మార్చి 2014
రూ. 12/-

చతుర



- భామనే సత్యభామనే ..118
- ఈరంకి ప్రమీలారాణి నవల నీలాంజన .. 6
- నవలావలోకనంలో యద్దనపూడి ఆరాధన .. 94

అక్షరధార

వేల ఏళ్ళ క్రితం మన ప్రాచీనులు మనిషి ప్రవర్తనా నియమావళిని నిర్దేశిస్తూ వాటిని శ్లోకబద్ధం చేశారు. అవి అన్ని కాలాలకి, అన్ని ప్రదేశాలకి చెందిన అందరికీ సమానంగా వర్తించే నిత్య సత్యాలు.

చేసిన తప్పే చేయకు!

కిం ప్రమత్తస్య బహుభిః పరోక్షైః హాయనైః
వరం ముహూర్తం విదితం ఘటేత శ్రేయసే యతః

భావం: పొరపాటున చాలాకాలం వ్యర్థమైపోయినా ఫర్వాలేదు. కానీ అది తెలుసుకున్నాక ఒక్క క్షణం కూడా వ్యర్థం చేసుకోకూడదు. లోకానికి సేవ చేసే ప్రయత్నం చేయాలి.

బంధు లక్షణం

స బంధుర్యో హితేషు స్యాత్
స పితా యస్తు పోషకః
స సఖా యత్ర విశ్వాసః
సా భార్యా యత్ర నిర్వృతిః

భావం: బంధువు తనవారి హితాన్ని కోరాలి. తండ్రి తన కుటుంబాన్ని పోషించాలి. స్నేహితుడు తన మిత్రుని విషయంలో విశ్వాసంతో ఉండాలి. భార్య తన భర్త క్షేమాన్ని, సుఖాన్నీ ఆలోచిస్తూ వాటిని కలిగేలా చూడాలి.

మిత్ర లక్షణం

అప్రియాణ్యపి పథ్యాని
యే వదన్తి నృణామిహ
త ఏవ సుహృదః ప్రోక్తా
అన్యేస్యుర్నామ ధారకాః

భావం: నిజమైన మిత్రుడు మనకి ఇష్టంలేని విషయాన్ని కూడా తెలియజేస్తాడు. మంచి స్నేహితుడు మనల్ని మెప్పించడానికి అసలు విషయాన్ని ఎప్పుడూ కప్పిపెట్టడు. అలాకాక కేవలం మన ప్రీతి కోసం వ్యవహరించే వారంతా పేరుకు మాత్రమే మిత్రులు.

వాయిదా కూడదు

శ్వః కార్యమద్యకుర్వీత
పూర్వాహ్ణే! చాపరాహ్ణికమ్।
నహి మృత్యుః ప్రతీక్షేత
కృతం వాప్యథవాకృతమ్ ॥

భావం: రేపు చేయాల్సిన పనిని ఇవ్వాళే, రాత్రి చేయాల్సిన పనిని పగలే చేయాలి. ఈ పనయింది, ఈ పని ఇంకా కాలేదని మృత్యువు విచక్షణ చూపదు.

దేనికి ఏది మూలం?

అనిర్వేదః శ్రియో మూలమ్
అనిర్వేదః పరం సుఖమ్
అనిర్వేదో హి సతతమ్
సర్వార్థేషు ప్రవర్తకః

భావం: దిగులు చెందకపోవడం లక్ష్మికి, అభివృద్ధికీ మూలం. విచారం లేకపోవడమే గొప్ప సుఖం. అన్ని పనులు చక్కగా జరిగేలా చూసేది విచారం లేకపోవడమే.

ఏదీ స్థిరం కాదు

దత్వా యాచంతి పురుషా
హత్వా వధ్యంతి చాపరే
పాతయత్వా చ పాత్యంతే
పరై రితిచ మే శ్రుతం!

భావం: దాతలే యాచకులు కావచ్చు. విజేతలే పరాజితులూ కావచ్చు. ఒకప్పుడు ఇతరులని కూల్చిన వాడే ఇప్పుడు తనే కూలిపోవచ్చు. ఏదీ స్థిరమూ కాదు. అసాధ్యమూ కాదు.

సేకరణ : లిపి

విజ్ఞప్తి

చతురకు నవలలు, ఇతర రచనలు, కూపన్లు పంపేవారు ఇకపై కింది చిరునామాకు పంపాల్సిందిగా విజ్ఞప్తి.

సంపాదకులు, చతుర, ఈనాడు కాంప్లెక్స్,
గూడ్స్ షెడ్ రోడ్డు, మూసాపేట విలేజి,
బాలానగర్ (మండలం) హైదరాబాద్ – 500072
రంగారెడ్డి జిల్లా **040-23815851 EX: 339, 355**

రచయితలు/రచయిత్రులు నవలలు తమ సొంతమే అన్న హామీపత్రంతో పాటు తమ పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు సహా ఇవ్వాలి. ఫోన్ నెంబరు ఉంటే సమాచారం వేగంగా ఇవ్వడానికి వీలవుతుందని గమనించగలరు. అనువాద నవలలు పంపేవారు మూలరచయిత అనుమతి పత్రం పంపాలి. అది సాధ్యం కాని పక్షంలో తాము ఏ సంకలనం/పత్రిక నుంచి ఆ నవల తీసుకున్నారో ఆ ప్రచురణకర్తల చిరునామాలు, ఫోన్ నెంబర్లు వివరంగా పంపాలి. అప్పుడు అనుమతి పత్రం తీసుకోవడానికి చతుర ప్రయత్నిస్తుంది. **తిరస్కృత రచనలు కావాలనుకునేవారు విధిగా తగినన్ని పోస్టేజి స్టాంపులు అంటించిన సొంత చిరునామాగల కవరును జతపరచాలి.** ఇలా చేయని పక్షంలో ట్రాష్‌లోకి వెళ్లిపోతాయి. ఆ తర్వాత స్టాంపుల కవర్ పంపినా ప్రయోజనం శూన్యం. చందాదారులు కూడా తాము పంపే డీడీ వెనుక/మెయిల్‌లో తమ పూర్తి చిరునామాను ఫోన్ నెంబరు సహా ఇవ్వాలి.





సృష్టికి మూలం.. ఆకాశంలో సగం..
వంటగది నుంచి విశ్వాంతరాళం వరకూ
ఎగసిన నవోత్తేజం..
మహిని ఏలుతోన్న మహిళామణికి పట్టంకడుతూ
స్త్రీలకు ఉపయుక్తకరమైన అంశాలతోపాటు
సరదా సరదా అంశాలతో...
ప్రతి ఒక్కరూ పాలుపంచుకునే
విలక్షణ శీర్షిక **భామనే.. సత్యభామనే!**
ఈ మహిళాదినోత్సవ కానుక!
చలో.. పేజీ నెం. 118

–సంపాదకులు

సరికొత్త శీర్షిక ప్రారంభం!

భామనే.. సత్యభామనే..! 1



సొగసు చూడతరమా...

తొలి సినిమాలోనే కింగ్‌ఖాన్ షారూఖ్‌ఖాన్‌తో హీరోయిన్‌గా నటించే అవకాశం పొందింది. 'రబ్ నే బనా ది జోడీ', 'బాండ్ బాజా బారాత్', 'జబ్ తక్ హై జాన్' సినిమాల్లో నటించి బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. మోడలింగ్ రంగం నుండి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ అందాల భామ.. అనుష్కశర్మ. ఎప్పుడూ స్లిమ్‌గా కనిపిస్తూ తన ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్న అనుష్కశర్మ సౌందర్య రహస్యాలేమిటో ఆమె మాటల్లోనే..

బాగా అలసిపోయినపుడు త్వరగా పునరుత్తేజం పొందడానికి సాధారణంగా అందుబాటులో ఉన్న అన్ని రకాల పదార్థాలను తీసుకుంటా. ప్రతి రెండు గంటలకోసారి ఏదో ఒకటి ఆరగిస్తా. వీలైనంత వరకూ పండ్లు స్వీకరిస్తుంటా. ఎక్కువగా ఇంటి భోజనమే తీసుకుంటా. చికెన్

మహిళా శక్తి

★ **స్వాతంత్ర్యమనేది ఒకరిస్తే పుచ్చుకునే వస్తువుకాదు. అది పరిపూర్ణత పొందుతూ, ఆత్మవైశాల్యంతో స్వతఃసిద్ధంగానే వ స్తుంది. గుడ్డు పొరను పగలగొట్టి లోపల జీవికి ముక్తి కలుగజేస్తే, అది ముక్తి పొందకపోగా చచ్చి ఊరుకుంటుంది.**

- శరత్‌చంద్ర ఛటర్జీ

★ **నీవు అనుకున్నదానికంటే అధికమైన శక్తి నీలో ఉంది. అనుకున్నది సాధించేవరకూ ప్రయత్నాన్ని విడనాడవద్దు.**

- మెలిస్సా ఈథరిడ్జ్

అంటే చాలా ఇష్టం. అన్నం, కాయగూరలు, చేపలకూరను ఇష్టంగా తింటా. నిజానికి అన్ని రకాల వంటలనూ ఆస్వాదిస్తా.

ఎంత ఆహారం తీసుకున్నా.. చేయాల్సిన రోజువారి కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేస్తే ఎలాంటి సమస్యా రాదు. జంక్‌ఫుడ్‌ను ఆమడ దూరంలో పెడతా.

ఎంత ఒత్తిడి ఉన్నా ప్రశాంతంగా నిద్రపోతా. చేయాల్సిన పనుల్ని అనుకున్న సమయానికే పూర్తి చేస్తా. అందువల్ల ఎటువంటి చిక్కులూ రావు. చివరి నిమిషాల్లో హడావిడి పడడం నాకు నచ్చదు.

బాగా ఆకలేస్తే.. తాజా పండ్లను ఆరగిస్తా. ఒక్కోసారి నిమిషానికి ఒక్కోటి తినేస్తుంటా.

నా బరువు ప్రతిరోజూ చెక్ చేసుకుంటా. తేడా వస్తే గుండెకు సంబంధించిన ఎక్సర్‌సైజ్ చేస్తా. అందువల్ల నా హృదయానికి ఎటువంటి ఇబ్బందీ లేదు. చిన్నపాటి వ్యాయామాలే చేస్తా. భారీ కసరత్తుల జోలికి వెళ్లను. చిరుచెమటలు పడితే చాలు. నా వ్యాయామం పూర్తయినట్టే.

అందరూ పాటించాల్సిన ఆరోగ్యసూత్రాలు:

✦ రోజుకో గుడ్డు తినండి. అది మీ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

✦ వ్యాయామం మన శరీరంలో సంతోషానికి కారణమయ్యే హార్మోనులను మేల్కొల్పుతుంది. మంచి ఆహారం, వ్యాయామం తప్పనిసరి.. ఇవి రెండూ సంపూర్ణ ఆరోగ్యానికి, సహజ సౌందర్యానికి దోహదపడతాయి.

ప్రతిరోజు ఇలా...

✦ ప్రతిరోజూ ఉదయం, రాత్రి పడుకునే ముందు ధ్యానం చేస్తాను. ఒత్తిడి మాయమై మనసు ప్రశాంతంగా ఉంటుంది. షూటింగ్ సమయాల్లో ఉదయం వ్యాయామం కుదరనపుడు సాయంత్రం తప్పకుండా చేయాల్సిందే.

✦ ఇతర ప్రాంతాలకు వెళ్లినపుడు జాగింగ్ లేదా వాకింగ్ చేస్తాను.

✦ కొంచెం కొంచెంగా రోజుకు ఆరు సార్లు ఆహారం తీసుకుంటాను. ఎక్కువగా నిమ్మరసం, కొబ్బరినీళ్లు, ప్రొటీన్ బార్, పండ్లు, చీజ్ టోస్ట్ వంటివి తీసుకుంటాను. బ్రేక్‌ఫాస్ట్‌లో మాత్రం ఒక గ్లాసు జ్యూస్, రెండు ఎగ్ వైట్స్ తీసుకుంటాను.

✦ రోజుకు 3 నుండి 4 లీటర్ల నీరు తాగుతాను.

✦ రోజులో ఎక్కువసేపు పనిచేయాల్సి వచ్చినపుడు మధ్యమధ్యలో నా కారులోనే ఓ కునుకు తీస్తుంటాను.



అంతర్నేత్రం



ఆన్‌లైన్‌లో చాటింగ్ చేస్తున్నపుడు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి. కొత్త ఫ్రెండ్స్ మోజులో పడి మీ గురించి పూర్తి సమాచారమిచ్చారంటే కష్టాలు కోరితెచ్చుకున్నట్టే! అనుకోని ఇబ్బందుల్లో పడకుండా ఆన్‌లైన్ చాట్‌ను సరిగా వినియోగించుకోవాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి.

✵ చాటింగ్‌కి ప్రైవేట్ చాట్‌రూమ్స్ కంటే ఆన్‌లైన్ సర్వీసులు ఏర్పాటు చేసిన చాట్ రూమ్స్‌ని ఎంచుకోవడం ఉత్తమం.

✵ ఆన్‌లైన్‌లో చాటింగ్ చేసేపుడు మీ అసలు పేరుకు బదులు నిక్‌నేమ్‌ను యూసర్ నేమ్‌గా ఇవ్వండి. అమ్మాయో, అబ్బాయో తెలియకుండా పేరును ఎంపిక చేసుకుంటే మరీ మంచిది.

✵ చాటింగ్‌లో పరిచయమైన వ్యక్తులకు మీ చిరునామా, ఫోన్ నంబరు, బ్యాంకు అకౌంటు, క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించిన వివరాలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు.

✵ అపరిచిత వ్యక్తుల నుండి వచ్చిన ఎటువంటి డాక్యుమెంట్స్‌నూ డౌన్‌లోడ్ చేసుకోకూడదు. అందులో వైరస్ ఉంటే మీ ఫైల్స్‌ను పాడుచేస్తుంది.

✵ ఏదైనా విషయం గురించి వాదన మొదలైనా, చర్చ పక్కదారి పడుతున్నా చాటింగ్‌ను ముగించేయడం శ్రేయస్కరం.

✵ చాటింగ్‌లో ఇతరులతో చర్చించుకున్న విషయాల కాపీని సేవ్ చేయడం తెలుసుకోవాలి. భవిష్యత్తులో ఏదైనా సమస్య తలెత్తినపుడు ఫిర్యాదు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది.

సంభాషణని సేవ్ చేయడమెలా?

మీ మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన టెక్స్ట్‌ను మౌస్‌తో హైలైట్ చేసి కాపీ చేయాలి. దాన్ని వర్డ్ డాక్యుమెంట్‌లో పేస్ట్ చేసుకుని సేవ్ చేసుకుంటే, ప్రింటు తీసుకోవచ్చు.


✵ ఎవరైనా ఇబ్బందికరంగా, అసభ్యకరంగా మాట్లాడుతుంటే వారి నుండి వస్తున్న మెసేజ్‌లను తీసుకోకపోవడం మంచిది. అందుకు ఇతరులు పంపే మెసేజ్‌లను బ్లాక్ చేయడమెలాగో తెలుసుకోవడం తప్పనిసరి.

మెసేజ్‌లను బ్లాక్ చేయడం ఎలా?

ఎవరి నుంచైనా మెసేజ్‌లు అందుకోకూడదనుకున్నప్పుడు కాంటాక్ట్ లిస్టులో వారి పేరును సెలెక్ట్ చేయాలి. అపుడు కొన్ని ఆప్షన్స్ వస్తాయి. అందులో బ్లాక్ లేదా ఇగ్నోర్‌ను ఎంచుకుని క్లిక్ చేయాలి. ఇంక ఆ వ్యక్తి పంపే ఎటువంటి మెసేజ్‌లూ మీకు చేరవు.

✵ మీతో చాటింగ్‌లో ఉన్న వ్యక్తులెవరైనా నియమాలను అతిక్రమిస్తున్నారనిపిస్తే చాట్ రూమ్ ఏర్పాటు చేసినవారికి ఫిర్యాదు చేయడమెలాగో తెలుసుకుని ఉంటే ఉత్తమం. ఇందుకోసం హెల్ప్ ట్యాబ్‌ను ఉపయోగించుకోవాలి.

టెక్‌గురూ!



మహిళల రక్షణకోసం నేడు అనేక ఉచిత మొబైల్‌యాప్స్ అందుబాటులో ఉన్నాయి.

❒ **స్క్రీమ్ అలారమ్**

ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫామ్‌పై పనిచేసే ఉచిత యాప్ ఇది. ప్రమాదకర పరిస్థితుల్లో ఫోన్ స్క్రీన్‌మీద ఒక్కసారి నొక్కితే అమ్మాయి గొంతుతో పెద్ద శబ్దం వస్తుంది. దీనివల్ల క్షణాల్లో చుట్టపక్కల వాళ్లు అప్రమత్తమై వారికి సాయం చేసే అవకాశముంటుంది.

❒ **వైడబ్ల్యుసిఐ సేఫ్టీ అలర్ట్**

అలారమ్‌తో పాటు మరో ఆప్షన్ ఉంది ఈ ఉచిత యాప్‌లో. అత్యవసర పరిస్థితుల్లో స్క్రీన్‌మీద నొక్కినపుడు పెద్ద శబ్దం రావడమే కాకుండా సన్నిహితులకు ఎస్సెమ్మెస్, ఇ-మెయిల్ లేదా కాల్ పోతుంది.

ఈ యాప్స్‌ను గూగుల్ ప్లే నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పురాణ విజ్ఞానం

కనిపెట్టు తల్లీ..


1. కర్ణుని పెంచిన తల్లి?	జ.
2. ప్రహ్లాదుని తల్లి?	జ.
3. శ్రీరాముడి తల్లి?	జ.
4. వామనుడి తల్లి?	జ.
5. దుర్యోధనుడి తల్లి?	జ.
6. శత్రుఘ్నుడి తల్లి?	జ.
7. ఆంజనేయస్వామి తల్లి?	జ.
8. శకుంతల తల్లి?	జ.
9. బలరాముడి తల్లి?	జ.
10. గరుత్మంతుడి తల్లి?	జ.

జవాబులు ఈ సంచికలోనే..

కనిపెట్టు తల్లీ.. జవాబులు : 1. రాధ, 2. లీలావతి, 3. కౌసల్య, 4. అదితి, 5. గాంధారి, 6. సుమిత్ర, 7. అంజనాదేవి, 8. మేనక, 9. రోహిణి, 10. వినత



యాంగ్రీ బర్డ్స్



రాజు : కొత్తగా పెళ్లయినవారిని 'లవ్ బర్డ్స్' అంటే, కొన్ని సంవత్సరాల క్రితం పెళ్లయినవారిని ఏమనాలిరా?

రవి : ఆ.. యాంగ్రీ బర్డ్స్ అనాలిరా!

ఫెవిస్టిక్!



తండ్రి : ఈ రోజు మీ అమ్మ మౌనంగా ఉందేమిటిరా?

కొడుకు : ఏమీ లేదు నాన్నా! అమ్మ లిప్‌స్టిక్ తెమ్మంటే నాకేమో ఫెవిస్టిక్‌లా వినిపించింది.

తండ్రి : నిన్ను దేవుడు చల్లగా చూడాలిరా!

బాగా ఉపయోగపడింది



బుక్‌సెల్లర్ సర్వేలో భాగంగా : మేడమ్! మీకు జీవితంలో బాగా ఉపయోగపడ్డ పుస్తకమేంటి?

కస్టమర్ : నా భర్త చెక్‌బుక్!


ఎవరంటే ఇష్టం?



తల్లి : నీకెవరంటే బాగా ఇష్టం? నేనా... నీ భార్యా?

కొడుకు : ఏమో అమ్మా! నీ ప్రేమ అన్నింటినీ మరిపింపజేస్తుంది. నా భార్య ప్రేమ ఎపుడూ నిన్నే గుర్తు చేస్తుంది.

బుడుగులు కాదు పిడుగులు



నా కొడుకు పేరు విశ్వజిత్. యుకెజి చదువుతున్న వాడి బుర్రనిండా సందేహాలే! పోయిన్నెల్లో మా అపార్ట్‌మెంట్లో పెళ్ళి జరిగింది. వాళ్ళు పిలుపులకి వచ్చినప్పుడు మా అబ్బాయిని తోడిపెళ్ళికొడుకుగా కూర్చోబెడతామని అడిగారు. నేను సరే అన్నాను. వాళ్ళు వెళ్ళిన తరువాత వాడు నన్ను విషయం అడిగాడు. నేను వివరంగా 'సందీపన్న పెళ్ళి కదా! అన్న పక్కన నిన్ను కూర్చోబెడతారు. నీకు నలుగూ, అవీ పూస్తారు. ఏడవకూడదు' అని చెప్పాను. అప్పటి నుంచి వాడు టీచరును, ప్రిన్సిపాల్‌ను, తోటి స్నేహితుల్నీ 'నా పెళ్ళి' అని ఆహ్వానించాడట. మొదట వాళ్ళు పట్టించుకోలేదట. రోజూ అదేపనిగా వారిని ఆహ్వానిస్తుండటంతో ప్రిన్సిపాల్ 'మీ అబ్బాయి పెళ్ళట కదా!' అని డైరీలో రాసి పంపింది. ఆవిడ ఎందుకలా రాసిందోనని నేను ఫోన్‌చేస్తే 'మీ అబ్బాయికి అప్పుడే పెళ్ళట. అందర్నీ ఆహ్వానిస్తున్నాడు' అని నవ్వుతూ చెప్పింది. నేను ఆశ్చర్యపోయి ఆరాతీస్తే తోడిపెళ్ళికొడుకుగా కూర్చోబెడతాను అనేదాన్ని వాడెలా అర్థం చేసుకున్నాడో తెలీదు కానీ అందర్నీ 'నాపెళ్ళ'ని ఆహ్వానించేసాడు. చుట్టుపక్కలున్న వాడి స్నేహితులు, తల్లిదండ్రులను వెంటబెట్టుకుని ఆరోజు పెళ్ళని (వారు మా అబ్బాయి పుట్టినరోజని అనుకున్నారట) మా ఇంటికి రావడం, నేను వారిని పెళ్ళివాళ్ళ ఇంటికి తీసికెళ్లడం జరిగింది. కొసమెరుపేంటంటే మరుసటిరోజు పెళ్లివాళ్ళు మళ్ళీ వచ్చి మీ అబ్బాయిని కాసేపు పంపండి అనగానే వాడు నన్ను పట్టుకుని 'నాకు ఒక పెళ్ళి చాలమ్మా! ఇంకోపెళ్ళి వద్దు!' అన్నాడు విసిగిపోయి. అక్కడున్న వాళ్లందరూ ఒకటే నవ్వులు..

– ఉమా మహేశ్వరి, సైనిక్‌పురి

మీ చిచ్చర పిడుగు కబుర్లూ ఇలా అందరితో పంచుకోవాలనుకుంటున్నారా? అయితే మీ పాప/బాబు చేసిన చిలిపి పనులు పదిహేను పంక్తులకు మించకుండా రాసి పంపించండి.

నేనుగానీ... మగాడినైతే!

అసలు మగాడిగా పుడితే ఎంచక్కా జడలు వేసుకుంటా (ఇప్పుడదేగా ఫ్యాషన్!). రంగురంగుల హెయిర్ స్టైల్స్ వేసుకోవచ్చు. ఇంటికి ఎంత ఆలస్యంగానైనా రావచ్చు కాబట్టి సెకండ్‌షో సినిమాలు చూస్తా. ఫ్రెండ్స్‌తో పార్టీలు, పబ్బులకి తిరుగుతా. క్లాసులో లెక్చరర్లని జంకూగొంకూ లేకుండా కామెంట్ చేస్తా. జల్సారాయుడిలా బతుకుతా. ఎటువంటి భయమూ లేకుండా ఒంటరిగా ప్రయాణాలు చేస్తా. పెళ్ళయ్యాక అత్తగారింట్లో దర్జాగా కాలుమీద కాలు వేసుకొని మర్యాదలు చేయించుకుంటా. ఆఫీసులో తోటి ఉద్యోగులను దబాయించి మాట్లాడతా. ఆడపిల్లలను ఏడిపించే వాళ్ళ భరతం పట్టి అందరిచేతా హీరోగా శభాషనిపించుకుంటా. శిఖర్ ధావన్‌లా మీసం పెంచి దానిమీద నిమ్మకాయలు నిలబెడతా.

– ఎ. భువన, ఇంజనీరింగ్ విద్యార్థిని, రాజమండ్రి



మీకూ ఇటువంటి వింత కోరికలేమైనా ఉన్నాయా? అయితే మీకే గనక ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వస్తే ఏం చేస్తారో పది పంక్తులకు మించకుండా రాసి పంపించండి. వ్యంగ్యం, హాస్యం తప్పనిసరి.

విద్యుత్తు ఆదాకు చిట్కాలు

★ మామూలు బల్బుల బదులు సీఎఫ్ఎల్ బల్బులు వాడడం వల్ల నాలుగు రెట్లు కరెంటు ఆదా అవుతుంది.

★ సాధారణ చోక్‌లు, రెగ్యులేటర్ల కన్నా ఎలక్ట్రానిక్‌వి వాడితే తక్కువ విద్యుత్ ఖర్చవుతుంది.

★ ఆటోమేటిక్‌గా టెంపరేచర్ తగ్గిపోయే ఇస్త్రీపెట్టెలను తీసుకోవడం మంచిది.



★ తడి బట్టలను ఇస్త్రీ చేస్తే ఎక్కువ విద్యుత్ ఖర్చవుతుంది.

★ ఇడ్లీ, దోశె వంటి వాటికి కావలసిన పిండిని మిక్సీ పట్టేటపుడు సరిపడ నీరు పోస్తే త్వరగా మెదుగుతుంది.

★ గ్యాస్, ఎలక్ట్రిక్ స్టవ్‌ల కంటే మైక్రోఓవెన్‌తో 50 శాతం ఎనర్జీ ఆదా చేయొచ్చు.

★ ఫ్రిజ్‌లోంచి తీసిన వస్తువులు గది ఉష్ణోగ్రతకు వచ్చిన తరువాతే వంటలో ఉపయోగించడం వల్ల తక్కువ ఎనర్జీ ఖర్చవుతుంది.

★ కంప్యూటర్, టీవీ, స్పీకర్స్ వంటివి వాడనపుడు వాటికి సంబంధించిన స్విచ్ ఆఫ్ చేయాలి. అంతేకాదు వాటి ప్లగ్‌లను సాకెట్ నుంచి తీసేయాలి. దీని వల్ల పది శాతం విద్యుత్ ఆదా అవుతుంది.

★ కంప్యూటర్ మీద పనిచేస్తూ విరామం తీసుకోవాల్సి వచ్చినపుడు మానిటర్‌ని ఆఫ్ చేయడం మంచిది. దీనికి మొత్తం సిస్టమ్‌కి కావలసిన ఎనర్జీ కంటే ఎక్కువ అవసరమవుతుంది. లేదంటే షట్ డౌన్ చేయడం మంచిది. స్టార్టింగ్ అప్, షట్‌డౌన్‌లకు విద్యుత్ ఖర్చవదు.

★ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, డిజిటల్ కెమెరాలకు వాడే బ్యాటరీ చార్జర్‌లను ఉపయోగించనపుడు వాటిని సాకెట్ నుంచి తీసి విద్యుత్ ఖర్చును తగ్గించుకోండి.

★ ఏమాత్రం గాలి చొరబడకుండా రిఫ్రిజిరేటర్ తలుపు మూయాలి.

★ వేడి పదార్థాలను ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఎక్కువ విద్యుత్ ఖర్చవుతుంది.

★ ఫ్రిజ్, ఎయిర్ కండిషనర్ వంటి వాటిని గోడకు మరీ దగ్గరగా పెట్టకూడదు. గాలిపారేవిధంగా కాస్త ఖాళీ వదలాలి.

★ లోడ్‌కు అవసరమైన బట్టలుంటేనే వాషింగ్ మెషిన్‌ను ఉపయోగించాలి.

★ తడిబట్టలకు ఎలక్ట్రిక్ డ్రయ్యర్‌లను వాడే కంటే సహజంగా ఆరనివ్వడం మంచిది.

★ ఏసీ వేసినపుడు వేడిగాలి లోపలకు రాకుండా తలుపులు వేయాలి.

సులభంగా తక్కువ సమయంలో తయారు చేసే కొత్తరకం వంటకాల గురించి వివరాలతోపాటు వాటి ఫొటోలూ పంపండి. ప్రచురించిన వాటికి రూ.100/- బహుమతి. అందరికీ అందుబాటులో ఉండే పదార్థాలతో తయారయ్యే వంటకాలకే ప్రాధాన్యం.



చిట్కాలక్ష్మి

★ పంచదార డబ్బాలో ఓ మూడునాలుగు లవంగాలు ఉంచితే చీమల బెడద ఉండదు.

★ ఏదైనా పిండివంటలో బాదంపప్పు వేయాల్సివస్తే వాటిని ఓ పావుగంట సేపు గోరువెచ్చటి నీటిలో నానబెట్టండి. పొట్టు తేలికగా వచ్చేస్తుంది.

భలే భలే!

'ప్రశాంతమైన వాతావరణం కోసం చూస్తే రచయిత ఒక్కముక్కా రాయకుండానే చనిపోతాడు' అనేవాడు అమెరికన్ రచయిత ఇ.బి. వైట్. ఇంట్లోనే గాలి, వెలుతురు వచ్చే గదిలో రాసుకునేవాడాయన. గదిలోకి వచ్చేపోయేవారి, కుటుంబ సభ్యుల మాటలు, ఫోన్ మోత.. ఇలా శబ్దాలన్నీ వినిపిస్తున్నా పట్టించుకోకుండా తన ఏకాగ్రతనంతా రచన మీదే ఉంచేవాడు.

భలేభలే!

ఉత్తమ అమెరికన్ చిన్నకథగా ఎంపికైన 'వాట్స్ ఇంపార్టెంట్ ఆఫ్ ఫీలింగ్' రచయిత ఆడమ్ విల్సన్. ఆయన రచనలను కంపోజ్ చేసేపుడు ఫాంట్ సైజ్ 135 పెట్టుకుంటాడు. ఎపుడూ ఏవో గింజలు తింటూ రాసుకుంటాడు. గింజలు రచయితలకు చాలా మంచిదని ఆయన అభిప్రాయం. 'ద అమెరికన్ రీడర్' పత్రికకు వ్యాసాలు రాస్తూ న్యూయార్క్ యూనివర్శిటీలో ప్రస్తుతం సృజనాత్మక రచనలో శిక్షణనిస్తున్నాడు.

భలేభలే!

ఆంగ్ల నవలారచయిత్రి హిల్లరీ మాంటెల్ ఎక్కడికెళ్లినా నోట్‌బుక్ తీసుకెళ్లేదట. కొత్త పదాలు, డైలాగులు, సామెతలు, వర్ణనలు.. ఇలా ఏది తట్టినా వెంటనే రాసుకునేది. వాటిని కిచెన్‌లోని ఏడడుగుల బులెటిన్ బోర్డులో పెట్టేది. తర్వాత తన రచనల్లో సందర్భానుసారంగా వాటిని వాడుకునేది. ఆమె రెండుసార్లు బుకర్ ప్రైజ్ గెలుచుకుంది.

భలేభలే!

ఆధునిక కవిత్వానికి ఆద్యుడైన అమెరికన్ కవి వాలెస్ స్టీవెన్స్ నడుస్తూ నడుస్తూ చిన్న చిన్న కాగితాల మీద రాసుకునేవాడు. ఆ కాగితాలను సెక్రటరీ భద్రపరిచి అడిగినపుడు ఇచ్చేవాడు. నూతన శైలిని, అనేక కొత్తపదాలను పరిచయం చేశాడు స్టీవెన్. ఆయన తన కవితాసంపుటికి పులిట్జర్ పురస్కారం అందుకున్నాడు.

భలే భలే!

'ద కైట్ రన్నర్' బాగా పేరు పొందడంతో పూర్తి సమయాన్ని రచనకు కేటాయించాడు ఆఫ్ఘన్ అమెరికన్ నవలారచయిత ఖాలెద్ హుస్సెనీ. అంతకుముందు వైద్యుడిగా పనిచేసేవాడు. ఏది స్ఫురిస్తే అది కాగితం మీద పెట్టేసి నెమ్మదిగా ప్రతి పదానికీ అర్థాలను నిశితంగా పరిశీలిస్తూ కథకు సరిపోతుందనుకుంటే ఉంచడం లేదా మరో పదాన్ని ఆలోచిస్తాడు.

భలే భలే!

అమెరికన్ రచయిత జాక్ కెరోక్ రచన చేయడానికి ముందు మోకాళ్లమీద నిల్చుని ప్రార్థన చేసేవాడు. కొవ్వొత్తి వెలుగులో రాసుకునేవాడు. స్నానాల గదిలో తలకిందుగా నిల్చుని కాలివేళ్లతో పైకప్పును తొమ్మిదిసార్లు తాకేవాడు. అది యోగాకంటే మెరుగైన అథ్లెటిక్ ఫీట్ అని, దానివల్ల మెదడు చురుకుగా పనిచేస్తుందని కెరోక్ అభిప్రాయం.

భలేభలే!



'ద ఆప్టిమిస్ట్స్ డాటర్' నవలకు పులిట్జర్ అవార్డు అందుకున్న అమెరికన్ రచయిత్రి యుదోర వెల్టీ తాను రాసుకున్న పేజీలను సాధారణ పేస్టుతో అంటించి ఒకటే పెద్ద పేజీగా చేసుకునేది. మొత్తం కథ ఒకేసారి కనిపించాలని అలా అంటించేది. అమెరికా లైబ్రరీలో ప్రచురితమైన తన రచనలను చూసుకున్న మొదటి రచయిత్రి యుదోర.

భలేభలే!

థాయి అమెరికన్ సైన్స్ ఫిక్షన్ రచయిత ఎస్.పి. సామ్‌టోవ్ తాను కట్టలేనంత మొత్తానికి బిల్లులు వచ్చినపుడు ఆయనకు రచన మీద ఏకాగ్రత కుదిరేది. ఆయన మొదట్లో సామ్‌టోవ్ సుచరిత్‌కుల్ అనే పేరుతో చాలా రచనలు చేశాడు. 'మాల్‌వరల్డ్', 'ఇంక్వెస్టర్', 'ద ఆక్విలియాడ్' వంటి రచనలు సుచరిత్‌కుల్ పేరుతో రాసినవే.

భలే భలే!

ఆస్ట్రేలియన్ రచయిత్రి బ్లాంచి డి ఆల్‌పగెట్ తాను మొదట కంప్యూటర్‌లో కంపోజ్ చేసుకున్న రచనకు ప్రింట్ అవుట్ తీసుకుంటుంది. తర్వాత ఒరిజినల్ ఫైల్‌ను డిలీట్ చేసి ప్రింట్ అవుట్ చూసుకుంటూ మొత్తం రచనను తిరిగి కంపోజ్ చేసుకుంటుంది. ఆల్‌పగెట్ ఎక్కువకాలం ప్రధానమంత్రిగా పనిచేసిన బాబ్‌హాక్ రెండో భార్య.

ఈరంకి ప్రమీలారాణి



'మెనీ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే ఆంటీ! కొత్త చీర కట్టుకోలేదేం? మొన్న నా కోసం కొన్న చీర కట్టుకోండి' వింధ్యతో అంది సంజనా.

'చాలారోజులైంది ఇలాంటి పండుగులు జరుపుకుని. అటువంటి సంతోషాలు నాకిక లేవు' బాధగా అంది వింధ్య.

'ఈరోజు మీ అమ్మగారిని కలవలేకపోయారా?' అందరూ ఉండి ఎవరూ లేనట్టు జీవితాన్ని గడుపుతున్న వింధ్య లోటును గమనించిన సంజనా చెప్పింది.

'నిజానికి అమ్మ ఆశీస్సులు తీసుకోవాలని నాకూ ఆశగా ఉంది. కానీ ఆమె దగ్గరికెళ్తే అన్నయ్యలు, అక్కలు ఏమైనా అంటారు. దాంతో నాకు, అమ్మకీ బాధ' చెప్పింది వింధ్య.

అందరూ ఉండి కూడా వింధ్య ఒంటరి జీవితం గడపడానికి దారితీసిన పరిస్థితులేంటి? ఇంతకీ సంజనా ఎవరు? ఒకరి జీవితాన్ని ఇంకొకరు ఎలా సుఖమయం చేసుకు న్నారు? విచిత్రమైన మలుపులతో ఆసక్తిగా సాగే **ఈరంకి ప్రమీలారాణి** నవల **నీలాంజన**



ఆకాశంలో నక్షత్రాలని ఏదో అదృశ్య హస్తం తీసి తన చేతి సంచిలో వేసుకున్నట్టుగా ఒక్కొక్క నక్షత్రం కన్పించకుండా పోతోంది. తూర్పువైపు ఆకాశం ఎర్ర తివాచీ పరచి రోజూ వచ్చే అతిథి కోసం ఎదురు చూస్తోంది. నిద్రపోతున్న వింధ్యకు మెలకువ వచ్చింది. నిద్రకళ్లకు టైము ఎంతయినది తెలియడం లేదు. ట్యూబ్‌లైట్ వేసి చూసింది. తెల్లవారుజామున 5.30 గంటలు దాటుతోంది. తను రాసుకోవాలి, ఇలా నిద్రపోతోందేమిటి? ఆమె గది బయటకు వచ్చి వంటింట్లోకి వెళ్లి పాలు స్టవ్‌పై పెట్టి వాష్‌బేసిన్ దగ్గర మొహం కడిగేటప్పటికి వీధి తలుపు తడుతున్న చప్పుడు. ఆమె హాల్లో లైటు వేసి, కిటికీ లోంచి బయటికి తొంగిచూసింది. ఆ మసక వెలుతురులో తన స్నేహితురాలు భార్గవి, ఆమె కూతురు సంజనా! చప్పున తలుపు తీసింది వింధ్య.

"రండి... రండి... లోపలికి రండి. వస్తున్నట్టు ఫోనైనా చేయలేదు" అందామె.

"రాత్రి చాలాసార్లు ఫోన్ చేశాను. నీ ఫోన్ పనిచేస్తున్నట్టు లేదు. అదృష్టం! నువ్వు ఇంట్లోనే వున్నావు" చెప్పింది భార్గవి.

"నేనెక్కడికి వెడతాను? కూర్చోండి.. కొంచెం కాఫీ తెస్తాను" అంది వింధ్య.

"వద్దు.. మేమింకా..."

"ఫర్వాలేదు.. మొదట కాఫీ తాగండి. రాత్రి వాన పడింది.. వాతావరణం చల్లగా వుంది"

వింధ్య కాఫీ తేవడానికి వెళ్లినా తల్లీకూతుళ్లిద్దరూ మాట్లాడుకోలేదు. 'ఏదో జరిగింది. లేకపోతే ఇలా చెప్పా చెయ్యకుండా ఎందుకు వస్తారు? ' అనుకుంది వింధ్య.

ముగ్గురూ మౌనంగా కాఫీలు తాగారు.

"పరీక్షలు బాగా రాశావా సంజనా? "

"బాగానే రాశాను ఆంటీ" అంది సంజనా. ఆమె కళ్లు బరువుగా వున్నాయి.

"కాస్సేపు నిద్రపో సంజనా! ఈ గదిలో పడుకోవచ్చు" హాలుకి ఎదురుగా వున్న గది చూపించింది వింధ్య.

ఆ గదిలోకి వెడుతూనే మంచంమీద వాలి నిద్రపోయింది సంజనా.

"నువ్వూ కాస్సేపు రెస్ట్ తీసుకో భార్గవి"

"ఊహు.. రెస్ట్ కాదు, నీతో చాలా మాట్లాడాలి. ఇలా హఠాత్తుగా వచ్చినందుకు ఏమీ అనుకోకు"

"నా ఫోన్ రెండురోజుల నుండి పని చేయడం లేదు. మనం ఆత్మీయులం భార్గవీ! నేను నిన్ను అపార్థం చేసుకోను. మీవారు, అత్తగారు బాగున్నారా? "

"బాగానే వున్నారు" చెప్తూ భార్గవి లేచి సంజనా పడుకున్న గది తలుపులు దగ్గరగా వేసివచ్చి వింధ్య పక్కన కూర్చుంది.

"కొన్ని రోజులు సంజనా ఇక్కడే వుంటుంది వింధ్యా. నీకేం అభ్యంతరం లేదుగా? "

"ఎంతమాత్రం అభ్యంతరం లేదు. ఇప్పటికైనా మీరు మా యింటికి వచ్చినందుకు సంతోషంగా ఉంది"

"నేను కాస్సేపటిలో బయలుదేరి విజయవాడ వెళ్లి, అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లిపోతాను"

"నువ్వు కూడా నాలుగు రోజులు వుండు భార్గవి.. సరదాగా వుంటుంది"

"వీలైనంత తొందరగా రమ్మని మా అత్తగారి ఆర్డరు. సంజనా చేసిన తెలివితక్కువ పని వల్ల ఇలా తీసుకురావల్సి వచ్చింది" అంది భార్గవి.

"అంటే ఏమైనా ప్రేమ విషయమా? " అడిగింది వింధ్య.

"ఔను.. ఇలా పరిస్థితిని గ్రహిస్తావు కాబట్టే దాన్ని నీ సంరక్షణలో వుంచవలసివచ్చింది"

"ఈ వయసులో చాలామంది ప్రధాన సమస్య ప్రేమేగా"

"అయినా తనని ఇక్కడ వుంచడం ఎందుకు? అతనితో మాట్లాడి పెళ్లి చేయ వచ్చుగా? "

"మాట్లాడటం అయింది. అతని వివ రాలు మాకంతగా నచ్చలేదు"

"ఏం? కులమతాలు, భాషా సమస్యలు ఇవన్నీ వున్నాయా? "

"అదేమీ కాదు. సంజనా ఇంజినీరింగ్ పూర్తి చేసింది, తెలుసుగా? అక్కడే దీనికి నీలం పరిచయం అయ్యాడు"

"నీలం..ఆకుపచ్చ.. ఇవేం పేర్లు? "

"అదే మరి.. మొదటి నుండీ అతని వ్యవహారమే కొత్తగా వుంది"

"అబ్బాయి బాగుండడా? "

"అందంగానే వున్నాడు. ఈరోజుల్లో అబ్బాయిలందరూ ఎలా వుంటున్నారో అలాగే వున్నాడు"

"మరి ఏమిటి అభ్యంతరం? "

భార్గవి కాస్సేపు సందేహించింది. "అతని తల్లిదండ్రులు విడాకులు తీసుకొని వేరువేరుగా పెళ్లిళ్లు చేసుకున్నారు. ఇతను మేనమామ సంరక్షణలో పెరిగాడు. ఆ మేనమామకూ పెళ్లి కాలేదు. ఎందుకో ఇలాంటి కుటుంబంలోకి సంజూని ఇవ్వాల నిలేదు"

"ఇలా అడుగుతున్నానని ఏమీ అను కోకు.. మరి మా యింట్లో తనని వుంచడం ఎందుకు? "

"మా ఆయనకి పంతం ఎక్కువ. తన మాట అందరూ వినాలనే తత్త్వం. ఇన్నా ళ్లూ ఆయన అధికారానికి ఎదురు లేదు. ఈ పెళ్లి విషయంలో సంజనా ఆయన మాట వినడం లేదు. ఆయనేమో, 'మీది ప్రేమకాదు, ఆకర్షణ. ఇద్దరూ కొన్నాళ్ల పాటు ఒకరినొకరు కలుసుకోకూడదు, ఫో నులో కూడా మాట్లాడుకోకూడదు' అని వాళ్లకి ఆంక్ష పెట్టారు"

'అయితే సంజనాకి ఇక్కడికి రావడం

ఇష్టముండి వుండదు. భార్గవి కూతుర్ని బలవంతంగా తీసుకొచ్చిందా? ' అనే సందేహం తలెత్తడంతో వింధ్యకి స్నేహితురాలిపై కోపం వస్తోంది. ఆ మాటే అడిగింది.

"లేదు.. సంజనాకి ఇక్కడికి రావడం ఇష్టమే"

"మరి నీలం సంగతి? "

"కొన్నాళ్లపాటు సంజూని నీ సంరక్షణలో వుండనీ. నీ దగ్గరుంటే ఈ పిచ్చి భ్రమలు, చెడ్డ ఆలోచనలు, కపట ప్రేమలు తగ్గుతాయి. నువ్వు దాన్ని సరైన దారిలో పెట్టగలవు"

"తల్లివి నీకంటేనా? "

"మేం చెప్పడం అయిపోయింది. నువ్వు నాకంటే బాగా మనిషిని, మనసుని బాగా అర్థం చేసుకోగలవు. అందుకే ఇక్కడకు తీసుకువచ్చాను"

"మరి.. ఇక్కడి వాతావరణం తనకి నచ్చుతుందో లేదో, తను మీ దగ్గరికి వచ్చేస్తానంటే? "

"అనదు. వాళ్ల డాడీకి మాట యిచ్చింది. వింధ్యా! ఆ నీలం మాకెందుకో నచ్చలేదు. ముఖ్యంగా మా ఆయనకు. మా ఆయన, మా అత్తగారు ఇద్దరి సంగతీ తెలుసుగా? అందుకే కొంతకాలం నీదగ్గర వుంచాలని అనుకున్నాము"

"కానీ నీలం తల్లిదండ్రుల్లాగే నేను కూడా..." అంటూ వింధ్య ఇక ముందుకు చెప్పలేక మౌనంగా కళ్లు వాల్చుకుంది.

"నీతో వాళ్లకి పోలికా? జీవితం అంటే ఆలోచన, అవగాహన వున్నదానివి నువ్వు. నీతో వుంటే సంజనా మారవచ్చును. అయినా తప్పు మాది కూడా వుంది వింధ్యా. ఒక్కతే కూతురని ఇన్నాళ్లూ గారం చేశాం. అడిగిన ప్రతి కోరికా తీర్చాం. అదే మేం చేసిన తప్పు"

"చాలామంది తల్లిదండ్రులు చేస్తున్న పొరబాటు అదే" వింధ్య అంది.

"అవును భార్గవీ. నాకు పిల్లలు లేకపోయినా చాలామంది పిల్లలను, పెద్దలను గమనిస్తూ వుంటానుగా. పిల్లలకి కాస్త కూర్చోవడం వచ్చిన దగ్గర నుండి మోటారు సైకిల్ మీద షికార్లు తీసుకు వెళ్లడం.. టి.వి.లో వాళ్లకు ఇష్టమైన ప్రోగ్రాం మాత్రమే చూడడంలాంటివి చేస్తూ అతి గారాబం చేస్తుంటారు. అలాగని పిల్లల్ని బంధించి పెంచమని నేను అనడం లేదు. అవసరమైనప్పుడు తగినంత కట్టడి కూడా పిల్లలమీద పెద్దలకి వుండడం లేదు. నేనేదో మాట్లాడేస్తున్నాను. సంజనా ఇక్కడ వున్నట్టు నీలంకి తెలియకూడదు కదూ!"

"అవును, వాళ్ల ప్రేమ నిజమైతే కొన్నాళ్ల పాటు దూరంగా వున్నా, ఏ కమ్యూనికేషన్ లేకపోయినా వాళ్లు కలుసుకుంటారు. లేకపోతే లేదు. సంజనా సెల్ ఫోన్ కూడా మా ఇంట్లోనే పెట్టాం. ఆ.. నేనింక బయలుదేరుతాను"

"నువ్వు కూడా సరదాగా రెండు రోజులు ఇక్కడే వుండు భార్గవీ"

"నాకూ వుండాలనే వుంది. రాత్రికే వచ్చెయ్యమని మా అత్తగారి ఆర్డరు"

"నువ్వు వెళుతున్నట్లు సంజనాతో చెప్పావా? "

"రైల్లోనే అన్నీ మాట్లాడుకున్నాం"

"ఇంతకూ తెల్లవారుజామునే మీరు ఎలా వచ్చారు? "

"నిన్ననే విజయవాడ వచ్చి అక్కడి నుండి కారులో ఇలా వచ్చాం. నేను మళ్లీ విజయవాడ వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లిపోతాను"

"విజయవాడలో మీ అమ్మగారు, తమ్ముడు, మరదలు, పిల్లలు.. అందరూ బాగున్నారా? "

భార్గవికి ఒక్కక్షణం బాధనిపించింది.

ఇంత మంచి మనసున్న వింధ్య గురించి తనవాళ్లు తేలిగ్గా మాట్లాడటం గుర్తుకు వచ్చింది. “మా మరదలు బాగుంది. మా అమ్మ బాగానే వుంది” అంది కాస్త నవ్వుతూ.

“అమ్మో.. భలే చమత్కారంగా జవాబు చెప్పావే. కాస్త ఆలోచిస్తే తప్ప నీ మాటలు అర్థం కావు సుమా!”

“మరి రచయిత్రిగారి స్నేహితురాలిని కదా? ” అంది భార్గవి తర్వాత.

“వింధ్యా.. సరదాకోసం నీ రచనా వ్యాసంగం, నీ హాబీలు ఏమీ మార్చుకో వద్దు. దాని ప్రవర్తన నీకు ఇబ్బందిగా అన్పిస్తే ఒక్క ఫోన్ చెయ్యి. నేను వచ్చి తీసుకువెడతాను” అంది వింధ్య రెండు చేతులూ పట్టుకుని.

వింధ్య నవ్వేసింది. “నా ఉద్యోగం రోజూ అటువంటి వయసు, మనసు వున్న పిల్లలతో గడపడమే అని మర్చిపో యావా? అయినా సంజనా నన్నెందుకు ఇబ్బంది పెడుతుంది? సీ ఈజ్ మై డా టర్! నువ్వేమీ తన గురించి బెంగ పెట్టు కోకు. సంజనా ఆనందంగా వుండేలా చూసే బాధ్యత నీది మాత్రమే కాదు.. నాది కూడా. సరేనా? ”

భార్గవి మరోసారి వింధ్యకి చెప్పి నిద్ర పోతున్న సంజనాని చూసి బయలుదే రింది. కారు దూరంగా వెళ్లిపోయింది.

★ ★ ★

పూర్తిగా తెల్లవారింది. సంజనా ఇంకా నిద్రపోతూనే వుంది. ప్రశాంతంగా వున్న కొలనులో చిన్న పువ్వు వేసినా వలయాలు ఏర్పడ్డట్టు, తెల్లకాగితంపై చిన్న సిరా చుక్కవేసినా ప్రస్ఫుటంగా కనపడినట్టు ఈ సంజనా ప్రేమకథ వింధ్యలో అలజడి రేపుతోంది.

ఆ ఉదయం పదకొండు గంటలకు నిద్ర లేచింది సంజనా. వంట పూర్తిచేసినా

రాసుకోలేక పోయింది వింధ్య. ఒక పక్క నవలల పోటీ దగ్గరపడుతోంది. ఆలోచన వచ్చినప్పుడు మూడ్ బాగోక, మూడ్ బాగున్నప్పుడు టైము దొరకక రచయితలు ఇబ్బంది పడుతుంటారు. దీనికి వింధ్య కూడా అతీతురాలు కాదు.

"సంజనా! కాఫీ తాగుతావా? "

"వద్దు.. అమ్మ వెళ్లిపోయిందా? "

"ఆ.. నీతో ముందుగానే చెప్పిందట కదా? "

"అవును.. నేను స్నానం చేసి వస్తాను"

సూట్‌కేసులోంచి తనకు కావలసినవి తీసుకొని స్నానానికి వెళ్లింది సంజనా. ఉదయం ఆమెను పరిశీలనగా చూడలేదు. తగినంత పొడవు, బంగారం రంగుకి కాస్త తక్కువైన ఒంటిరంగు. చక్కగా ట్రిమ్ చేసిన కనుబొమలు. ఊరి నుండి వచ్చిన ప్పుడు జుట్టు పైకి మడిచి క్లిప్పు పెట్టు కుంది. నిద్రపోతున్నప్పుడు క్లిప్ తీసిన ట్టుంది. నిద్ర లేచేటప్పటికి జుట్టు వీపంతా నడుము దాకా పరచుకుంది.

అరగంటసేపు స్నానం చేసి వచ్చింది సంజనా.

"భోం చేద్దాం, రా సంజనా. అరె.. తల స్నానం చేసావా? మధ్యాహ్నంవేళ తల స్నానం చేయకూడదు సంజనా!"

"మీరు కూడా అమ్మలాగే మాట్లాడతారే మిటి ఆంటీ? "

"పెద్దవాళ్ళు అలాగే మాట్లాడతారు.. సరేలే.. రా భోంచేద్దాం"

ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. "నాకు గొప్పగా వంట చేయడం రాదు సంజనా.. రెండురోజులు ఎడ్జస్ట్ కావాలి"

"బాగుందాంటీ.. నేను కూడా ఎక్కువగా రుచులు కావాలనుకోను"

ఏదో తిన్నాననిపించి లేచింది సంజనా. తెల్లవారు జామునే లేచింది కాబట్టి, చేసే పనేమీ లేదు కాబట్టి నిద్ర వస్తోంది వింధ్యకి. అతిథిని వదిలి వెళ్ళి నిద్రపోతే బాగుండదని మొహమాటంగా కూర్చుంది. ఇంతసేపూ రెస్ట్ తీసుకుంది కాబట్టి తీరి కగా కూర్చుని పేపరు చూస్తోంది సంజనా.

"నీకు తెలుగు వచ్చా సంజనా? "

"ఏదో కొద్దిగా వచ్చు ఆంటీ"

"పోనీ ఇక్కడ ఉన్నన్ని రోజులు నేర్చుకో"

"ఏమో ఆంటీ చూద్దాం" అంది అనాస క్తిగా.

ఇంక సంభాషణ ఎలా పొడిగించాలో తెలియలేదు వింధ్యకి. అదే ఏ నవల గురించో, కథ గురించో అయితే అనర్గ ళంగా వాదించేది. ఇక్కడ ఉన్నది సాటి రచయితో, సాహితీవేత్తో కాదు. 'తన ప్రేమ... ప్రేమే' అని నిరూపించుకోవల సిన ఆడపిల్ల. ఇంతలో ఫోను మోగింది. అట్నుంచి భార్గవి. విజయవాడ క్షేమంగా చేరానని, సాయంత్రం హైదరాబాద్‌కి బయలుదేరుతానని సంజనాతో మాట్లాడు తుంటే అక్కడే కూర్చుంది వింధ్య, భార్గవి తన స్నేహితురాలే కాబట్టి.

"అలాగే నమ్మా... అలాగే... చెప్పా వుగా ఎన్నిసార్లు చెబుతావు? ఆ... అలాగే.." అంది సంజనా. ఆమె ముఖం లో చిరాకు, అసంతృప్తి. ఈనాటి యువ

తకు ప్రతినిధిలాగే ఉంది. ఫోన్ పెట్టేసి వెళ్ళి గదిలో మంచం మీద కూర్చుంది. ఆ మొహంలో ఏదో పోగొట్టుకున్న ఫీలింగ్.

★ ★ ★

"సంజనా ఫోన్ చేసిందే? ఏమిటో ఒక్కగానొక్క పిల్లని ఏ దిక్కూ లేనట్లు మీ ఫ్రెండ్ ఇంటికి పంపించావ్"

అత్తగారికి చపాతీలు చేస్తున్న భార్గవి ఆశ్చర్యపోయింది. మామ్మకి మనవరాలికి క్షణం పడదు. అటువంటిది సంజనా ఇంట్లో లేదని ఆవిడ బాధపడడం.. బహుశా పోట్లాటలు లేక కాలక్షేపం లేదేమో! నిజానికి సంజనాని ఎక్కువగా మిస్సయ్యేది భార్గవే. ఆమెను కాలేజీకి పంపడం, వచ్చేదాకా ఎదురు చూడడం, రావడం ఆలస్యమైతే కంగారు పడటం.. ఇప్పుడవన్నీ లేవు. పొయ్యిరాళ్ళలాగా తనూ, భర్తా, అత్తగారు. ఈ ముగ్గురికి నలుగురు పనివాళ్ళు. ప్రేమ పేరుతో ఉన్న ఒక్క కూతురూ దూరం అవుతుం దేమో అని భయంగా ఉంది. అసలు సంజనా ప్రేమలో పడుతుందనే ఆలోచన తనకెందుకు రాలేదు? వస్తే మాత్రం ఏం చేయగలిగేది? మనిషిని ఆపగలదు కానీ మనసుకు ఆనకట్ట వేయగలదా? ఒకవేళ నీలం సంగతి అన్ని విధాలా నచ్చితే పెళ్ళి చేసేవారా? ఏమో ఏ విషయంలోనైనా నిర్ణయం భర్తదే. ఆయనకు వ్యతిరేకంగా ఈ ఇంట్లో ఏదీ జరగదు. జరగకూడదు. నెలరోజుల క్రిందటి సంఘటన గుర్తుకొ చ్చింది భార్గవికి.

★ ★ ★

డిపార్టుమెంటు స్టోర్సులో బిల్లు చెల్లిస్తు న్నాడు రామకృష్ణ. "కావలసినవి అన్నీ తీసుకున్నావా? ఏం మర్చిపోలేదుకదా!" అతను ఇలా అడగటం ఏ పదోసారో

అయినా ఓపిగ్గా జవాబిచ్చింది భార్గవి. ఒక వేళ ఏ వస్తువైనా కొనడం మర్చిపోతే ఏమౌతుంది..? అతనో, తనో వచ్చి తీసుకోవచ్చు. కానీ ఆ మాట అతనితో అనే ధైర్యం లేదు. అంటే మళ్ళీ ఏదో అంటాడు. షాపు కుర్రవాడు సామాన్లు తెచ్చి కార్లో పెట్టాడు. కారు ఎక్కబోతూ తల తిప్పి చూసింది భార్గవి.

"అరె.. సంజనా!" అంది.

"ఏది.. ఎక్కడ? " అడిగాడు రామకృష్ణ.

షాపు పక్కనే గల రెస్టారెంటు ఎదురుగా బయటవేసిన గొడుగుకింద కూర్చుని కోక్ తాగుతోంది సంజనా. పక్కనే ఎవరో అబ్బాయి. ఒక ప్లేటులో రెండు చెంచాలు వేసుకుని కట్‌లెట్ తింటున్నారు. భార్యాభర్తలిద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. అతడి ఆవేశం తెలిసినట్టుగా భార్గవి భర్త చెయ్యి పట్టుకుంది. అతను చెయ్యి విదిలించుకుని విసురుగా వాళ్ల దగ్గరికి వెళ్ళిపోయాడు. తండ్రిని చూసి చప్పున లేచి నిలబడింది సంజనా.

"సంజనా! పద ఇంటికి" అన్నాడు రామకృష్ణ.

"డాడీ.. నేను.."

"పద ఇంటికి" అతను కూతురు చెయ్యి పట్టుకున్నాడు.

"డాడీ... ఇతను.."

"పరిచయాలు అక్కర్లేదు, పద"

"సార్.." అన్నాడు నీలం.

"నేను నీతో మాట్లాడడం లేదు" రామకృష్ణ కూతురు చెయ్యి పట్టుకుని తీసుకువచ్చి కార్లో కూర్చోపెట్టాడు. అతను అరవలేదు, కానీ ఆ మాటలు పదునుగా ఉన్నాయి. కళ్ళు తీక్షణంగా ఉన్నాయి. భార్గవి కూడా కారు ఎక్కాక అది కదిలి వెళ్ళిపోయింది. నీలం ఏం చెయ్యాలో తెలియక అలా నిలబడిపోయాడు. భార్గవికి సిగ్గుగా ఉంది. ఇదేమైనా సినిమానా? భర్త ఇంత విపరీతంగా ప్రవర్తించవలసిన అవసరం ఏముంది? ఇంటి దగ్గర కారు ఆగింది. కూతురు మళ్ళీ వెళ్ళిపోతుందేమో అన్నట్టు రామకృష్ణ సంజనాను చెయ్యి పట్టి తీసుకువచ్చి సోఫాలో కూలేశాడు. సంజనా జుట్టు మొహం అంతా కప్పేసింది. భార్గవికి చిరాగ్గా ఉంది. సంజనాపై జాలిగా ఉంది.

"ఎవడే వాడు? " అడిగాడు రామకృష్ణ.

"మా సీనియర్"

"కాలేజి అయ్యాక ఇంటికి రాలేవా? రోడ్డు మీద కూర్చుని పబ్లిక్‌గా వాడితో కోక్ తాగుతున్నావా? " అతని గొంతు అంతకంతకు స్థాయి పెరిగిపోతోంది.

"ఏమిటండీ ఆ కేకలు ఎవరైనా వింటారు" అంది భార్గవి.

"విననీ.. దీని సంగతి అందరికీ తెలియాలి"

"తెలిస్తే ఏం చేస్తారు? అందరికీ తెలియాల్సిన అవసరం ఏముంది? " అంది సంజనా.

"ఏమిటే ఆ మాటలు? " రామకృష్ణ చెయ్యెత్తి కూతుర్ని కొట్టబోయాడు. భార్గవి ఆమెను పక్కకు లాగింది.

"సంజనా! డాడీకి సారీ చెప్పు" భార్గవి బతిమిలాడుతున్నట్టుగా అంది.

"నేనే తప్పూ చేయనప్పుడు సారీ ఎందుకు చెప్పాలి? "

"విన్నావా దాని మాటలు? ఎవడితోనో తింటూ తాగుతూ కూర్చుని తనే తప్పూ చేయలేదట"

"అది చెప్పేది మీరు కూడా వినండి"

"అసలు నువ్వు సపోర్టు చేయబట్టే అది ఇలా తయారైంది"

చాలామంది మగవాళ్ళలాగే రామకృష్ణ జరిగిన దానిని భార్యపైకి నెట్టాడు. అతనింకా ఏమనేవాడో ఇంతలో పనివాడు

వచ్చి ఎవరో అతనికోసం వచ్చారనడంతో రామకృష్ణ బయటకు వెళ్ళిపోయాడు. తుపాను వెలిసినట్లైంది భార్గవికి. రామ కృష్ణ తల్లి గదిలోంచి బయటకు వచ్చింది. జరిగింది అత్తగారికి సగం అర్థమైంది, సగం కాలేదు. అయినా ఆవిడ "మా కాలంలో.." అంటూ గతంలోకి పోయింది.

"సంజనా! ఇంక లే.. స్నానం చెయ్యి. కాస్త చికాకు తగ్గుతుంది" అంది భార్గవి.

ఆ మాటలు విన్పించుకోలేదు సంజనా. వెళ్ళి తన గదిలో కూర్చుంది. రాత్రి పది గంటలకు ఇంటికి వచ్చాడు రామకృష్ణ. అప్పటికి ఇల్లు ప్రశాంతంగా ఉంది. మర్నాడు బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గర కూతుర్ని చూసి మళ్ళీ మొదలు పెట్టాడు "ఇష్టం వచ్చినట్టు తిరగడానికైతే కాలేజికి వెళ్ళొద్దు" అని.

సంజనా కూడా ఊరుకోలేదు. "ఏమిటి డాడీ.. నిన్నటి నుండి తిరుగుతున్నావ్... తిరుగుతున్నావ్ అంటున్నారు. నేనేదో ఒక్కసారి ఫ్రెండ్‌తో బయట కనపడితే తప్పు చేసినట్టా? నిన్న మధ్యాహ్నం క్లాసులు లేవు. కావాలంటే ఈ విషయం మీరు కాలేజీలో అడగండి. తనకేదో షాపింగ్ ఉందంటే వెళ్ళాం"

"ఇంతకీ వాడెవడు? "

"నా ఫ్రెండ్"

"నిన్న సీనియర్ అన్నావ్"

సంజనా ఒక నిముషం మాట్లాడలేదు. "దాచడం ఎందుకు డాడీ? మేం పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం"

భార్యాభర్తలిద్దరూ మొహాలు చూసుకు న్నారు. వాళ్ళ దృష్టిలో సంజనా ఇంకా చిన్నపిల్ల. అది కన్నవాళ్ళ ప్రేమ. కానీ ఆమెను యువతిలాగ చూసి ప్రేమించే ప్రేమ.. అటువైపుంది.

"ఎంత ధైర్యమే నీకిలా చెప్పడానికి? "

సంజనాకి విసుగేసింది.

"చెప్పనంత వరకూ చెప్పు.. చెప్పు.. అంటారు. చెప్పాక, ఎంత ధైర్యం అంటారు. ఎలా మాట్లాడాలి? "

"ఎంతకాలం నుండి సాగుతోంది ఈ భాగోతం"

"భాగోతం కాదు ప్రేమే.. అయినా ఏమిటి డాడీ ఈ భాష? "

"నువ్వు చేసే పనుల కన్నా ఘోరంగా ఉందా నా భాష? "

"నేనేతప్పు చేయలేదంటే నమ్మరేం? "

"మళ్ళీ అదే మాట" అతని చెయ్యి విసురుగా సంజనా చెంపను తాకేదే కానీ సంజనా తప్పించుకుంది.

రామకృష్ణ ఆగ్రహం అవధులు దాటింది. అతను ఎడమ చేత్తో సంజనా జుట్టు పట్టుకున్నాడు. చూస్తున్న భార్గవికి భయంగా ఉంది. గట్టిగా మాట్లాడటం, గొడవలు ఆమెకు అలవాటు లేదు.

"ఏమిటండీ ఇది.. ఆడపిల్లని పట్టుకు కొడతారు? "

"నువ్వు నోర్మూసుకో"

"ఎవడే వాడు.. వాడిని ప్రేమించావా? "

"అదేగదా చెబుతున్నాను"

భార్గవి బలవంతంగా రామకృష్ణ చేతిని సంజనా జుట్టు నుండి విడిపించింది. సంజనా మొహంలో ఏదో రిలీఫ్. భార్గవి వీధి తలుపు వేసేసింది. అదృష్టవశాత్తూ పనివాళ్ళందరూ పెరటివైపే ఉన్నారు.

అయినా ఆమె తలుపులు వేసేసింది.

"ఏమిటండీ.. ఇది ఇల్లా, సంతా? ఇరవై ఏళ్ళున్న పిల్లని కొడతారా? "

సంజనా నీరసం వచ్చినట్టు సోఫాలో కూర్చుండిపోయింది.

"వయసొస్తే సరిపోతుందా.. బుద్ధి లేక పోయాక? "

"నిజంగా అది చేసింది తప్పే అయితే కూర్చోబెట్టి మాట్లాడండి"

"ఇంక మాటాలేదు.. మంతీలేదు. వారం రోజుల్లో ఎవరితోనో ఒకరితో ముడి పెట్టేస్తాను.. తిక్క కుదురుతుంది"

రామకృష్ణ మూర్ఖుడని తెలుసు కానీ.. ఇంత మూర్ఖుడనుకోలేదు.

"నేను చేసుకోను.." అంది సంజనా.

"అదిగో.. మళ్ళీ ఎలా మాట్లాడుతోందో చూడు"

"ఆగండి.. ఇద్దరికిద్దరే.. విషయం వది లేసి వాదించుకుంటారు. ఏమండీ నా మాట వినండి.. అతనెవరో ఏమిటో తెలుసుకోండి"

"ఏం వాడికిచ్చి పెళ్ళి చేస్తావా? నాకిష్టం లేదు"

"ఏ ప్రయత్నం చేయకుండా.. ఏం తెలుసుకోకుండా నాకిష్టం లేదు అంటే ఎలా? "

రామకృష్ణ ఒక నిముషం ఆలోచించాడు.

"సరే.. వాడెవరో కనుక్కో" అంటూ వెళ్ళిపోయాడు.

సంజనా దిగాలుగా కూర్చుంది. ఎప్పుడూ సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, లాప్‌టాప్‌తో ఏదో పని చేసుకుంటూ సీతాకోకచిలుకలా తిరుగుతూ ఉండే కూతురిని అలా చూసి బాధ కలిగింది భార్గవికి. "సంజానా.. లే. అలా కూర్చుంటే మరీ డల్ గా అన్పిస్తుంది. టీవీ పెట్టుకో. నాలుగు పాటలు చూస్తే చలాకీతనం వస్తుంది" అంది.

సంజనా మాట్లాడలేదు.

"చూశావుగా దాని మొండితనం.. తండ్రి మాట మీద గౌరవం లేదు.. నీ మాటంటే లెక్కలేదు" అంది అత్త.

భార్గవి అత్తగారివైపు వారిస్తున్నట్టు చూసింది. ఆవిడకి అంత సున్నితంగా చెబితే అర్థం కాదు.

సంజనా ఒక్క ఉదుటన లేచింది.

"ఏం.. ఎందుకు వుండాలి? పిల్లలు పిల్లల్లాగే వుంటారా? వాళ్ళకంటూ జీవితం ఏర్పడదా? "

"ఏమిటా తెగింపు మాటలు? కాస్త వినయం నేర్చుకో"

"నేనేం తప్పు చేయలేదంటే వినరేం. అక్కడ అతను నేనే కాదు, దాదాపు వంద మంది మనుషులు వున్నారు. అయినా డాడీ నన్ను అవమానంగా లాక్కొచ్చారు. ఏదో నేరం చేసినట్టు ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ వేళ కాలేజీకి కూడా వెళ్ళొద్దన్నారు. ఎందుకు? ఇదంతా ఈరోజు తెలిసింది కాబట్టి. అసలు తెలియకపోతే? " విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయిందామె.

భార్గవికి, అత్తగారికి ఏమనాలో తెలియలేదు. ఆమె మాటల్లో అసత్యం లేదు. భార్గవి వంటచేయడానికి వంటింట్లోకి వెళ్ళింది. ఆ యింట్లో డ్రైవరు, తోటమాలి, వాచ్‌మెన్, పనిమనిషి వున్నారు. వంట భార్గవే చేస్తుంది. చేస్తూనే ఆలోచించసాగింది. ఎంత ఆలోచించినా తప్పు తన భర్తదే అన్పిస్తోంది. ఈ రోజుల్లో ఆడపిల్లలు, మగపిల్లలు కలిసి తిరగడం, సినిమాలకి, హోటల్స్‌కి వెళ్ళడం మామూలైపోయింది. అంత అనాగరికంగా కార్లో కూలేసి యింటికి తీసుకురావడం, ఏదో చెయ్యకూడని పనిచేసినట్టు ఆ మాటలు. సంజనాని నెమ్మదిగా అడిగితే... అసలు సంజనాయే కాదు... ఈ తరం పిల్లలు

కోప్పడితే, దండిస్తే అసలు వినరు. బుజ్జగిస్తేనే మాట వింటారు. రామకృష్ణ అనవసరంగా గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చాడు. ఆ యింట్లో సీరియస్‌గానే వున్నారందరూ...

ఆ రాత్రి భోజనాలు అయ్యాక రామకృష్ణతో మాట్లాడింది భార్గవి. "సంజనాని అలా కోప్పడ్డారు. మాట్లాడడం మానేసారు".

"మళ్ళీ మొదలుపెట్టావా? ఇంతకీ అది ఏమంటుంది? "

"ఏమీ అనలేదు... మీతో చెప్పిందిగా ప్రేమించానని, ఒకసారి అతనితో మాట్లాడండి".

రామకృష్ణ భార్యవైపు చిరాగ్గా చూశాడు. "చిన్నప్పుడు దానికి యిష్టమైనవి అన్నీ కొంటున్నానని, గారం చేస్తున్నానని నామీద చిరాకు పడేదానివి. ఇప్పుడది ప్రేమించాననగానే వాడితో మాట్లాడాలా? "

"అప్పుడది చిన్నపిల్ల. హద్దులో పెట్టవలసిన వయసు"

"అంటే యిప్పుడు హద్దులో పెట్టనవసరం లేదా? "

"ఇప్పుడు తనతో మంచేదో, చెడేదో చర్చించాల్సిన వయసు"

"అన్నీ పుస్తకాల్లో వున్నట్టు జరగవు"

"ఎందుకు జరగవ్? పుస్తకాలు, సినిమాలు జీవితాల్లోంచి వచ్చేవే! అయినా మనం మాట్లాడుకోవలసింది సంజనా గురించి.. మనకి వున్నది ఒక్కగానొక్క కూతురు. మనం చెయ్యం అంటే వాళ్ళే పెళ్ళి చేసుకుంటాం అంటారు. ఇంత ఐశ్వర్యం వుండీ దాన్ని దూరం చేసుకుంటే ఏం లాభం? "

అతను కొంచెం సేపు మాట్లాడలేదు.

"సరే, రేపు నువ్వు మాట్లాడి చూడు"

"మీరే మాట్లాడండి"

"ఏం.. నువ్వెందుకు మాట్లాడవ్? "

"అది ఏమందో చెప్పినా మీకు నామీద నమ్మకం వుండదు. దాన్ని నేను సపోర్ట్ చేస్తున్నాను అనుకుంటారు"

"సరే.. రేపు మాట్లాడదాం"

హమ్మయ్య అతనిచేత ఆ మాట అన్పించడానికి యింత కష్టపడవలసి వచ్చింది. తిరిగి చూసేసరికి రామకృష్ణ గుర్రు పెడుతున్నాడు. అదృష్టవంతుడు.

★ ★ ★

"ఈ ప్రేమ పెళ్ళిళ్ళ వల్ల సుఖమేమీ వుండదంటే వినవేం? "

"అలా ఏ విషయాన్నైనా అందరికీ సరిపోతుందని ఎలా చెప్తారు డాడీ? "

"నీకు తెలియదు. ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకున్నవాళ్ళు ఎక్కువగా విడిపోతారు"

"ఏం.. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు చేసుకున్నవాళ్ళు కలసి వుంటున్నారా? "

ఈ వాదన సుమారు అరగంట నుంచి జరుగుతోంది. భార్గవి కల్పించుకుంది. "సంజనా యిదంతా పక్కకు పెట్టు. నిన్న నీతో కన్పించాడే అతనెవరు.. పేరు? "

"నీలం"

"అదేం పేరు? నీలం.. ఆకుపచ్చలాంటి పేర్లేమిటి? "

"ఏమో.. అందరూ అతన్ని అలాగే పిలుస్తారు"

"కులం? "

"తెలియదు"

"వాళ్ళ నాన్నగారు ఏం చేస్తారు? "

"తెలియదు, తను వాళ్ళ మామయ్య దగ్గర వుంటాడు"

"పోనీ వాళ్ళ మామయ్య ఏంచేస్తారు? "

"ఏదో ప్రయివేటు కాలేజీ ప్రిన్సిపాల్"

"ఇంతకీ అతను నీకెలా పరిచయం? "

"మాకు వన్ ఇయర్ సీనియర్"

"పెళ్ళి చేసుకుందామనే అభిప్రాయానికి వచ్చి ఎన్ని రోజులైంది? "

"ఆరు నెలల పైనే"

"మరి మాకెందుకు చెప్పలేదు? "

సంజనా మాట్లాడలేదు. రామకృష్ణకి మళ్ళీ కోపం వస్తోంది. "చూశావుగా దాని పొగరు, నువ్వడిగిన ప్రశ్నల్లో చాలావాటికి తెలియదు అన్నదే జవాబు. పైగా వాళ్ళు నిర్ణయం తీసుకున్న ఆరు నెలలకైనా మనకు చెప్పాల్సిన బాధ్యత లేదు" రామ కృష్ణ కోపంగా బయటకు వెళ్ళిపోయాడు. కారు బయలుదేరిన చప్పుడు విన్పించింది. కూతురి ప్రవర్తన భార్గవికి కూడా చిరాగ్గా వుంది. కానీ యిలా చిరాకు, కోపంతో పనులు జరగవ్. మగవాళ్ళు ఏమాత్రం చిరాగ్గా వున్నా బయటికి వెళ్ళిపోతారు. ఆడవాళ్ళకి అది వీలవదు. సంజనాని చూస్తే ఒక్క పక్క జాలిగా కూడా వుంది.

"సంజనా! ఇటు రా" అంది తల్లి.

"ఏమిటమ్మా? "

"నేను చెప్పేది ఆవేశపడకుండా విను. ఆ నీలం నాకూ డాడీకి ఇద్దరికీ నచ్చలేదు. అతని గురించి నీకేం తెలియదు. మీది ప్రేమో, ఆకర్షణో మీకు తెలియదు. ఏ నమ్మకం పెట్టుకొని మీ పెళ్ళికి ఒప్పుకో మంటావు? "

"ఎందుకమ్మా మీ పెద్దవాళ్లందరూ యిలా ఆలోచిస్తారు? మొదటే ఒక నిర్ణ యానికి వచ్చేస్తారు. మొన్న సాయంత్రం డాడీ అంత అనాగరికంగా నన్ను బలవం తంగా లాక్కొచ్చారు. నాకెంత బాధ, అవ మానం కలిగిందో తెలుసా? "

"ఆయన చేసిన పని నాకూ నచ్చలేదు. మా దృష్టిలో నువ్వు చాలా చిన్నపిల్లవి సంజనా. అలాంటిది నువ్వొక అబ్బాయితో వుండటం చూసి ఆయన తట్టుకోలేకపో యారు. పోనీ జరిగిందేదో జరిగింది.. ఆ నీలం నిన్ను ఏం జరిగిందో కనీసం ఫోను లోనైనా అడిగాడా? సంజూ! నేను చెప్పేది నువ్వూ ఆలోచించు. ఇంత ఆస్తికి నువ్వు ఒక్కగానొక్క వారసురాలివి. చిన్నప్పటి నుండి అన్ని సౌకర్యాలతో పెరిగినదానివి.. నిజంగా అతను నిన్ను ప్రేమిస్తున్నాడో, నీ ఆస్తిని ప్రేమిస్తున్నాడో మనకి తెలియదు. ఈ రోజుల్లో ఇంతటి మహానగరంలో అతడు ఎటువంటివాడో, కుటుంబం ఎటు వంటిదో మనకి ఎవరు చెబుతారు? "

ఇంతలో కాలింగ్‌బెల్ మోగిన చప్పుడు.. 'ఎవరో వచ్చారు' అని పనిమ నిషి వచ్చి చెప్పింది. సంజనా అలాగే కూర్చుంది. భార్గవి హాల్లోని ద్వారం దగ్గ రకి వెళ్ళేసరికి మొన్న చూసిన అబ్బాయి!

"నమస్తే! నా పేరు నీలం. మీతో మాట్లాడాలని వచ్చాను" అన్నాడు.

భార్గవికి ఆశ్చర్యంగా వుంది. ఇలా అను కున్నారో లేదో అలా వచ్చేశాడు. అతడిని యింట్లోకి పిలవాలా? వద్దా?

ఈ కాలం యువకులను నమ్మడానికి లేదు. వాడిచేతిలో కత్తో, రివాల్వరో, ఏ యాసిడ్ బాటిలో వుంటే.. వాటితో సంజ నాకుగానీ, తమకుగానీ ఏమైనా హాని చేస్తే? సమయానికి రామకృష్ణ కూడా యింట్లో లేడు. ఉన్నా అతడేమైనా హీరోనా? ఒక్క నిముషంలో యిదంతా ఆలోచించింది భార్గవి. నీలంకి అర్థమైంది, ఆమె తనని ఇంట్లోకి పిలవడానికి సందేహి స్తోందని. అపరిచితుడ్ని యింట్లోకి రమ్మన డానికి ఆలోచిస్తోందని.

ఆమె యిబ్బందిని గ్రహించిన వాడిలాగ నీలం "నేను యిలా బయటే కూర్చుం టాను. అంకుల్‌తో మాట్లాడి వెళ్ళిపో తాను" అన్నాడు.


"లోపలికి రండి" అంది భార్గవి మర్యా దకి.

"నన్ను ఏకవచనంలో నువ్వు అని సం బోధిస్తే చాలు" అన్నాడు నీలం.

"అంకుల్ యింట్లో లేరు"

"అలాగా? సెల్‌ఫోను తీసుకువెళ్ళారా? ఫోన్‌చేస్తే వస్తారా? అంతవరకూ

యిక్కడ కూర్చుంటాను" అతను వరండాలో వేసిన పేముకుర్చీల్లో ఒకదానిలో కూర్చున్నాడు. మళ్ళీ ఏమన్పించిందో గార్డెన్‌లోని ఉయ్యాలలో కూర్చున్నాడు. ఇతను వచ్చినట్టు సంజనాకి చెప్పాలా? వద్దా? అతను ఆమె గురించి అడగలేదు. భార్గవి



వెంటనే రామకృష్ణకి ఫోన్‌చేసింది. అతను బయలుదేరి వస్తున్నాడు యింటికి. ఇంతలో "ఎవరు వచ్చారమ్మా?" అంటూ బయటికి వచ్చిన సంజనాకి గార్డెన్‌లో ఊయలలో కూర్చున్న నీలం కన్పించాడు.

ఆమె అతని దగ్గరగా వెళ్ళబోయింది. భార్గవి ఆమెను చేయిపట్టి ఆపేసింది. "వద్దు... డాడీ

యింటికి వస్తున్నారు. మళ్ళీ మీ యిద్దర్నీ చూశారంటే పెద్ద గొడవ అవుతుంది"

సంజనా పనిమనిషితో దినపత్రిక పంపించింది. నీలం పేపరు ఒకసారి తిర గేసి యింటిని పరిశీలనగా చూడసాగాడు. రెండు అంతస్తులుగా కట్టిన యిల్లు సంజ నావాళ్లది. గేటుకి, యింటికి మధ్య పెద్ద తోట. ఒకవైపు ఊయల. తోట మధ్యలో ఫౌంటెన్. బిల్డర్‌గా రామకృష్ణ బాగా సంపాదిస్తున్నాడు కాబోలు. చూసినంత మేర తోట పచ్చదనంతోపాటు రామకృష్ణ ఐశ్వర్యం కూడా కన్పిస్తోంది.

కారు రివ్వున వచ్చి ఆగింది. డ్రైవరు డోర్ తీశాక గానీ కారు దిగలేదు రామ కృష్ణ. నీలంకి తన హోదా, దర్జా అన్నీ తెలియాలి. అతన్ని చూసి లేచి నిలబ డ్డాడు నీలం. 'ఫర్వాలేదు, వీడికి పెద్దలంటే గౌరవం వుంది' అనుకున్నాడు.

"నమస్తే అంకుల్"

"ఆ.. ఏమిటి యిలా వచ్చావ్?"

"మీతో మాట్లాడాలని వచ్చాను"

"లోపలికి రా"

ఇద్దరూ హాల్లో, సోఫాల్లో కూర్చున్నారు. పనిమనిషితో యిద్దరికీ కాఫీ పంపింది భార్గవి.

"చెప్పు, ఏం మాట్లాడాలి?" అడిగాడు రామకృష్ణ. అతనికి కోపం, పట్టుదల ఎక్కువ. భార్గవితో కూడా తగినంతే మాట్లాడతాడు. కాస్త సరదాగా, చనువుగా వుంటే తనని లోకువ చేస్తారేమోనని అతని భయం. నీలం గొంతు సవరించు కున్నాడు. బయటికి రఫ్‌గా కన్పించినా రామకృష్ణ ముందు నీలం వయసు రీత్యా, అనుభవం రీత్యా చాలా చిన్నవాడు. అందులోనూ అతి సున్నితమైన ప్రేమ విషయం అతనిది.

"నాకు సంజనా మూడేళ్లుగా తెలుసు"

"అయితే..?"

"సంజనా మీకు చెప్పేవుంటుంది"

"చెప్పింది"

వింటూన్న భార్గవికి నవ్వొస్తోంది, కోపం వస్తోంది. నీలం యిబ్బంది అర్థమ వుతోంది. అటువంటప్పుడైనా రామకృష్ణ బాగా మాట్లాడవచ్చుకదా! పోనీ తను కల్పించుకుని మాట్లాడితే? రామకృష్ణకు కోపం వస్తుంది.

కాఫీ పూర్తయింది. నీలంకి కాస్త చురు కుదనం వచ్చింది.

"సంజనా.." అంటూ ఏదో చెప్పబో యాడు.

"నీ గురించి సంజనాకి ఏమీ తెలియదు. మీరు గంటల తరబడి మాట్లాడుకుం టారు. కానీ ఒకరి వివరాలు మరొకరికి తెలియవు"

"నాకు తెలుసంకుల్, తన గురించి"

"కానీ తనకి నీ గురించి ఏమీ తెలి యదు. అసలు నీ పేరే నాకు నచ్చలేదు. నీలం.. అదేం పేరు?"

"నా పేరు నీలంరాజు శ్రీధర్"

"మరి అంత మంచి పేరుతోనే పిలిపిం చుకోవచ్చుకదా! మీ తల్లిదండ్రులు ఎక్కడ వుంటారు? మీ నాన్నగారేం చేస్తారు?"

అతని మొహం చిన్నబోయింది. "మా అమ్మానాన్న విడాకులు తీసుకున్నారు"

'చూశావా వీడి చరిత్ర యిది' అన్నట్టు చూశాడు రామకృష్ణ, భార్గవి వైపు. వింటూన్న సంజనా కూడా ఉలిక్కిపడింది. తల్లి చెప్పినట్టుగానే సంజనా బయటికి రాలేదు. హాలుకు పక్కనే గల తండ్రి ఆఫీ సురూమ్‌లో కూర్చుంది. అక్కడికి రామ కృష్ణ నీలం యిద్దరూ కన్పిస్తున్నారు. భార్గవి ఆ గది పక్కనే కుర్చీ వేసుకు కూర్చుంది.

"మరి నువ్వు ఎవరి దగ్గర వుంటావు? నిన్నెవరు చదివిస్తున్నారు?"

"మా మామయ్య"

"ఆయనకి పెళ్ళి కావలసిన ఆడపిల్లలు వున్నారా? "

"లేరు.. ఆయనకి పెళ్ళి కాలేదు"

"మరి నిన్ను పెంచవలసిన అవసరం ఏముంది? "

"మానవత్వం" సింపుల్‌గా అన్నాడు నీలం.

"సంజనా నీకెందుకు నచ్చింది? మాయింటికి రమ్మని, నాతో మాట్లాడమని తను నిన్ను పిలిచిందా? "

"సంజనా ఎందుకు నచ్చిందంటే నా దగ్గర జవాబు లేదంకుల్. బహుశా ప్రేమలో పడ్డవాళ్లెవరూ దీనికి జవాబు చెప్పలేరనుకుంటా. మొన్న మీకు మమ్మల్ని బజారులో చూడగానే కోపం వచ్చింది. నిన్న తను కాలేజికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. సరే, ఒకసారి నేను కూడా మిమ్మల్ని కలిసి మాట్లాడాలని యిలా వచ్చాను"

"తనకి నువ్వు సీనియర్ అయ్యుంటే నీ చదువు పూర్తయి వుండాలే? నీకింక ఆ కాలేజీతో పనేమిటి? "

"వీలైనప్పుడు కాలేజీ దగ్గరే మేం కలుసుకుంటాం"

"సరే, ఇప్పుడు నువ్వేమంటావ్? "

"సంజనాకి, నాకు పెళ్ళి చేస్తే.."

ఈసారి రామకృష్ణ గొంతు సవరించుకున్నాడు. "ఆ మాట సంజనా కూడా చెప్పింది. కానీ ఏం చూసి నా కూతురిని నీకిచ్చి పెళ్ళిచేయాలి? అమ్మాయికి పెళ్ళి చేయాలంటే ఆస్తి, అంతస్తు, కుటుంబం యివన్నీ చూస్తారు పెద్దవాళ్ళు. నీకు పెళ్లికి కావలసిన ఏ లక్షణమూ లేదు"

"కానీ సంజనా అంటే ప్రేమవుంది"

"కేవలం అది ఒక్కటే సరిపోదు. ప్రేమ తిని ఎవ్వరూ బ్రతకలేరు. వెధవ డబ్బు అని ఈసడిస్తారు. కానీ ఆ డబ్బేలేకపోతే పొద్దున్నే కప్పు కాఫీ కూడా దొరకదు. అయాం సారీ! సంజనాని నీకిచ్చి చేయలేను"

అంతవరకు మౌనంగా వున్న సంజనా మధ్యలో కల్పించుకుని అంది "తనకి కేంపస్ సెలక్షన్స్‌లో జాబ్ వచ్చింది డాడీ"

"అలాగా.. మరి చెప్పవేం? "

"నాకున్న అర్హతలను బట్టి మీ అమ్మాయిని యిస్తారా లేక ఆమె మీద గల ప్రేమని చూశా? "

రామకృష్ణకి కోపం వచ్చింది. "ఇదేమైనా సినిమా అనుకున్నావా? కేవలం నిన్ను చూసి యిచ్చేయడానికి నీ కుటుంబం, నీ లక్షణాలు ఏవీ నాకు నచ్చలేదు"

"అవన్నీ వుండి మీ అమ్మాయి మీద ప్రేమ లేకపోతే"

"చూడు బాబూ.. ఇప్పటికి నువ్వు చాలా సార్లు 'ప్రేమ' అనే మాట ఉపయోగించావ్.. ప్రేమ అనేది ఒక వస్తువులాగ మనకి కన్పించదు. కానీ దాన్ని వ్యక్తపరచడానికి మనం చేసే పనులు కూడా కన్విన్సింగ్‌గా వుండాలి"

"నేను యిందులో తప్పుగా ప్రవర్తించింది ఏముంది? నాకు మీరు చెప్పే లక్షణాలేమీ లేకపోవచ్చు. ఇంకొకటి కూడా లేదు. అదే మోసం. ఎవరో యిద్దర్ని తీసుకొచ్చి నా తల్లిదండ్రులు అంటే నమ్మేవారు

కాదా? మా మావయ్య ప్రయివేటు కాలేజీకి ప్రిన్సిపాల్. నన్ను క్రమశిక్షణతోనే పెంచారు. ఇంకా మావాళ్ళు విడాకులు తీసుకున్నారంటే దానికి కారణం తెలియదు. అది వాళ్ళ వ్యక్తిగత విషయం"

"నువ్వు మాత్రం ఏదో కారణంతో భార్యకి విడాకులు ఇవ్వవని గ్యారెంటీ ఏమిటి? "

"విడాకులు వంశానుగతంగా వచ్చే ఆస్తో, వ్యాధో కాదంకుల్"

"ఏమో! నువ్వెంత చెప్పినా నాకు నమ్మకం, సంతృప్తి కలగడం లేదు"

"పోనీ మీరొకసారి మామయ్యతో మాట్లాడండి"

"నువ్వే నచ్చనప్పుడు మీవాళ్ళతో మాటలు దేనికి? "

"ఏమిటి డాడీ.. అంత కచ్చితంగా మాట్లాడతారు? ఎక్కడో ఒక దగ్గర మీరు కన్విన్స్ కావడం లేదు" అంది సంజనా.

"ఈ సంబంధం నాకు నచ్చలేదు సంజనా. నువ్వు నాకు ఒక్కగానొక్క కూతురివి. మనకు డబ్బుకి లోటు లేదు. పెళ్ళికొడుక్కే కాదు.. వాళ్ళ పెద్దవాళ్ళకు కూడా ఒకహోదా వుండాలి. మా అమ్మాయి ఫలానా జడ్జిగారి కోడలు, ఫలానా ఎమ్.ఎల్.ఏ గారి కోడలు యిలా చెప్పుకోగలిగి వుండాలి. ఇక్కడ ఆ ఆవకాశమే లేదు. ఈ ప్రేమ పెళ్ళిళ్ళవల్ల వచ్చే సమస్యలు తట్టుకొనే శక్తి నాకు లేదు. పైగా ప్రేమ పెళ్ళిళ్ళపై నాకు సదభిప్రాయం లేదు"

"అయితే నాకు పెళ్ళి చేస్తానని వేరే ప్రయత్నాలు చేయకండి డాడీ"

"ఏం బెదిరిస్తున్నావా? "

"లేదు.. నిజమే చెబుతున్నాను"

"నువ్వు అతన్ని అంత గాఢంగా ప్రేమించావా? "

రామకృష్ణ మాటల్లో అందరికీ వెటకారం వినపడింది.

"ప్రేమలో ప్రేమే వుంటుంది. గాఢత్వం, నిగూఢత్వం ఇవేవి వుండవ్"

"ఉపన్యాసాలు ఇవ్వకు"

"మీరు చెయ్యనన్న పెళ్ళి మేమే చేసుకుంటే? " నీలం అన్నాడు.

"ఓ.. అంతధైర్యం వుందా? యిప్పుడేగా మావయ్య క్రమశిక్షణతో పెంచారన్నావ్? అదేనా ఈ శిక్షణ? చూడు బాబూ! యింక మాటలు అనవసరం. ఈ సంబంధం.. నీ సంబంధం నాకు నచ్చలేదు. మీది కేవలం, ఆకర్షణ, ఆవేశం. అది తీరిపోగానే మీ యిద్దరి మధ్యా ఈగో ప్రాబ్లమ్స్ వస్తాయి. సంప్రదాయం, కుటుంబం అన్నీ సరిగా చూసి చేసిన పెళ్ళిళ్ళే నిలబడడం లేదు.. వాటిలోనే ఎన్నో గొడవలు, సర్దుబాట్లు, సర్దుకుపోవడాలు ఉంటాయి. ఇక హోదా, కుటుంబం, సంప్రదాయం ఏమీ సరిపోని మీ పెళ్ళి నిలబడదు. ఈనాడు తీసుకున్న ఏ నిర్ణయమయినా పదేళ్ల తర్వాత ఎందుకు తీసుకున్నామా అన్పించకూడదు"

నీలం లేచి నిలబడ్డాడు. "అదేమిటి, వెళ్ళిపోతావా? " సంజనా అడిగింది.

"ఇంక ఎంతసేపు మాట్లాడినా యివే మాటలు. మీ డాడీకి మన మీద నమ్మకం లేదు. నా మీద సదభిప్రాయం లేదు. ఇదేమీ రోమనుల కాలం కాదు, ఎరీనాలో దిగి సింహంతో పోరాడి గెల్చి నా ప్రేమను నిరూపించుకోవడానికి"

"అయితే మనం ఎలా? " సంజనాకి ఏడుపు వచ్చేస్తోంది.


"ఆలోచిద్దాంలే సంజనా.. మీ డాడీ మా మామయ్యతో మాట్లాడనని అన్నారుగానీ మామయ్య మీ డాడీతో మాట్లాడవచ్చు. అంకుల్! యిది నా ఫోన్‌నెంబరు. మీ అభిప్రాయం మారితే ఫోన్ చేయండి" అని అతను వెళ్ళిపోయాడు.

సంజనా అతడిని గేటుదాకా సాగనం

పింది.

తండ్రి హాల్లోనే కూర్చుని సీరియస్‌గా ఆలోచించడం ఆశ్చర్యమన్పించింది. తల్లి ఏదో పని చేసుకుంటోంది. సంజనా తన గదిలోకి వెళ్లి ఆలోచించసాగింది.

సముద్ర కెరటాల్లాంటి ఆలోచనలు, ఒడ్డుకి రాకుండా వుండలేవు. ఒడ్డుని దాట లేవు, సముద్రంలో వుండలేవు... ఆమెకు జీవితంలో మొదటిసారి సీరియస్‌గా ఆలోచించడం అలవాటయిన క్షణం అది.



"సంజనా ఇటు రా.. యిలా కూర్చో" రెండురోజుల తర్వాత రామకృష్ణ కూతురితో మాట్లాడిన మాట అది.

తల్లి దగ్గరగా లేకుండా తండ్రితో మాట్లాడాలంటే సంజనాకు భయం వేసింది. అయినా వచ్చి కూర్చుంది. తండ్రీకూతుళ్ళిద్దరూ రామకృష్ణ బెడ్‌రూమ్‌కి అటువైపున్న బాల్కనీలో కూర్చున్నారు. అటువైపు వీధి వైపు వున్నంత హడావిడి వుండదు. ఇప్పుడిప్పుడే అపార్ట్‌మెంట్స్ కడుతున్న ప్రాంతం. ఇద్దరు ఎదురెదురుగా పేము కుర్చీల్లో కూర్చున్నారు.

"సంజనా! నీ పెళ్ళి విషయంలో నీలం గురించి నాకు సంతృప్తికరంగా లేదు"

"ఆ విషయం మీరు మొన్ననే చెప్పారు"

"నువ్వు చిన్నదానివి.. ఎవరైనా నీతో కాస్త బాగా మాట్లాడితే, కొంచెం నీపై శ్రద్ధ చూపిస్తే అదే ప్రేమ అనుకునే వయసు"

"మరి దేన్ని ప్రేమనుకోవాలి? నీలం చెప్పినట్టు సింహంతో పోరాడి.." సంజనాకి నవ్వు వచ్చింది. ఆ నవ్వుని పెదవుల పైకి రాకుండా కట్టడి చేసుకుంది.

రామకృష్ణ ఆలోచిస్తున్నట్టుగా చెప్పసాగాడు "సంజనా! నేను యిప్పుడు యిలా వున్నత స్థితికి రావడానికి ఎంత కష్టపడ్డానో తెలుసా? మానాన్నది చిరుద్యోగం. ఇద్దరు అక్కలు, నేను, తమ్ముడు. ఇంతమందికి చదువు చెప్పించాలంటే చాలా కష్టం. నేను యింటర్‌లోనే చదువు ఆపేసి చిన్నవుద్యోగంలో చేరవలసి వచ్చింది. కొద్దిగావున్న పొలం అమ్మి ఇద్దరు అక్కలకి పెళ్ళి చేసేసరికి తాతలు దిగి వచ్చినట్టయింది. తర్వాత మా నాన్న రిటైర్‌మెంట్, ఆయన అనారోగ్యం.. ఈలోగా మా తమ్ముడు ఎవరో అమ్మాయిని ప్రేమించానంటూ ఎవరికీ చెప్పకుండా ఆమెను పెళ్ళి చేసుకొని యింటికి తీసుకువచ్చాడు. ఆ గొడవలకి మానాన్న ఆరోగ్యం మరింత పాడైంది. ఆ తర్వాత ఎంతోకాలం ఆయన బతకలేదు. కాస్త సంపాదనతో నేను, అమ్మ, తమ్ముడు, మరదలు.. యింత మంది బతకాలి. మధ్య మధ్యలో మా అక్కల ప్రసవాలు, మా బావలకు మర్యాదలు! వీటన్నిటితో నాకెందుకు పిచ్చెక్కలేదా అని యిప్పుడన్పిస్తుంది. మా తమ్ముడు ఏ పనీ చెయ్యడు, బాధ్యత వహించడు. ఎలా కలుపుకున్నారో ఏమో, మా మరదలి వైపువాళ్ళు వచ్చి వీడిని, మరదలిని తీసుకుపోయి చిన్న వ్యాపారం పెట్టించారు. నేను పని చేసే కాంట్రాక్టరు దగ్గర చిన్నచిన్న పనులు స్వయంగా చేయడం మొదలుపెట్టి ఈ స్థితికి రావడానికి ఇరవై ఏళ్ళు పట్టింది. ఇంక నువ్వు ఏసీ రూములో నిద్రపోయి, ఏసీ కారులో తిరగడం అలవాటు పడ్డా

నివి.. ఒక్కసారిగా ఆ పేదరికంలో ఎలా సర్దుకుపోగలవ్? ”

సంజనా కొంచెంసేపు మాట్లాడలేదు. “డాడీ! మీ చిన్నప్పటి పరిస్థితులు యిప్పుడు లేవు. తనకి జాబ్ వచ్చింది. ప్రారంభంలోనే ఇరవైఐదువేల రూపాయల జీతం. నేనూ జాబ్ చేస్తాను. యింక డబ్బులేకపోవడం అనే సమస్యే లేదు”

“కానీ అతనికి మేనమామ వున్నాడు”

“ఉండనివ్వండి. నీలంతో మాత్రమే నా అనుబంధం”

“అలా అనుకోవడమే పొరబాటు సంజనా. మేనమామ అతన్ని పెంచి పెద్ద చేసినవాడు. కేవలం నీలంతోనే నీకు అనుబంధం అనుకోకూడదు. పైగా అతనికి భార్య లేదు. ముసలివయసులో మీరే చూడాలి. ఈ బాధలన్నీ నువ్వు పడలేవు”

తండ్రి తనని భవిష్యత్తు గురించి హెచ్చరిస్తున్నాడో, భయపెడుతున్నాడో సంజనాకి అర్థం కాలేదు.

“నాకేం బాధలేదు డాడీ.. నా మీద నాకు నమ్మకం వుంది”

“కానీ నీ పరిస్థితులపైన నాకు నమ్మకం లేదు”

“అయితే ఏం చెయ్యమంటారు? ” విసుగ్గా అంది సంజనా.

“చూశావా.. కాస్త ఓపికగా నాలుగు మాటలు వినలేని నువ్వు పరిస్థితుల్ని ఎదుర్కొంటావా? ఏదైనా చెప్పినంత సులువు కాదు ప్రాక్టికల్‌గా ఎదుర్కోవడం. నా మాట విను నిన్ను నేను గొప్పింటి కోడలిగా ఊహించుకున్నాను. నిన్ను చదివించింది కేవలం డిగ్రీ కోసమే తప్ప రాత్రనక, పగలనక ఆ ఉద్యోగాలు చేయమని కాదు. ఉద్యోగం చేయకపోతే ఈ మధ్య తరగతి జీవితాలు ఎలాగుంటాయో నాకు తెలుసు. పైగా అతని తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. అదెందుకో మనకు తెలియదు. ఈ మేనమామకు పెళ్ళి కాలేదు, అదెందుకో అర్థం కాదు. ఇన్ని లొసుగులు ఉన్న ఈ సంబంధం మనకు అవసరమా? ”

సంజనాకు ఇబ్బందిగా ఉంది. తండ్రికి తన మీద ఉన్న ప్రేమ తెలియనిది కాదు. అలా అని తండ్రి కోసం నీలంను వదులుకోలేదు. సమస్యలు కాలానికి వదలివేయడం మంచిదే. కానీ అందులోనే ‘ఎస్కేపిజం’ దాగి ఉంటుంది.

“ఇక్కడ కూర్చున్నారా? ఏం చేస్తున్నారు? ” అంటూ వచ్చింది భార్గవి.

“చూడు భార్గవి, సంజనా ఎంత చెబుతున్నా, ఆ నీలంనే చేసుకుంటాననంటోంది”

“ఏం సంజనా? ”

“అవునమ్మా.. డాడీ అనవసరంగా భయపడుతున్నారు. ఆయన చెప్పినట్టు జరగదు”

రామకృష్ణకి కోపం వచ్చేసింది. “అంటే నువ్వు చెప్పినట్టు అంతా జరుగుతుందా? అయితే వాడినే చేసుకో”

“నాకు మీరూ కావాలి డాడీ”

“నా మాట వినని దానికి ఇక నేనెందుకు? ”

రామకృష్ణ బయటికి వెళ్ళిపోయాడు.

★ ★ ★

“ఏమిటీ ఇంట్లో అందరూ నన్నొక విలన్‌గా చూస్తున్నారు” రామకృష్ణ అడిగాడు

భార్గవిని.

"అందరూ అనకండి. మీరేం చేసినా మీ అమ్మగారికి ఇష్టమే"

"అంటే నీకు, నీ కూతురికి ఇష్టం లేదు, అంతేగా? "

"నా కూతురు అంటారు ఎందుకు? సంజనాని ఇన్నాళ్లూ ఒక్కగానొక్క కూతురు అని గారం చెయ్యలేదా మీరు? "

"అందుకని అది ఎవరో దారిన పోయే దానయ్యని చేసుకుంటానంటే ఊరుకోవాలా? "

"ధనవంతుడైనా, దానయ్య అయినా దారిలోనే నడుస్తాడు. అతని మామయ్యతో మాట్లాడితే మీ సొమ్మేం పోయింది? "

"సొమ్ము పోయినా ఫర్వాలేదు, పరువు పోకూడదు. నేను అతనితో మాట్లాడితే మనకేదో ఇంట్రస్టు ఉందనుకుంటారు"

ఒక క్షణం ఆగి మళ్లీ అన్నాడు "అసలు నాకే నచ్చనప్పుడు ఈ తతంగం అంతా ఎందుకు? "

"ఆ అబ్బాయిని చూశాక, మాట్లాడాక కాస్త పద్ధతి కలవాడు అనిపించింది" తన అభిప్రాయం అడగకపోయినా చెప్పేసింది భార్గవి.

"మనకు తెలిసి ప్రేమపెళ్ళిళ్ళు చేసుకున్న వాళ్లు ఎవరు సుఖంగా ఉన్నారు, చెప్పు? " మాట్లాడుతూ ఏదో ఆలోచన వచ్చినవాడి లాగ ఆగిపోయాడు.

"ఏమిటి.. ఏదో ఆలోచిస్తున్నారు? "

"ఆ.. వాడేమన్నాడు.. ఎరీనాలో దిగి పరీక్షలో నెగ్గలేనన్నాడు కదూ! మనమొక పరీక్ష పెడితే? "

"పరీక్షా? "

"అవును, కొంతకాలంపాటు వీళ్ళిద్దరినీ కలుసుకోనివ్వకుండా, మాట్లాడుకోకుండా చేస్తే? "

"చాల్లెండి. అతను మీకు నచ్చనప్పుడు ఎందుకు ఈ పరీక్షలు, ప్రయోగాలు? "

"అబ్బాయి బాగానే ఉన్నాడు. అయినా నేను ఆలోచించేది వాడి గురించి కాదు, సంజనా గురించి. ఐడియా వాడే ఇచ్చాడుగా.. ఏమంటావ్? "

"ఏమో, నాకేం అర్థం కావడం లేదు"

"ఇందులో అర్థం కానిదేముంది? సంజనాని కొంతకాలం పాటు ఎక్కడికైనా పంపిద్దాం"

"ఎక్కడికి పంపిస్తాం? ఇన్నాళ్లూ ఒక్కతే అమ్మాయని దానికి సౌకర్యాలు జరగవంటూ ఎక్కడికీ పంపించలేదు. ఇప్పుడు పంపిస్తే, ఎందుకు, ఏమిటి అని ప్రశ్నలు వేస్తారు"

"మీ అమ్మగారింటికి పంపిద్దాం"

"మా అమ్మకు అన్నం పెట్టడానికే మా మరదలు విసుక్కుంటోంది, అక్కడికి ఇది కూడా ఎందుకు? "

"పోనీ మీ తమ్ముడి దగ్గరకి పంపిస్తే? " అంది భార్గవి.

రామకృష్ణ మొహం కోపంతో ఎరుపెక్కింది. "ఛీ! వాడి స్వార్థం తప్ప ఏమీ తెలియని వాడింటికా? ఆ.. మీ వింధ్య గారింటికి పంపిస్తే.."

భర్త వైపు నిశితంగా చూసింది భార్గవి. "తనంటే సదభిప్రాయం లేదుగా మీకు"

రామకృష్ణ కళవళపడ్డాడు. "సదభిప్రాయం లేకేం? అసలు మనమ్మాయి అక్కడ ఉండటమే కరెక్టు"

"ఎందుకు? "

"ఆవిడ ప్రేమించి పెళ్ళిచేసుకొని విడాకులు తీసుకుంది. తను ఎలాంటి పరిస్థితుల్లో అలా ఒంటరిగా బతుకుతోందో చెప్పగలదు"

"కానీ ఒకరి అనుభవాలు చూసి పాఠాలు నేర్చుకొనే వయసు కాదు సంజనాది" అంది భార్గవి.

"నేనేం చెప్పినా నీకు నచ్చకపోతే

ఎలా? "

"మీరు మనుషుల గురించి ఆలోచిస్తున్నారు. నేను మనసు గురించి ఆలోచిస్తున్నాను" అంది భార్గవి.

"ఆలోచించు.. సంజనా మారాలంటే మీ వింధ్య గారి ఇల్లే కరెక్టు"

భార్గవి ఆలోచిస్తోంది. ఇన్నాళ్ళూ తను వింధ్యతో మాట్లాడటం భర్తకి ఇష్టం లేదు. ఆమె ఫోన్ చేసినా, ఇంటికి వచ్చినా భర్త, అత్తగారు అనుమానించేవారు. వింధ్య తమ ఇంటికి రావడమే మానేసింది. ఆమె లాగే తనూ సంసారం విడిచిపోతుందేమోనని భయపడేవారు. కానీ వింధ్య జీవితం అలా కావడానికి కారణం స్నేహం కాదు. వీరిలాంటి ఇద్దరు మనుషులు. కానీ వింధ్య వీళ్ళ గురించి ఎన్నడూ చెడుగా మాట్లాడదు. మంచికో చెడుకో వింధ్య ఇంటికి పంపుతాను అంటున్నాడు భర్త. ప్రేమ సంగతి ఎలా ఉన్నా, సంజనా వింధ్య దగ్గర ఉంటే బాగుపడుతుంది. తను కూడా నాలుగు రోజులు వింధ్యతో కలసి గడపవచ్చు భార్గవికి వింధ్యను తలుచుకుంటే సమస్యలు మరచిపోయి, మనసు తేలికై హాయిగా నిద్రపట్టింది. ఎవరిని తలుచుకుంటే మన సమస్యలు మరచిపోతామో, మన బాధలు తీరినట్టయి సంతోషం కలుగుతుందో అదే ప్రేమ.

★ ★ ★

"ఏమిటీ పరీక్షలు? నాన్సెన్స్!" చిరాగ్గా అంది సంజనా.

"పోనీ పరీక్షే కదా.. పెట్టనీ" శాంతంగా అన్నాడు నీలం.

"అంటే ఇలా నువ్వు, నేనూ మాట్లాడుకోకుండా ఉంటే, ఫోన్స్ చేసుకోకుండా, కలుసుకోకుండా ఉంటే నిజమైన ప్రేమికులం అయిపోతామా? " సంజనా తెల్లటి ముఖం ఎర్రబడింది. ఆవేశంతో పెదవులు అదురుతున్నాయి.

"ఏమో.. వాళ్ళకి ఏదో ఆలోచన వచ్చింది. అది అమలు చేయాలని ఆశ" ఒక్క క్షణం ఆగి అన్నాడు "మనమీద మనకి నమ్మకం లేకపోతే కదా!"

"నిజం చెప్పు.. మనల్ని మనం ఇలా నిరూపించుకోవలసిరావడం అసహ్యంగా లేదు? " అంది సంజనా.

"అలా ఆలోచిస్తావ్ ఎందుకు? పరీక్షకు నిలబడదాం"

సంజనా మాట్లాడలేదు. ఆమె నీలంను కలుసుకోవడానికి వీల్లేకుండా ఎక్కడికో పంపిస్తామని అన్నారు. ఎక్కడికో తెలియదు, ఎన్ని రోజులో చెప్పలేదు. కాకపోతే ఈ విషయం గురించి మాట్లాడుకోండన్నారు. కానీ సంజనాకి ఈ పరీక్షలు, విడదీయడం ఇష్టం లేదు. ఆమెతో పోలిస్తే నీలం కాస్త 'కామ్'గానే ఉన్నాడు.

"మనం ఇంత చిన్న విషయంలోనే ఏకాభిప్రాయానికి రాలేకపోతే ఎలా? "

"నన్ను వేరే ఊరు తీసుకువెళ్ళి అక్కడ వేరే పెళ్లి చేస్తారనే అనుమానం లేదా? "

"ఓ.. అదొకటి ఉందా? అయినా మనల్ని వాళ్ళు నమ్మాలి అనుకున్నప్పుడు, మనం వాళ్ళని నమ్ముదాం. అంతటి పరిస్థితి వస్తే నిన్నునువ్వు రక్షించుకోలేవా? "

"ఎలా? " అంది సంజనా.

"అది ఆ పరిస్థితిని బట్టి ఆలోచించాలి. అటువంటి పరిస్థితి వస్తే నాకు ఫోన్ చెయ్యి. ఎలాగోలా తప్పించుకో"

"నువ్వు మాట తప్పవు కదూ!"

"మనం ఇలా మాట్లాడుకుంటే మనల్ని విడదీయాలని ఆలోచన వచ్చినవాళ్ళు సగం విజయం సాధించినట్టే"

సంజనాకి ఏడుపు వచ్చేస్తోంది. అది చూసి నవ్వాడు నీలం.

"ఛ! నన్ను చూసి నవ్వుతావా? నీకు హృదయం లేదు"

"ఇంతసేపటికి మంచిమాట చెప్పావు. అవును నాకు హృదయం లేదు. నీకు ఇచ్చే సానుగా!"

సంజనా అతని భుజం మీద తల వాల్చింది. ఆమె కళ్ళవెంట నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి.

"నిన్ను వాళ్ళు పంపిస్తున్నారు. కానీ మనసుని ఎక్కడికీ పంపిచలేరుగా? మనల్ని కలుసుకోవద్దన్నారు, కానీ నువ్వు ఎక్కడ ఉంటావో నన్ను తెలుసుకోవద్దనలేదుగా? "

"నేను ఎక్కడ ఉన్నది ఎలా తెలుసుకుంటావ్? "

"అది ఇంకా ఆలోచించలేదు. అదేగా పరీక్ష అంటే? "

★ ★ ★

'మేలుకోవయ్యా.. కావేటి రంగా శ్రీరంగా మేలుకోవయ్యా..' మంచినిద్రలో ఉన్న సంజనాకి మెలకువ వచ్చింది. ఆమె ఒకసారి కళ్లు తెరచి చూసి మళ్లీ నిద్రపోవడానికి ప్రయత్నించింది. కానీ నిద్ర రావడంలేదు. ఆమెకు తన ఇల్లు గుర్తుకు వచ్చింది. రాత్రి చాలాసేపు చదువుకుని నిద్రపోవడం తనకి అలవాటు. లేవగానే తమ ఇల్లు నిశ్శబ్దంగా ఉండడం ఎన్నడూ చూడలేదు. ఎ.సి.లో పడుకున్నా, రోడ్డు మీద పోయే వాహనాల చప్పుళ్లు, పనివాళ్ళపై నాయనమ్మ కేకలు.. బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేస్తే తను త్వరగా బయటకు వెళ్ళాలని తల్లిని తొందరపెట్టే తండ్రీ.. 'ఉదయం ఇంత ప్రశాంతంగా ఉంటుందా' అనిపిస్తోంది. ఆఖరికి ఆమెకు ఇలా ఖాళీగా సమయం గడుపుతూ ఏదో ఒకటి ఆలోచించడం బాగుంది. ఇంతలో సన్నగా అడుగులు వేస్తూ గదిలోకి వచ్చింది వింధ్య. "సంజనా! నిద్రలేస్తావా? " మృదు

వుగా నిద్రలేపుతోంది. కళ్లు తెరిచింది సంజనా. లేత ఆకుపచ్చరంగు చీరలో అందంగా ఉంది వింధ్య.

"గుడ్ మార్నింగ్ ఆంటీ!"

"గుడ్ మార్నింగ్ సంజనా! నేను కాలేజీకి వెడుతున్నాను. టేబుల్ మీద అన్నీ సర్దిపెట్టాను. నా కోసం చూడకుండా నువ్వు భోజనం చేసెయ్. స్టవ్ పక్కన గిన్నెలో పాలు ఉన్నాయి. పక్కనే షెల్ఫ్‌లో బోర్నవిటా, హార్లిక్స్, పంచదార ఉన్నాయి. నీకు ఇష్టమైనది కలుపుకుని తాగు. స్టవ్ దగ్గర జాగ్రత్త!

ఇక్కడంతా కొత్తవాళ్లు నీకు. బయటకు వెళ్ళకపోవడమే మంచిది. నువ్వు ఇంట్లో ఉన్నట్టు ఎవరికీ తెలియకుండా నేను బయట తాళం వేసుకు వెడుతున్నాను. ఇదిగో ఇది డూప్లికేట్ కీ. ఏదైనా పని ఉంటే, బయటకు రావాలనిపిస్తే వెనుక వైపు తలుపు తీసుకు రావచ్చు. బయట ఎండ చాలా ఎక్కువగా ఉంది, జాగ్రత్త. నేను వెళ్ళొస్తాను" వింధ్య బయటకు వెళ్ళి తాళం వేసిన చప్పుడు. వింధ్యతోపాటు వచ్చిన సన్నని పరిమళం కూడా వెళ్ళిపోయింది. కాటన్ చీరలు ఇంత బాగుంటాయా? ఆకుపచ్చరంగు ఇంత బాగుంటుందా? ఒక్కొక్కప్పుడు పువ్వులే కాదు, ఆకులు కూడా పరిమళిస్తాయి.

సంజనా కొంచెంసేపాగి మంచం మీద నుండి లేచింది. నిన్న తను వచ్చిందే కానీ.. ఆంటీని వివరాలు అడగలేదు. ఆంటీ జాబ్ చేస్తున్నట్టు ఉంది. తలుపులు అన్నీ మూసిన ఆ ఉదయం వేళ, ఆ ఇంట్లో ఆమెకు ఏదో స్వేచ్ఛ లభించినట్టయింది. టి.వి. ఆన్ చేసి చూస్తూ కూర్చుంది. సుమారు ఉదయం ఏడున్నర గంటలకు నిద్రలేచిన ఆమె పదకొండు గంటల వరకు మొహం అయినా కడగకుండా అలా కూర్చుంది. కరెంట్ పోవడంతో లేచి బ్రష్ చేసి కాఫీ కలుపుకుంది. తాగుతూ ఇంటిని పరిశీలనగా చూడసాగింది. చుట్టూ కాంపౌండ్ వాల్‌తో మిగతా ఇళ్ళకు కాస్త దూరంగా ఉన్న ఇల్లు అది. ముందు గది పెద్దగా, చిన్న హాలులాగా ఉంది. దాన్ని ఆనుకొని వంటిల్లు, హాలులో కాస్త పక్కగా చిన్న డైనింగ్ టేబుల్. వెనుకగా రెండు గదులు. ఒకటి పడకగది. ఇంకొక గదిలో బీరువా, టేబుల్, కుర్చీ టేబుల్ మీద ఇంగ్లీషు, తెలుగు నిఘంటువులు. పక్క షెల్ఫులో పుస్తకాలు. ఆమె ఆశ్చర్యపోయింది. ఇంట్లో ఎక్కడ చూసినా పుస్తకాలే. ఆమె కాఫీ తాగిన కప్పు పెట్టడానికి వంటింట్లోకి వచ్చింది. కిచెన్ చిన్నది అయినా పొందిగ్గా అన్నీ సర్దివున్నాయి. ఒక పక్కగా దేవుని పటాలు, విగ్రహాలు. హాలులో కూడా ఎక్కువ సామాను లేదు. పేము సోఫాసెట్టు, టీపాయ్ పైన ఇంగ్లీషు, తెలుగు దినపత్రికలు, నాలుగైదు వార, మాస పత్రికలు. గోడలకు వెంకటేశ్వరస్వామి, అలివేలు మంగల ఫొటో. షోకేసులో ఉత్తమ రచయిత్రి అవార్డు అందుకుంటూ వింధ్య ఫొటో. సంజనాకి తెలుగు పుస్తకాల గురించి అంత బాగా తెలియదు. తల్లి చెబుతూ ఉంటుంది గానీ తను అంత శ్రద్ధగా వినదు. ప్రముఖ తెలుగు రచయిత్రి వింధ్య ఈవిడేనా? తల్లి తనను ఎక్కడికి పంపిస్తోందో, ఆ యిల్లు, వాతావరణం ఎలా ఉంటాయో చెప్పబోయింది. తను వింటే కదా! కోపంతో 'నువ్వేం చెప్పొద్దు, నేనేం వినను' అంది. అయితే ఈ యింట్లో ఆంటీ ఒక్కతే కన్పిస్తోంది. ఆమెకు ఎవరూ లేరా? మెడలో మంగళసూత్రాలు నల్లపూసలు కన్పిస్తున్నాయి. అంటే ఆంటీకి పెళ్ళయింది. మరి అంకుల్? ఆఫీసు పనిమీద ఏదో ఊరు వెళ్ళివుంటారు. సంజనా ఆలోచిస్తూ,

ఇంట్లో తిరుగుతూ, ప్రశ్నలు వేసుకుంటూ జవాబులు చెప్పుకుంది. తన యింటితో పోలిస్తే చిన్న బొమ్మరిల్లులా ఉన్న ఈ యిల్లు నచ్చింది సంజనాకి. స్నానం చేసి, భోజనానికి కూర్చుంది.

మధ్యాహ్నం ఒంటిగంటకి యింటికి వచ్చింది వింధ్య. "అబ్బ! ఏం ఎండలు? అయినా బస్సులు రష్‌గానే ఉన్నాయి. గుడ్ సంజనా! భోజనం చేస్తున్నావా? నేనూ చీర మార్చుకుని వస్తాను"

వింధ్య వచ్చేసరికి సంజనా భోజనం ముగించి టి.వి. చూస్తోంది. ఆమె తిన్న కంచం అలాగే వుంది. వింధ్యకు చిరాకేసింది. కానీ ఆమెను ఏమనడానికి మనసు రాలేదు. తనే కంచంతీసి, గిన్నెలు తోమే టబ్‌లో వేసి, టేబుల్ క్లీన్ చేసి భోజనానికి కూర్చుంది.

"కూర అలాగే ఉంది సంజనా.. నువ్వు వేసుకోలేదా? "

"కొద్దిగా తిన్నాను ఆంటీ, ఆనపకాయ నాకు నచ్చదు"

"అలాగా, ఆ విషయం నాకు తెలియదు. అయినా ఏదో ఒకకూర వండుకోవాలిగా" సంజనా మాట్లాడలేదు.

"కాస్సేపు నిద్రపోతాను సంజనా.. మరి నువ్వు? " అంది.

"నాకు మధ్యాహ్నం నిద్ర అలవాటు లేదాంటీ"

"అందుకే చక్కగా, నాజూగ్గా వున్నావ్" ఆ పొగడ్తకి సిగ్గుపడింది సంజనా.

"అయినా ఎందుకు నిద్రపోవు? పొద్దున్న లేటుగా లేచావా? "

"లేదు ఆంటీ.. యిప్పుడు టి.వి.లో మంచి డాన్స్ ఉంది"

"అలాగా.. అయితే నేనూ చూస్తా, చూడొచ్చుగా? "

"ఇది మీ టి.వి. ఆంటీ"

ఆ మాటతో కాస్త ఫీలైంది వింధ్య. కానీ తను ఫీలవుతూ కూర్చుంటే సంజనా మనసులో ఏముందో తెలియదు. నిజానికి ఆమెకు నిద్రవస్తోంది. అయినా సంజనాతో మాట్లాడాలని కూర్చుంది.

హిందీఛానల్‌లో ఏదో డాన్స్ ప్రోగ్రాం వస్తోంది.

"మీరు యిలాంటి డాన్స్‌లు చూస్తారా ఆంటీ? "

"బాగుంటే చూస్తాను.. ఏం అలా అడిగావ్? "

"మా అమ్మ చూడదు ఆంటీ. నా బలవంతం మీద కాస్సేపు చూసినా ఏదో పని కల్పించుకుని వెళ్లిపోతుంది"

"మాతరం వాళ్ళకి నెమ్మదిగా, హుందాగా వుండే ప్రోగ్రాములు కావాలి. మీకు కాస్త స్పీడుగా, హడావిడిగా ఉండాలి అవునా!"

"నిజమే. అమ్మ టి.వి. శ్రద్ధగా చూసింది అంటే అది ఏదో పాత సినిమా అయివుంటుంది"

"మరి మీ డాడీ? "

"ఆయన కాస్సేపు న్యూస్ ఛానల్స్ చూస్తారు, అంతే. మరి మీ పిల్లలు నాలాగే ఉంటారా ఆంటీ? వాళ్ళు కన్పించడం లేదే? "

"నాకు పిల్లలు లేరమ్మా" వింధ్య ముఖం చిన్నబోయింది.

"మరి అంకుల్ ఆఫీసు పని మీద

ఊరికి వెళ్ళారా? "
"లేదు, కొన్ని కారణాల వల్ల మేం విడి పోయాం, విడాకులు తీసుకున్నాం"
"ఎందుకు.. అయాం సారీ! మరీ పర్స నల్ విషయం అడిగానేమో కదూ"
"ఫర్వాలేదు. నీకు తెలియవచ్చు. యూ ఆర్ మెచ్యూర్డ్" కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత అంది వింధ్య.
"ఒక్కరూ ఉండటం బోర్‌గా ఉండదా? "
"బోర్‌గానే ఉంటుంది. కానీ తప్పదు కదా!" అంది వింధ్య.
"మరి మీ అమ్మావాళ్ళు? "
"నాది ప్రేమ వివాహం. ఇంట్లో అంద రినీ ఎదిరించి ఆ పెళ్ళి చేసుకున్నానని కోపం. ఈలోగా మీ అంకుల్‌తో కూడా సరిపడక విడాకులు తీసుకువచ్చేసానని మావాళ్లకు నా మీద ద్వేషం. నేను విడా కులు తీసుకున్నాను కాబట్టి, అమ్మావా ళ్ళతో కలిసి ఉంటే వాళ్ళ పిల్లలకి మంచి సంబంధాలు రావేమోనని భయం మా అన్నయ్యలకి. అందుకే అందరికీ దూరంగా ఉంటున్నా"
"మరి మీరు జాబ్ చేస్తున్నారా? "
"నేను ఇంగ్లీష్ ఎమ్మే. రాజమండ్రిలో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాను"
టి.వి. చూస్తున్నా సంజనా పూర్తిగా ఆ డాన్సుని ఆనందించలేకపోతోంది. ఇంతలో వింధ్య "సంజనా! నేనిక్కడ ఉంటే నీక్కూడా ప్రోగ్రాం చూడాలన్పించదు. కాస్సేపు నిద్రపోతాను" అంటూ బెడ్ రూమ్‌లోకి వెళ్ళిపోయింది. తండ్రికి, తనకీ జరిగిన 'చర్చ' గుర్తుకు వచ్చింది సంజ నాకి. 'వెళ్ళు.. ఆవిడ ఇంటికి వెడితే ప్రేమ పెళ్ళి చేసుకున్నవాళ్ళ జీవితం ఎలా ఉంటుందో తెలుస్తుంది' అంటూ అరిచాడు నాన్న. ఇదా కారణం! వింధ్య ఆంటీ జీవితం చూసి తను బుద్ధి తెచ్చుకోవాలా? కాదు, కాదు మనసు మార్చుకోవాలి.
పదిరోజులు గడచిపోయాయి. సంజ నాకి వింధ్య టైమ్‌టేబుల్ బాగా అలవాట యిపోయింది. వింధ్య తెల్లవారు జామునే లేస్తుంది. మూడ్‌ని బట్టి రాసుకోవడమో, చదువుకోవడమో చేస్తుంది. ఆరు గంట లకు పనిపిల్ల వస్తుంది. ఆమెతో పని చేయిస్తూ వంట పూర్తిచేసి, స్నానం, పూజ ముగించుకుని కొద్దిగా తిని బయట తాళం వేసుకు వెళ్లిపోతుంది. మళ్లీ రావడం ఒంటిగంటకే. ఆలోచనలతో నిద్రపట్టకపో యినా, బద్ధకంతో లేవలేకపోయినా వింధ్యని డిస్టర్బ్ చేయకుండా వుండడం సంజనాకి అలవాటు. ఒకరోజు ఉదయమే రేడియోలో భక్తిగీతాలు వింటూ, కూ నిరాగాలు తీస్తూ పనిచేసుకుంటోంది వింధ్య. "ఆ అమ్మాయి గారెవరండీ? " పని పిల్ల నాగమణి ప్రశ్న.
వింధ్య ఏం చెబుతోందా అని వినసా గింది సంజనా.
"మా ఫ్రెండ్ కూతురు" చెప్పింది వింధ్య.
"అలాగా.. ఈ వూళ్ళో ఉద్యోగం వచ్చిం దాండీ? "
"ఏం.. ఉద్యోగం రాకపోతే మనింటికి రాకూడదా? "
"అది కాదండీ, ఈ రోజుల్లో ఎవరింటికి ఎవరూ రాకపోకలు చేయడంలేదని మీరే అంటూంటారుగా? "
"బాగుంది. నా పాఠం నాకే అప్పగిం చావ్! నీతో పరిచయం పెంచుకుందామని, నువ్వెలా పనిచేస్తున్నావో చూద్దామని వచ్చింది, చాలా? "
ఆ సమాధానానికి సంజనాకి నవ్వొచ్చింది.
"ఆవిడ హైదరాబాద్‌లో వుంటారంట గదండీ, మన ఊళ్ళో ఏం తోచుబాటు అవుతుందా అని? "
"అబ్బ! నీతో మాట్లాడితే ఇదేనే చిక్కు.



ప్రశ్న మీద ప్రశ్న వేస్తావు. కాలక్షేపానికేం లోటు? హాయిగా టి.వి. చూస్తుంది. పుస్తకాలు చదువుకుంటుంది. కుట్లూ, అల్లికలూ నేర్చుకోవచ్చు, బొమ్మలు వేసుకోవచ్చు"

"అయ్‌బాబోయ్.. ఇవన్నీ మీలాగే అమ్మాయిగారికి కూడా వచ్చాండీ? "

"ఆ.. నువ్వు తప్ప యింకెవరూ కబుర్లతో కాలాన్ని వృథా చేసుకోరు"

ఆ మాటతో నాగమణి కబుర్లాపి పనిలో పడింది. ఇదంతా వింటూన్న సంజనా ఉలిక్కిపడింది. ఆంటీ చెప్పిన వాటిల్లో తను టి.వి. చూడడం తప్ప ఏమీ చేయడం లేదు. కాకపోతే నాగమణి కబుర్లతో కాలాన్ని వృథా చేసుకుంటోంది, తను ఆలోచనలతో. తామిద్దరికీ అదే తేడా. తల్లి కూడా ఇదే కాకపోయినా, యిలాంటివే ఏవో చెబుతూ ఉంటుంది. తను వింటే కదా!

“సంజనా.. నేను వెళ్లొస్తాను. కాఫీ కాదు బోర్నవిటా తాగు. నా కోసం కూర్చోకు, భోజనం చేసేయ్. పెరుగు ఫ్రిజ్‌లో ఉంది, సరేనా? ”

సంజనా లేచి చూసేసరికి వింధ్య వెనక్కి తిరిగి వెళ్ళిపోతోంది. కనకాంబరం రంగు కాటన్ చీర రెపరెపలు, మొగలి పువ్వు వాసనలు వింధ్యతోనే వెళ్లిపోయాయి.

★ ★ ★

“ఏమిటి ఆంటీ! నాగమణితో నాగురించి అలా చెప్పారు? ” మధ్యాహ్నం కాఫీలు తాగాక తీరికగా పేపరు చూస్తూన్న వింధ్యని అడిగింది సంజనా. ఆమెకు అర్థం కాలేదు.

“మీరు చెప్పిన ఒక్క మంచి లక్షణం కూడా నాకు లేదు. తినడం, టి.వి. చూడటం, పడుకోవడం తప్ప నేనేం మంచి పని చేస్తున్నానని”

“మంచిపని అంటే ఏమిటి నీ దృష్టిలో? కొంగుబిగించి అహర్నిశలు శ్రమపడిపోవడమా? కాదు. ఇన్నాళ్ళకి భార్గవికి నిన్ను నా దగ్గర ఉంచాలన్పించింది. నువ్వు మంచిపిల్లవి కాబట్టి నేనెవరో పెద్ద పరిచయం లేకపోయినా నాతో ఉంటున్నావు. వాళ్ళమ్మా, నేనూ ఎంత చెప్పినా వినకుండా ఈ నాగమణి ఎనిమిదో తరగతిలోనే చదువు మానేసింది. ఎలాగైనా ప్రయివేటుగా పదోతరగతి రాయించాలని నేను ఎంతో కృషి చేశాను. దాని బుర్రలోకి ఎక్కలేదు. ఇంక నీ సంగతి.. ఇంజనీరింగ్ చదివావు, ఏడాదిలోగా ఉద్యోగం వస్తుంది. లేదూ ఎమ్.టెక్ చదువుతావు. ఈ నాగమణి పనిచేసినంతసేపూ చేయడం, ఆ టి.వి.లో వచ్చే చెత్త సీరియల్స్, సినిమాలు చూడటం, జీవితం అలా లేదని బాధపడటం.. ఇదేగా? ”

“మీరు అమ్మలాగే మాట్లాడతారు ఆంటీ. మీకూ టీ.వి. అంటే కోపమా? ”

“కోపమా.. అన్ని ఛానల్స్ ఇరవైనాలుగు గంటలు కార్యక్రమాలు రూపొందించాలంటే కష్టం కదూ! ఎంత వినోదం కోసమైనా దానికీ కొంత హద్దు వుంటే బాగుంటుంది. అంత చక్కటి మీడియాని మనం సరిగా ఉపయోగించుకోలేక పోతున్నామేమో అన్పిస్తుంది”

ఇంతలో ఫోన్ మోగింది. వింధ్య ఫోన్ తీసి “భార్గవీ! నీకు నూరేళ్ళు. నీ గురించే అనుకుంటున్నాం” అంది.

“మా అమ్మాయి నిన్నేం ఇబ్బంది పెట్టడం లేదుగా? ”

“లేదు. మీ అమ్మాయిని నేనే ఇబ్బంది పెడుతున్నాను”

“అంటే? ”

“పాపం.. ఈ పల్లెటూరిలో తనకేం తోస్తుంది. అందులో మాకు సగం టైం పవర్ కట్. టీవీ చూడాలన్నా ఉండదు”

“నీకు ఎన్నో ఆర్ట్స్ వచ్చు. తనని నేర్చుకోమను”

“చూద్దాంలే. మన యిష్టాయిష్టాల్ని ఎవరిమీదా రుద్దకూడదు. సరే.. సంజనాతో మాట్లాడు”

ఫోన్ సంజనా తీసుకుంది.

“ఆంటీనేం ఇబ్బంది పెట్టడం లేదుగా? ”

“లేదమ్మా! ఆంటీ చెప్పారుగా”

“వింధ్య దగ్గర తెలుగే కాదు, మంచి

ఇంగ్లీషు నవలలు ఉన్నాయి. అవి చదువు. తనకు బొమ్మలు వేయడం, గ్లాస్ పెయింటింగ్, కుట్లు, అల్లికలు యిలా చాలా వచ్చు, నేర్చుకో. అన్నింటినీ మించి కాస్త తెలుగు నేర్చుకో"

"అలాగేనమ్మా" వీలైనంత సహనంగా అంది సంజనా.

"మీరెలా ఉన్నారమ్మా? నువ్వేం చేస్తున్నావ్? "

"ఏముంది మామూలే. నువ్వులేక అస్సలు తోచడం లేదు"

"గ్రానీ ఎలా ఉంది? "

"బాగానే ఉన్నారు, యిదిగో మాట్లాడు" ఫోన్ అత్తగారికి యిచ్చింది భార్గవి.

"ఎలా ఉన్నావ్? " కమలమ్మగారు అడిగింది.

"బాగున్నాను. ఇక్కడ ఎంత బాగుందో తెలుసా? హైదరాబాద్‌లో ఉండగా నువ్వు ప్యాంట్ వేసుకోవద్దన్నావా? ఇక్కడికి వచ్చాక షార్ట్స్ వేసుకుంటున్నాను"

"నీ ఇష్టం వచ్చినట్టు ఉండవే. ఎవరడిగారు నిన్ను? "

"అదీ.. అలా అన్నావ్, బాగుంది" సంజనా మరికాస్సేపు మాట్లాడి ఫోన్ పెట్టేసింది.

★ ★ ★

ఆ రోజెందుకో సంజనాకి మరీ చిరాగ్గా ఉంది. వింధ్య వెళ్ళాక ఆలోచించడం మొదలు పెట్టింది. తను వచ్చి ఇన్ని రోజులైంది, నీలం గురించి ఏమీ తెలియలేదు. అసలు తన గురించి తనకే అర్థం కావడం లేదు. ఇక్కడ ఇలా ఉంటే కొన్ని రోజుల్లో పిచ్చిపట్టేట్టు ఉంది. తల్లి చెప్పినట్టు ఏమైనా నేర్చుకుంటే.. బుక్స్ చదివితే..? ఆలోచన వచ్చిందే తడవుగా ఆమె వింధ్య లైబ్రరీలోంచి ఒక పుస్తకం తీసి చదవడం మొదలుపెట్టింది.

మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటికి ఇచ్చింది వింధ్య.

"సంజనా! భోజనం చేశావా? "

"లేదాంటీ, మీరు వచ్చాక తిందామని"

"ఏదో చదువుతున్నావే? అబ్బ! 'గాన్ విత్ ది విండ్', ఇంతకుముందు చదివావా? "

"లేదాంటీ, పుస్తకాలు చదవడం ఇదే మొదలు"

"అన్నప్రాశన రోజే ఆవకాయ అన్నట్టు, మొదటే ఇంత సీరియస్ నవల చదువుతున్నావా? సరేలే రా, భోజనం చేద్దాం"

భోజనాలు పూర్తయ్యేసరికి పోస్ట్ వచ్చింది. నవలల పోటీలో ప్రథమ బహుమతి వచ్చిందని వింధ్యకి వారపత్రిక ఆఫీసునుంచి ఉత్తరంతో పాటు చెక్కు వచ్చింది. వింధ్య ఆనందం పట్టలేక సంజనా చేతులు పట్టుకు గిరగిరా తిప్పేసింది.

"ఏమిటి ఆంటీ! ఇంత ఆనందం? "

"ఆనందమే సంజనా! నవలల పోటీలో ప్రథమ బహుమతి అంటే మాటలా? పడిన కష్టానికి గుర్తింపు లభించింది"

"తెలుగు పుస్తకాలతో నాకంత పరిచయం లేదు. మీరొక ప్రముఖ రచయిత్రి అయినందుకు థ్రిల్లింగ్‌గా ఉంది"

"ఎందుకు? "

"నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగినా ఎప్పుడూ ఇలా కవుల్ని, రచయితల్ని, సినిమావాళ్ళని కలుసుకోలేదు. అటువంటిది ఒక రచయిత్రి ఇంట్లో ఉన్నానంటే

థ్రిల్ కాదా మరి!"

వింధ్య వంటింట్లోంచి పంచదార తెచ్చి సంజనా నోట్లో పోసింది. కాస్త తనూ వేసుకుంది.

"ప్రథమ బహుమతి వచ్చినందుకు పార్టీ లేదా ఆంటీ? "

"అలాగే, సాయంత్రం చేసుకుందాం" తనకు వచ్చిన ఉత్తరం, చెక్కు కవరులో పెట్టి సరస్వతీదేవి విగ్రహం పాదాల ముందు వింధ్య పెట్టింది.

★ ★ ★

"వావ్! మీరు పార్టీ ఇస్తానంటే ఏ హోటల్ కో తీసుకు వెడతారనుకున్నాను ఆంటీ. ఇంత బాగా ఏర్పాటు చేస్తారనుకో లేదు. అబ్బ! ఈ వెన్నెల.. ఈ డాబా ఎంత బాగున్నాయో! అరే! బిర్యాని నాకిష్ట మని ఎవరు చెప్పారాంటీ? "

"ఇంకెవరు చెబుతారు? భార్గవి చెప్పింది"

"అమ్మ ఫోన్ చేసిందా? నాకు చెప్పనే లేదు"

"నేనే ఫోన్చేసి నా బహుమతి గురించి చెప్పి, నీ డిన్నర్ గురించి అడిగాను. నువ్వు అప్పుడు నిద్రపోతున్నావని లేప లేదు. ఇంతకీ బిర్యానీ ఎలావుంది? "

"బ్రహ్మాండంగా ఉంది"

"మధ్యాహ్నం నుండి నువ్వు ఏమీ తిన లేదుగా, అందుకే అంతబాగుంది. ఆ రుచి ఆకలిది. బిర్యానీది కాదులే"

"ఎంత బాగా మాట్లాడతారు ఆంటీ! అందుకే రచయిత్రి అయ్యారు" మరి కొంచెం బిర్యానీ, పెరుగు పచ్చడి వేసు కుంటూ అంది సంజనా.

ఆమెను చూస్తే జాలేసింది వింధ్యకి. సంజనా ఇంట్లో పదిమంది ఒకేసారి కూర్చుని భోజనం చేసేంత పెద్ద డైనింగ్ టేబుల్ ఉంది. అటువంటి వ్యక్తి ఈ డాబామీద నేలపై పరచిన పాత తివాసీ మీద కూర్చుని బిర్యాని తింటోంది. ఎన్ని ప్రేమ కథలు చూసినా, విన్నా ఈ ఆడపి ల్లలకి బుద్ధి రాదా? కోరి కోరి పేదరికం లోకి ఎందుకు అడుగు పెడతారు?

"ఏమిటి ఆంటీ.. తినకుండా ఏదో ఆలో చిస్తున్నారు? "

"అహ.. ఏమీ లేదు"

"ఆంటీ ఎలాగూ వేసవికాలమేగా, ఇక్కడే పడుకుంటే? "

"అలాగే"

"లైటు ఆర్పేసి ఆ డాబా మీద ఇద్దరూ పక్క వేసుకుని పడుకున్నారు. వెన్నెల డాబా మీద పరుచుకుని అందం అంటే ఇదే అన్నట్టు ఉంది.

"ఏమిటి ఆంటీ చిన్నగా చప్పుడు? "

"కొబ్బరాకుల చప్పుడు, ఎప్పుడూ విన లేదా? "

"లేదు, భలే బాగుంది"

"వెన్నెల్లో ఆకుపచ్చని ఆకులు కూడా వెండిరంగు పూసుకున్నట్టు వుంటాయి. గాలికి ఆకులు ఒకదానితో ఒకటి రాసుకుని మంచి శబ్దాన్నిస్తాయి"

"చాలా బాగుంది. ఆంటీ మీకు నిద్రవ స్తోందా? "

"లేదు, ఏం.. అలా అడిగావ్? "

"అంకుల్, మీరు ఎందుకు విడిపో యారు? "

"ప్రేమ ఎక్కువై"

"అదేమిటి ఆంటీ? " అడిగింది సంజనా.

"అవును సంజనా! మనలో చాలా మందికి ప్రేమించడం రాదు. అది వాళ్ళ దౌర్భాగ్యం. ఇతరులు వాళ్ళని ప్రేమిస్తే దాన్ని స్వీకరించడం అంతకన్నా రాదు. అది వాళ్ళ దురదృష్టం. మీ అంకుల్ రెండో రకం"

"మరి మీది ప్రేమ వివాహం అన్నారుగా? "

"అవును డిగ్రీలో మేమిద్దరం క్లాస్‌మేట్స్‌మే. పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లోకి వచ్చాక పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాం. చదువు పూర్తయ్యాక తను ప్రయివేటు ఆఫీసులో క్లర్కుగా చేరాడు. మా పెళ్ళికి యింట్లో ఒప్పుకోలేదు. సామ, దాన, భేద, దండోపాయలన్నీ ప్రయోగించినా లాభంలేకపోయింది. నేను యింట్లోంచి వచ్చేసాను. హైదరాబాద్ వెళ్ళిపోయాం. నాకు చాలా గర్వంగా వుండేది, చాలామందిలా కాకుండా నేను ప్రేమని నిజం చేసుకున్నానని. మనసుకి వ్యతిరేకంగా ప్రవర్తించలేదని చాలా సంతృప్తిగా ఉండేది. తను ప్రయివేటు కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు. తర్వాత రెండు బెడ్‌రూమ్‌లున్న యిల్లు చూసి వాళ్ళ అమ్మగారినీ, చెల్లెలినీ తీసుకువచ్చాడు. అందరం కలిసే వుండేవాళ్ళం. వాస్తవ జీవితానికి కాస్త దూరంగా, ఊహాలోకంలో వున్న నన్ను ఈ ఆడవాళ్ళిద్దరూ తమ సూటిపోటి మాటల ద్వారా ఇహలోకంలోకి తెచ్చేవారు. మా అత్తగారికి బాధగా ఉండేది.. కొడుక్కి రావలసిన కట్నం రాలేదని, ఆడంబరంగా పెళ్ళి జరగలేదని. మా ఆడపడుచుకీ బాధగా ఉండేది.. తనకన్నా నేను ఎక్కువ చదివాను కాబట్టి ఎక్కడ తనని లోకువ చేస్తానేమోనని. ఆ అసంతృప్తి అంతా మాటల ద్వారా వ్యక్తం చేసేవారు. అటువంటి సమయంలోనే నన్ను ఉద్యోగం చేయమని ఒత్తిడి చేయసాగారు. అది నాకిష్టంలేదు"

"ఎందుకు? "

"నాకు సంగీత సాహిత్యాలంటే చాలా యిష్టం. కొన్నాళ్ళు సంగీతం నేర్చుకున్నాను. నేను రాసిన గేయాలు, కథలు అప్పుడప్పుడూ పత్రికల్లో వస్తూండేవి. ఉద్యోగం చేస్తే చదువుకోవడానికి, రాసుకోవడానికి సమయం దొరకదని. నా బాధ్యత కేవలం అతడిని ప్రేమిస్తే చాలనుకున్నాను.

అక్షరశిల్పి



ఈరంకి ప్రమీలా రాణి

అమ్మానాన్నా ఇద్దరూ సాహిత్యాభిమానులు కావడంతో నాకూ చిన్నప్పట్నుంచీ సాహిత్యాభిలాష కలిగింది. అక్షరాల్లో ఎన్నో భావాలు, అర్థాలు, బాధలు, సంతోషాలు! అందుకే వృత్తిరీత్యా ఉపాధ్యాయిని అయినప్పటికీ ప్రవృత్తిరీత్యా రచయిత్రినయ్యాను. ఇప్పటివరకూ నేను రాసిన పదిహేడు కథలు, మూడు నవలలు ప్రచురితమయ్యాయి. 'నీలాంజన' నా నాలుగో నవల. కళ అనేది ఎక్కడున్నా, నన్ను ఆకర్షిస్తుంది. నన్ను 'అక్షరశిల్పి'ని చేసిన నా అభిమాన రచయితలు, కవులకు ఎంతో ఋణపడివున్నాను. ముఖ్యంగా నన్ను రచయిత్రిగా ప్రోత్సహిస్తున్న 'చతుర'కు కృతజ్ఞతలు.

చిరునామా:
ఈరంకి ప్రమీలా రాణి
బి2 638, ఎన్.ఎఫ్.సి. నగర్,
ఘట్‌కేసర్, రంగారెడ్డి జిల్లా,
పిన్: 501301

కానీ అతని ఒక్కడి సంపాదనతో ఇంటిని నడపాలంటే ఇబ్బందిగా వుంది. మూర్ఖంగా వుండకూడదు అన్పించింది. పార్ట్‌టైమ్ జాబ్‌లో చేరాను. రెండు

మూడు గంటలు తప్ప మిగతా రోజంతా యింట్లోనే ఉండేదాన్ని. మా అత్తగారికి నన్ను సాధించడానికి బాగా సమయం దొరికేది. పనిమనిషిని కూడా పెట్టకుండా పనంతా నా చేత చేయించేది. నేను, నా పుస్తకాలు, నా సాహితీలోకం యిలా టైం టేబుల్ వేసుకుని అన్నింటికీ సమయం కేటాయించి సంతోషంగా వుండడానికి ప్రయత్నించేదాన్ని. కానీ మనం నవ్వుతూ సంతోషంగా వుంటే భరించలేనివాళ్ళు చాలామంది వుంటారు ఈ లోకంలో. అటువంటి యిద్దరు వ్యక్తులు నా పక్కనే వుండటం నా దురదృష్టం. బోరు కొడుతున్నానా సంజనా? "

"లేదాంటీ, చెప్పండి"

"ప్రేమించేటప్పుడు కేవలం మనకి యిష్టమైన మనిషి గురించి మాత్రమే తెలుస్తుంది. వాళ్ళతోటే సంబంధం అనుకుంటాం. కానీ పెళ్ళి కుటుంబానికి సంబంధించింది. ఇంతలో వాళ్ళ చెల్లెలికి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. మాది కులాంతర వివాహం కావడంతో ఆమెకు మంచి సంబంధాలు రాకపోవడం, వచ్చినా అవి కుదరకపోవడం జరిగేది. దానికి ముఖ్యమైన కారణం నేనే అని భావించేవారు. మనలో చాలామంది తమ సమస్యలకి ఇతరులను కారణంగా చూపిస్తారు. మా అత్తగారు తన కూతురికి పెళ్ళికాకపోవడానికి కారణం అమ్మాయికి చదువు, అందం, ఉద్యోగం లేకపోవడం కారణమని తెలిసినా నన్నే టార్గెట్ చేసుకునేది. ఒకరోజు మీ అంకుల్ కూడా వాళ్ళతో చేరిపోయి నన్ను తిట్టారు" వింధ్య పేలవంగా నవ్వింది.

"అదేమిటి ఆంటీ? అంకుల్ మిమ్మల్ని అంత ప్రేమించి కూడా.."

"నేతి బీరకాయలో నెయ్యి వుంటుందా? యిది కూడా అంతే. నామీద కోపంతో ఆ యిద్దరు ఆడవాళ్ళు నాలో లేని లోపాల్ని పదే పదే చెప్పేవారు. అవి లోపాలు కాదు.. అవి ఆయనకి తెలిసినా ఏమీ ఎదురు చెప్పేవాడు కాదు. కొన్నాళ్లకు అవి నిజమనే అభిప్రాయానికి కూడా తను వచ్చాడు. వాళ్ళకి నచ్చేట్టు మారమని యితను నాకు చెప్పేవాడు. నా తప్పేమీ లేనప్పుడు మారవలసిన అవసరం ఏముందని నా వాదన. యిప్పటికీ ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే.. అతనికి నా అలవాట్లు, అభిరుచులు అన్నీ తెలుసు. అటువంటి అతను కూడా నన్ను విమర్శించడం. పెళ్ళయిన రెండేళ్ళకాలంలోనే స్వప్నాలు కరిగిపోయి నిజాలు బయటపడ్డాయి. వాళ్ళ చెల్లెలికి పెళ్ళి అయింది. అతను బాగానే వున్నాడు. ప్రయివేటు కంపెనీ అయినా మంచి వుద్యోగంలోనే వున్నాడు. నా వల్లనే ఇటువంటి సంబంధం వచ్చిందని, కట్నం ఎక్కువ యిస్తే యింకా మంచి సంబంధం వచ్చేదని మా అత్త కొత్త గొడవ మొదలు పెట్టింది. చిన్నగా మా మధ్య గొడవలు మొదలయ్యాయి. ఒకరోజు ఆ గొడవ తారస్థాయికి చేరింది. 'నిన్ను చేసుకుని నేను అన్నీ పోగొట్టుకున్నాను' అన్నాడతను. ఆ మాట నా మనసుని తాకింది. అతనేం పోగొట్టుకోలేదు. నేనే నా కుటుంబాన్ని, మావాళ్ళ ప్రేమనీ, ఆదరణని అన్నీ పోగొట్టుకున్నాను. అతన్ని ఆదరించని యింటికి నేనూ వెళ్ళనని మా పుట్టింటికి వెళ్ళలేదు. అతను తనవారినీ, ఆదరణనీ వదులుకోలేదు. వాళ్ళ అమ్మగారినీ, చెల్లెలిని తన వద్దే పెట్టుకున్నాడు. చాలా కష్టపడి, ఖర్చు చేసి, చెల్లెలి పెళ్ళి చేశాడు. త్యాగం అనే పెద్దమాటను వాడను కానీ వదులుకోవడంలో నేనే ముందున్నాను. ఇటువంటి పరిస్థితుల్లో మా నాన్నగారు పోయారు. అంతటి కష్టంలో నా పక్క-

నుండి ఓదార్చవలసిన మనిషి నన్నొక్కదా న్నే పంపించాడు. తిరిగి హైదరాబాద్ వెళ్ళేసరికి నేను ఎంతో శ్రమపడి సేకరిం చుకున్న పుస్తకాలన్నీ అమ్మేసింది మా అత్త. నాకున్న ఖరీదైన ఒకటి రెండు చీరలు మాయమైపోయాయి. ఆ రోజు నేనింక ఊరుకోలేకపోయాను. పెద్దగొడవ జరిగింది. దానితో మా యిద్దరి మధ్య కూ డా దూరం పెరగసాగింది. ఇంతలో అత నికి మంచి కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. జీతం పెరిగింది. మా అత్తగా రికి నేనొక చీమలాగ కనపడ్డాను. అలా.. అలా అహంకారాలు పెరిగి, విడిపోవడా నికి దారితీసాయి. అప్పుడే మా నాన్నగారు ఈ యిల్లు నాకు యిచ్చినట్టు తెలిసింది. వెంటనే ఈ యింటికి వచ్చేసాను. ఇల్లుకూ డా నా మనసులాగే ఖాళీగా వుంది. ఇక్క డికి వచ్చి జీవితాన్ని మొదట్నుంచి పునర్ని ర్మించుకున్నాను" ముగించింది వింధ్య.

సంజనా మాట్లాడలేదు బాధ వలన. ఆమెక్కాస్త భయం కూడా వేసింది, భవి ష్యత్తును తలుచుకుని.

చాలాసేపు యిద్దరూ మాట్లాడుకోలేదు.

"నిద్రపో సంజనా! పన్నెండు గంటలు దాటినట్టుంది"

"నిద్ర రావడం లేదు ఆంటీ"

"ఊహూ, యిలా అన్నీ మనసుకి తీసు కోకూడదు. నిద్రమేలుకుని ఆలోచిస్తే సమ స్యలు పరిష్కారం కావు. పైగా నీ గురించి ఆలోచించడానికి మేమంతా లేమా? "

"ఆంటీ!"

"అవును సంజనా! సమస్యలు అందరికీ వస్తాయి. కానీ నేనున్నానని ధైర్యం చెప్పే వాళ్ళు ఎంతమంది వుంటారు? మేమంతా వుండగా నీకే దిగులూ లేదు. హాయిగా నిద్రపో" పది నిముషాల్లో సంజనా నిద్ర పోయింది. వింధ్యకు నిద్రరావడం లేదు. ఆమెకు తన గతం ఎప్పుడూ గుర్తుకు రా దని కాదు. సాహిత్యంలో, ఉద్యోగంలో పడి గతాన్ని మర్చిపోవడానికి ప్రయత్ని స్తుంది. కానీ సంజనా చిన్న విషయం అడిగితే, చిన్న తాళం చెవితో పెద్ద ఖజా నాని తెరిచినట్టు జ్ఞాపకాల మాళిగ తెరుచు కుంది. పోనీలే యిలాగైనా తన గతం ఒక రికి ఉపయోగపడితే చాలని అనుకుంది.



"నువ్వొక అమ్మాయిని ప్రేమిం చావా? ఆమె, నువ్వు కొంతకాలం కలుసు కోకూడదని వేరేవూరు పంపించారా? ఆమె ఎక్కడ వుందో నేను కనిపెట్టాలా? బాగుంది" అన్నాడు అఖిల్.

నీలం, అఖిల్ టాంక్‌బండ్‌పై కూర్చు న్నారు.

"బాగుందని వూరుకుంటే లాభం లేదు, సాయం చేయాలి" అన్నాడు నీలం.

"ఇదేం అయ్యేది కాదు గానీ.. హాయిగా ఆ అమ్మాయిని మర్చిపోయి మరొకరిని ప్రేమించు. హైదరాబాద్‌లో ఆడపిల్లలకేం తక్కువ"

"ఛ! ఇలా మాట్లాడటానికి సిగ్గులేదు? "

"తప్పేముంది? ఈరోజుల్లో ఒక ప్రేమ, ప్రేయసి ఎవరికి సరిపోతున్నాయి? "

నీలం నమస్కారం పెట్టేసాడు. "ఆపరా బాబు, వినడానికి ఘోరంగా వుంది"

అఖిల్ నవ్వేసాడు.

"ఏమిటి నా ప్రేమకు నువ్వు కూడా

పరీక్ష పెడుతున్నావా? సంజనా తల్లి దండ్రులు పెట్టిన పరీక్ష చాలులే"

"లేదురా, ఈ రోజుల్లో ఎవరూ యిటు వంటి విషయాలని సీరియస్‌గా తీసుకో వడం లేదు"

నీలంకి ఆవేశం వచ్చింది "అందుకే మన వయసు వాళ్ళమీద ఎవరికీ నమ్మకం వుండటం లేదు. ఇప్పటివాళ్ళు, యిప్పటి పుస్తకాలు, ఈనాటి సినిమాలు, ఈ కాలం ప్రేమలు, పెళ్ళిళ్ళు, ఈ రోజుల్లో చదు వులు.. అంటూ తీసిపారేస్తున్నారు" గంభీ రోపన్యాసం యిచ్చాడు.

"సరేసరే.. నీ ప్రేమను నిజం చేసుకుని ఈతరంపై గల అపనమ్మకాన్ని పోగొడతా నంటావు. సరే, అలాగే కానీయ్. ఇంతకీ ఆమెలో ఏమిటి అంత ప్రత్యేకత"

"అది తెలిస్తే ఇన్ని యుగాలుగా తెలి యని ప్రశ్నకు జవాబు దొరికినట్టే"

"ఏమిటది? "

"ప్రేమకు నిర్వచనం"

"ఓకే బాబా.. నీకు సాయం చేస్తాను. యింతకీ ఏం చెయ్యాలి? "

★ ★ ★

"హలో.. హలో.. నమస్తే ఆంటీ!"

"నమస్తే"

"నా పేరు మాధవి. సంజనా వుందా ఆంటీ? "

"లేదమ్మా, బయటకు వెళ్ళింది"

"ఎప్పుడు వస్తుంది ఆంటీ? "

"ఒకగంటలో వస్తుంది. నువ్వు ఫోన్ చేసినట్టు చెబుతాను. నీ నెంబరు యివ్వు"

"నా నెంబరు తన దగ్గర వుంది ఆంటీ. మళ్ళీ చేస్తాను"

అఖిల్ ఫోన్ పెట్టేసి "అమ్మో! ఆంటీతో చాలా జాగ్రత్తగా మాట్లాడాలిరా" అన్నాడు.

"మిమిక్రీ వచ్చు కాబట్టి నువ్వు ఈ మాత్రమైనా మాట్లాడావ్. యింతకీ ఏమం టారు? "

"తనేదో బయటకు వెళ్ళినట్లు చెబుతు న్నారు. ఏవూరో పంపించారన్నది అబద్ధ మేమో. తను యింట్లోనే వుందేమో? "

"ఏదో వూరు పంపిస్తున్నట్టు సంజనా చెప్పింది"

"అలా చెప్పి యిద్దరినీ పక్కదారి పట్టిస్తు న్నారేమో!"

"మరెలా తెలుసుకోవడం? "

"చూద్దాం.. యింకా టైముందిగా" సమస్య తనది కాదు కాబట్టి తేలిగ్గా అన్నాడు అఖిల్.

★ ★ ★

సాయంత్రంవేళ ఆకాశం నీలిరంగు చీర కట్టుకుంది. ఆ చీర పైకి బంగారు నగలు పెట్టుకోవాలా? కనకాంబరాల కంఠహా రాలు ధరించాలా అని ఆలోచిస్తూ.. ఈలోగా మల్లెపూరంగు మేఘాలను సిగలో తురుముకుంటోంది. కొంగలబారు పడమటికి సాగిపోతోంది. ఆరిన బట్టల్ని తీస్తున్న సంజనాకి ప్రకృతి కొత్తగా, అందంగా కనబడుతోంది. యింతలో డాబాపైకి వచ్చింది వింధ్య.

"ఈ పనులన్నీ నీకెందుకు సంజనా, హాయిగా కూర్చోక? "

"కూర్చుని కూర్చుని విసుగు పుట్టుకొ స్తోంది ఆంటీ"

"స్వేచ్ఛగా కాలేజీకి వెళ్ళివచ్చే నీకు యిక్కడ కాళ్ళూచేతులూ కట్టినట్టుంది కదూ!"

"లేదాంటీ యిక్కడకు వచ్చాక మనిషిని బంధింపబడ్డానేమో కానీ మనసు ఆలోచిం చడం నేర్చుకుంది"

"అంటే? "

"ఇంతకుముందు కాలేజీకి వెళ్ళివస్తూ ఇదే జీవితం.. చాలా బాగుంది అనుకునే దాన్ని. అమ్మ మీ గురించి చెప్పినప్పుడు కూడా సరిగ్గా వినలేదు. తెలియని మను

షుల మధ్య, కొత్త వాతావరణంలో ఎలా వుండాలో అనుకునేదాన్ని. కానీ అప్పటి కంటే యిప్పుడు బాగుంది"

"వెరీగుడ్! మనిషి వర్తమానంలో సంతోషంగా వుండడం కంటే సంతృప్తి లేదు"

"మా యింట్లో నేను దేనికీ ఆలోచించనవసరం లేదు. అమ్మ, నాన్న అన్నీ అమర్చి పెట్టేవారు. చదువు, స్నేహితులు, సినిమాలు, పార్టీలు.."

"తర్వాత నీలం" అంది వింధ్య.

"అతని విషయం మీకెలా తెలుసు? "

"నేను, భార్గవి ప్రాణస్నేహితులమని మరచిపోయావా? ఏ కారణం లేకుండా నిన్ను యిక్కడ వుంచుతారా? "

సంజనాకి భయం వేసింది. ఆంటీ జీవితాన్ని చూసి తను మారాలని యిక్కడ వుంచినట్టు చెప్పిందా మమ్మీ?

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ సంజనా? "

"ఏం లేదు, పదండి కిందికి వెడదాం"

నిజంగా ప్రేమించి పెళ్ళి చేసుకుంటే.. అన్నీ బాగుంటే ఫర్వాలేదు. కానీ ఏ మాత్రం యిద్దరికీ సరిపడకపోయినా ఆంటీ జీవితంలాగే వుంటుందా? అది ప్రత్యక్షంగా చూసి నేర్చుకోవాలని తనని యిక్కడికి పంపించారా?

★ ★ ★

"హలో అంకుల్! సంజనా వుందా? "

"నువ్వెవరు? "

"నాపేరు శ్రీదేవి"

"ఎందుకు ఫోన్ చేశావ్? "

"సంజనా దగ్గర ఆ మధ్య డబ్బుతీసుకున్నాను. యివ్వాలనీ.."

"తను నిన్ను కలిసినప్పుడు యిద్దువుగానీలే"

"తను ఈ మధ్య కన్పించడంలేదు అంకుల్"

"కన్పిస్తుందిలే.. ఫోన్ పెట్టెయ్" రామకృష్ణ అరచిన అరుపుకి ఫోన్ పగిలిపోతుందన్పించింది అఖిల్‌కి.

"అబ్బ, ఈ అంకుల్ చాలా గట్టివాడు"

"ఆ.. లేకపోతే కోటీశ్వరుడెలా అయ్యాడనుకున్నావ్? "

"ఎవరండీ ఫోనులో.. అలా కోప్పడుతున్నారు? " అడిగింది భార్గవి.

"ఎవరో మగవాళ్ళు ఆడగొంతుతో మాట్లాడుతున్నారు" అన్నాడు రామకృష్ణ.

★ ★ ★

'ఆకులో ఆకునై... కొమ్మలో కొమ్మనై..' మెలకువ వస్తూనే చక్కటి పాట. కృష్ణశాస్త్రిగారి భావగీతం. సంజనా మెలకువ వచ్చినా బయటకు రాలేదు. వింధ్య పాడుతుంటే ఆ నిశ్శబ్దంలో ఆ పాట తెల్లకాగితంపై శ్రీకారం రాసినట్టు ఏదో సంతోషాన్ని, శుభాన్ని తీసుకువస్తున్నట్టు వుంటుంది. వింధ్య బయట తాళం వేసుకు వెళ్ళిపోయినట్టు చప్పుడు. వీధిలో కూరగాయలు అమ్మేవాళ్ళ కేకలు, పొలం పనికి బండి మీద వెళ్ళేటప్పుడు ఎద్దుల మెడలో మువ్వల చప్పుడు, పక్షుల కిచకిచలు వింటుంటే తనకి తప్ప అందరికీ పని వున్నట్టుగా వుంది. తన పరిస్థితే అర్థం కావడం లేదు. ఈ వూరు వచ్చి దాదాపు నెలరోజులు అవుతోంది. మూడునాలుగు రోజులకొకసారి తల్లే ఫోన్ చేస్తుంది. వింధ్యకు ఫోన్ బిల్లు భారం కాకూడదని ఈ ఏర్పాటు. నీలం ఎలా ఉన్నాడు? ఏం

చేస్తున్నాడు? ఎందుకొచ్చిన గొడవ అని తనని మరచిపోవడానికి ప్రయత్నిస్తు న్నాడా? నిజానికి తనకి కూడా ఇద్దరు ముగ్గురు ఫ్రెండ్స్ తెలుసు. ప్రేమించా మంటూ నాలుగురోజులు హాయిగా తిరిగి ఆ తర్వాత వేరేవాళ్ళతో ప్రేమ అంటూ కాలక్షేపం చేయడం. తను కూడా వాళ్ళల్లో ఒకతి కాబోతోందా? అలా అయితే తను భరించగలదా? ఇంట్లో 'కుక్' దగ్గర నుంచి బయట తిరిగే కారు వరకు తన యిష్టానికి విలువ యిచ్చే డాడీ, నీలం విష యంలో యిలా కఠినంగా వుంటారనుకో లేదు. యిలా ప్రేమించానని చెప్పేసరికి ఆయన ప్రేమనే పోగొట్టుకోవలసి వచ్చింది. కరెంటు పోయింది. అబ్బ.. ఈ పల్లెటూళ్ళల్లో యిదొక బాధ. ఏ సౌకర్యా లూ లేని ఈ యింట్లో ఆంటీ ఎలా ఉం టోందో? తమింట్లో ఉన్న నలుగురికే నలు గురు పనివాళ్లు. కూరగాయలు, సరుకులు ఆంటీనే తెచ్చుకుంటుంది. కరెంటు బిల్లు, ఫోన్ బిల్లు తనే కడుతుంది. ఎక్కడికి వెళ్ళినా బస్సులోనే వెడుతుంది. తమ కారు, యూనిఫారం వేసుకున్న డ్రైవరు.. హైదరాబాద్ మహానగరవీధుల్లో అలా కార్లో వెడుతుంటే ఆ గొప్పదనమే వేరు.

'ట్రాఫిక్‌జామ్ అయిందబ్బా.. ఈ కార్లో రావడం కంటే నడకమేలు. సందుల్లోంచి కూడా నడిచిపోవచ్చు' అని చెప్పడం ఒక ఫ్యాషన్. తను ఆ జీవితానికి దూరమౌ తోందా? హైదరాబాద్ జీవితం ఆంటీ లాగే తనకి ఒక కలగా మిగిలిపోతుందా? ఆలోచనలు పిచ్చిపిచ్చిగా సాగుతుంటే అలా పడుకునే వుంది సంజనా.

వింధ్యది సింపుల్ లివింగ్. ఆమెకు గట్టిగా ముప్పై చీరలు కూడా ఉన్నట్టు లేవు. మెళ్ళో మంగళసూత్రం, నల్లపూసలు బంగారానివి. ఒక చేతికి ఆరు గాజులు, ఇంకొక చేతికి యింట్లో వుంటే వాచీ కూడా పెట్టుకోదు. అయితేనేం? ఆ ముఖంలో ప్రశాంతత, ఎప్పుడూ పెదవుల మీద తొ ణికిసలాడే చిరునవ్వు.. ఏ నగలూ యివ్వ లేని అందం అది. సంజనా ఆలోచనలు పువ్వుపైన వాలే సీతాకోకచిలుకల్లాగా తిరు గుతున్నాయి.

పదకొండు గంటలకి లేచి తీరికగా కాఫీ తాగింది. పన్నెండు దాటుతుండగా భోజనం చేద్దామని అనుకుంటుంటే తలుపుతట్టిన చప్పుడు. సంజనా కిటికీ లోంచి చూసింది. ఎవరో ముసలమ్మ 'వింజమ్మా' అని పిలుస్తోంది. ఎండలో ఆమెకు తలుపుకు వేసిన తాళం కన్పిం చడం లేదేమో! ఎవరు వచ్చినా తలుపు తీయవద్దని చెప్పింది వింధ్య. అయినా ఈ రోజెందుకో సంజనా మనసు ఎదురు తిరు గుతోంది. వద్దన్న పని చేయాలన్పిస్తోంది. ఆమె తాళం తీసుకుని వెనుకపైపు తలుపు తీసుకుని వీధివైపు వచ్చింది.

"ఎవరు కావాలి అవ్వా? " అడిగింది స ంజనా.

"వింజమ్మ... వింజమ్మలేదూ? నువ్వె వరు, ఆయమ్మ చుట్టానివా? "

"అ.. అవును" అలా చెబితేనే ఆ ముస లామెకు అర్థం అవుతుంది.

"ఏం కావాలి అవ్వా నీకు? "

"వింజమ్మ నెలనెలా రెండువందలి స్తుంది. నిన్న, మొన్న రాలేకపోయాను, జొరం"

"లోపల కూర్చో, అమ్మ వస్తుంది" తాళం తీసి లోపల కూర్చోబెట్టింది.

ముసలమ్మ వింధ్య మంచితనం, తన అసహాయత గురించి చెబుతూనే వుంది. "నా పిల్లలు నన్ను చూడరు. వింజమ్మ డబ్బిస్తేనే గంజిపోస్తారు"

ఇంతలో వింధ్య వచ్చింది.

"ఏం నాగమ్మా బాగున్నావా? "

"వచ్చావా తల్లీ.. బాగానే వున్నానమ్మా"

ఆమెలేచి వింధ్య రెండు చేతులు పట్టు కుంది. ఆమె కంటి వెంట నీళ్ళుకారి వింధ్య చేతులపై చుక్కలుగా పడ్డాయి. "అయ్యో ఏడవకు నాగమ్మా.. ఏమైనా తిన్నావా? "

"లేదమ్మా రెండురోజులుగా జొరం.. తినాలనిలేదు"

"సరేలే, నేను పెడతాను తిందువుగాని"

హాలు తలుపు వేసేసి, ఫ్యాన్‌వేసి, తను చీరమార్చుకుని వచ్చింది వింధ్య. అరిటాకులో అన్నం, కూర వడ్డించింది. ముడతలు పడ్డచెయ్యి, వణుకుతున్న వేళ్ళు, అలా ఆమె తింటూంటే తెలియని భావం ఏదో కలిగింది సంజనాకు. వింధ్య సంజనాను గమనిస్తూనేవుంది.

"చారు బాగుందమ్మా" అంది నాగమ్మ.

"అన్నం పెట్టావు, నూరేళ్ళు చల్లగా వుండమ్మా" నాగమ్మ ఆశీర్వదించింది.

'ఎవర్ని ఉద్ధరించడానికి' అనుకుని నవ్వు కుంది వింధ్య.

"నేనింక ఎడతానమ్మా"

"ఈ ఎండలో రావడమే తప్పు నాగమ్మా. ఎక్కడైనా కళ్ళుతిరిగి పడిపోతే ఏమయ్యేది? కాస్సేపు పడుకో, సాయంత్రం వెడుదువుగానీ" చాప యిచ్చింది వింధ్య. అది వేసుకుని అయిదు నిముషాల్లోనే గాఢ నిద్రలోకి జారుకుంది ముసలమ్మ.

"రా.. సంజనా భోజనం చేద్దాం. ఆమెను యిందాకటి నుండి అలా చూస్తున్నావేం సంజనా? "

"పాపం బాగా ముసలామె. తలుపుకు వేసిన తాళం కన్పించలేదనుకుంటా, ఒకటే తలుపు బాదేసింది. సరే, ముసలామె కదా అని లోపల కూర్చోబెట్టాను. ఇంతకీ ఈమె మీకెలా తెలుసు? "

"నా చిన్నప్పుడు మాఇంట్లో పనిచేసేది"

"ఆమెకెవరూ లేరా"?

"ఇద్దరు కొడుకులున్నారు. ఈమెకు వృద్ధాప్య పింఛను వస్తుంది. నెలనెలా నేనో రెండువందలు ఇస్తాను" నెయ్యి వడ్డిస్తూ అంది వింధ్య.

"కొడుకులు ఏ పనీ చేయరా? "

"ఒకడు మేస్త్రీ, ఇంకొకడు కూరగాయలు పండిస్తాడు. అయినా ఈ ముసలి తల్లిని చూడటానికి వాళ్ళకి కష్టంగా వుంది. సాధారణంగా నేనే ఇంటికి వెళ్ళి డబ్బులిచ్చి వస్తాను. నేను వెళ్ళేలోగా ఈ నెల తనే వచ్చేసింది"

సంజనాకు తన నాయనమ్మ గుర్తుకు వచ్చింది. ఆవిడకు అన్నీ ఉన్నాయి. సంతృప్తి తప్ప. "ఆ.. అన్నట్టు భార్గవి ఫోన్ చేసింది. నువ్వెలాగ వున్నావని అడిగింది. మీ నాయనమ్మగారు నిన్ను బాగా తలుచుకుంటున్నారుట"

"అబ్బ.. మా నాన్నమ్మకు సాధించడానికి నేను లేక తోచడం లేదేమో. అయినా అమ్మ లాండ్‌లైనుకు చేస్తే నేను మాట్లాడేదాన్ని కదా!"

"మన ఫోన్ డెడ్ అయింది. మీ మమ్మీకి నేను కాలేజీలో వున్నానని తెలియదు. అయినా ఒక్కగానొక్క మనవరాలివైన నిన్ను మీ నాయనమ్మ సాధించడం ఏమిటి? "

"జుట్టు కత్తిరించుకోకు, ప్యాంటు వేసుకోకు ఇలాంటివి ఏవో చెప్తుంది. మీరు చెప్పండాంటీ ఇలా నేను బాగాలేనా? "

"నా దృష్టిలో ఎబ్బెట్టుగా, అసభ్యంగా వుండనంతవరకు ఏ వస్త్రధారణ అయినా ఫర్వాలేదు"

"మా అమ్మ చాలా సంప్రదాయంగా వుంటుంది. ఆవిడకు మా అమ్మా నచ్చదు"

వింధ్య నవ్వింది "కొంతమంది దగ్గర కొన్ని కొలబద్దలు ఉంటాయి. ఆ కొలతకి మనం సరిపోతే ఫర్వాలేదు. లేకపోతే అంతే"

"మీ అత్తగారూ అంతేనా? "

"అహ.. అందులోనూ మాది ప్రేమ వివాహం. అందుకని ఆవిడకు నేనేదో బరి తెగించిన దానిలాగ కనబడేదాన్ని"

భోజనాలు పూర్తయ్యాయి.

"సంజనా! నేను కాస్సేపు నిద్రపోతాను. ఆ ముసలామె నిద్రలేచి వెడతానంటే ఈ డబ్బు యివ్వు" వింధ్య లోపలికి వెళ్ళిపోయింది.

చేతిలో వున్న రెండువందలను మార్చి మార్చి చూడసాగింది. సంజనా ఎన్నో వేల రూపాయలు లెక్క చేయకుండా ఖర్చు పెట్టింది. తల్లి ఇక్కడ దింపి వెడుతూ ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు. ఎందుకు? ఆ.. అర్థమైంది. డబ్బుయిస్తే తను పారిపోతానని భయం. ఆమెకు ఒక చిలిపి ఆలోచన వచ్చింది. ఈ రెండు వందలతో పారిపోతే? ఈ ముసలమ్మ, ఆంటీ నిద్రపోతున్నారు. తనని ఆపేదెవరు? ఆ తెల్లవారుజామున తల్లి ఈ ఇంట్లోకి తీసుకువచ్చాక తను మళ్ళీ ఈ గేటు దాటలేదు. తను ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాలి? రోడ్డుమీదకి వెళ్ళి ఎవరినైనా అడిగితే వాళ్ళే దారి చెబుతారు. రాజమండ్రి వెళ్ళిపోతే బయటి ప్రపంచంలో అడుగుపెట్టినట్టే. లక్కీగా తను ఈ ఇంట్లో వుంటున్నట్టు ఎవరికీ తెలియదు. తను ఎక్కడుందో నీలంకి తెలియదు. తనకి ఫోన్ లేదు. కానీ అతను ఎక్కడ ఉంటాడో, ఫోన్ నెంబరు ఏమిటో తనకి తెలుసు. రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళ్ళడం చాలా ఈజీ. ఆమె ఆ రెండు కాగితాల్ని రెండు లక్షల రూపాయలుగా చూస్తోంది. ఆమె ఎటూ నిర్ణయించుకోలేకపోతోంది. పారిపోవడం చాలా సులువు. కానీ తర్వాత వచ్చే పరిణామాలు.. ఆ.. ఏమైతే తనకెందుకు? ఇదంతా నీలంకి, ఫ్రెండ్స్‌కి చెబితే ఎంత థ్రిల్లింగ్‌గా వుంటుందో!

ఆమె తలుపుగడియ తీసింది. చెప్పులు బయటనే వున్నాయి. ఇంతలో పోస్ట్ వచ్చింది. పోస్ట్‌మేన్ ఆమెకి వారపత్రిక ఇచ్చి వెళ్ళిపోయాడు. ఏదో పత్రిక ఆఫీసు నుంచి వింధ్యకు వచ్చిన కాంప్లిమెంటరీ కాపీ అది.

ఆ ఇంటికి అటూఇటూ అరుగులు వుంటాయి. ఇల్లు తూర్పు ముఖం చేసి వుంటుంది. టైము రెండు గంటలు దాటిపోవడం వల్ల ఎండ పడమర వైపు తిరిగి ఇంటినీడ కాంపౌండ్‌వాల్ మీద పడుతోంది. సంజనా పత్రిక పట్టుకుని ఒక అరుగుమీద కూర్చుంది. వేడిగా వుంది గానీ ఎండలేదు. వెళ్ళిపోదామా? వద్దా? ఇదే ఆలోచన! ఆమె అప్రయత్నంగా కవర్‌కి ఉన్న పిన్నులు తీసి పుస్తకం పేజీలు తిప్పసాగింది. వింధ్య కథపడిన పేజీ వచ్చింది...

సంజనా ఆ పేజీ దగ్గర ఆగిపోయింది. ఏం రాస్తుందాంటీ? ఇంతలాగ ఎప్పుడూ ఏదో చదువుతూ ఉంటుంది. రాత్రి బాగా పొద్దుపోయే వరకూ రాస్తూ వుంటుంది. ఏముంది ఆకర్షణ ఈ అక్షరాలలో?

ఆమె అప్రయత్నంగా కథ చదవసాగింది. ఇంటర్మీడియెట్ వరకూ కాస్త తెలుగు చదివేది. ఇంజనీరింగ్‌లోకి వచ్చాక తెలుగు మాట్లాడటమే తగ్గిపోయింది.

ఆమె కళ్ళు చదవడం మొదలుపెట్టాయి. మనసు ఆలోచించసాగింది. తనకొచ్చిన తెలుగులో కాస్త కూడబలుక్కుంటూ చదివే సరికి గంట పట్టింది. కథలో లీనమైన మనసు ఆ మూడ్‌లోంచి బయటకు రావడంలేదు. ఆ వేసవికాలపు మధ్యాహ్నం వేళ సంజనా మనసు మంచులాగ ఘనీభవించింది.

ఆ కథ ఇలా సాగిపోయింది. ఎవరూ పట్టించుకోని ఒక యువతి కథ అది. ఆమెకు పోలియో వల్ల కాళ్ళు చచ్చుపడి



పోతాయి. ఇంట్లో పాకుతూ తిరిగే ఆమె అంటే కుటుంబ సభ్యులందరికీ చిన్న చూపే. చావలేక బతికే ఆమెను తల్లి అన్నివిధాలా ఆదుకుంటుంది. ఆమెలో ఆత్మవిశ్వాసం నింపుతుంది. ఇంట్లోనే కొద్దిగా చదువు నేర్పుతుంది.

నడవడానికి కాళ్ళులేని ఆమె చేతుల్లో అపారమైన 'చిత్రకళ' వుంది. తల్లి అది గమనించి తన దగ్గరున్న కొద్ది బంగారం అమ్మేసి రంగులు, బ్రష్‌లు కొని, ఇంటికే వచ్చి చిత్రకళ నేర్పే మాస్టారిని ఏర్పాటు చేస్తుంది. ఈమె పరిస్థితి చూసిన మాస్టారు కూడా ఉచితంగా చిత్రాలు వేయడం నేర్పుతాడు. ఆమె ఆ కళలో నిష్ణాతురాలై ఆర్థికంగా ఎవరిమీదా ఆధార పడకుండా నిలదొక్కుకుంటుంది. ఎన్నో సార్లు ఆత్మహత్యా ప్రయత్నం చేసిన ఆమె చావడానికి ఎన్నో కారణాలు, మార్గాలు వుంటాయి. కానీ జీవించాలంటే అంత కంటే మార్గాలు, కారణాలు వుంటాయని ఆ కథ ముగుస్తుంది.

కరుణ రసాత్మకమైన ఆ కథ సంజనా మనసులో నిలిచిపోయింది. ఆమె వెళ్ళిపో వడం మర్చిపోయి అలా కూర్చుండిపో యింది. తను నిజంగా వెళ్ళిపోయుంటే ఏమయ్యేది? ఒక మంచి రచయిత్రికి అవ మానం జరిగేది. ఇద్దరు మంచిస్నేహితుల మధ్య శాశ్వతంగా విభేదాలు వచ్చేవి. అన్నింటినీ మించి విల్‌పవర్ వుందని విర్రవీగే తను, తనచేతిలోనే ఓడిపోయేది.

ఈ కథలో కాళ్ళులేని యువతి అంత సాధించగా లేనిది, తను అన్నీవున్నా నీలం ప్రేమను సాధించలేనా?

★ ★ ★

"నువ్వేం ఫ్రెండ్‌విరా? ఒక చిన్న ఇన్ ఫర్మేషన్ తేలేకపోయావ్" కాస్త కోపంగా అన్నాడు నీలం.

"మీ సంజనాకి ఫ్రెండ్స్ వున్నారేమో.. వాళ్ళని అడిగితే తెలుస్తుందిగా. మీ కాలే జీవాళ్ళు నీకే తెలియదా? "

"తెలుసు. కానీ కథంతా వాళ్ళకి చెప్పాలి. వాళ్ళకయినా సంజనా ఇంటి వాళ్ళు జవాబు చెబుతారో లేదో!"

"ఈ ఆడపిల్లల పేర్లతో ఫోన్ చేయడం బాగాలేదురా" అన్నాడు అఖిల్.

"ఏం చెయ్యను? వాళ్ళు నన్ను చూశారు. నా గొంతువిన్నారు, పైగా నీలాగ నాకు మిమిక్రీ రాదుగా"

"అయినా పాండవుల అజ్ఞాతవాసాన్ని దుర్యోధనాదులు బయట పెట్టడానికి ప్ర యత్నించినట్టు, ఈ సంజనా అజ్ఞాత వాసాన్ని ఛేదించాలనే పట్టుదలేమిటో? "

"ఏమిత్రా! ఎప్పుడూలేని ఈ పురాణ జ్ఞానం? " అన్నాడు నీలం.

"ఏదో.. మా బామ్మతో ఉంటే అంతే. ఆవిడకి పాత సినిమాలంటే పిచ్చి. మా ఇంట్లో వున్న పాత తెలుగు సినిమా సీడీ లన్నీ ఆవిడవే. కాకపోతే అవి ఎలా పెట్టాలో తెలియదు. పెద్దావిడ కదా, ఎక్కువ నిద్రపట్టదు. అందుకని మొన్న రాత్రి ఆవిడతోపాటు కూర్చుని 'నర్తనశాల" సినిమా చూశానులే. అప్పుడే తెలిసింది ఇదంతా"

అతను మాట్లాడుతుంటే ఒక ఆలోచన వచ్చింది నీలంకి. తను ఎంతసేపూ ఆంటీ, అంకుల్ అంటే సరిపోదు, ఈ బామ్మగా రిని మర్చిపోకుండా వుండాలి.

"ఒరేయ్! పదా" అన్నాడు అఖిల్‌తో.

"ఎక్కడికి? "

"సంజనా ఇంటికి"

"నేరుగా వాళ్ళింటికా.. ఎందుకు? "

"సంజనాకి బామ్మ వుందిలే. ఆమెను అడిగితే మొత్తం తెలిసిపోతుంది"

"వద్దు, ఇంటికి వెళ్ళడం మంచిదికాదు, ఫోన్ చేద్దాం. వాళ్ళకి ల్యాండ్‌లైను ఉందా? నెంబరు తెలుసా? "

"ఉంది, నాకు నెంబరు తెలుసు. ఎందుకు? "

"ముసలివాళ్ళకి సెల్‌ఫోను సరిగ్గా విన పడదు. ఏద్దైనా షాపునుంచి చేద్దాం"

చాలాసార్లు ఫోన్ మోగాక వీళ్ళు అను కున్నట్టే బామ్మగారు ఫోన్ తీసింది. "సంజనా వుందాండి? "

"నువ్వెవరు? "

"వాళ్ళఫ్రెండ్‌నండి. నాపేరు శ్రీలక్ష్మి"

"అయితే? "

"తనదగ్గర నా బుక్స్ వుండిపోయాయి. ఎప్పుడు ఇస్తుందో అడగాలి, కొంచెం పిలు స్తారా? "

"సంజనా వూళ్ళో లేదు"

"అలాగా, ఏవూరు వెళ్ళింది? "

"రా.." బామ్మ అంటుండగానే చప్పున భార్గవి ఆమె చేతిలో ఫోన్ తీసుకుని పెట్టే సింది.

"ఏమిటత్తయ్యా మీరు, అది ఏ వూరు వెళ్ళిందో ఎవరికీ చెప్పవద్దని మీ అబ్బాయి చెప్పారుకదా? "

"పాపం! ఆ అమ్మాయి ఎవరో పుస్తకాల కోసం ఫోన్ చేసిందే"

"అయినాసరే, నేను స్నానం చేసొచ్చే లోగా మీరెందుకు ఫోన్‌తీశారు? "

ఆవిడ ఏదో గొణుక్కుంటూ తనగదిలోకి వెళ్ళిపోయింది.

"అదిరా.. మీ సంజనా వెళ్ళిన వూరు 'రా' అంట" అన్నాడు అఖిల్ నవ్వుతూ.

"అదేం వూరు? పాపం ముసలావిడ ఏదో చెప్పబోయింది. ఎవరో ఆమెను చెప్ప నివ్వలేదు" అన్నాడు నీలం.

"రా.. అనే అక్షరంతో ఏవూరి పేరు లేనట్టుందే" అన్నాడు అఖిల్

"రా అంటే రాయబోటి, రాయదుర్గం, రావులపాలెం.. ఇలా కావచ్చు" అన్నాడు నీలం.

"సరిపోయింది. రైల్వేగైడు కొని చదువు కోవాలి"

"సరేలే, ప్రయత్నిద్దాం" నీలం మొహం వాడిపోయింది. తన ప్రయత్నం ఎందుకు ఫలించడం లేదు? తనుపెద్ద హీరోలాగ ఆమె అడ్రెసు కనిపెడతానన్నాడు. నిజా నికి తను అది ఒక థ్రిల్‌లాగ ఫీల్ అయ్యాడు. రావులపాలెందాకా వచ్చిన మిత్రులిద్దరూ దానికి దగ్గరలో గల రాజా నగరం, రాజమండ్రి సంగతి మర్చిపో యారు.



వింధ్య రాసిన కథ చదివాక సంజ నాలో మార్పు రాసాగింది. ఇటు 'గాన్ విత్ ది విండ్' నవల చదవడం పూర్తయింది. ఆ నవలలోని హీరోయిన్లది, తను రోజూ చూసే వింధ్యాంటీది, ఒక్కొ క్కరిదీ ఒక్కొక్క పోరాటం. తనదీ ఒక పోరాటం. వారితో పోలిస్తే తనదీ ఒక సమస్యేనా అన్పిస్తోంది. అక్కడ తల్లిదం డ్రులు, ఇక్కడ ఆంటీ తను ఎలాంటి కష్ట మూ పడకుండా చూసుకుంటున్నారు. తనే ప్రేమించాననని వాళ్ళని కష్టపెడుతున్నానా?

"ఏంటి సంజనా.. ఏదో ఆలోచిస్తు న్నావ్? "

"ఏం లేదాంటీ"

"అంటే ఏదో ఒకటి ఉన్నట్టే" వింధ్య నవ్వుతూ అంది.

మళ్లీ తనే "నాకు తెలుసు సంజనా,

మనకి అలవాటైన వాతావరణంలో ఏ పనీ లేకపోయినా కాలక్షేపం అయిపోతుంది. వేరే వూరు వెళ్తే బోర్‌గానే వుంటుంది" అంది.

"ఏం చేస్తున్నారాంటీ? "

"ఈ చీరమీద డిజైను వేసి చాలారోజులైంది. నిన్న నవల పోస్ట్ చేశాను. అందుకని మళ్ళీ కుట్టుకోవడంలోకి వచ్చాను"

"నాకూ నేర్పండి ఆంటీ"

"నీకు ఇంట్రెస్టు వుందా? "

"లేదు. మా అమ్మ ఏమైనా నేర్చుకోమన్నా విన్పించుకోలేదు. కానీ మిమ్మల్ని చూశాక నాకు నేర్చుకోవాలన్పిస్తోంది"

"నేర్చుకో! ఈ కళలు ఆర్థికంగా సాయం చేసినా చేయకపోయినా ఆనందాన్నిస్తాయి, సంతృప్తినిస్తాయి"

"మా అమ్మ 'హుక్' కుట్టమన్నా నేను చేయలేదాంటీ. తను బాధపడివుంటుంది"

"తను బాధ పడిందో లేదోకానీ, నువ్వు బాధపడుతున్నావు. ఎంత చదివినా, ఏ పదవిలో వున్నా స్త్రీ స్త్రీలాగ వుంటేనే బాగుంటుంది సంజనా"

"మీరూ అమ్మలాగే మాట్లాడతారాంటీ"

"ఇద్దరం స్నేహితురాళ్లం కదా! నీకొకటి చూపిస్తానుండు"

వింధ్య లోపలిగదిలో నుండి ఒక డైరీ తెచ్చింది "ఇది మేము ఇంటర్మీడియెట్‌లో వుండగా మీ అమ్మ నాకిచ్చిన గిఫ్ట్. వెంటనే నేను పేరు రాశాను చూడు"

డైరీ తెరవగానే కన్పించేట్టు పేజీ కుడివైపు కార్నర్‌కి చక్కటి అందమైన అక్షరాలు తెలుగులో 'భార్గవింధ్య' అని రాసి వుంది. "అబ్బ! చాలా బాగుందాంటీ, ఇదెవరు రాశారు? "

"నేనే"

"మీ ఇద్దరి పేర్లకి కలిపి ఒకే అక్షరం.. ఐడియా బాగుంది"

"అవును, శరీరాలు వేరైనా ప్రాణం ఒక్కటే అన్నట్టు వుండేవాళ్ళం"

"ఇంత ఫ్రెండ్స్ అయినప్పుడు మీరు తరచు కలుసుకోరెందుకు ఆంటీ? "

"నేనూ భార్గవి విడిగా వున్నదెప్పుడు? అస్తమానం హోటల్స్‌లో, సినిమాల్లో కలుసుకోవడం కాదు ప్రేమన్నా, స్నేహమన్నా.. ఎక్కడవున్నా తనను ఇష్టపడే వ్యక్తి ఒకరున్నారు అన్న ధైర్యం కలగాలి. ఇప్పుడు చూడు, ఎంతమంది బంధువుల్లో, సన్నిహితుల్లో నిన్ను వుంచాలంటే భార్గవికి నేనే గుర్తుకు వచ్చాను. నా మీద నమ్మకంతో నిన్నిక్కడకు తీసుకొచ్చింది. ఇంకేం కావాలి నాకు? స్నేహమంటే ఇదే"

సంజనా మాట్లాడలేకపోయింది. తనని ఇక్కడ నిజంగా వుంచిన కారణం ఆంటీకి తెలిస్తే? తన రాకకు కారణం తల్లికాదు తండ్రి అని తెలిస్తే?

★ ★ ★

"ఆంటీ.. ఆంటీ"

"ఏమిటీ సంజనా? "" అంటూ వచ్చింది వింధ్య.

"చూడండాంటీ, ఈ ఎల్లో గులాబీ ఎంత బాగుందో!"

"అబ్బా అంతేనా? నిశ్శబ్దంగా వుండే నువ్వు ఇలా గట్టిగా పిలిస్తే ఎంత భయపడ్డానో తెలుసా? అయినా గులాబీని చూస్తే ఎందుకంత సంతోషం? "

"ఏమో ఆంటీ.. మా ఇంట్లో పెద్ద తోట వుంది. అసలు అందులో ఏ మొక్కలు వున్నాయి? అవి ఏ పూలు పూస్తాయని ఎప్పుడూ పట్టించుకోలేదు. కానీ ఈ చిన్ని గులాబీని చూస్తుంటే ఎంత బాగుందో!"

వింధ్య నవ్వేసింది "ఏమో.. నాకు మాత్రం ఈ చిన్న పింక్‌కలర్ గులాబీయే నచ్చింది" అంది సంజనా ముఖాన్ని తన రెండు చేతుల్లోకి తీసుకుని.

"పొండి ఆంటీ!"

"అవును సంజనా! నువ్వు చాలా

అందంగా వుంటావు, తెలుసా? "
"నిజంగానా? "
"నిజంగానే నీ చిన్నప్పుడు ఒకటిరెండు సార్లు చూశాను. బొమ్మలాగా వుండేదా నివి. ఇన్ని రోజులు ఇప్పుడు నాతో కలిసి వుండడం నా అదృష్టం"
"చాల్లెండి ఆంటీ.. పొగుడుతున్నారు"
"లేదు, సంజనా.. మనదేశంలో గల గొప్ప సంప్రదాయం కుటుంబ జీవనం. నువ్వు రావడంతో పిల్లలులేని లోటు నాకు మరింత కనబడుతోంది. ఈ బంధనాలే లేకపోతే మనిషికి చెక్కబల్లకి తేడా ఏముంది? "
"ఆంటీ నేనొకమాట అడగనా? "
"అడుగు"
"మీరు మళ్ళీ పెళ్ళి ఎందుకు చేసుకో లేదు? "
ఒక్క నిముషం బాధ కనబడింది వింధ్య మొహంలో. సంజనా యిలా అడు గుతుందని అనుకోలేదు. అయినా ఆమె మాటల్లో అమాయకత్వమే గాని వెటకారం లేదు.
"లేదు, అలా పెళ్ళి చేసుకోవడం నాకు చేతకాదు. మీ అంకుల్ సంగతి ఏమో గానీ ఆయనను నేనింకా ప్రేమిస్తూనే వున్నాను" వింధ్య లోపలికి వెళ్ళిపోయింది.

★ ★ ★

ఆ రోజు ఆదివారం. వింధ్య యింట్లోనే వుంది. సంజనాకి నీలం మరీమరీ గుర్తు కొస్తున్నాడు. తన ఆలోచనలు ఆంటీ ఎక్కడ పసిగడుతుందో అన్నట్టు కాస్త జంకుగా వుంది.
"సంజనా! తల స్నానం చేస్తావా? "
"చెయ్యాలి ఆంటీ, కానీ బద్ధకంగా వుంది"
"నేను చేయిస్తాను.. రా"
"మీరు చేయిస్తారా.. నేనేమైనా చిన్న పిల్లనా? "
"కాదు పెద్ద పిల్లవే. నా పాత నైటీ ఒకటి వేసుకో. సాంప్రదాయికంగా వుండే తలస్నానం చేస్తే ఎంత బాగుంటుందో నీకు తెలిసేలాగ నేను పోస్తాను. నైటీ వుంటుంది కాబట్టి నీకేం బాధలేదు"
సంజనా ఒప్పుకుంది. ముందుగా

నువ్వుల నూనె ఒంటికి రాసుకోమంది వింధ్య. సుగంధద్రవ్యాలు, కచ్చూరాలు, గంధం పొడి, పసుపువేసి తయారుచేసిన సున్నిపిండి ఒంటికి రాసుకోమంది. కుంకుడు కాయలపొడి ఉడకబెట్టి, అందులో మందార ఆకులు వేసి, ఆ రసం వడకట్టి తలస్నానం చేయించింది వింధ్య.

"అబ్బ, భలే బాగుందాంటీ ఈ పొడి వాసన"

"ఈ రాత్రి నీకు హాయిగా నిద్రపడుతుంది చూడు" అంది వింధ్య.

"అంతదాకా ఎందుకు నాకు యిప్పుడే నిద్రవస్తోంది" అంది సంజనా. తర్వాత జుట్టుకి సాంబ్రాణి పొగ వేసింది.

"అబ్బ నా జుట్టు జిడ్డుగా వుండి తొందరగా ఆరదు ఆంటీ, యిప్పుడు యిట్టే ఆరిపోయింది"

"షాంపూ వల్ల జుట్టు లోపలి జిడ్డు వదలదు. అందుకే ఆరదు. మనకంత సమయం, ఓపిక లేక వాటిని వాడుతున్నాం"

సంజనా జుట్టు పట్టుకుచ్చులా వుంది. ఏదో హాయిగా తేలిగ్గా వుంది.

వింధ్య స్నానం చేసి వచ్చి సంజనాకి జడ వేసింది. "జడ నాకు బాగుండదాంటీ. క్లిప్ పెట్టుకుని జుట్టంతా వదిలేసుకుంటా"

"ఈ ఒక్కరోజు చూడు.. నచ్చకపోతే మానేద్దుగానీ"

జడవేసి, మల్లెలు, కనకాంబరాలు కలిపి కట్టిన మాల తలలో పెట్టింది వింధ్య.

"గుడికి వెడదామా సంజనా? "

"ఇక్కడ గుడి కూడా వుందా? "

"దగ్గర్లో రామాలయం వుంది"

"అయితే వెడదాం ఆంటీ. అరె! గుడికి వెడితే లంగావోణీ వేసుకోవాలా? నా దగ్గర లేవు. తెచ్చుకోలేదు"

"ఫర్వాలేదులే, చుడీదార్ వేసుకో. అయినా గుడికి వెడితే లంగావోణే వేసుకోవాలని ఎవరు చెప్పారు? "

"మా బామ్మ. పండుగలు, పెళ్ళిళ్ళు అంటే మా అమ్మ కూడా అంతే, అలాగే చెబుతుంది"

"నిజమే, లంగావోణి, చీరల్లో వుండే అందం ఇంక దేనికీ రాదు"

"ఆ విషయం ఇక్కడకు వచ్చాక, మిమ్మల్ని చూశాక బాగా అర్థమైంది. కాటన్ చీరలు, ఇంత బాగుంటాయని, అవి ఇంతబాగా కట్టుకోవచ్చని"

"అయితే నీకు నచ్చిన కాటన్ చీరలు కొనుక్కుందువు గాని, నేను నిన్ను రాజమండ్రి తీసుకువెడతాను"

ఇద్దరూ గుడికి వెళ్ళారు. సంజనా పేరు మీద అర్చన చేయించింది వింధ్య. గుడి మండపం ప్రశాంతంగా వుంది. వింధ్య యిల్లే ఊరికి దూరంగా వుంటుంది. అక్కడికి మరికొద్ది దూరంలో గుడి. ఎండలకు పొలాలు, చెట్లు ఆకుపచ్చగా మెరుస్తున్నాయి. పక్కనే పొలం దగ్గరగా చిన్న కొలను, అందులో కలువలు.

"పల్లెటూళ్ళు ఎంత బాగుంటాయో ఆంటీ"

"రాజకీయాలు లేకపోతే యింకా బాగుంటాయి. నువ్వెప్పుడూ పల్లెటూళ్ళు చూడలేదు కదూ!"

"చూడలేదు. అయినా హైదరాబాద్‌లో వుండడం అలవాటైన వాళ్ళు యింకొక వూరిలో వుండడం కష్టమే"

"ఆ మాట నిజమే"

"అక్కడ వుండగా మా యింటికి తరచూ వస్తూండేవారా? "

"లేదు. ఎప్పుడైనా భార్గవితో నా సొదంతా వెళ్ళబోసుకోవడానికి వచ్చేదాన్ని"

"అప్పుడు మాబామ్మ ఏదైనా అనేదా? "

"లేదు. అయినా ఎందుకు అలా అడిగావ్? "

"మీరు చెప్పడం లేదు. ఆవిడ కళ్ళకే భూతద్దాలు వున్నాయి. వాటితో ఆవిడకి

అందరిలో లోపాలే కనబడతాయి"

"ఎందుకు ఆవిడంటే అంత కోపం? "

"మా బామ్మ అంతే ఆంటీ. అమ్మని, నన్ను, పనివాళ్ళని ఏదోఒకటి అంటూనే వుంటుంది. పాపం! మా అమ్మ ఎలా భరిస్తుందా? అన్పిస్తుంది"

"ఏం చేస్తుంది? పెద్దావిడ కదా! ఆవిడని ఏమైనా అంటే డాడీ ఫీలవుతారు"

"మాటకి ముందు రేపు నీకు పెళ్ళయితే ఎలాగే? అత్తవారింట్లో యిలాగే వుంటావా? మీ నాన్నకు చెడ్డపేరు తెస్తావా? అంటుంది"

"ఒక విధంగా అవి కూడా మంచి మాటలే సంజనా. ఒక వైపు ఆ మాటలు చూస్తే చాదస్తంగా వుంటాయి. అవే మాటలు మరోవైపు మనకొక ట్రైనింగ్ లాంటివి. ఇలా మా అమ్మో, బామ్మో మాట్లాడితే మాకు- అంటే నాకు, మా అక్కకు కోపం వచ్చేది. ఇదంతా జరిగాక, మేము పెరిగాక ఆ మాటలు మంచివే అన్పిస్తోంది"

"మీరు యింత పాజిటివ్‌గా ఎలా ఆలోచిస్తారు ఆంటీ! ఎవరి మీదా కోపం రాదా? "

"ఎంత పాజిటివ్‌గా ఆలోచించి ఏం లాభం.. జరిగే నష్టం జరిగాక? జీవితం చాలా చిన్నది సంజనా! మనం సుఖంగా వుండి మిగతా వారిని ఆనందంగా వుంచాలని అనుకుంటే గొడవలేదు.

సంజనా ఆలోచిస్తోంది. తను చేస్తున్నది కరక్టేనా? నీలంతో తన ప్రేమ నిజమైనదేనా? తల్లిని, తండ్రిని బాధపెట్టి పెళ్ళి చేసుకునేంత గొప్పవాడా నీలం?

తండ్రి అడిగిన ప్రశ్నల్లో చాలా వాటికి తను తెలియదనే జవాబు చెప్పింది. అప్పుడది గర్వంగా అన్పించింది. ఇప్పుడు ఆలోచిస్తే సిగ్గుగా వుంది.

"ఏమిటి సంజనా.. ఏదో ఆలోచిస్తున్నావు? పద వెడదాం" అంతవరకు దేవుడిని, ప్రకృతిని చూసి ఆనందిస్తున్న సంజనా ఒక్కసారిగా అలా ఎందుకు అయిపోయిందో అర్థం కాలేదు వింధ్యకి. సంజనాకి ఏదో బాధగా వుంది. తండ్రి తనని యిక్కడికి పంపిన కారణం ఆంటీకి తెలిస్తే, ఎంత బాధపడుతుంది? తనొక స్పెసిమన్‌లాగా కన్పిస్తోందా వీళ్ళకని అనుకోదా? ఆమెకు తల్లిమీద కూడా కోపం వచ్చింది, స్నేహాన్ని ఇలా వాడుకుంటున్నందుకు.

"ఏమైంది సంజనా, అలా వున్నావేం? " మళ్ళీ అడిగింది వింధ్య, "ఆకలిగా వుందా? ఇక్కడొక చిన్న హోటలు వుంది. టిఫిన్ చేస్తావా? మీ హోటల్స్ అంత బాగుండ వనుకో"

"వద్దు ఆంటీ.. యింటికి వెడదాం"

ఇంత మంచి ఆంటీని కనీసం తనైనా మోసం చెయ్యకూడదు. అసలు విషయం చెప్పేస్తే? ఆవిడకి కోపం వచ్చి యింట్లోంచి పొమ్మంటే.. తల్లికి, ఆవిడకి వున్న స్నేహం చెడిపోతే.. ప్రేమించావని అక్కడికి పంపిస్తే, అక్కడ కూడా స్నేహాన్ని చెడగొట్టి వస్తావా? నువ్వు ఎక్కడా సరిగా వుండలేవా? అని అడి గితే.. సంజనా ఆలోచనలకు హద్దులేదు. వాళ్ళ నడకకి హద్దు పెడుతూ యింటికి చేరుకున్నారు.

★ ★ ★

'అతడేనేమో అనుకున్నానే అంత ద వ్వున శ్రావణ మేఘముందని..'

సంజనాకి మెలకువ వచ్చింది.

మెత్తగా, హాయిగా వింధ్య గొంతు.

"శుభోదయం ఆంటీ!" కిచెన్‌లోని వెడు తూనే అంది సంజనా.

"శుభోదయం. ఏమిటి ఈ వేళ తెలు గులో? "

"మీరు రోజూ పాడే తెలుగు పాటలు విని. ఎంత బాగా పాడతారు ఆంటీ? ఈ పాట మీరే రాశారా? "

"అమ్మో! నేనంత గొప్పగా రాయడమా? కృష్ణశాస్త్రి గారి సాహిత్యం"

"అలాగా, ఆయన ఎక్కడ వుంటారు ఆంటీ? మీరు ఎప్పుడైనా చూశారా? "

"చాలా చిన్నతనంలో కాకినాడలో జరి గిన ఒక సాహితీ సభలో చూశాను. అప్ప టికే ఆయన మాట్లాడలేని స్థితిలో వున్నారు. వారిప్పుడు లేరు, స్వర్గస్థుల య్యారు"

"ఈ పాట చాలా బాగుంది ఆంటీ"

"అవును. కవులు రాసే చాలా పాటలు ఆణిముత్యాలే. ఒక్కో భావం వింటూ వుంటే తెలియకుండా ఆనందబాష్పాలు వస్తాయి. నేను యిప్పుడు పాడిన వాక్యమే విను.. శ్రావణ మేఘాలు నల్లగా వుంటాయి. ఒక్కొక్కప్పుడు నీల వర్ణంతో.. ఆ మేఘాలను చూసి రాధ కృష్ణుడు అను కుందిట. నీలమేఘశ్యాముడు అంటా రుగా.. దానికామె చెలులు ప్రతి మబ్బూ ప్రభువైతే, ప్రతి కొమ్మ మురళైతే.. అని మరింత కవ్విస్తారు ఆమెను. వెదురు నుంచి మురళిని తయారు చేస్తారు. కృష్ణు డి పెదవి తగిలి వెదురు వేణువు అయిందా? ప్రతి వెదురు కొమ్మా వేణు వుగా పలుకుతుందా? అందమైన సందేహం.. ఇలాంటి సందేహమే ముళ్ళ పూడి వారి 'కానుక' కథలో కూడా కనబ డుతుంది" తన్మయత్వంతో చెపుతోంది వింధ్య.

"ఆ... పాలు పొంగుతున్నాయి" అం టూ సంజనా చప్పున స్టవ్ ఆపేసింది. సాహిత్యంలోంచి ఇహలోకంలోకి వచ్చింది వింధ్య.

"అయాం సారీ! సంగీతసాహిత్యాల గురించి మాట్లాడుతుంటే సమయమే తెలి యదు నాకు"

"ఫర్వాలేదు ఆంటీ, మీరు చెప్పింది సగం అర్థమైంది. అయినా చాలా బాగుంది. మీరు చెప్పే విషయాలు అర్థం కావాలంటే నేను తెలుగు సాహిత్యం చద వాలి. పైగా నేను తెలుగు మీడియంలో చదవలేదు కదా!"

"ఫర్వాలేదు సంజనా.. తెలుగులో చది విన చాలామంది పుస్తకాలంటే కేవలం కాలక్షేపం కోసం అనుకుంటారు. కానీ అవి మన నేస్తాలు, మార్గదర్శకాలు. ఒక్కొక్క ప్పుడు మంచి శత్రువులు" నవ్వుతూ అంది

వింధ్య.

"అదేమిటి ఆంటీ? "

"అవును, కొన్ని పుస్తకాలు చదువుతూంటే ఇలా జీవితంలో ఒక్క వాక్యమైనా నేను రాయగలనా? అన్పిస్తుంది. ఎక్కడివి ఈ భావాలు! సరస్వతి కటాక్షంతో తప్ప ఇలా రాయడం అసాధ్యం అన్పిస్తుంది" అలా మాట్లాడుతున్నప్పుడు వింధ్య కళ్ళల్లో వెలుగు, ముఖంలో వింత కాంతి, సంతృప్తి కనిపించాయి. ఆమె హఠాత్తుగా వాచీ చూసి "నాకు కాలేజీకి సమయం అవుతోంది సంజనా, వెళ్లొస్తాను"

"కాలేజీలు యింకా తెరవలేదుగా ఆంటీ? "

"ఇవి స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులు. నేను ఎమ్మే ఇంగ్లీషు కదా!" ఆమె వెళ్ళిపోయింది. సంజనాకి మాటరాలేదు. ఆంటీ చదివింది ఇంగ్లీషు. ఆలోచించేది, మాట్లాడేది, ఆఖరుకు శ్వాసించేది తెలుగు సాహిత్యాన్ని.

★ ★ ★

"నేను నీకు రెండు రోజులు కన్పించనురా" అన్నాడు అఖిల్.

"మిమిక్రీతో పాటు మేజిక్ కూడా నేర్చుకున్నావా, కన్పించను అంటున్నావ్? " అడిగాడు నీలం.

"మా పొలం అమ్మేస్తున్నాం. నేనూ వెళ్ళి సంతకాలు పెట్టాలి"

"దానికి రెండు రోజులు ఎందుకు? "

"మా పొలం రాజమండ్రి దగ్గరలో వుంది. అది అమ్మేస్తున్నాం"

"వెరీగుడ్! వెళ్ళిరా. ఈలోగా నేను 'చెలిమి లేదూ, చెలియా లేదు..' అనే పాట ప్రాక్టీస్ చేస్తాను"

"అబ్బ! మరీ అంత బాధపడకురా"

"లేకపోతే ఏమిటి? సంజనాని వెతకరా అంటే నువ్వు ఊరికి పోతున్నావా? నా అనుమానం, నా బాధ భరించలేకే వూరికి పోతున్నావని"

"ఛ! అదేం లేదు. కావాలంటే మా నాన్నని అడుగు"

"ఓ.. మీరిద్దరూ కలిసే వెడుతున్నారా? మరి మీ షాపు ఎవరు చూస్తారు? "

"అమ్మ చూసుకుంటుంది"

★ ★ ★

"ఏమిటి ఆంటీ, పొద్దున్నే గార్డెనింగ్ మొదలు పెట్టారు? "

"చూడు, వర్షాలు లేకపోయినా ఎలా గడ్డి మొలుస్తోందో.. నాలుగు రోజుల నుంచి తియ్యాలనుకుని ఎప్పటికప్పుడు బద్ధకిస్తున్నాను"

"ఇక్కడ పనివాళ్ళు దొరకరా? "

"వస్తారు. కానీ నాకు కూడా కొంచెం వ్యాయామం చేసినట్లవుతుందని"

"అబ్బ! ఎన్ని పనులు చేస్తారో ఆంటీ.. అయినా ఉత్సాహంగా వుంటారు"

"ఒక్కదాన్నే వుంటాను కదా! కాలక్షేపం కోసం యివన్నీ. అయ్యో! నువ్వు చేతులు పెట్టకు. నీ పొడుగాటి గోళ్ళు పాడైపోతాయి"

"ఫర్వాలేదు ఆంటీ, సరదాగా వుంది"

గడ్డి తీస్తున్న సంజనాని వింతగా చూసింది వింధ్య. భోజనం చేశాక ప్లేటు కూడా తియ్యని సంజనాయేనా? ఎప్పుడూ ఆలోచిస్తూ, సీరియస్‌గా వుండే సంజనా రోజురోజుకీ మారుతోంది. ఇలా కూతుర్ని

చూస్తే భార్గవి ఆశ్చర్యపోతుందేమో!

"బోర్నవిటా తాగావా? "

"లేదు ఆంటీ"

"వెళ్ళి, తాగిరా"

"ఇదంతా అయ్యాక వెడతాను"

"చెబితే వినవు కదా!"

వింధ్య చేతులు కడుక్కుని లోపలికి వెళ్ళి బోర్నవిటా తెచ్చింది.

"ఇదిగో.. తాగు"

సంజనా చేతులు చూపించింది. తెల్లటి చేతుల నిండా మట్టి.

"బాగుంది, మట్టి గోరింటాకు" నవ్వుతూ గ్లాసుతో తనే తాగించసాగింది.

"అబ్బ కాఫీ యివ్వొచ్చు కదా!"

"ఊహు.. మధ్యాహ్నం కాఫీ"

ఇద్దరూ ఎండిపోయిన కొమ్మలు, ఆకులు తీసి, నీరు బాగా పోయేట్టు మట్టిని తవ్వి చెత్తంతా బయట వేసేసరికి పది గంటలు అయింది. స్నానాలు చేసేసరికి ఇద్దరికీ నీరసం వచ్చేసింది.

"వంట చేసే మూడ్ లేదు సంజనా. ఏదైనా హోటలుకి పోదాం"

"ఈవూళ్ళో హోటల్స్ బాగుంటాయా? "

"ఇక్కడ కాదు, రాజమండ్రి వెడదాం. ఏదైనా సినిమా కూడా చూద్దాం. చూసి చాలా రోజులైంది"

ఇద్దరూ కాఫీ తాగి బస్సులో రాజమండ్రి బయలుదేరారు. కూరగాయల బస్తాలు, మధ్యాహ్నానికి హోటల్సుకు వెళ్ళే పాలక్యాన్లతో బస్సు రష్‌గానే వుంది.

"ఎప్పుడూ కారులో తిరిగే నీకు ఈ బస్సు ప్రయాణం చిరాగ్గా వుండొచ్చు" అంది వింధ్య.

"కాలేజీకి బస్సులోనే వెళ్ళేదాన్ని ఆంటీ"

"నీలం నీకు ఎలా పరిచయం? "

"రెండుమూడేళ్ళుగా ఒకే కాలేజీ అని తెలుసు. క్రితం సంవత్సరం కాలేజీలో జరిగే ఫంక్షన్‌లో నా డాన్సు చూసి యింప్రెస్ అయ్యాడు. అలా అలా స్నేహం పెరిగింది"

"మీడాడీకి అతనెందుకు నచ్చలేదు? "

"మాది నిజమైన ప్రేమ కాదని, డబ్బు యిబ్బందులు వస్తాయని ఆయన అనుమానం ఆంటీ. ప్రేమించి పెళ్ళి చేసుకున్న వాళ్ళు సంతోషంగా వుండరా? "

"అది ఎవరూ చెప్పలేరు. ప్రేమపెళ్ళి అనేది మనిషినిబట్టి, మనసునిబట్టి మారుతూ వుంటుంది. బాధ్యతగల మనిషి అదెటువంటి పెళ్లయినా నిలబెట్టుకుంటారు"

సంజనా ఏదో అనబోయింది. ఈలోగా బస్సు రాజమండ్రి చేరింది. ఇద్దరూ హోటల్లో భోజనం చేసి, సినిమా చూసి, షాపింగ్‌కి బయలుదేరారు. సంజనాకి ఉత్సాహంగా వుంది. ఇలా బయటికి వచ్చి చాలారోజులైంది. ఇక్కడి మనుషులు, వాళ్ళ యాస ఆమెకు కొత్తగా అనిపించాయి.

"బాగుందాంటీ, ఈ వూరు" మనస్ఫూర్తిగా అంది సంజనా.

"మరేమనుకున్నావ్? పవిత్ర గోదావరి ఒడ్డున వున్న వూరు. కాటన్‌దొర కృషితో సస్యశ్యామలమైన ప్రాంతం. తూర్పుగోదావరి జిల్లాకి స్వాగతం పలికే ముఖద్వారం"

సంజనాకి గులాబీరంగు కాటన్ చీర కొంది వింధ్య.

"నాకెందుకు ఆంటీ? "

"తీసుకో సంజనా. భార్గవి హఠాత్తుగా వచ్చి నిన్ను తీసుకువెడతానంటే అప్పటికప్పుడు నాకు చీర కొనే అవకాశం వుంటుందో వుండదో"

"అయినా నాకు చీర కొనాలా ఏంటి? "

"నాకు పిల్లల్లేరు సంజనా. నువ్వు వచ్చిన తర్వాత, ఆ లోటు మరింత తెలుస్తోంది. నువ్వా వెళ్ళిపోతే మరింత ఒంటరినవుతాను"

"అదేమిటి? "

"అవును, వున్నన్ని రోజులూ మనకి ఎవరి విలువా తెలియదు. తీరా వాళ్ళు వెళ్ళిపోయాక వాళ్ళతో మరింత బాగా గడ పలేదే అనుకుంటే ఏం ప్రయో జనం? రోజూ ఒక్కదాన్నే వంట చేసుకుని తినాలంటే విసుగ్గా వుంటుంది. సరదాగా ఏదైనా హోటలుకి వెడదామంటే ఎవరు న్నారు.. నేను తీసుకువెళ్ళేవాళ్ళు, నన్ను తీసుకువెళ్ళేవాళ్ళు? "

"మీకెవరూ స్నేహితులు లేరా? "

"గట్టిగా అడిగితే లేరనే చెప్పాలి. పైగా నాతో సినిమాలకు, హోటల్స్‌కు రావా లంటే వాళ్ళ యింట్లోవాళ్లు కూడా ఒప్పుకో వాలి. ఒంటరిగా వెడదామంటే నన్ను అందరూ వింతగా చూస్తారేమో అన్పి స్తుంది" ఒక్క నిముషం ఆగి మళ్లీ అంది "అంతేకాదు, అలా వెళ్లాలంటే నాలో నేనే ఏదో యిబ్బందిగా ఫీలవుతాను"

"ఇంతగా ఎదుటివారి గురించి ఆలోచి స్తారా ఆంటీ? "

"మర్చిపోయావా.. నేను రచయిత్రిని. రచనలు చేయడానికి మొదటి అర్హత బాగా చదవడం అయితే, రెండో అర్హత పరిశీ లన. నేను యిలా అంటున్నానని ఏమీ అనుకోకు సంజనా. మీ తరంవాళ్ళకి వ్యక్తి ముఖ్యం. మా తరంవాళ్ళకి కుటుంబం, మనుషులు, మనసులు ముఖ్యం"

"నేనూ యిలా అంటున్నానని ఏమీ అనుకోకండి ఆంటీ.. మనసే ముఖ్యమైతే ఎంతో ప్రేమించిన అంకుల్ మీ గురించి ఎందుకు ఆలోచించలేదు? "

"ఇలాంటి పెళ్ళిళ్ళలో ఒకరు త్యాగం చేయాలి, ఒకరే సర్దుకుపోవాలని అనుకుం టారు. ముఖ్యంగా ఆడవాళ్ళే సర్దుకుపోవా లని అత్తవారింటి ఆలోచన. పైగా నాకు మా ఫ్యామిలీ సపోర్టు కూడా లేదు. మా అన్నలకి, అక్కకి నీ వయసున్న ఆడపిల్లలు వున్నారు. వాళ్ళని తీసుకువచ్చి యిలాగే అవియివీ కొనాలన్పిస్తుంది. కానీ నేను వాళ్ళనేదో చెడగొడతానన్నట్టు పంపించరు నా దగ్గరకు"

ఇద్దరూ కాస్సేపటి దాకా మాట్లాడుకో లేదు. "మాటల్లోనే బస్టాండుకి వచ్చేసాం. ఊరు చూస్తానంటూ రిక్షా అయినా ఎక్క లేదు. ఎండలో నడిచి మొహం వాడిపో యింది. పద.. కాస్త కూల్‌డ్రింక్ అయినా తాగుదువు గాని"

బస్టాండ్ రష్‌గానే వుంది.

"సంజనా కూల్‌డ్రింక్ షాపు యిటు" అంది వింధ్య.

తండ్రి పక్కనే నిలబడి బస్ టిక్కెట్టు



నెంబరు చూసుకుంటున్న అఖిల్ ఆ పిలుపు విని యిటు తిరిగాడు. సంజనా ఎవరో అర్థం కాలేదు. మెరూన్‌కలర్ చుడీ దార్ వేసుకున్న అమ్మాయి ఇటు తిరిగితే బాగుండుననుకున్నాడు. ఆమెను ఎప్పుడూ చూడలేదు. గుర్తుపట్టడం ఎలా అనుకున్నాడు. ఇంతలో అఖిల్ తండ్రి సెల్ ఫోను మోగింది. అట్నుంచి తల్లి 'బయలు దేరారా? లేదా' అంటూ. తండ్రి కాస్త దూరంగా పోయి మాట్లాడుతున్నాడు. అప్పుడు ఓ ఆలోచన వచ్చింది అఖిల్‌కి. తన సెల్‌ఫోన్‌తో ఈ అమ్మాయిని ఫొటో తీస్తే? ఛ! అది పద్ధతికాదు. కానీ నీలం అనుక్షణం జపించే పేరుగల అమ్మాయి చుట్టుపక్కల వుంటే కనుక్కోకుండా ఎలా? ఈమెను ఫొటో తీస్తే, అది చూసి నీలమే చెప్తాడు, ఆమె తన సంజనాయో కాదో!

వింధ్య షాపులో డబ్బులు యిచ్చేసింది. కర్చీఫ్‌తో పెదవులు తుడుచుకుంటూ ఇటు తిరిగింది సంజనా. సరిగ్గా అపుడే అఖిల్ ఫొటో తీసాడు.

★ ★ ★

వింధ్య కూర్చుని రాసుకుంటోంది. ఎందుకో ఏకాగ్రత కుదరడం లేదు. మన సెందుకో బాధపడుతోంది. ఆమె పెన్ క్యాప్ పెట్టి టేబుల్ దగ్గర నుండి లేచింది.

"సంజనా" పిలుస్తూ బయటికి వచ్చింది. లేదు.. సంజనా యింట్లో లేదు.



ఏమైంది? వింధ్యకి కంగారు వచ్చేసింది. 'ఏమైంది? సంజనా పారిపోయిందా? ఆమెకు ఈ వూరు తెలియదు. వచ్చిన యిన్ని రోజుల్లో తనతో తప్ప బయటికి రాలేదు. ఎక్కడికి వెళ్ళింది? ఇప్పుడు భార్గ వికి ఏం జవాబు చెప్పాలి? ' రెండు నిము షాలలో యిదంతా ఆలోచించింది వింధ్య. ఆమె వీధి గుమ్మంలో నిలబడి సంజనా కోసం చూడసాగింది. ఇంతలో రెండు చేతుల్లో తామరపూలు పట్టుకుని వచ్చింది సంజనా.

"హేపీ బర్త్‌డే, మెనీ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" అంటూ యిచ్చింది వింధ్యకు.

"చాలా థ్యాంక్స్! ఎక్కడికి వెళ్ళావు సంజనా? నీ గురించి ఎంత భయపడ్డానో తెలుసా? "

"ఎందుకు ఆంటీ? "

"నీకిక్కడ ఏం తెలుసు? ఇన్నాళ్ళు కాలు బయటపెట్టని దానివి? "

"మీకు బర్త్‌డే విషెస్ చెప్పాలని ఆశ. వెరైటీగా వుంటుందని చెరువులో తామర పూలు తెచ్చాను"

"చెరువులోకి వెళ్ళావా? కాలు జారితే, బురదలో కూరుకుపోతే? " వింధ్యకి చెప్ప లేని భయం వేసింది.

"తగిన జాగ్రత్తలు లేకుండా చేస్తానా ఆంటీ? ఇక్కడ గేదెలు కాసే కుర్ర

వాళ్ళున్నారు. వాళ్ళని కోసి యివ్వమన్నాను. చూశారా నాకాళ్ళకి బురద లేదు"

వింధ్య నవ్వింది. "అయినా నా బర్త్‌డే అని నీకెవరు చెప్పారు? "

"పొద్దున్నే అమ్మ ఫోన్ చేసింది. మీరు నిద్ర పోవడమే రాత్రి రెండుగంటలు దాటి వుంటుంది. మిమ్మల్ని నిద్ర లేపడం యిష్టం లేక ఆ శుభాకాంక్షలు నేనే స్వీకరించాను. ఈ తామరపూలతో అందజేసాను. అబ్బ చూశారా మీతో వుంటే నాకూ కవిత్వం వస్తోంది!"

"భార్గవికి నేను ఫోన్ చేస్తాను" తను మాట్లాడాక ఫోన్ సంజనాకిచ్చింది వింధ్య.

కుశల ప్రశ్నలయ్యాక ఫోన్ అత్తగారికి యిచ్చింది భార్గవి. "నా కోసం ఎవరైనా వచ్చారా? " అడిగింది సంజనా.

ఆ ప్రశ్న తల్లిని అడిగే ధైర్యం లేదు.

"యింటికి ఎవరూ రాలేదు, ఎవరో శ్రీలక్ష్మిట నీగురించి ఫోన్ చేసింది" చెప్పిందావిడ.

సంజనా ఫోన్ పెట్టేసి ఆలోచించసాగింది. శ్రీలక్ష్మి.. ఈ పేరుగల ఫ్రెండ్స్ ఎవరూ తనకు లేరు. నీలం పేరులో 'శ్రీ' వుందిగాని అతని గొంతు ఆడపిల్ల గొంతు లాగ ఎందుకు వుంటుంది?

తన పుట్టినరోజును అతిథి కోసం సెలబ్రేట్ చేసుకోవాలి కాబట్టి వింధ్య పాయసం చేసింది. డైనింగ్ టేబుల్ మీద ఫ్లవర్‌వాజ్ పెట్టి అందులో నీళ్ళుపోసి, టేబుల్‌సాల్ట్ వేసి తామరపూలు పెట్టింది.

"టేబుల్ సాల్ట్ వేసారేమిటి ఆంటీ? "

"అలా వేస్తే పువ్వులు తొందరగా వాడిపోవు"

"కొత్త చీర కట్టుకోలేదేం ఆంటీ? "

"అటువంటి సరదాలు వుండడానికి నేనేమైనా చిన్నపిల్లనా? "

"బర్త్‌డే ఏ వయసువారైనా చేసుకోవాలి. మీరు కొత్తచీర కొనుక్కోలేదు. మొన్న నా కోసం కొన్న చీర మీరు కట్టుకోండి. కావాలంటే నాకు మళ్ళీ కొనవచ్చు"

"చాలా రోజులైంది యిలాంటి పండుగలు చేసుకుని. నీకోసం కొన్న చీర నువ్వే కట్టుకోవాలి" ఎప్పుడూ నవ్వుతూ ప్రశాంతంగా వుండే ఆంటీ ముఖం సీరియస్‌గా, బాధగా వుంది. ఆమెను అడగాలంటే మొహమాటంగా వుంది. ఆమెలోటు అర్థం అవుతూనే వుంది. అందరూ వుండి ఎవరూ లేనట్టుగా ఒంటరి జీవితం ఎంత బాధాకరం. తన పుట్టినరోజు గుర్తుకు వచ్చింది సంజనాకు. అర్ధరాత్రి ఫోన్లు వచ్చేవి ఫ్రెండ్స్ నుంచి కొన్నాళ్ళు. ఈ మధ్య అదీ కాకుండా తల్లితో ముందే చెప్పి రహస్యంగా యింట్లో దాక్కుని అర్ధరాత్రి సరిగా పన్నెండు గంటలకు బర్త్‌డే విషెస్ చెప్పడం, అప్పుడు కేక్ కోయడం, కబుర్లు చెప్పుకుని ఏ మూడు గంటలకో నిద్ర పోయి, పొద్దున్న పదకొండు గంటలకు లేచేవారు. వెడితే అందరూ హోటల్లో లంచ్, తర్వాత సినిమా, లేదంటే ఏ పార్కుకైనా పిక్నిక్‌లాగా వెళ్ళడం.. పుట్టిన రోజంటే తన డ్రెస్‌తో కలిపి పదిహేను, ఇరవై వేలు ఖర్చు అవుతుంది. దాదాపు తన ఫ్రెండ్స్ అందరి పుట్టిన రోజులూ యిలాగే జరుగుతాయి.

ఇంతలో ల్యాండ్ ఫోన్ మోగింది. అట్నుంచి వింధ్యతల్లి. ఆమెతో కాస్సేపు మాట్లాడి ఫోన్ పెట్టేసింది వింధ్య.

"ఈ రోజు మీ అమ్మగారిని కలవలేకపోయారా ఆంటీ? "

"నిజానికి వెళ్ళి అమ్మ ఆశీస్సులు తీసుకోవాలి. వెడితే ఎవరైనా ఏమైనా అంటారు. నాకు బాధ, ఆవిడకీ బాధ. అందుకే రేపు వెడతాను వీలైతే"

భోజనాలు పూర్తయ్యాయి. వింధ్య ఏదో పుస్తకం చదువుతూనే కాసేపటికి నిద్రలోకి జారుకుంది. సంజనా హాల్లోనే కూర్చుని

వింధ్య చీరమీద వేసిన డిజైను కుట్టసాగింది. ఇంతకీ ఆంటీ చేసిన తప్పేమిటి? ప్రేమించి పెళ్ళి చేసుకోవడమా? దొంగలకు, నేరగాళ్లకు కొన్నాళ్ళు జైలుశిక్ష వేసి వదిలేస్తారే? అటువంటిది ఆంటీకి ఎందుకు ఈ యావజ్జీవ శిక్ష? ఆ అంకుల్ ఎవరో తెలిస్తే అడిగేది, యింత మంచి ఆంటీని ఎందుకు బాధపెడతారని? అడిగేది. తనా..? తన ప్రేమే పెళ్ళిగా మారుతుందో లేదో తెలియని తను యింకొకరికి సాయం చెయ్యడమా? ఏం.. తప్పేముంది? వరదల్లో కొట్టుకుపోయేవాడిని వర్షంలో తడిసేవాడు రక్షించలేడా? అంకుల్ హైదరాబాద్‌లో వుంటాడని తెలుసు. ఎలా వుంటాడు? అతని ఫొటో కోసం షోకేసులు, అల్మారాలు కళ్ళతోనే వెతకసాగింది. చిన్నచిన్న బొమ్మలు, రోజువారీ పేపర్లు, గోడలకు దేవుళ్ళ ఫొటోలు అవి కూడా ఒకటి రెండు, అంతే. సరే, అంకుల్‌ని చూస్తుంది. ఏం మాట్లాడాలి? యిక్కడే తను నీలం సహాయం తీసుకోవాలి. ఆమెకు ఉత్సాహం వచ్చింది. సహజంగా ఆ వయసులో వుండే ఉత్సాహం, ఏదో వెరైటీగా చేయాలనే తపన ఆమెను నిలువనీయడం లేదు. ఆలోచించగా ఆలోచించగా ఒక కొస దొరికింది. ఆ కొసతో కోటను పట్టాలంటే కాస్త ఆగాలి.

ఆ సాయంత్రం గుడికి బయలుదేరారు యిద్దరూ.

"మీకింకా దేవుడిమీద నమ్మకముందా ఆంటీ? " అడిగింది సంజనా.

"ఎందుకు వుండకూడదు? "

"చిన్నదాన్ని పెద్దమాటలు మాట్లాడుతున్నానని అనుకోకండి. దేవుణ్ణి నమ్మి మీరు పొందిందేమిటి? "

మనుషులు ఏమైనా నాకన్యాయం చేశారేమోకానీ, దేవుడేం చేసాడు? మంచి కుటుంబంలో పుట్టాను. అవయవలోపం లేదు. క్రమశిక్షణతో పెరిగాను. చదువుకుని ఉద్యోగం చేస్తున్నాను. అన్నింటినీ మించి నాకిష్టమైన రచనావ్యాసంగం వదులుకోలేదు. చాలామంది నిర్భాగ్యుల కంటే నేను నయం కదూ!"

"కానీ, ఈ ఒంటరి జీవితం? "

"ఏం చేస్తాం? ఒక్కొక్కప్పుడు అన్పిస్తుంది, నేను కొంచెం సహనంగా వుండి సర్దుకుపోయుంటే బాగుండేదని"

"పోనీ, యిప్పుడు అంకుల్ దగ్గరకు వెళ్ళిపోతే? "

"నాకు ఆత్మాభిమానం అడ్డువస్తోంది. పైగా ఆయన మరో పెళ్ళి చేసుకుని వుంటే? "

ఒక నిముషం ఆగి అంది సంజనా. "ఆంటీ నా గురించి అమ్మ చెప్పే వుంటుంది. యిప్పుడు నేనేం చెయ్యాలి? "

"ఒకరి జీవితం గురించి యింకొకరు ఎలా సలహాలు యివ్వగలరు సంజనా? అందులోనూ నాలాంటివాళ్ళు! అతని తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు కాబట్టి యితనూ భార్యని అలాగే విడిచిపెడతాడేమోనని మీ డాడీ భయం"

"మీకు ఈవిషయం అమ్మ చెప్పిందా? "

"చెప్పింది. యిక్కడ నువ్వు వున్న యిన్ని రోజుల్లో అతను నువ్వెక్కడ వున్నది, ఎలా వున్నది.. ఏమీ పట్టించుకోలేదు"

"అసలు ఒప్పందమే మేం ఒకరి గురించి ఒకరం తెలుసుకోకూడదని. లాప్‌టాప్ కంప్యూటర్, సెల్‌ఫోన్.. ఇవేమీ లేకుండా నేను గడపాలి"

"ఇక్కడకు వచ్చాక నీలో కూడా అతని గురించిన ఆలోచనలు తగ్గాయేమో అన్పిస్తోంది"

సంజనా ఒక్క నిముషం మౌనంగా వూరుకొని అంది "ఆ మాటా నిజమే ఆంటీ"

"ఎందుకు? "

"హైదరాబాద్‌లో వుండగా నాకు వేరే

ఆలోచనలేవి లేవు. నీలం, కాలేజీ, చదువు, ఫ్రెండ్స్.. ఇవే. యిక్కడికి వచ్చాక, మిమ్మల్ని చూశాక అర్థమయింది, జీవితాన్ని ఎంత సీరియస్‌గా తీసుకోవాలో"

"అంటే అతనంటే యిప్పుడు యిష్టం తగ్గిందా? "

"లేదు. ఏ సాయంత్రమో కలుసుకోవడం, రిలీజైన కొత్త సినిమాలు, లేటెస్ట్ సెల్‌ఫోన్స్, బైకులు.. వీటి గురించి మాట్లాడుకోవడం కాదు ప్రేమంటే అని అర్థమయింది"

"ఈ మాటలు అవసరమే. అయితే ఈ బంధాన్ని నిలబెట్టుకోవాలనే బాధ్యత యిద్దరికీ వుండాలి"

"మొన్న మీరు చెప్పినట్టు ఈ పెళ్ళిళ్ళల్లో ఒకరే త్యాగం చేయాలి, ఒకరే సర్దుకుపోవాలి. యిన్నాళ్ళూ ఇది నేను గమనించలేదు. అమ్మ చాలావాటికి సర్దుకుపోతూంటుంది"

"మీ డాడీకి కోపం ఎక్కువనే విషయం నాకు తెలుసు. కానీ ఆయనకి కుటుంబం పట్ల బాధ్యత వుంది. ఆ స్థాయిలో వుంటూ కూడా ఏ చెడు అలవాట్లూ లేవు" అంది వింధ్య.

తండ్రి గురించి మంచిగా మాట్లాడుతోంది వింధ్య. తండ్రికి మాత్రం ఆమె అంటే మంచి అభిప్రాయమే లేదనుకుంది సంజనా.

"నిజమే ఆంటీ.. మా డాడీకి కోపం ఎక్కువ. అరుస్తూ వుంటారు. ఆయన అనే మాటలు అమ్మ ఎందుకు భరిస్తోందా అన్పిస్తుంది. కానీ ఆ భరించడంలో ప్రేమ వుంది. అమ్మ పక్కన లేకుండా ఆయన ఎక్కడకీ వెళ్ళరు. పైకి కనిపించే మాటలు కాకుండా వారిద్దరి మధ్య ఒక బంధం వుంది, అది సహజీవనంవల్ల వస్తుంది. మన అభిరుచులకు తగ్గట్టు జీవించాలంటే ఎంత కష్టపడాలో మిమ్మల్ని చూస్తే అర్థమైంది. రెండు వందలకోసం ఎండలో నడిచి వచ్చిన ముసలమ్మ.. ఆమెను మీరు ఆదరించిన తీరు.. నీలంకు, నాకు అంత అనుబంధం ఏది? "

"మీ యిద్దర్నీ బజార్లో చూసినప్పుడు, డాడీ నీ మీద అరిచినప్పుడు అతనెందుకు మాట్లాడలేదు? "

"ఆయన కోపం అలవాటైన నేనే ఏమీ మాట్లాడలేదాంటీ. ఇంక తనేం మాట్లాడతాడు? ఆ తరువాత అతను మా యింటికి వచ్చి డాడీతో మాట్లాడాడు"

"నువ్వు రమ్మని ఫోన్ చేశావా? "

"లేదు. తనే వచ్చాడు. తను వస్తున్నట్టు నాక్కూడా తెలియదు"

"అతనంతట అతనే వస్తే బాధ్యత కలవాడే సంజనా. యిద్దరు వ్యక్తులు ఒకేలా ఆలోచించడం, ఒకరికొకరు బాధ్యతగా వుండడమే ప్రేమంటే! భార్గవికి ఎంత నమ్మకం చూడు నా మీద, నిన్ను నా దగ్గరకి పంపించింది"

'పాపం! ఆంటీకి అసలు విషయం తెలియదు' సంజనాకి ఏడుపు వస్తోంది.

"ఏమిటి సంజనా.. ఆ కళ్ళ వెంట నీళ్ళు .. ఏమైంది? "

"అబ్బే, ఏం లేదాంటీ.. అయాం సారీ. మీ పుట్టినరోజున నా కళ్ళ వెంటనీళ్ళు వచ్చాయి"

"బాగుంది.. వారం, వర్జ్యం చూసుకుని మనసు బాధ పడుతుందా? " అంది వింధ్య.

ఆమె కళ్ళ వెంట నీళ్ళు తుడుచుకుంది. "నేనెప్పుడైనా ఏడిస్తే- మా బామ్మ ఆడపిల్ల ఏడవకూడదు. ఈ వేళ మంగళవారం, శుక్రవారం- అంటుంది" అంది అమాయకంగా.

వింధ్య నవ్వింది "అలా సెంటిమెంటుతో భయపెడితే వింటారని అంటారులే"

"మీ వ్యక్తిత్వం చాలా గొప్పది ఆంటీ"

మనస్ఫూర్తిగా అంది సంజనా.

"ఇంతకీ నువ్వు బాధపడ్డ కారణం. నీలంని అలా అన్నానని ఫీలయ్యావా? మంచిచెడులు చెప్పాలని కానీ, నిన్ను బాధ పెట్టాలని కాదు"

"అది కాదు.. అసలు విషయం మీకెలా చెప్పాలో అర్థం కావడం లేదు. నన్ను యిక్కడికి పంపిన కారణం వేరే వుంది. మిమ్మల్ని చూసి నేను మారాలని, మీలాగ ప్రేమపెళ్ళి చేసుకోకూడదని" హమ్మయ్య చెప్పేసింది. మనసులో బాధవున్నా ఫర్వా లేదు. బరువు ఉండకూడదు.

వింధ్య మనసు ఒక్కక్షణం బాధ పడింది.

"అయితే నువ్వు యిక్కడికి వచ్చిన కారణం నీకు తెలుసన్నమాట"

"ఇది ముందుగానే మీకు తెలుసా? ఎవరు చెప్పారు? ఆశ్చర్యంగా వుంది"

"కొంత అర్థమయింది. మరికొంత అర్థం చేసుకున్నాను. నీలం తల్లిదండ్రులు విడా కులు తీసుకున్నారు కాబట్టి అతనికి కూడా అదే పోలిక రావచ్చు అని మీ డాడీకి అను మానం, అంతేగా? "

"మావాళ్ళ ప్రవర్తన నాకు సిగ్గుగా వుంది ఆంటీ, స్నేహాన్ని ఇలా ఉపయోగిం చుకున్నందుకు"


"ఎందుకు బాధపడతావ్ సంజనా? యిదీ ఒక కౌన్సిలింగ్ లాంటిదే. గాంధీజీని చూసి ఎలావుండాలో నేర్చుకో వాలి, గాడ్సేని చూసి ఎలా వుండకూడదో నేర్చుకోవాలి.. యిదీ అంతే"

ఇద్దరూ గుడి దగ్గరకి వచ్చేసారు. "ఆంటీ ఒక్కమాట చెప్పండి. యిన్నాళ్లూ ఈ విషయం దాచానని నామీద కోపంగా వుందా? "

"నాకు తెలిసిన విషయం నువ్వు దాచడం ఏమిటి? పిల్లల గురించి యిన్ని జాగ్రత్తలు తీసుకొనేవాళ్ళే అసలైన తల్లిదం డ్రులు"

'ఆంటీ ఎంత మంచిది. ఎంత పాజిటి వ్‌గా ఆలోచిస్తుంది. యింక ఆలస్యం చేయకూడదు. ఇంత మంచి ఆంటీకి మర్చి పోలేని బహుమతి ఇవ్వాలి' అనుకుంది సంజనా.

5



"అన్నయ్యా ఎవరిదిరా ఈ ఫొటో" అఖిల్ చెల్లెలు అమల అడిగింది.

"అబ్బ! నా సెల్‌ఫోన్ తీసుకోవద్దని ఎన్నిసార్లు చెప్పాను? " అన్నాడు అఖిల్.

"నీకు, నాకు ఒకటే సెల్‌ఫోను. నా ఫ్రెండ్స్ అందరికీ ఈ ఫోను నెంబరు యిచ్చాను. ఈ రెండురోజుల్లో నాకు ఏమైనా ఫోన్లు వచ్చాయేమోనని చూస్తు న్నాను. ఈ ఫొటో కనబడింది. ఎందుకు తీసావ్ ఈ ఫొటో? "

"ఏం లేదు, అనుకోకుండా కెమెరా ఆన్ అయినట్టుంది" అఖిల్ జేబులో ఫోన్ పెట్టేసుకున్నాడు.

"ఒకసారి చూడనియ్యి. ఆవిడ రచయిత్రి వింధ్యగారనుకుంటా"

"ఛ! ఫో.. వింధ్యాలేదు, సంధ్యాలేదు. ఏదో పొరబాటు జరిగిందంటే వినవేం? " అఖిల్ చప్పున యింట్లోంచి బయటకు వచ్చి బైకుమీద నీలం యింటికి బయలుదే రాడు.

"ఏమిట్రా ఎప్పుడూలేనిది యింటికి

వచ్చావు? ఊరునుండి ఎప్పుడు వచ్చావు? ” అడిగాడు నీలం.

“ఈవేళ పొద్దున్నే! వెంటనే వద్దామంటే నువ్వు ఆఫీసుకి వెళ్ళి వుంటావని రాలేదు. పద, బయటకు పోదాం”

“అబ్బ ఆఫీసులో చాలా అలసిపోయా నురా. పైగా బయట ఒకటే ట్రాఫిక్.. ఇంట్లోనే కూర్చుందాం” బద్ధకంగా అన్నాడు నీలం.

“నీతో మాట్లాడాలి.. రారా బాబూ, ప్రిన్సిపాల్ గారు వస్తే బాగుండదు” నీలం చేయి పట్టుకుని బయటికి లాక్కుపో యాడు అఖిల్.

“బయటకు వద్దులే.. డాబా మీద కూర్చుందాం పద”

“నేను మొన్న రాజమండ్రి వెళ్ళినప్పుడు ఒకమ్మాయిని చూశాను”

“అయితే? ”

“అరే! చెప్పేది విను. ఆమె పేరు సంజనా! ఆమె మీ సంజనాయో కాదో చూడాలి నువ్వు”

“సరిపోయింది. నువ్వు చూసిన అమ్మాయి నాకెలా కనబడుతుంది”

“ఇలా” అఖిల్ సెల్ ఫోన్‌లో ఫొటో చూపించాడు.

నీలంకి ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. అనుక్షణం తను జపించే పేరు. అస్తమాను కలలోకి వచ్చే రూపం. మరచి పోవడం అసాధ్యం.. అవే జ్ఞాపకాలు.. కలబోసి, రూపందాల్చి ఈ చిన్న సాంకేతిక పరిజ్ఞానంలో యిమిడిపోయింది. ఆమె వేరే వూళ్ళో వుండగా ఆమె ఫొటో హైద రాబాద్ రావడం థ్రిల్లింగ్‌గా వుంది. అతను మాట్లాడకపోవడం చూసి అఖిల్‌కి అనుమానం వచ్చేసింది. ఏమిట్రా అలా చూస్తున్నావు? ఈమె కాదా? ”

“ఈమె.. ఈమె.. మా సంజనాయే”

“నిజంగా.. నిజంగానా!”

“అబ్బ, అఖిల్ బెస్ట్‌ఫ్రెండ్ అంటే ను వ్వేరా. ఇంతకీ తను ఏ వూళ్ళో వుందో ఎలా కనిపెట్టావు? ” మరోసారి ఆ ఫొటోని చూస్తూ అడిగాడు.

“రాజమండ్రి వెళ్ళానుగా.. అక్కడ బస్టాండులో కనబడింది. ఎవరో ఈమెను సంజనా అని పిలిచారు. ఆమె మీ సంజనా అయివుండవచ్చని ఫొటో తీశాను. హమ్మయ్య! మీ సంజనాని నీ చేతిలో పెట్టేసాను”

“అది బాగానే వుంది గానీ.. యింతకీ తను వుండేది ఏవూరు? ”

“మళ్ళీ మొదటికే వచ్చావా? రాజ మండ్రి”

“ఆ వూళ్ళో ఎక్కడ? ”

“అది నాకెలా తెలుస్తుందిరా? బస్టాం డులో ఎవరో ఎవరినో పిలిస్తే లక్కీగా ఆమె సంజనా అయింది”

“ఎక్కడ వుందో తెలుసుకాబట్టి మనం వెతకడం సులువు” అన్నాడు నీలం.

“చాల్లే, రాజమండ్రి చిన్నవూరు అనుకుం టున్నావా? గోదావరి అంతవుంది” అన్నా డు అఖిల్.

“అదేం పోలికరా.. ఊరును నదితో పోలుస్తావు? ”

“నీ ప్రేమ వ్యవహారంతో మతి పోతోం దిరా”

“ఇంతకీ ఈ పక్కనున్న ఆవిడ ఎవరు?

“తెలియదు”

“వాళ్ళ పెద్దమ్మో, పిన్నో అయివుండాలి”

“ఇదేదో అందినట్టే అంది జారిపోతూ వుంది” అన్నాడు నీలం.

“ఆ... ఈ పక్కనున్న ఆవిడ మా చెల్లె లికి తెలుసు”

“ఎలా తెలుసు? ”

“ఆవిడ రచయిత్రో, ఏదో అంది”

“వెరీగుడ్! పద, మీ యింటికి పోదాం”

అఖిల్ టైము చూశాడు. రాత్రి తొమ్మి

ది గంటలు దాటుతోంది.

"ఊహు.. యిప్పుడు వద్దు. రేపు వద్దు వుగాని. ఇప్పుడు మా నాన్న యింటికి వచ్చే సమయం. నిన్ను చూస్తే..? "

"సరే.. సరే.." నీలం నవ్వుతూ వీడ్కోలు పలికాడు మిత్రుడికి.

అఖిల్‌ది వ్యాపారస్థుల కుటుంబం. తండ్రి వద్దన్నా వినకుండా స్కూలు అయిపోగానే వెళ్ళి షాపులో తండ్రి పక్కన కూర్చునేవాడు. అలా.. అలా... ఇంటర్మీడియెట్‌దాకా సాగిన చదువు అక్కడ చతికిల పడింది. అఖిల్ తండ్రికి నీలంలాగ తన కొడుకు చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కాలేదని బాధ. అందుకే తండ్రి నీలంని చూస్తే మళ్ళీ తనకి ఉపన్యాసం యిస్తాడని అతని భయం. అఖిల్ చెల్లెలు కూడా అన్న బాటలోనే నడచి హైస్కూల్లోనే ఆగిపోయింది. ఆ ఫొటోలోని రెండో వ్యక్తి ఎవరని అమలని అడగాలని వుంది అఖిల్‌కి. కానీ సాయంత్రం ఛీ.. ఫో.. అని, ఇప్పుడు ఎలా అడగాలి? కానీ సంజనా పక్కనున్న వ్యక్తిని అమల గుర్తుపడితే సమస్య తీరిపోయినట్టే. ఇన్నాళ్ళూ చెల్లెలిని పుస్తకాల పురుగని ఏడ్పించేవాడు. ఇప్పుడా పుస్తకాలు ఏవో పనికొచ్చేట్టు వున్నాయి.

★ ★ ★

"పోరా సెల్‌ఫోన్ యిమ్మంటే యివ్వవు గానీ, ఆవిడ ఎవరో చెప్పాలా? " అంది అమల.

"అవును"

"కెమెరా అనుకోకుండా ఆన్ అయిందన్నావుగా. ఎవరినో ఫొటో తీస్తే ఆవిడ మీద నీకేమిటి యింట్రస్టు? "

"ఏమీ లేదు, ఎలాగూ ఫొటోలో వున్న వ్యక్తి నీకు తెలుసుకదా! అనుకోకుండా ఫలానావాళ్ళ ఫొటో తీశానంటే ఎంత గొప్ప. అందుకే చెప్పు.. చెప్పు"

"ఆ ఫొటో యిందాక సరిగా చూడనివ్వలేదు. చూడనీ.."

"ఇదిగో చూడు"

"నీ యింట్రస్ట్ ఈవిడమీదా, పక్కనున్న అమ్మాయి మీదా? " అన్నని ఓరగా చూస్తూ అంది.

"ఛ.. ఛ.. ఆమె నాకు నీలాంటిదే. సాయంత్రం నీలం దగ్గరకు వెడుతూ నీతో సరిగా మాట్లాడలేదు, అంతే. అంతకంటే ఏం లేదు. ఈమె ఎవరో చెప్పు? "

నిజానికి అఖిల్‌కు నీరసంగా, విసుగ్గా వుంది.

ఫ్రెండ్స్ సర్కిల్‌లో ఒకడు ప్రేమిస్తే వాడు బాగానే వుంటాడు. అతని ఫ్రెండ్స్‌కి పడుతుంది ఆ బాధంతా. అటు నీలం చెప్పేదంతా వినడం, ఇప్పుడు చెల్లెల్ని బతిమిలాడడం.. చిరాగ్గానే వుంది. కాని తప్పదు.

"ఈవిడ వింధ్య అని మంచి రచయిత్రి"

"అలాగా.. ఏ వూళ్ళో వుంటుంది? "

"ఏమో తెలియదు. ఈవారం వార పత్రికలో ఆవిడ ఫోన్ నెంబరు, ఫొటో పడింది" అమల టీపాయ్‌మీద పత్రిక తీసి చూపించింది.

నిజమే ఫొటోతో సంజనా పక్కనున్న వ్యక్తి, పత్రికలో పడిన ఫొటోలోని వ్యక్తీ ఒకరే.

"ఈమె బాగా రాస్తుందా? "

"ఓ.. బ్రహ్మాండంగా!"

"ఈవిడ ఫొటో పత్రికలో పడుతూ ఉంటుందా? "

"ఎప్పుడూ లేదు. యిదే మొదటిసారి"

"ఇంతకీ ఈ నవల దేని గురించి? "

"ఏమిటో.. ఎప్పుడూ పుస్తకాలు చదువుతానని నన్ను ఏడిపించేవాడివి.. ఏమిటిది సడెన్‌గా? "

"చెప్తున్నాను కదా! క్రికెటర్లు, హీరోలు, రచయితలు.. వీళ్ళ ఫొటో మన దగ్గర వుందంటే గొప్పే కదా!"

"ఈ సీరియల్ ఈవారమే మొదలైంది. సబ్జెక్టు యింకా తెలియదు"

మర్నాడు ఆ పుస్తకం ఆ యింట్లో కన్పించలేదు. అది నీలం యింటికి చేరింది.

★ ★ ★

వింధ్య ఇంట్లో లేదు. ఉద్యోగానికి వెళ్ళింది. తను యిక్కడికి వచ్చి రెండు నెలలు అయింది. ఇన్నిరోజుల్లో రోజూ వచ్చే పనిమనిషి, ఎప్పుడైనా వింధ్య దగ్గర పది, పాతిక చేబదులు తీసుకునేవాళ్ళు తప్ప ఆ యింటికి ఎవరూ రాలేదు. ఆంటీకి వచ్చే ఫోన్‌కాల్స్ కూడా అన్నీ రచనల గురించి, సాహిత్యం గురించి మినహా క్షేమ సమాచారాల గురించి కాదు. ప్రేమ వివాహం చేసుకుంటే.. విడాకులు తీసుకుంటే.. ప్రపంచం యింత పరాయిగా చూస్తుందా? రేపు తన పరిస్థితి కూడా యింతేనా? అనుకుంటోంది సంజనా.

వింధ్య ఏదో మాట్లాడుతూ ఒకసారి అంది 'సంజనా ఏ విషయంలో అయినా మనం ఫెయిలైతే మనమీద మనకి నమ్మకం పోతుంది. అందులో ఇలాంటి ప్రేమ పెళ్ళిళ్లలాంటివి అయితే మరీను. అందుకే ఎక్కువగా ఒంటరి జీవితం ఇష్టపడతాను'

సంజనా ఆలోచిస్తోంది. తను వచ్చి రెండునెలలు అయింది. వచ్చేనాటికి, ఇప్పటికి తనలో చాలా మార్పు. ఆలోచనల్లో, మాటల్లో, నడవడిలో.. ఇలా తనలో మార్పు తనకి తెలియకుండానే జరిగింది. అయితే 'మంచికే' అని కచ్చితంగా చెప్పవచ్చు. ఆంటీ తనని ఇంత బాగా చూసుకున్నందుకు, తనకి యింతమంచి జీవితం రుచి చూపించినందుకు ఆమెకు ఇష్టమైన అంకుల్‌ని బహుమతిగా యివ్వాలి. ఆమె టేబుల్, సొరుగులు, షెల్ఫ్‌లు వెతకసాగింది. వింధ్య ఫోటోలు ఏవో వున్నాయి కానీ వాటిలో అంకుల్ లేడు. అసలు ఆంటీ లేనప్పుడు ఇంటిని ఇలా సోదా చేయవచ్చా? కానీ ఏ ప్రయత్నం చేయకుండా అంకుల్ ఎవరో ఎలా తెలుస్తుంది? టైము గడిచేకొద్దీ సంజనాకి పట్టుదల పెరుగుతోంది. బీరువాకి తాళం తగిలించే వుంది. కానీ బీరువా తెరవడానికి ఆమెకు ధైర్యం చాలడం లేదు. పుస్తకాల అర తెరిచే వుంది. ఆమె పుస్తకాలన్నీ అటూ ఇటూ చేసి చూడసాగింది. పై అరలో పుస్తకాల వెనుక మంచి గంధంతో చేసిన ఫొటో ఫ్రేం. దానిలో పెళ్ళి దండలతో వింధ్య, పక్కనే ఆమె భర్త. దాదాపు ఇరవైమూడేళ్ల క్రితం ఆంటీ ఇంత అందంగా వుండేదా? ఇప్పుడు మాత్రం ఆమెకు ఏం తక్కువ? ఆ కళ్ళజోడు తీసేసి కొద్దిగా మేకప్ చేస్తే ఆమె అందానికేం తక్కువ? ఇంక అంకుల్ కూడా బాగానే ఉన్నాడు. ఆయన్ని ఎక్కడో చూసినట్టుగా ఉంది. కానీ గుర్తు రావడంలేదు. ఆమెకు సంతోషంగా వుంది. అంకుల్‌ను ఫొటోలో అయినా చూడగలిగింది. ఫొటో దొరికినట్టే మనిషీ దొరకవచ్చు.

★ ★ ★

నీలం రెస్ట్‌లెస్‌గా వున్నాడు. అనుకోకుండా అఖిల్ ద్వారా సంజనా ఎక్కడ వున్నది తెలిసింది. తెలిసి ఏం చెయ్యగలడు? సంజనా సైగ చేస్తున్నా వినకుండా వాళ్ళ డాడీ షరతులన్నిటికీ ఒప్పుకున్నాడు. ఇప్పుడు సంజనాకి ఫోన్‌చేస్తే బాగుంటుందా? అయినా ఏమిటీ పరీక్షలు? వాళ్ళకి ఇష్టమైతే పెళ్ళి చేయాలి, లేకపోతే మీదారి మీరు చూసుకోండి అనాలి. అయినా ఎందుకీ నిరీక్షణ? పోనీ వదిలివేస్తే? ఛ! ఏమిటీ ఆలోచన! ఆమె ప్రేమకోసం ఒకప్పుడు ఎంత తహతహలాడాడు? ఇప్పుడు ఆమె దూరంగా వున్నా మరచిపోలేకపోతున్నాడు. ఈ రెండు నెలల్లో సంజనా అభిప్రాయం మారి

వుంటే? పోనీ అదైనా తెలుసుకోవాలిగా.
"ఏమిట్రా.. అలా కూర్చున్నావు? "
"అబ్బే, ఏం లేదు మామయ్యా. నువ్వెంతసేపయింది వచ్చి, ఎవరు తలుపు తీశారు? "
"యిప్పుడే వచ్చాను. యాదయ్య తలుపు తీశాడు. ఇదిగో ఈ ఫొటో చూడు. మా కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గారి అమ్మాయి. నీకు ఇష్టమైతే చూద్దాం"
"నాకెందుకు ఇష్టం కావడం? "
పరిశీలనగా చూశాడాయన మేనల్లుడి వైపు.
"అలా చూస్తావేమిటి మామయ్యా? "
"లేకపోతే ఏమిటి.. ఒకమ్మాయి ఫొటో అబ్బాయికి ఎందుకిస్తారు? హౌస్ సర్జె న్‌గా చేస్తోంది"
"నాకు ఇష్టం లేదు మామయ్య"
"ఏం.. ఎందుకని? "
"ప్రత్యేకంగా కారణం ఏమీ లేదు" నీలం అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

★ ★ ★

సంజనా సోఫాలో కూర్చుని ఏదో కుడుతోంది. ఇంతలో ఫోన్ మోగింది. అట్నుంచి వింధ్య. "సంజనా! నా గురించి ఎదురు చూడకు. అమ్మకు జ్వరంగా వుందిట. ఒకసారి చూసి వస్తాను" అని చెప్పి ఫోను పెట్టేసింది.
తనకి మంచి అవకాశం దొరికింది. నీలంతో మాట్లాడి ఆ అంకుల్ సంగతి తెలుసుకోమనాలి. కానీ ఫోను చేయడం షరతులకు విరుద్ధం. కానీ ఇలా ఫోన్ చేసేది తనకోసం కాదు. ఆంటీ కోసం. ఆమె సందేహిస్తూ సర్దిచెప్పుకుంటూ నీలంకి ఫోన్ చేయసాగింది. ఎంగేజ్ వస్తుంది ఫోన్. విసుగ్గా ఫోన్ పెట్టేసింది. వెంటనే ఫోన్ మోగింది. చిరపరిచితమైన గొంతు. చిరకాలం ఎదురుచూస్తోన్న పిలుపు.
"నువ్వేనా.. నువ్వేనా..? " సంజనా గొంతులో ఒణుకు.
"నేనే.. నీలంని"
"ఇన్నాళ్ళకు నేను గుర్తొచ్చానా? "
"కాదు, ఎక్కడ వున్నది తెలిసింది"
"ఎలా తెలిసింది ఈ ఫోన్ నెంబరు? "
"అదంతా పెద్దకథలే, ఎలా వున్నావు? "
"బాగున్నాను" అంది సంజనా.
"నేనైతే ఏం బాగాలేను"
"అందుకే నేను ముందే చెప్పాను. ఈ పరీక్షలూ అవీ వద్దని. నువ్వేదో గ్రీకు వీరుడినను కున్నావు"
"నువ్వు వుండేది ఏ ప్రాంతం? ఎవరింట్లో? వాళ్ళతో కలిసి వుండగలుగుతున్నావా? "
"ఓ.. ఈ ఇంట్లో వుండే అబ్బాయితో స్నేహం ఏర్పడింది"



"ఏయ్ నిజం చెప్పు.. అతనేం చదువుకు న్నాడు? "

"మెడిసిన్"

"పేరూ? "

"రెడ్"

"అదేం పేరు? "

"మరి నీ పేరు.. నీలం బాగుందా? " నవ్వింది సంజనా.

"అబద్ధాలు చెప్పడానికి నేనే దొరికానా నీకు? ఇంట్లో ఎవరూ లేనట్టున్నారు? "

"ఆ విషయం నీకెలా తెలుసు? "

"ఇది ల్యాండ్‌ఫోను. ఇంట్లో అందరూ వుంటే వాళ్ళబ్బాయితో స్నేహం ఏర్పడిం దని నువ్వు ఎలా చెప్పగలవు? "

"నీ లాజిక్ బాగుంది. ఇంతకీ ఎక్కడి నుండి నువ్వు? "

"హైదరాబాద్ నుండి. అదంతా సరే.. నీకేం అన్పించడం లేదా? ఆ పల్లెటూరిలో బాగుందా? "

"బాగుంది"

"బాగుందా? నేను గుర్తు రావడం లేదా? "

"ఈ వూరు, యిల్లు, వాతావరణం బాగు న్నాయి. నువ్వు గుర్తురావడం వేరే విషయం. మా ఇంట్లో లేని ప్రశాంతతను అభిమానాన్ని ఇక్కడ చూశాను" వింటూన్న నీలంకి బాధగా వుంది.

"ఎవరు అంత అభిమానం చూపించే వ్యక్తి? " అడిగాడు.

"మా ఆంటీ" అంది సింపుల్‌గా సంజనా.

"ఆంటీయా? "

"అవును. ఈ ఇల్లు, ఫోను ఆవిడవే. ఆవిడ మా అమ్మ ఫ్రెండ్"

"ఆవిడ పేరు వింధ్య కదూ!"

"అవును, హైదరాబాద్‌లో కూర్చుని



ఇక్కడి ఇన్ఫర్మేషన్ బాగానే తెలుసుకుంటున్నావే. ఇంతకీ ఎందుకు ఫోన్ చేశావ్? "

"చెప్పానుగా, మీ డాడీ నిన్ను హైదరాబాద్ రమ్మనేలోగా నువ్వు ఎక్కడున్నదీ తెలుసుకుంటానని. మాట్లాడవేం సంజనా? "

"నన్ను ఆలోచించుకోని నీలం"

"అంటే? "

"అవును నీలం, ఇలా పెద్దవాళ్ళని ఎదిరించి, వాళ్ళని బాధపెట్టి చేసుకునే పెళ్ళిళ్ళు సక్సెస్ అవుతాయా అన్పిస్తోంది"

"నిజం చెప్పు, ఈ అభిప్రాయానికి నువ్వు రావడానికి కారణం? అక్కడ మెడిసిన్ చదువుతున్న అబ్బాయి వున్నాడా? "

"ఛ! పాపం ఈ ఆంటీకి పిల్లల్లేరు. నేను వచ్చేదాకా ఆవిడ ఒంటరిగా వుంటున్నారు"

"మరి అంకుల్? "

"విడాకులు తీసుకున్నారు"

"ఎందుకు? "

"వీళ్ళది ప్రేమవివాహం. ఆంటీ తన వాళ్ళందరినీ వదులుకుని అంకుల్‌ని చేసుకున్నారు. అంకుల్ తల్లికి ఈ పెళ్ళి నచ్చలేదు. తగాదాలు ఎక్కువై వాళ్ళు విడిపోయారు"

"దానికి, మనం పెళ్ళి చేసుకోకపోవడానికి సంబంధం ఏమిటి? "

"మనం మాత్రం అలా విడిపోమని నమ్మకం ఏమిటి? "

"ఆ భయం నీకు అక్కర్లేదు. నాకు తల్లి లేదు"

"ఛ.. నా అభిప్రాయం అది కాదు"

"ఏదైనా సరే.. ఇంతదాకా వచ్చేక ఇప్పుడు విడిపోతే విడిపోవడం కాదా? "

"అది మనకే పరిమితం. ఆ బాధ మనలోనే వుండిపోతుంది. రెండు కుటుంబాల పరువు పోదు"

"నువ్వు చెప్పేది నాకు కన్విన్సింగ్‌గా లేదు సంజనా? "

"ఏమో.. ఇక్కడ చాలా టైము ఒంటరిగా వుంటాను. ఆలోచించగా ఆలోచించగా ఈ ప్రేమ పెళ్ళిళ్ళకన్నా పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు నయమన్పిస్తోంది" చెప్తూంటే ఆమె గొంతులో జీర.

"సంజనా!" ఇంక ఆపమన్నట్టు అరిచాడు నీలం. "ఇలా బాధపడిపోతూ విడిపోవడం అవసరమా? ఎప్పుడో ఏదో జరుగుతుందని ఇప్పటి ఆనందాన్ని వదులుకోవడం ఫూలిష్‌నెస్" అన్నాడు నీలం.

"చెడు జరుగుతుందని తెలిసినప్పుడు ముందే జాగ్రత్త పడటం మంచిది కదా!"

"ఏం చెడు జరగదు. దీన్ని నువ్వు అతిగా ఊహించుకుంటున్నావ్"

"అయినా ఇవన్నీ నీకెవరు చెప్పారు.. మీ ఆంటీయా? "

"లేదు.. ఆవిడ ఇతరుల గురించి తను నిర్ణయం తీసుకునే వ్యక్తి కాదు"

"మరి ఎందుకీ ఆలోచన? "

"నాకే అన్పించింది. ఈ ప్రేమ పెళ్ళిళ్ళ వల్ల సెక్యూరిటీ వుండదని"

జుట్టు పీక్కోవాలన్పించింది నీలంకి. రామకృష్ణని మెచ్చుకోవాలి. అతను అనుకున్నది సాధించాడని మనసులో అనుకుంటూ అతడేదో చెప్పబోయేసరికి గేటు చప్పుడైంది.

"ఆంటీ వచ్చింది నీలం. మనం తర్వాత మాట్లాడదాం"

సంజనా ఫోన్ పెట్టేసి తలుపు తీసింది. భోజనంతోపాటు ఆంటీ పెట్టే ఆప్యాయమైన చీవాట్లు ఆదరంగా తింది సంజనా.

★ ★ ★

"ఏమండీ.. ఎన్నాళ్ళు సంజనాని అక్కడ వుంచుతాం? తీసుకొచ్చేద్దాం" అంది భార్గవి.

"ఏం.. తను వచ్చేస్తానని అందా? "

"లేదు"

"పోనీ, మీ ఫ్రెండు తీసుకుపొమ్మన్నారా? "

"ఛ.. తను ఎప్పటికీ అలా అనదు"

"మరి నీకెందుకు తొందర? "

"సంజనా లేకపోతే ఏం తోచడంలేదు"

"నీకు తోచకపోయినా ఫర్వాలేదు. తను ఏం చేస్తోందో తనకి తెలియాలి"

"పోనీ మీరు ఫోన్‌చేసి ఒకసారి మాట్లాడండి"

"ఊహు... అది అక్కడికి వెళ్ళాక ఒక్కసారైనా నాతో మాట్లాడిందా? "

"కేవలం పెళ్ళి గురించేకాదు. ఖరీదైన వస్తువులు ఏవీ లేకుండా దానికి బతకడం రావాలి"

"మీరు చేస్తున్నది నాకు అర్థం కావడం లేదు. మన గారంకొద్దీ ఐశ్వర్యం చూపించుకోవడానికి పిల్లలకి అన్నీ అలవాటు చేయడం, ఆ తర్వాత వాళ్ళకి కోరికలు ఎక్కువయ్యాయని ఆ జీవితం దూరం చేయడం.. బాగుంది"

"ఈ సౌకర్యాలన్నీ అది వెళ్ళే ఇంట్లో వుండాలిగా? "

"మన అంతస్తుకి తగ్గ సంబంధమే చేయండి"

"అది ఒక సామాన్యుణ్ణి ప్రేమించిందిగా. భార్గవీ నీ దగ్గర దాచడం

ఎందుకు? నేను నీలం కుటుంబం గురించి వాకబు చేశాను. అతడు చెప్పినవన్నీ నిజాలే. వాళ్లింట్లో మామయ్య, ఇతనే వుంటారు. వీళ్ళకి వంటకి పనికి కలిపి ఒక నౌకరు"

"అయితే నీలంకి ఇచ్చి చేస్తారా? " ఆశగా అడిగింది భార్గవి.

"చూద్దాం, సంజనా ఊరినుండి రానీ"

భార్గవికి సగం అర్థమైంది, సగం కాలేదు. పోనీలే సంజనా ఒక్కగానొక్క కూతురు. దానికి నచ్చిన సంబంధం చేస్తే సంతోషిస్తుంది.

★ ★ ★

నీలం మళ్ళీ ఫోన్ చేశాడు. "ఏమిటి సంజనా ఇది? నువ్వు రెండురోజుల క్రితం మాట్లాడినది నాకేం అర్థం కాలేదు"

"అర్థం కాకపోవడానికి ఇదేమన్నా అద్వైతమా? "

"రచయిత్రి ఇంట్లో వుండి సంజనాకి భాష ఎక్కువైంది" అనుకున్నాడు నీలం.

"నాకు పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకోవడం ఇష్టం అని చెబుతున్నాను"

"మన పెళ్ళికి పెద్దవాళ్ళు ఒప్పుకుంటే నీకేం అభ్యంతరం లేదుగా? " అన్నాడు నీలం.

"వాళ్ళకి అభ్యంతరం వుండబట్టే కదా మనం ఇలా ఫోన్లు చేసుకోవలసి వచ్చింది"

"నీలం, నా మనసు విప్పి చెబుతున్నా విను. నన్ను మా డాడీ ఇక్కడికి పంపిన కారణం నెరవేరింది. వింధ్య ఆంటీ నీకు పరిచయం లేదు, నీకు తెలియదు. ఆమె చాలా మంచి వ్యక్తిత్వంగల వ్యక్తి. మా అమ్మఫ్రెండ్ అయినా ఇంత బాగా ఆమెను పరిశీలించే అవకాశం నాకు రాలేదు. ఆడ వాళ్ళల్లో అయినా, మగవాళ్ళల్లో అయినా ఒక 'గ్రేస్' వుండాలి. వింధ్య ఆంటీలాంటి మంచి మనిషినే అంకుల్ దూరం చేసుకున్నాడంటే ఎన్నో తేడాలున్న మనం కలిసి వుండగలమా? "

"అయ్యిందా నీ అనుమానాల లిస్ట్. ఎంతసేపూ విడిపోయిన వాళ్ళ గురించి మాట్లాడతావుగానీ కలిసున్న వాళ్ళ గురించి మాట్లాడవేం? "

సంజనా ఏదో అనబోయింది. వింధ్య రావడంతో ఫోన్ పెట్టేసింది.

★ ★ ★

"సంజనా! ఏం అలా వున్నావ్? ఏదో చెప్పాలని సందేహిస్తున్నావ్"

అప్పుడే వాన కురిసి వెలిసింది. చల్లగా వున్న ఆ సాయంత్రం వేళ వేడిగా మిరప కాయబజ్జీలు చేసింది వింధ్య. మధ్యాహ్నం నుంచి సంజనా ఏదో ఆలోచిస్తున్నట్టు

ఎందుకు వున్నదో అర్థం కాలేదు. అందుకే అడిగింది.

"ఆంటీ మీతో ఒక విషయం చెప్పాలి. నీలం ఈమధ్య రెండుసార్లు ఫోన్ చేశాడు"

"అసాధ్యుడే, ఈ ఫోన్ నెంబరు ఎలా తెలిసింది? "

"ఎలా తెలుసుకున్నాడో ఏమో! నేను మాత్రం ఇవ్వలేదు"

"నువ్వు ఇవ్వవని తెలుసు నాకు"

"మీరు రచయిత్రి అని, నేను మీ ఇంట్లో వున్నానని తెలుసుకున్నాడు"

వారపత్రికలో తన ఫోన్ నెంబరు చూసి ఉండవచ్చును. అయినా సంజనా తన ఇంట్లో వున్నట్టు ఎలా తెలిసింది?

"సరే ఇంతకీ ఏమంటాడు? "

"మామూలు విషయాలతోపాటు మా పెళ్ళి విషయం కూడా మాట్లాడాం"

"నువ్వేం అన్నావు? "

"మా ఇద్దరికీ పెళ్ళి కుదరదని చెప్పేశాను"

వింధ్య నిర్ఘాంతపోయింది. "అలా ఎందుకు చెప్పావు సంజనా? "

"అవును ఆంటీ ఆలోచించగా ఆలోచించగా డాడీ చెప్పింది నిజమే అన్పిస్తోంది. నీలంకి ఒక కుటుంబమంటూ లేదు. అతనిలాంటివాళ్ళు తొందరగా బంధనాలు వదులుకోగలరు. ఇటు మావాళ్ళకీ అతను నచ్చలేదు. ఒక్కతే అమ్మాయినని నన్ను ఎంతో గారంగా పెంచారు. ప్రేమగా చూశారు. ఈ పెళ్ళి చేసుకుని వాళ్ళని ఎందుకు బాధపెట్టాలి? "

"నేను నీలంతో మాట్లాడనా? " అంది వింధ్య.

"వద్దు ఆంటీ. నీలంతో ఇప్పుడు మాటలు అవసరం లేదు. మూడేళ్ళుగా ఎన్నో జ్ఞాపకాలు పోగేసుకుని ఇప్పుడు అతన్ని మరచిపోయి వేరే పెళ్ళి చేసుకొనే ధైర్యం లేదు. అందుకే ఏ పెళ్ళీ వద్దు. ఇలా ఒంటరిగా వుంటేనే బాగుంటుం దేమో!"

చాలాసేపు వింధ్య మాట్లాడలేదు. తను అనవసరంగా ఈ సంజనాని అట్టిపెట్టుకుందా? తనని చూసి సంజనా బుద్ధి తెచ్చుకోవాలనుకుంటే.. ప్రాణం నిలబెట్టే వైద్యం వికటించి ప్రాణంమీది కొచ్చినట్టు ప్రేమ వద్దంటే, ఆమె పెళ్లే వద్దంటోంది. ఇప్పుడెలా? భార్గవి ఏమనుకుంటుందో? అసలే తనమీద రామకృష్ణకు మంచి అభిప్రాయం లేదు. ఇప్పుడు ఇంక గొడవలు కూడా అవుతాయా? ఈమధ్య కాస్త ప్రశాంతంగా వున్న మనసు మళ్లీ ఆందోళనపడ సాగింది.

★ ★ ★

నీలం మళ్ళీ ఫోన్ చేశాడు. "ఏం సంజనా.. ఏం ఆలోచించావ్? "

"నా నిర్ణయంలో మార్పులేదు"

"అబ్బ ఏమిటి సంజనా యిది? ఎంతసేపూ నీ మాట నీదేనా? పోనీ నీ అనుమానానికి ఆధారం వుందా? "

"ఆంటీ జీవితమే ఆధారం"

"ఎంతసేపూ ఆంటీ ఆంటీ. నా గురించి ఆలోచన రాదా?

"రాదు. ఆవిడ ఒంటరితనం పోగొట్టాలి. అందుకు నేను ప్రయత్నం చేయాలి. నాకసలు ఆవిడని వదిలిపెట్టి మా యింటికి కూడా వెళ్ళాలని లేదు"

"నువ్వు మీవాళ్ళకి ఒక్కతే అమ్మాయివని మర్చిపోయావా? "

"అమ్మకి డాడీ వున్నారు. నాయనమ్మకి కొడుకు, కోడలు వున్నారు. ఆంటీకి డబ్బు, హోదా, అంతస్తులు ఇవి కూడా లేవు"

"సరే.. నీ సహాయం ఆవిడకి అక్కరలేకపోతే? "

"ఆవిడకి నా సహాయం అక్కరలేదు. ఇన్నాళ్ళు ఆవిడ ఒంటరిగానే వున్నారుగా. కేవలం ఆమె మీద అభిమానంతో నేను

చేస్తున్న ఆలోచనలు యివి. యిక్కడికి వచ్చాక నాకు ప్రపంచం గురించి, ప్రకృతి గురించి, ప్రేమ గురించి తెలిసింది. ప్రేమ గురించి మాట్లాడడం అంటే కలిసి కట్‌లెట్‌లు తినడం కాదు, బాధ్యతగా వుండటం"

"నాకు బాధ్యత లేదంటావా? "

"నీకే కాదు.. నాకూ లేదు. వుంటే అలా పిచ్చిపిచ్చి జవాబులు చెప్పేదాన్నికాదు"

"సరే, అయితే యింతకీ ఏమంటావ్? "

"ఎన్నిసార్లు చెప్పినా ఒకటే.. నా మనసు పెళ్ళికి అంగీకరించడం లేదు"

"పోనీ ఒక పనిచేస్తే.. ఆంటీని మన దగ్గర అట్టిపెట్టుకుంటే? "

"వెరీగుడ్! ఈ ఆలోచన బాగుంది. ఆంటీని ఆమె భర్తను మనం కలిపితే? అది ఇంకా బాగుంటుంది కదా" తనకి వచ్చిన ఆలోచనే నీలంకి రావడం సంజనాకి సంతోషం కలిగిస్తోంది.

"వాళ్ళిద్దరూ కలిసివుంటే నేను ఆవిడని ఒంటరిగా వదిలేశానని బాధ వుండదు"

"బాగానే వుంది, కానీ ఆయన ఎలా వుంటారో? ఎక్కడుంటారో తెలియదే? "

"ఆయన హైదరాబాద్‌లోనే వుంటారుట"

"బాగుంది. ఆయన కోసం చార్మినార్ ఎక్కి 'అంకుల్' అని అరవమంటావా? "

సంజనా నవ్వేసింది. "కాదు, వింధ్యాంటీ ఫోన్ నెంబరు ఎలా తెలుసుకున్నావో ఇది కూడా అలాగే తెలుసుకో"

"నువ్వు యిలా దొరకడంలో నా కృషి వుంటే వుండొచ్చు కానీ, అదృష్టం ఎక్కువగా వుంది. ఆయన పేరైనా తెలియకుండా.."

"నాకూ తెలియదు, కానీ తెలుసుకుంటాను" అంది సంజనా.

అంకుల్ పేరు ఏమిటి అని అడిగితే వింధ్య చెప్పకపోవచ్చు. ఎందుకు, ఏమిటి అని సందేహాలు వస్తాయి. సంజనా కళ్ళతోనే పెళ్ళి శుభలేఖ కోసం వెతికింది. ప్రేమ పెళ్ళిళ్ళకి శుభలేఖలు వేయరని ఆమెకు తెలియదు.

★ ★ ★

వింధ్య భార్గవికి ఫోన్ చేసింది.

"ఏమిటి వింధ్యా విశేషాలు? " కుశల ప్రశ్నలయ్యాక అడిగింది భార్గవి.

"నీలం సంజనాకి ఫోన్‌చేశాడు భార్గవి"

"అలాగా.. నీ ఫోన్ నెంబరు ఎలా తెలిసింది? " ఆశ్చర్యంగా అడిగింది భార్గవి.

"ఎలా తెలిసిందో నాకు తెలియదు"

"ఫోన్ చేసినట్టు ఎవరు చెప్పారు? "

"సంజనాయే చెప్పింది. కానీ తను నీలం విషయంలో అభిప్రాయం మార్చుకున్నట్టు వుంది"

"అంటే అతడిని చేసుకోదా? "

"అసలు పెళ్ళే చేసుకోదుట"

"అదేమిటి? ఎందుకు ఆ నిర్ణయం తీసుకుంది? "

"అదే తెలియదు భార్గవి. నీతో యిలా చెప్పినట్టు సంజనాతో చెప్పేస్తాను. దాచవలసింది ఏమీ లేదు. నిజానికి అతను ఫోన్ చేసిన రెండుసార్లు నేను యింట్లో లేను. అయినా సంజనా నాతో చెప్పింది. నేను నీతో చెప్పాను"

"కానీ వాళ్ళ డాడీ నీలంతో పెళ్ళికి సుముఖంగానే వున్నారు"

"అలాగా? "

"అందరూ యిష్టపడుతున్నపుడు తనకే

మిటి అభ్యంతరం? ”

“అదే తెలియదు” అంది వింధ్య.

“ఏమిటో ఒక్కగానొక్క పిల్ల మనసులో ఏముందో తెలుసుకోలేకపోతున్నాం. యింత బాగా చూసుకుంటుంటే హాయిగా వుండక ఏమిటో ఈ పిల్లల అసంతృప్తి” నిరాశగా అంది భార్గవి.

“మనిషి ఏది, ఎప్పుడు కావాలనుకుంటాడో తెలిస్తే సమస్యే లేదు. అయినా నువ్వేం బాధపడకు. ఏది జరిగినా మన మంచికే అనుకుంటే ఏ గొడవా లేదు”

“నీ అంత బాలెన్స్‌డ్‌గా నేను వుండలేకపోతున్నాను” అంది భార్గవి.

“పరిస్థితులు అనుకూలంగా లేకపోతే వేదాంతం అదే వస్తుంది” నవ్వింది వింధ్య. కాసేపు మాట్లాడాక “సంజనాని ఏమీ అనకు.. యింక వుంటాను” అంటూ ఫోను పెట్టేసింది వింధ్య.

★ ★ ★

ప్రస్తుతం సంజనా ముందు వున్న సమస్య తన పెళ్ళి కాదు, ఆంటీ జీవితం. తనని యింత బాగా చూసుకున్న ఆంటీ ఒంటరిగా మిగిలిపోకూడదు. కానీ అంకుల్‌ను ఆంటీ దగ్గరకు చేర్చాలంటే, ఆయన ఫొటో చూసింది తను ఒక్కతె. ఆయన హైదరాబాద్‌లో వుంటాడు కాబట్టి తను యిక్కడి నుండి అక్కడికి వెళ్ళిపోవాలి. నీలం సహాయంతో అతడిని పట్టుకోవాలి. కానీ తల్లి, తండ్రీ తనని యింకా రమ్మనలేదు. మరెలా? వాళ్ళు రమ్మనేది ఏమిటి? అది తన యిల్లు. వాళ్ళు తన వాళ్ళు. తనకి కూడా ఆంటీని వదలి వెళ్ళాలని లేదు. ఇలా తను ఇన్ని రకాలుగా ఆలోచిస్తే ఏ పనీ కాదు. ఆమె యిల్లంతా తిరిగి చూసింది. ఈ రెండు మూడునెలల్లో ఎన్ని అనుభవాలు, ఎన్ని ఆలోచనలు? ఈ కుటీరంలాంటి యింట్లో, ఈ ఆశ్రమంలాంటి యింట్లో తను మానసికంగా ఎదిగింది. చాలారకాలుగా జ్ఞానోదయం అయింది. ఎదుటివారిని గురించి ఆలోచించడం వచ్చింది. రెండువందల కోసం మనుషులు ఎలా తాపత్రయపడతారో, ఒంటరితనం పోగొట్టుకుందుకు ఎంత ఘర్షణ పడతారో అర్థమైంది. ఒక్క మాటలో చెప్పాలంటే బతకడానికి ఎన్నిసార్లు చావాలో అర్థమైంది.

“సంజనా! ఏమిటి యిక్కడ నిలబడి ఆలోచిస్తున్నావు? ”

“నేను మా యింటికి, హైదరాబాద్ వెళ్ళిపోదామనుకుంటున్నాను ఆంటీ”

“ఏం.. బెంగ పెట్టుకున్నావా? ”

“లేదు. ఉద్యోగ ప్రయత్నాలు చేయాలి. లేదంటే ఎమ్.టెక్ చదువడానికి ఏర్పాట్లు చేసుకోవాలి”

“దొంగా! నీలంతో పెళ్ళికి అని చెప్పకూడదు? ”

“అది కేవలం నా చేతుల్లో లేదు. డాడీ, మమ్మీ ఒప్పుకోవాలిగా? ”

“ఏం అతనికి ఉద్యోగం వుందిగా, మీరిద్దరూ పెళ్ళి చేసుకోవచ్చు కదా!” ఆమె మనసు తెలుసుకోవాలని అంది వింధ్య.

“ఈ మధ్య కాలంలో నీలం అభిప్రాయం మారవచ్చు. నా మనసే మారవచ్చు, చూద్దాం”

“నీకు నీలం ఫోన్ చేసిన విషయం నేను భార్గవికి చెప్పాను సంజనా”

సంజనా ఆశ్చర్యపోయింది. “చెప్పడమే మంచిది ఆంటీ” అని మాత్రం అంది.

ఆ తర్వాత సంజనాయే తండ్రితో మాట్లాడి తను హైదరాబాద్ రావడానికి అనుమతి తీసుకుంది. సంజనా ఒక్కతె వూరికి రావాలా? ఆమెను ఎవరైనా తీసుకురావాలా? అని ఆలోచించారు. సంజనా తను ఒక్కతె వస్తానంది. ఆమే రాజమండ్రి వెళ్ళి రైలు టిక్కెట్, అదీ సెకండ్ క్లాసులో రిజర్వు చేయించుకుంది.

వింధ్యకి బెంగగా అన్పించింది.

"నేను మళ్ళీ వస్తాను ఆంటీ" సంజనా ఓదార్పుగా అంది.

"ఏదైనా ఒక మంచి అనుభవం మనకు తెలియనంత వరకు బాగానే వుంటుంది సంజనా. కానీ అది ఒక వసంతంలా వచ్చి వెళ్ళిపోతే మళ్ళీ ఆ రుతువు కోసం జీవిత కాలం ఎదురుచూడాలి"

సంజనా ఆలోచిస్తున్నట్టుగా అంది. "నిజమే ఆంటీ మీరు చెప్పింది. ఇక్కడికి సగం మనస్సుతో వచ్చాను. కానీ చాలా తెలుసుకుని, చాలా నేర్చుకుని వెడుతున్నాను. ఇక్కడ గడిపిన ఈ కొద్దికాలం నాకు అపురూపమైనది. ఇంత తీరికగా ఇక్కడికి మళ్ళీ నేను రాలేకపోవచ్చు. కానీ నా మనసు ఖాళీ అయిన ప్రతిసారీ ఈ జ్ఞాపకాల సంతృప్తితో పూర్ణ జీవితం గడపగలననే నమ్మకముంది. నాకులాగ పెళ్ళికాబోయే ప్రతీ ఆడపిల్లా యిలా మీలాంటి వాళ్ళ శిక్షణ తీసుకోవాలాంటీ. ముఖ్యంగా మా తరం ఆడపిల్లలు"

వింధ్య రాజమండ్రి వచ్చి సంజనాను రైలు ఎక్కించింది. చిత్రమేమంటే ఇన్నాళ్ళూ అనేక విషయాలు మాట్లాడుకున్న యిద్దరూ ఈ సమయంలో మాటలు రానివాళ్ళే అయ్యారు.

"టిక్కెట్టు జాగ్రత్త పెట్టుకున్నావుగా, వెళ్ళగానే ఫోన్ చెయ్యి" వింధ్య యిలా చెప్పడం ఏ పదోసారో అయినా సంజనాకి విసుగు రావడంలేదు. అదే తల్లి ఇంతకు ముందు చెప్పిన విషయాన్నే మళ్ళీ చెబితే విసుక్కునేది.

"ఇంత రాత్రివేళ మళ్ళీ యింటికి ఎలా వెడతారు ఆంటీ? "

"ఇప్పుడు వెళ్ళను. ఈ రాత్రి మా అమ్మ దగ్గర వుండి రేపు సాయంత్రం యింటికి వెడతాను సంజనా. నాకు పిల్లల్లేరు. పిల్లల్ని ఎలా చూడాలో తెలియదు. నా ప్రవర్తనవల్ల.." వింధ్య అంటుంటే సంజనా

ఆమె రెండు చేతులూ పట్టుకుంది.

"లేదు ఆంటీ, నా తిక్క మాటలతో మిమ్మల్ని యిబ్బంది పెట్టివుంటే ఏమీ అనుకోకండి. ఈ జీవితం ఎప్పటికీ మర్చి పోను. మీరెప్పుడు వస్తారు హైదరాబా ద్‌కి? "

"నీ పెళ్ళికి వస్తాను"

"అప్పుడు మీకు వెలకట్టలేని బహుమతి యిస్తాను" అంది సంజనా.

రైలు కదిలింది. ఆ రాత్రివేళ గోదావరి నదికి మరో రెండు ఉపనదులను గుర్తుకు తెస్తూ నీళ్ళు వాళ్ళ కళ్ళల్లో నిలిచాయి.

★ ★ ★

కారు తీసుకుని స్టేషనుకి వచ్చారు భార్గవి, రామకృష్ణ.

"ఎలా వున్నారు డాడీ? "

"బాగున్నాను, ప్రయాణం ఎలా జరి గింది? "

"బ్రహ్మాండంగా జరిగింది"

రామకృష్ణ సంతోషించాడు, కూతురు తనతో మాట్లాడుతున్నందుకు.

"ఫస్ట్‌క్లాసులో రావలసింది"

కనుబొమలు ముడివేసి చూసింది సంజనా. "ఏ క్లాసు అయినా రైలు చేరే గమ్యం ఒకటేగా" అంది.

భార్గవికి అనుమానంగా వుంది. సంజనా మారిందా? మారినట్టే కనబడు తోంది. ఇన్నాళ్ళూ ట్రిమ్ చేయని కనుబొ మలు, లిప్‌స్టిక్ వేయని పెదవులు, కుదు రుగా వేసుకున్న జడ.. ఒక సూట్‌కేసుతో వెళ్ళిన వ్యక్తి అదే కాకుండా యింకో ట్రావె లింగ్ బ్యాగ్‌తో దిగింది. అందులో ఏము న్నాయి బట్టలా? అన్ని ఎవరు కొంటారు. వింధ్యది సింపుల్ లివింగ్ తనకు తెలుసు. సంజనా మారినా ఫర్వాలేదు. అది మంచివైపు మార్పయి వుండాలి. తమకు అనుకూలంగా వుండాలి. సంజనా కారు దిగి యింట్లో అడుగు పెట్టింది. అది మామూలుగా అనే మాట. మనసు వింధ్య దగ్గర వుండిపోయింది. అది ఎవరికీ తెలి యని రహస్యం. ఇంట్లోకి రాగానే ఆమె చేసిన మొదటి పని వింధ్యకు ఫోన్ చేయడం. 'ఎలా వున్నావే? ' అని నాయ నమ్మ అడుగుతున్నా విన్పించుకోలేదు.

"క్షేమంగా యింటికి చేరాను ఆంటీ"

"హమ్మయ్య! చాలా సంతోషం సంజనా. ప్రయాణం బాగానే జరిగిందిగా? రాత్రంతా నువ్వు ఎలా వున్నావనే ఆలో చనే"

"ఏమైపోతాను ఆంటీ మీ భయంగాని"

"ఏమోనబ్బా, ఒంటరిగా ప్రయాణం చేయడం అలవాటు లేదు కదా!"

"ఏదైనా సరే ఎప్పుడో ఒకప్పుడు ప్రారంభం కావాలిగా.. అది మీరు చెప్పే మాటే"

వింటూన్న భార్గవికి, రామకృష్ణకి, నాయ నమ్మకు ఆశ్చర్యంగా వుంది. సంజనా యింత ఉత్సాహంగా, నవ్వుతూ వుండటం. "ఇంక వుంటాను ఆంటీ" అంటూ మూడు సార్లు సంభాషణ పొడిగించి ఇరవై నిము షాల తర్వాత ఫోన్ పెట్టేసింది సంజనా.



సంజనా వచ్చి పదిరోజులు అయింది. ఈ పదిరోజుల్లో ఆమె బయటికి వెళ్ళ లేదు. వూరు నుండి వచ్చానని ఎవరికీ ఫోన్ చేసి చెప్పలేదు. కంప్యూటర్, సెల్

ఫోన్ వాడలేదు. ఆమె గదిలో స్టీరియో పెద్దగా విన్పించడం లేదు. గార్డెన్‌లో మొక్కల్ని పరిశీలించడం, డైలీ పేపరుని ఆమూలాగ్రంగా పఠించడం.. ఇలా 'రాముడు మంచి బాలుడు' అన్నట్టు సంజనా మంచి బాలిక, కాదు కాదు మంచి యువతి అయిపోయింది.

"సంజనా నీకు ఫోన్"

"ఎవరమ్మా? "

"ఏమో తెలియదు" చదువుతున్న పుస్తకం పక్కనపెట్టి మాట్లాడి వచ్చింది సంజనా.

ఆమె చదువుతున్న పుస్తకం తీసి చూసింది భార్గవి. అది బుచ్చిబాబుగారి 'చివరకు మిగిలేది'.

ఇంత సీరియస్ నవల, పైగా తెలుగు నవల తన కూతురు చదవడమా? సంజనా ఫోన్ పెట్టేసి వచ్చి మళ్ళీ నవల చదువుకోసాగింది. భార్గవి ఏదో పని చేస్తోందే గానీ మనసు సంజనా గురించి ఆలోచిస్తోంది. రమ్మని చెప్పకుండా తనే వచ్చేసింది. రాగానే నీలంతో పెళ్ళికి తొందర చేస్తుందని అనుకుంది. కానీ ఆ విషయమే మాట్లాడటం లేదు. ఎందుకు? ఏం జరిగింది? నీలం, సంజనా ఫోను లోనే దెబ్బలాడుకున్నారా?

"ఎలావుంది సంజనా నీకు వింధ్య యింట్లో? " బీన్స్ ఒక బేసిన్‌లో వేసుకు వచ్చి సంజనా ఎదురుగా కూర్చుని వాటిని తుంచసాగింది భార్గవి.

"చాలా బాగుందమ్మా"

"ఆ పల్లెటూళ్లో నీకు కాలక్షేపం అయ్యేదా? "

"ఆ.. వెళ్ళిన కొత్తలో బోర్‌గా ఉండేది. అదేదో హౌస్ అరెస్ట్‌లాగా వుండేది. కానీ ఇంట్లోనే ఒక మంచి ప్రపంచం నిర్మించుకో

వచ్చని నాకు అర్థమైంది. ఆంటీతో స్నేహం ఏర్పడ్డాక టైమే తెలిసేది కాదు"

"వింధ్యతో అంతలాగ మాటలా.. ఏమి టవి? "

"సంగీతం, సాహిత్యం, సినిమాలు, రాజకీయాలు.. యిలా ఎన్నో మాట్లాడుకునే వాళ్ళం. నువ్వెప్పుడూ పాత సినిమా పాటలు విను విను అంటావ్. వాటి గురించి అంతకంటే ఎపుడైనా మాట్లాడావా? ఆంటీ ఒక్కో పాట గురించి మాట్లాడుతూంటే టైమే తెలిసేది కాదు"

"తను కాలేజీకి వెళ్ళేది కాదా? "

"ఉదయం ఎనిమిది గంటలకు వెళ్ళి ఒంటిగంటకు వచ్చేవారు. భోజనం చేసి నిద్ర పోయి లేచేవారు. అప్పటి నుండి ఒకటే కబుర్లు. ఆంటీ దగ్గర మంచి లైబ్రరీ ఉంది. ఆవిడ అలా చదువుతూ రాసుకుంటూనే ఉంటారు"

"మరి ఇంట్లో పని? "

"ఉదయం పనమ్మాయి వస్తుంది. ఉండేది ఒక్కరేగా, తొందరగా పని ముగించుకొని చదువుకుంటారు, రాసుకుంటారు"

"చివరకు మిగిలేది నవల చదువుతున్నావా? అర్థం అవుతోందా? "

"ఆ.. పుస్తకాలు ఎలా చదవాలో, వాటి గురించి ఎలా అర్థం చేసుకోవాలో, ఎలా ఆలోచించాలో ఆంటీని చూసి నేర్చుకున్నాను. పుస్తకాల గురించి మాట్లాడేటప్పుడు ఆంటీ ముఖం చూడాలి, వెలిగిపోతుంది. కళ్ళు మెరిసిపోతాయి"

"నీ సూట్‌కేసుతో పాటు యింకో బ్యాగ్ తెచ్చావే? "

"అందులో ఆంటీ ఇచ్చిన బుక్స్, నీకివ్వవలసిన చీర.. యిలా చాలా వున్నాయి"

"నాకు చీర ఎందుకు? "

"నేను వద్దనే అన్నాను. కానీ ఆంటీ ఒక ప్లెయిన్ చీర కొని దానిమీద డిజైను వేసి ఇచ్చారు. దానిమీద పెయింటు చేసి నీకు ఇమ్మన్నారు"

'బాగుంది. ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరవుతారు అనే సామెత నిజం కాబోతోందా? ' అనుకుంటూ భార్గవి వంట చేయడానికి లేచింది.

★ ★ ★

సాయంత్రం నీరెండ ఆహ్లాదంగా ఉంది. మధ్యాహ్నం వానకురిసి, వెలిసి, మత్తుగా, చల్లగా వుంది వాతావరణం. కొద్దిగా వచ్చే ఎండలో కొమ్మలు, రెమ్మలు, ఆకులు తడిసిపోయి హోలినాటి చిన్నపిల్లల్లా ఉన్నాయి చెట్లు.

ఆ తడిపొడిగా ఉండే డాబాపై కుర్చీ వేసుకు కూర్చుని 'మిథునం' చదువుతోంది సంజనా. యింతలో వింధ్య ఫోన్. భార్గవి తీసుకుంది. "ఫోన్ సంజనా కివ్వు" అంది వింధ్య.

"ఏమిటి మీ ఇద్దరి మధ్యా మాటలు ఎక్కువయ్యాయి? "

"అదంతేలే" ఫోను సంజనా తీసుకుంది.

"ఎలా వున్నారు ఆంటీ? "

"బాగానే ఉన్నాను. నువ్వెలా వున్నావు? "

"బాగున్నాను. మీరు ఇచ్చిన పుస్తకాలు చదువుతున్నాను"

"చివరకు మిగిలేది అయిపోయింది"

"ఎలావుంది? "

"బాగుంది. అసలు ఆ క్లైమాక్స్ వూహించం కదా!"

వింధ్య నవ్వింది. "అంత గొప్ప నవల నా లైబ్రరీలో ఉందనుకోవడం గొప్పగా ఉంటుంది"

"ఇప్పుడు మిథునం చదువుతున్నాను ఆంటీ"

"ఏ కథ నచ్చింది? "

"అన్నీ బాగున్నాయి. దేనికదే సాటి"

"అవును తెలుగు భాషలో ఇంతమంచి పుస్తకాలు వున్నందుకు మనం గర్వపడాలి"

"నాకు దిగులుగా ఉంది ఆంటీ! మీరు ఇచ్చిన పుస్తకాలు చదవడం అయిపోతే ఎలా? "

నవ్వేసింది వింధ్య. "నువ్వున్నది హైద రాబాద్‌లో.. అడవిలో కాదు. నీకిప్పుడు తెలిసింది కాబట్టి నువ్వే సెలెక్ట్ చేసుకుని మంచి పుస్తకాలు కొనుక్కోవచ్చు"

"అవునాంటీ.. ఏమిటో మీ సలహా లేనిదే ఇంత చిన్నవిషయం తెలియలేదు"

"ఫర్వాలేదులే. ఆ.. అన్నట్టు నీలం ఫోన్ చేశాడు. నువ్వు హైదరాబాద్ వెళ్ళి పోయినట్టు చెబితే ఆశ్చర్యపోయాడు. నువ్వు అతనికి ఎందుకు చెప్పలేదు? "

"ఏమో ఆంటీ చెప్పాలన్పించలేదు"

"పాపం! అతడి మాటలు వింటూంటే బాధన్పించింది. సంజనా ఒకమాట గుర్తు చేయనా? "

"ఏమిటి ఆంటీ అది? "

"నువ్వు వచ్చిన రోజు నేను నీతో అన్న మాటలు. చాలామందికి ప్రేమించడం రాదు. అది వాళ్ళ దౌర్భాగ్యం, చాలా మందికి ప్రేమను స్వీకరించడం రాదు. అది వాళ్ళ దురదృష్టమని చెప్పాను. నువ్వు ఈ రెండు కేటగిరీల్లోకి రాకూడదని ఆశ నాకు. ఏమీ మాట్లాడకుండా మౌనంతో ఎదుటివారిని అయోమయానికి గురి చేయవద్దు. నువ్వు యిక్కడ లేవని, ఆ వూళ్ళోనే ఉన్నావని తెలియగానే అతని గొంతులో ఆశ్చర్యం చూడాలి. బహుశా ఆ కళ్లల్లో, మనసులో చెప్పలేని బాధ ఉండాలి. ఎవరినీ బాధకి గురిచేయడం మన పద్ధతి కాకూడదు. ఇంక ఉంటాను"

★ ★ ★

ఆ మర్నాడు ఒక ఆశ్చర్యకరమైన సంఘ టన జరిగింది. నీలం సంజనా ఇంటికి వచ్చాడు. ఆ సాయంత్రం ఎందుకో రామ కృష్ణ ఇంట్లోనే ఉన్నాడు. తల్లితండ్రులతో ఏదో మాట్లాడుతూ ఫ్రూట్ సలాడ్ తింటోంది సంజనా.

"రండి. లోపలకు రండి" అంది భార్గవి నీలంను చూసి. దాదాపు మూడు నెలల తర్వాత అతడిని చూస్తోంది సంజనా.

భుజాలదాకా వేలాడే జుట్టు చక్కగా కత్తిరించుకున్నాడు. ప్లెయిన్ కలర్‌షర్ట్, డార్క్‌కలర్ పేంట్, షేవ్ చేసుకుని అందంగా వున్నాడు.

"లోపలకు రా" అని రామకృష్ణ పిలవ డంతో వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

భార్గవి అతనికి ఫ్రూట్ సలాడ్ తెచ్చి ఇచ్చింది.

"మీతో మాట్లాడాలని వచ్చానంకుల్"

"మాట్లాడు"

"మీరన్నట్టుగా సంజనా నేను ఫోన్స్ చేసుకోలేదు, కలుసుకోలేదు. అసలు తను ఈ వూరు వచ్చిన విషయమే తెలియదు. ఇప్పటికైనా మా పెళ్లి విషయంలో మీ అభిప్రాయం చెప్పండి? "

"నేను ఈ సంబంధాన్ని అంగీకరిస్తు న్నాను. మీ మామయ్యతో మాట్లాడి ముహుర్తాలు పెట్టుకుందాం"

"కానీ, నాకు ఇష్టం లేదు డాడీ"

"ఏం.. ఎందుకు? "

"ఈ ప్రేమ వివాహాల మీద నమ్మకం పోయింది. అసలు పెళ్లే చేసుకోవాలని లేదు"

"ఆ.. అవేం మాటలు సంజనా? "

"అవును డాడీ ప్రేమించామన్న మనసుకి విలువ లేదు. అందరి ఎదుట పెళ్లి చేసుకున్న పెళ్లికి విలువ లేదు. అందుకే నాకు ఆ రెండింటి మీదా నమ్మకం పోయింది"

"ఇదొక వైరాగ్యం లాంటిది, సంజనా. ఏదైనా తీవ్ర భావోద్వేగానికి గురైనపుడు వైరాగ్యంతో కొందరు పెళ్లి చేసుకోకూడదని అనుకుంటారు" అన్నాడు రామకృష్ణ.

"ఇది అలా అనుకోవడం కాదు డాడీ, నిర్ణయం"

"అదే అంకుల్, నేను ఫోన్ చేసినప్పుడు ఇలాగే మాట్లాడింది" అన్నాడు నీలం.

"మీరు ఫోన్స్ చేసుకున్నారా? "

"చేసుకున్నాం"

"మరి ఇందాకా చేసుకోలేదన్నావ్? "

"నిజమే అంకుల్.. కానీ సంజనా ఎక్కడుందో కనుక్కుంటానని తనతో ఛాలెంజ్ చేశాను. అందుకని చేయవలసి వచ్చింది"

"నీకు నెంబరు ఎలా తెలిసింది? "

తనకి ఫోన్ నెంబరు ఎలా తెలిసిందో చెప్పాడు నీలం. వింటున్న సంజనా ఆశ్చర్యపోయింది. వెళ్లక వెళ్లక ఆంటీతో బయటకు వెడితే ఇంత జరిగిందా? తనని ఫొటో తీస్తున్నట్టు తెలియనే లేదు. ఏమైనా ఆ అఖిల్ ఎవరోగానీ అతని తెలివికి జోహారు.

"అంకుల్.. ఇప్పుడు నాకు ఫోన్ నెంబరు ఎలా తెలుసు? మేమిద్దరం ఏం మాట్లాడుకున్నాం? ఇద్దరికీ నియమాలు తెలియవా? ఇదంతా వదిలేద్దాం. ఇంతకు ముందు మిమ్మల్ని, ఇప్పుడు మీ అమ్మాయిని పెళ్లికి ఒప్పించడానికి నాకు ఓపిక నశిస్తోంది. ఇలాంటివి మరో రెండు సిట్టింగ్స్ జరిగితే నేనూ పెళ్లి వద్దనడం కాదు, నేరుగా సన్యాసుల్లో కలిసేట్టు వున్నాను" అతనన్న విధానానికి సంజనా నవ్వేసింది. భర్త తిడతాడని భార్గవి నవ్వు ఆపుకుంది. రామకృష్ణకి కూతురు అలా నవ్వడం చిరాగ్గా వుంది.

"ఎందుకానవ్వు.. చేసేదంతా చేసి? "

"ఏం చేశాను డాడీ? మీరెలా వుండమంటే అలాగే వున్నానుగా. కాస్త వ్యక్తిత్వంతో వున్నందుకు వింధ్యాంటీని అంకుల్ వదిలేసారు, అలాంటి ప్రేమ ఆయనది. మీ ఎదురుగా స్వేచ్ఛగా నవ్వడానికి కూడా భయపడుతోంది అమ్మ, యిది పెళ్ళి. వీటిని నేనెందుకు నమ్మాలి? " అడిగింది సంజనా.

రామకృష్ణ మాట్లాడలేదు.

"నమ్మాలి.. నీ కోసం, నా కోసం నమ్మాలి" అన్నాడు నీలం.

"ఎందుకో నాకు నమ్మాలన్పించడం లేదు" అంది సంజనా. నీలం చివాలున కుర్చీలోంచి లేచి ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు.

సంజనా వేగంగా వీధి గుమ్మంలోకి వచ్చేసరికి అతని బైకు గేటుదాటి రోడ్డుమీదకు వెళ్లిపోయింది.

సంజనా నిరుత్సాహంగా వచ్చి సోఫాలో కూలబడిపోయింది. "నీ సంగతి నాకు అర్థం కావడం లేదు సంజనా" అన్నాడు రామకృష్ణ.

"ఏమిటీ డాడీ? "

"ఔను. నేను, మీ అమ్మ నిన్ను పట్టించుకోనట్టు, ప్రేమించనట్టు, పోయిపోయి ఆ నీలంని ప్రేమించావు. కాస్త జీవితం పట్ల అవగాహన పెరుగుతుందని ఊరికి పంపిస్తే, ఇప్పుడు పెళ్లే చేసుకోనంటున్నావు. నీలంకోసం మమ్మల్ని, ఆంటీ కోసం నీలంని ఇలా ఎవరో ఒకరిని బాధ పెట్టడమేనా.. నీ పని? కావాలంటే ఈ విషయంలో ఆంటీ సలహా కూడా తీసుకో"

"ఆవిడ పెళ్లి చేసుకోమనే చెప్పారు డాడీ"

"మరింకేమిటి అభ్యంతరం? "

రామకృష్ణ ప్రశ్నకు, సంజనా దగ్గర



సమాధానం లేదు.

★ ★ ★

సంజనా నీలంని నెక్లెస్‌రోడ్డులో కలుసుకుంది. నల్లని జీన్స్ ప్యాంట్, లేతపసుపు రంగులో స్లీవ్‌లెస్ కుర్తీ ధరించిన సంజనా అందంగా ఉంది.

"చెప్పు నీలం.. ఏదో మాట్లాడాలన్నావుగా? "

"అబ్బ! రాగానే అంత తొందరెందుకు? కాస్సేపు రిలాక్స్ అవుదాం" ఇద్దరూ

హుస్సేన్‌సాగర్ అలలని చూస్తూ కూర్చు న్నారు. 'ఒడ్డుకు వచ్చే ఈ అలలని చూస్తే వింధ్య అంటీ ఏమనేది? ఒడ్డును తాకి తిరిగిపోయే అలలు విరిగిపోయిన నా ఆశల చిహ్నాలు అనేది'

ఏమిటిది తను కొంచెం కొంచెం ఆంటీ లాగా మారిపోతున్నానా? అనుకుంది సం జనా.

"ఆవిడెవరి కోసమో నువ్వు ఒంటరిగా వుంటాననడంలో అర్థం లేదు సంజనా. అది అనవసర త్యాగం" అన్నాడు నీలం.

"అంత పెద్దమాట ఎందుకులే. మా అమ్మ తన బంధువుల గురించి చెబుతూం డేది. ఇద్దరు అక్కచెల్లెళ్లు వుండేవారుట. అక్కకు కళ్లు కన్పించవని చెల్లెలు, ఆవిడను చూసుకోవడానికి పెళ్లి మానేసిందట. అది త్యాగం కాదు, మానవత్వం"

"కానీ మీ ఆంటీ ఆరోగ్యంగానే వున్నారు. సొంత ఇల్లు వుంది. ఉద్యోగం వుంది. ఇంకేం కావాలి? "

"ఇప్పుడు ఆవిడకి ఎవరి సహాయం అక్కర్లేదు, నిజమే. రేపు ఈ బలం, ఆరోగ్యం, ఉద్యోగం వుంటాయా? భర్తా పిల్లలు లేని ఆ ముసలి వయసులో ఆవి డని ఎవరు చూస్తారు? మా నాయన మ్మకు, మా డాడీకి ఆవిడంటే ఇష్టం లేదని అమ్మ ఆవిడను ఇంటికి పిలవదు. కానీ నన్ను నమ్మకంగా పంపించడానికి మొదట గుర్తుకు వచ్చింది ఆవిడ యిల్లే. ఆవిడకి మనశ్శాంతి కల్గించడం తప్పా? "

"ఆవిడను మనతోపాటే వుండనిద్దాం అన్నానుగా!"

"మీ మామయ్యగారు ఒప్పుకోకపోతే? "

"నీకు సంజనా అని కాదు, సందేహం అని పేరు పెట్టవలసింది"

"అదికాదు నీలం.. పాపం ఆంటీ ఒంట రితనం గురించి నీకు తెలియదు. ఆవిడకి హోటలుకి వెళ్ళాలన్నా, సినిమాలకు వెళ్ళా లన్నా, ఆఖరికి ఏ వేడుకకు వెళ్ళాలన్నా బెదురుగానే వుంటుంది. అందుకే ఆంటీకి అంకుల్‌ని బహుమతిగా యివ్వాలి"

'ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకుని ఉంటే? ' సంజనా ఆలోచించసాగింది. "ఒకవేళ ఆయన పెళ్ళి చేసుకుని ఉంటే ఆయన విషయం ఆంటీకి చెప్పవద్దు"

"ఇంతకీ ఆయన పేరైనా తెలుసుకు న్నావా? "

"లేదు. ఎవరిని అడగాలో తెలియట్లేదు"

"మీ మమ్మీని అడుగు"

"చెబుతుందనే నమ్మకం లేదు"

"అయినా పేరుదేముందిలే, చాలామం దికి ఒకే రకం పేర్లు వుంటాయి"

"ఆ.. నేను ఆయన ఫొటో చూశాను" ఎక్సైటింగ్‌గా అంది సంజనా.

"ఆ ఫొటో తెచ్చావా? "

"లేదు"

"మరి ఎలా వెతుకుతాం? అంతకాలం అక్కడున్నావు.. చిన్న ఫొటో దొంగిలిం చుకు రాలేకపోయావా? "

"అది వాళ్ళ పెళ్ళిఫొటో.. ఎలా దొంగి లించమంటావ్? నీకు లాగా నాకు సెల్‌ఫో న్‌లో ఫొటోలు తీసే ఫ్రెండ్స్ లేరు. పైగా ఇన్నాళ్లూ ఆ యింట్లో వుండి దొంగతనం చెయ్యనా? "

"పోనీ ఆ ఫొటో జిరాక్స్ అయినా.."

"ఆ ఐడియా రాలేదు"

"మినీ ఇండియా లాంటి ఈ హైదరాబా ద్‌లో ఒక వ్యక్తిని ఏ ఆధారాలూ లేకుండా ఎలా కనిపెడతాం? "

"ఆయన్ని చూస్తే నేను గుర్తుపడతాను"

"కానీ అటువంటి వ్యక్తి నీకు ఎదురుప డాలిగా? సంజనా ఒకమాట చెబుతాను విను. వింధ్యాంటీ కోసం నువ్వు పెళ్ళి మానుకోవడం అర్థం లేని పని. పోనీ పెళ్ళి మానేసావే అనుకో, యింకో యిరవై ఏళ్ళు పోయాక నీకు వింధ్యాంటీ పరిస్థితే

వస్తుంది. అప్పుడు నిన్ను చూసుకోవడానికి యింకో సంజనా రావాల్సి ఉంటుంది? "

నిజమే కదా! సంజనా మాట్లాడలేకపో యింది. పరిస్థితుల గురించి నీలం తన కంటే బాగా అర్థం చేసుకున్నాడు. సంజనా పెళ్ళికి ఒప్పుకుంది.

★ ★ ★

"వింధ్యా పదో తేది సంజనా ఎంగేజిమెంటు. నువ్వు తప్పక రావాలి. ముందుగా పిలుస్తున్నాను. రైలు టిక్కెట్లు దొరకలేదు అంటే ఒప్పుకోను. లేదూ నీ టికెట్టు మెయిల్ చేస్తాను. సంజూ నిన్ను ప్రత్యేకంగా పిలుస్తుందిట"

"పిలిచినందుకు సంతోషం. కానీ ఎంగేజిమెంటుకి రాలేను. పెళ్ళికి వస్తాను"

"నువ్వు రాకపోతే నేను వూరుకున్నా, సంజూ వూరుకోదు"

"ఫర్వాలేదు, నువ్వు నచ్చచెప్పు. నాకు రాసుకునే పని వుంది"

"మళ్ళీ కొత్త నవల? "

"అవును"

"నీ సీరియల్ బాగుంది"

"థ్యాంక్స్! వుంటాను" వింధ్య ఫోన్ పెట్టేసింది.

ఎంగేజిమెంటుకి రాను అని చెప్పేసిందే గానీ, నిజానికి ఆమెకూ వెళ్ళాలనే వుంది. కానీ హైదరాబాద్ వెళితే ఎన్నెన్ని జ్ఞాపకాలు! నూతన వధువుగా ఆ వూళ్ళో అడుగు పెట్టడం, టాంక్‌బండ్, బిర్లామందిర్, దుర్గం చెరువు.. అతను, తనూ కలిసి తిరిగిన స్థలాలు, చూసిన సినిమాలు, ఎంత అందమైన రోజులవి, ఏమైపోయాయి? పెళ్ళికి ఒక్కరోజు ముందు వెళ్ళి మర్నాడు పెళ్ళి కాగానే బయలుదేరి వచ్చేయాలి. నిజానికి పెళ్ళి పనులు చేయడం ఎంత బాగుంటుంది. ఆ సందడే వేరు. ఆమె తన పెళ్ళిఫొటో తీసి చూసింది. ఈ ఫొటో ఫ్రేం మంచి గంధంతో చేసినది. ప్రత్యేకంగా మైసూరు నుండి తెప్పించి మొదటి పెళ్ళికానుకగా యిచ్చింది అతనికి. అతన్నుంచి తను విడిపోయినప్పుడు తన దగ్గర ఏమున్నాయ్? చీరలతో ఒక సూట్‌కేసు, పుస్తకాలతో ఒక అట్టపెట్టె, ఈ ఫొటో ఫ్రేం తెచ్చుకుంటున్నందుకు అతను బాధ పడతాడనుకుంది. 'పట్టుకుపో' అన్నాడతను. ఇంక సంజనా గురించి.. ఒక ఆడపిల్ల, ఐశ్వర్యవంతురాలు.. తనతో ఈ చిన్న యింట్లో వుందంటేనే తమాషాగా వుంది. సంజనా పెళ్ళికి తను వెళ్ళాలి, ఏ జ్ఞాపకాలు గుర్తొచ్చినా బాధించినా సరే. అది తనలోనే వుండనీ. సంజనాలాంటి మంచి అమ్మాయిని బాధపెట్టకూడదు. చక్కటి సీక్వెన్స్‌తో ఎన్నో నవలలు రాసిన ఆమె ఏ దారీలేని గజిబిజి ఆలోచనలను అదుపులో పెట్టలేకపోతోంది.

★ ★ ★

ఎంగేజ్‌మెంటు దగ్గరపడుతున్న కొద్దీ సంజనాకి దిగులు పెరగసాగింది.

"అమ్మా.. వింధ్యాంటీ పెళ్ళికి నువ్వు వెళ్ళావా? "

"లేదు"

"మీరిద్దరూ బెస్ట్‌ఫ్రెండ్స్ కదా!"

"తను రిజిస్టర్ మేరేజ్ చేసుకుంది. అటువంటి పెళ్ళికి ఎక్కువ మందిని పిల వరు. నన్ను పిలిచింది కానీ వెళ్ళడానికి వీలు కాలేదు"

"ఎందుకు కాలేదు? డాడీ వెళ్ళొద్దన్నారు కదూ!"

"ఒక విధంగా అలాగే అనుకో"

"ఎందుకు మమ్మీ, డాడీకి అంత భయ పడతావ్? "

"ఏం భయపడితే? టైముకు వెళ్ళకపోతే ఆఫీసులో బాస్ అరుస్తాడని భయప డతాం. పనిమనిషిని గట్టిగా ఏమన్నా అంటే మానేస్తుందని భయపడతాం. అలాంటిది జీవితాంతం తోడుగా వుండే భర్తకు భయపడితే తప్పేముంది? అప్పుడు నాకూ పెళ్ళయిన కొత్త. ధైర్యం చేసి పెళ్ళికి వెడతానని అడగలేకపో యాను. నేను మొన్న కూడా చూశానుగా పెళ్ళి చేసుకున్న వాళ్ళందరూ ఏదో తెలివి తక్కువ వాళ్ళన్నట్టు మాట్లాడావ్. అది నిజం కాదు! మీ డాడీకి కోపం వుంది కానీ చెడ్డతనం లేదు. ఆ కోపాన్ని కాస్త భరిస్తే తప్పేముంది? "

"అయితే ఆంటీదే తప్పంటావా? "

"లేదు. వాళ్ళ విషయమే మొదటి నుంచి వేరుగా వుంది. ప్రేమించి పెళ్ళి చేసుకున్న అతను వాళ్ళ అమ్మ చేతిలో కీలుబొమ్మ అయ్యాడు. అందుకే ఎంతో సహనం గల వింధ్య కూడా భరించలేకపో యింది"

"ఆవిడ యిక్కడే వుండవచ్చుగా? "

"ఎలా వుంటుంది? విడాకులు తీసుకునే సమయానికి తనకి పార్ట్‌టైమ్ జాబ్ మాత్రమే వుంది. వీళ్ళు యింట్లోంచి పొమ్మన్నారు. ఇంతలో వాళ్ళ నాన్నగారు యిల్లు యిచ్చారు. వెంటనే వెళ్ళిపోయింది"

"ఆంటీ ఒక్కరు ఆ యింట్లో వుండడం బాగాలేదమ్మా"

"అందుకని ఏం చేస్తావ్? "

"అంకుల్‌ని వెతికి పట్టుకుని.."

"ఆ యింటికి పంపిస్తావా? యివన్నీ అయ్యే పనులు కావులే"

"ఇంతకీ ఆయన పేరేంటి? ఆయన్ని నువ్వు చూశావా? "

"ఒకసారి చూసిన గుర్తు. పేరు.. పేరు... ఏదో కృష్ణ!"

★ ★ ★

ఆరోజు సంజనా ఎంగేజిమెంటు. ఇంట్లోనే ఏర్పాటు చేశారు. ముఖ్యమైన స్నేహితుల్ని మాత్రమే పిలిచారు. సంజ నాకి సంతోషంగా వుంది. కోరుకున్న వాడిని పెద్దవాళ్ళ అనుమతితో పెళ్ళి చేసు కుంటోంది. ఈ అదృష్టం ఎంతమందికి వస్తుంది? ఉదయం పదిన్నర గంటలకు ముహూర్తం.

ఎంగేజిమెంటుకి చెల్లెలితో సహా వచ్చాడు అఖిల్. "నీ ఫొటో తీసింది వీడే, పేరు అఖిల్. వాళ్ళ చెల్లెలు అమల!" పరి చయం చేశాడు నీలం.

"సారీ అండి.. మీకు తెలియకుండా మిమ్మల్ని ఫొటో తీయవలసి వచ్చింది"

"ఫర్వాలేదులెండి. దానివల్ల మంచే జరి గింది కాబట్టి సరిపోయింది"

"మీరు రచయిత్రి వింధ్యగారింట్లో మూడు నెలలు వున్నారా? చాలా అదృష్టవంతురాలు" అంది అమల.

సంజనా నవ్వేసింది.

"ఆవిడ రాసిన కథలు ముందే చదివేసి వుంటారు"

"లేదు.. లేదు.. నాకు తెలుగు అంత బాగా చదవడం రాదు. అక్కడికి వెళ్ళాక నేర్చుకున్నదే. అసలు ఆమె రచయిత్రి అనే విషయం అక్కడికి వెళ్ళాక తెలిసింది"

"రా.. సంజనా ముహూర్తం దాటిపోతోంది" పిలిచింది భార్గవి.

నీలం తరపున అతని మామయ్య, అఖిల్, అమలవాళ్ళ తల్లితండ్రులు, కొద్ది మంది స్నేహితులు మాత్రం వచ్చారు. ముహూర్తం సమయానికి వజ్రపుటుంగరాలు మార్చుకున్నారు నీలం, సంజనా. ఇద్దరూ పెద్దవాళ్ళ కాళ్ళకి నమస్కారం చేశారు. నీలం తన మామయ్యను పరిచయం చేశాడు "ఈయన మా మామయ్య కృష్ణమోహన్"

ఆ పేరు ఈ మధ్యనే ఎక్కడో వింది, ఎక్కడ? ఈ మనిషిని కూడా ఎప్పుడో చూసినట్టు ఉంది.. ఎప్పుడు? గుర్తురావడం లేదు.

ఫంక్షన్ పూర్తయింది. అతిథులు అందరూ భోజనాలు చేసి వెళ్ళేసరికి రెండు గంటలు అయింది.

ఎవరూ లేకుండా చూసి, వెళ్ళేముందు సంజనా చేయి పట్టుకున్నాడు నీలం.

"ఇదేమిటి, విడిచిపెట్టు"

"ఊహూ సగం పెళ్ళి అయిపోయింది కాబట్టి ఫర్వాలేదు"

"బాగుంది"

"బాగుందనే చేయి పట్టుకున్నది. అవునుగాని పెళ్ళి ముహూర్తం చూశావా నెలన్నర తర్వాత కుదిరింది"

"అవును. ముహూర్తాలు అప్పడే వున్నాయిట"

"అది కాదు నే చెప్పేది. నీ ప్రేమ కోసం ఆరు నెలలు ఆగవలసి వచ్చింది. నువ్వు ఊరు వెళ్ళి మూడు నెలలకు వచ్చావు. ఇప్పుడు అందులో సగం నెలన్నరకి ముహూర్తం కుదిరింది"

"నిజం.. నిజం.. నేను గమనించనే లేదు" అంది సంతోషంగా సంజనా.

"నువ్వెక్కడ గమనిస్తావులే, ఏదో పరవశంలో వుంటే"

"ఈ రోజు నీకు చాలా స్వాతంత్ర్యం వచ్చిందే? "

"సగం హక్కులు కూడా వచ్చేసాయి. అందుకే రోజూ కలుసుకోవాలి. ఇద్దరం కలిసే షాపింగ్ చేద్దాం" అన్నాడు నీలం.

"అలాగే"

నీలం మాటలు తల్చుకుంటూ తల్లితో పాటు పనివాళ్ళ చేత పనులు చేయిస్తోంది సంజనా.

ఇంతలో ఫోన్ మోగింది. అట్నుంచి వింధ్య.

"ఫంక్షన్ ఎలా జరిగింది సంజనా? "

"బాగా జరిగింది, ఆంటీ. ఒక్క మీరు రాలేదనే లోటు తప్ప"

"పెళ్ళికూతురు మేకప్‌లో చూడటానికి నేను వస్తానుగా. ఇంతకీ పెళ్ళికి నీకేం బహుమతి కావాలి? "

"హఠాత్తుగా అడిగితే ఎలా ఆంటీ? "

"అయితే ఆలోచించుకునే చెప్పు"

"ఆ.. గుర్తొచ్చింది. ఇప్పుడే చెప్పేస్తాను. మీ పుస్తకాలు, చెరువులో తామరపువ్వులు, మనం వేసిన మొక్కలు, రామాలయం లోనిగంట, దాని మీద వాలే పిచ్చుకలు.."

వింధ్య నవ్వేసింది. "బాగుంది, బహుమతుల లిస్టు పెరిగిపోతోందే? "

"ఔనాంటీ.. మన మాటలు విని మా అమ్మ నవ్వుతోంది"

"అది కాదులే.. ఇంత మంచి కూతురు పెళ్ళికూతురు అయిందని సంతోషం. ఇంతకీ నీలం ఎలా వున్నాడు? "

"బాగున్నాడు"

"ఒకరికొకరు కావాలని పెళ్ళిచేసుకుంటున్నారు. సంతోషంగా వుండండి సంజనా"

"తప్పకుండా ఆంటీ, మీరే చూస్తా

రుగా? "

వింధ్యాంటీతో మాట్లాడుతుంటే అప్పుడు గుర్తుకు వచ్చింది.. ఆమె ఇంట్లో వున్న వ్యక్తి.. అదే ఫొటోలో.. ఆ పోలికలతో నీలం మామయ్య. యస్.. తను కనిపెట్టింది. ఆంటీ భర్త, నీలం మామయ్యా ఒక్కరే. సంజనాకి చెప్పలేనంత థ్రిల్లింగ్‌గా అనిపించింది.

ఆమె వెంటనే నీలంకి ఫోన్ చేసింది "మనం కలుసుకోవాలి.. ఎక్కడున్నావ్? "

"ఇంటికి రంగులు వేయించాలని నేనూ మామయ్య బజారుకి వచ్చాం"

"అలాగా.. రేపు సాయంత్రం కలుసుకుందాం. నీకు వీలవుతుందిగా? "

"అలాగే" అన్నాడు నీలం.

★ ★ ★

సంజనా, నీలం షాపింగ్ మాల్‌లో కూర్చుని కోక్ తాగుతున్నారు. ఫొటో విషయం చెప్పింది సంజనా.

"నువ్వు చెప్పేది నిజమేనా? "

"నిజమే.. మా అమ్మకు అంకుల్ పేరు కృష్ణ అని మాత్రం గుర్తుంది. మీ మామయ్య పేరు కృష్ణమోహన్. ఈ మధ్యనే నేను వాళ్ళ పెళ్ళి ఫొటో చూశానుగా.. పోలికలు తెలుస్తున్నాయి"

"నువ్వు పొరపాటు పడ్డావేమో? "

"లేదు లేదు. నేను సరిగానే చూశాను. కాస్త వయసు పైబడింది, అంతే. అంకుల్ అలాగే వున్నారు"

అనుమానంగా చూశాడు నీలం.

"అబ్బ.. అలా చూడకపోతే వెళ్ళి మీ యింట్లో ఎక్కడైనా వాళ్ళ పెళ్ళిఫొటో

ఉందేమో చూడకూడదా? ”

“లేదు.. మా యింట్లో లేదు. ఎందుకంటే మామయ్యకు పెళ్ళికాలేదు”

“నిజంగానా.. ఎవరు చెప్పారు? ”

“ఆయనే”

“అది అబద్ధం అయివుండవచ్చు”

“అబద్ధం చెప్పవలసిన అవసరం ఆయనకేంటి? ”

“ఏమో.. కానీ ఆయనకు పెళ్ళయింది. నేను ఫొటోలో చూసినది ఆయన్నే”

“ఏం కాదు, మామయ్య భార్యను వదిలేసేంత దుర్మార్గుడు కాదు”

“ఆయన చెడ్డవాడని నేను అన్నానా? నాతో ఇంత వాదించే బదులు మీ ఇంట్లో వాళ్ళ పెళ్ళిఫొటో వుందేమో వెతకరాదా? ”

“బాగుంది, అందులో వున్నది మీ ఆంటీయో కాదో, నాకెలా తెలుస్తుంది? ”

“ఏమిటి నీలం.. నీ తెలివి అమ్మాయిల మీదేగాని ఆంటీల మీద పని చేయదా? మీ యింట్లో ఆంటీ సీరియల్ పడిన పత్రికలో ఆమె ఫొటో వుంటుంది కదా! అదీ, పెళ్ళిఫొటో దొరికితే రెంటినీ దగ్గర పెట్టుకుచూస్తే తెలియదా? లేదా ఆ పెళ్ళి ఫొటో తీసుకురా, నేను పోల్చగలను”

“ఆంటీ దగ్గరకు వెళ్ళాక నీ మెదడు షార్ప్‌గా పనిచేస్తోందే? ”

“మరేమనుకున్నావ్ మా ఆంటీ అంటే? ”

“నువ్వింత మెచ్చుకుంటుంటే ఆమెను నాకూ చూడాలని వుంది”

“ఇది పొగడ్త కాదు. ఆవిడ స్వభావం అందరికీ నచ్చే విధంగా వుంటుంది” ఒక నిముషం ఆగి మళ్ళీ అంది సంజనా “అక్కడకు వెళ్ళాక నాకు చాలా తెలిశాయి. భవిష్యత్‌కు పనికివస్తుందనే దేవుడు నన్ను, నా ఆలోచనలు మార్చుకొమ్మని ఆంటీ దగ్గరకు పంపాడేమో!”

సంజనాతో ఈ విధమైన సంభాషణ జరిగిన దగ్గర నుండి నీలం వీలైనప్పుడల్లా యింట్లో పెళ్ళిఫొటో కోసం చూడసాగాడు.

“ఏమిట్రా యిది? యిల్లంతా ఇన్‌కమ్ టాక్స్ దాడి జరిగినట్లు యిలా తవ్వేస్తున్నావ్? ”

“నా టెన్త్ క్లాసు సర్టిఫికెట్ కన్పించడం లేదు మామయ్యా”

“అంత అజాగ్రత్తగా వుంటే ఎలాగరా? సర్టిఫికెట్స్ అన్నీ ఒక ఫైలులో పెట్టుకోమని చెప్పానుగా”

“ఏమిటో బద్ధకం, అందుకే ఇంట్లో ఆడ వాళ్ళు వుంటే ఇలాంటివన్నీ శ్రద్ధగా చేస్తారు”

“ఏమిటోయ్ ఎప్పుడూ లేనిది ఆడవాళ్ళ గురించిన ఆలోచన.. అయినా వస్తోందిగా ఒకమ్మాయి. పాపం రాగానే యిలాంటి సోదిపనులు అప్పగించకు”

“ఏం యిలాంటి పనులు చెబితే ఆడ వాళ్ళు ఇంట్లోంచి వెళ్ళిపోతారా? ” ఓరగా చూస్తూ అన్నాడు.

“అదేమో వాళ్ళ గురించి నాకు తెలియదుగానీ పెళ్ళి శుభలేఖలు సెలెక్ట్ చేయడానికి వెళ్ళాలన్నావుగా, బయల్దేరు!”

“నీ పెళ్ళికి ఎలాంటి కార్డులు వేయించారు మామయ్యా? ”


“అదేం లేదులే.. అయినా ఎందుకలా అడుగుతున్నావ్? పెళ్ళికానివాడికి శుభలేఖలతో పనేమిటి? ఇంతకీ నువ్వు వస్తావా? రావా? ”

“నువ్వు వెళ్ళి శుభలేఖలు చూస్తూ వుండు. నేను యివన్నీ సర్దేసి వస్తాను”

“నేను హెల్ప్ చేయనా? ”

“ఆ.. వొద్దొద్దు. నీ కెందుకు శ్రమ? నువ్వు వెళ్ళు, నేనొక పావుగంటలో వచ్చేస్తాను. నువ్వు కారు తీసుకువెళ్ళు. నేను ఆటోలో వచ్చేస్తాను. పనయ్యాక ఇద్దరం కలసి వచ్చేద్దాం”

కారు తాళాలు తీసుకుని కృష్ణమోహన్ వెళ్ళిపోయాడు. తీసినవన్నీ యథాతథంగా



సర్దేశాడు నీలం. అతనికి నిరాశ కలిగింది. నిజంగానే మామయ్యకు పెళ్ళికాలేదు. అతను బీరువా దగ్గర నీరసంగా నడుముపై చేతులు పెట్టుకు నిలబడ్డాడు.

ఆ భంగిమ ఎలా వుందంటే.. రవివర్మ చిత్రంలో శివుడు గంగావతరణం కోసం ఎదురుచూస్తున్నట్టు ఉంది. ఆకాశ గంగ ఒక్కో చుక్కా పడ్డట్టు బీరువా మీద డ్రెస్సులు తెచ్చుకున్న ఖాళీ అట్టపెట్టెలు, పనికిరాని ఫైల్సు ఒక్కొక్కటీ కింద పడ్డాయి. అందులో ఆఖరి చుక్క ఒక

ఫైలులో దాచిన వింధ్య పెళ్ళిఫొటో, వరుడు కృష్ణమోహన్.

★ ★ ★

ఆ తర్వాత నీలం, సంజనా కలిసి కృష్ణ మోహన్‌ను వింధ్య యింటికి తీసుకువెళ్ళ డానికి ప్లాన్ చేశారు.

"ఆవిడెవరినో పెళ్ళికి పిలవడానికి నేను రావాలా? నాకు వీలవదు"

"అలా అంటే ఎలా మామయ్యా? ఇన్నాళ్ళూ నువ్వు, నేనూ యిద్దరం ఎంత ఒంటరిగా గడిపాం. యిప్పుడైనా నలు గురినీ కలుపుకోకపోతే ఎలా? "

"ఎవరో తెలియనప్పుడు ఎలా వెడతాం? "

"వెడితే అదే తెలుస్తుంది. అయినా ఆవిడ సంజనాకు కావలసిన మనిషి. వాళ్ళ అమ్మా, నాన్న స్వయంగా ఆవిడను పెళ్ళికి పిలవడానికి, వీలైతే తమతో తీసు కురావడానికి వెడుతున్నారు. ఇంట్లో ఒక్క దాన్ని ఉండడం ఎందుకని సంజనా బయ లుదేరుతోంది. రాజమండ్రి పరిసర ప్రాంతాలు నేను చూడలేదని నన్నూ రమ్మన్నారు. నువ్వొక్కడివి ఇక్కడెందుకని నేను నిన్ను రమ్మంటున్నాను"

"బాగుంది" అన్నాడు కృష్ణమోహన్.

"బాగుంటుంది, అందుకే రమ్మనేది"

కృష్ణమోహన్ మౌనం వహించాడు.

"ఏమిటి మామయ్యా ఆలోచిస్తున్నావు? "

"ఎప్పుడో వదిలేసిన ప్రాంతం మళ్ళీ వెళ్ళాలా అని? "

"నీకా ప్రాంతం తెలుసా? "

"కొద్దిగా తెలుసు"

"ఎలా? "

"ఆ.. ఇప్పుడవన్నీ ఎందుకు? ఇంతకీ ఏ రోజు ట్రైనుకి వెళ్ళాలి? "

"సంజనా చెబుతానంది"

★ ★ ★

హోటల్లో కూర్చుని మాట్లాడుకుంటు న్నారు సంజనా నీలం, అఖిల్, అమల.

"ఏం ప్రేమరా బాబూ! ఇన్ని ట్విస్ట్‌లు ఏ ప్రేమలోనూ చూడలేదు"

"ఏమనుకున్నావ్.. సంజనా కల్యాణం అంటే అంతా స్పెషల్!"

"మీ మామయ్య పెళ్ళి ఫొటో ఏది అని అడగలేదా? " సంజనా అడిగింది.

"లేదు, అసలు ఆ ఫొటో ఎక్కడ పడే సాడో ఆయనకే తెలియదు"

"అలాంటి అపురూపమైన ఫొటోలు పడే స్తారా ఎవరైనా? " అంది అమల.

"అసలు ఆయనకు ఆ పెళ్ళిపై, భార్యపై విలువ ఉన్నట్టు లేదు" అంది సంజనా.

"ఉంటే విడాకులు ఎందుకు తీసుకుం టారు? " అంది అమల.

"అబ్బ ఏమిటి మీరిద్దరూ ఎంతసేపూ మామయ్యని ఏదో అంటారు" అన్నాడు నీలం.

"అవును మరి.. సాధారణంగా ఇలాంటి విషయాల్లో ఆడవాళ్ళు కలిసి ఉందాం అనే చూస్తారు. మీ మగవాళ్ళే.."

"ఏం కాస్త సహనంగా ఉంటే ఏం పోయింది మీ ఆడవాళ్ళు? "

"సహనమనేది ఏమైనా యూనిఫామా, ఆడవాళ్ళే వేసుకు తిరగడానికి? మగవాళ్ళు కూడా వేసుకోవచ్చు"

"సరే.. మగవాళ్ళకి సహనం కాస్త తక్కువగా ఉంటుందనే అనుకుందాం. అంత ఓపిక ఉంటే ఆడవాళ్ళు వాళ్ళని బాగు చేయవచ్చుకదా? "

"చిన్నాచితకా రిపేర్లు అయితే చేయవ చ్చు. అసలు మెదడే పనిచేయకపోతే ఏం చేస్తాం? " నవ్వుతోంది సంజనా.

"మరీ మీ ఆంటీ అంటే ఎంత ఇష్టమైనా అలా అనెయ్యకు. మామయ్య కాలేజీ ప్రిన్సి పాల్‌గా ఎంతో మందిని తీర్చిదిద్దారు"

"అదే చెబుతున్నాను.. ఒకవైపు మేధావి అన్పించుకుంటూ, ఇంకొకవైపు ఒక స్త్రీ

మనసు అర్థం చేసుకోవడంలో ఇంత మూర్ఖంగా ఉంటారెందుకు? ”

నీలం మాట్లాడలేదు. ఇంట్లో మామయ్య, తనూ కొన్ని ఇబ్బందులు పడిన మాట వాస్తవమే. అది కేవలం ఆడ వాళ్ళు ఇంట్లో లేకపోవడం వల్ల కాదు. ఏమిటో మనుషులకే దూరంగా ఉన్నట్టు ఉండేది. పండుగలు, ప్రత్యేకమైన రోజులు అన్నీ ఒకలాగే ఉండేది. తనకి చదువు, క్రికెట్, ఫ్రెండ్స్ సర్కిల్ అయినా ఉండేది. మామయ్య తన వయసు వల్ల హోదా వల్ల ఎవరితోనూ కలవలేకపోయేవాడు. తను ఆయనతో ఉండలేక, ఆయన్ని ఒంటరిగా వదిలి వెళ్ళలేక బాధపడేవాడు. ఆయనకి ఇన్నాళ్లూ పెళ్ళి కాలేదనే అనుకునేవాడు. అటువంటిది ఆయన పెళ్ళి ఫొటో చూసిన క్షణం తనకి వర్ణించనలవి కాని ఆశ్చర్యం.

“మామ్మయ్యని ఆ ఊరు తీసుకువెడతాం. వెడితే ఏం జరుగుతుంది? ఎప్పుడో విడిపోయిన వాళ్ళు మళ్ళీ కలుస్తారా? ” నీలం అడిగాడు సంజనాని.

“ఏమో.. నాకూ తెలియదు. మనం చేసేది కేవలం ప్రయత్నం. ఆ తర్వాత వాళ్ళ ఇష్టం”

“ఇంతకీ ఇదంతా చెబితే మీ ఇంట్లో ఏమన్నారు? ” అడిగాడు అఖిల్.

“మొదట బాగానే ఉంది అన్నారు. తరువాత ఏమిటీ ఆరిందా పనులు? అని నన్ను తిట్టారు”

"నాకయితే మీరు చేస్తున్నది కరెక్ట్ అన్పిస్తోంది" అన్నాడు అఖిల్.

"ఏమో నాకైతే భయంగా ఉంది" అంది అమల.

"నిన్నెవరూ అడగలేదు. పైగా మనం ఆ ఊరు వెళ్ళడం లేదు" అన్నాడు అఖిల్.

"పోనీ సరదాగా రాకూడదూ? " అంది సంజనా.

"వద్దు, ఎక్కువమంది ఉంటే వాళ్ళు మనసు విప్పి మాట్లాడుకోలేరు. నన్నడిగితే మీరూ వెళ్ళడం మానేయడం మంచిది" అన్నాడు అఖిల్.

"అసలు కథానాయిక ఈవిడ లేకపోతే ఎలాగలే.. పరిచయం చేయవలసింది తనేగా? " నీలం నవ్వుతూ అన్నాడు.

"ఒకప్పుడు ప్రేమికులు.. తర్వాత భార్యాభర్తలు. వాళ్ళకి నేను పరిచయం చేయాలా? ఏమీ అక్కర్లేదు"

"సరేలే, వాళ్ళ ఇద్దరినీ కలిపిన పుణ్యం ఊరికేపోదులే"

"ఏమోనబ్బా.. నాక్కాస్త భయంగానే ఉంది. ఏదో చెయ్యబోయి ఏదో చేస్తామా అని" సంజనా అంది.

"చూద్దాం"

"ఏమిటో మనిద్దరం మన పెళ్ళికంటే ఎక్కువగా వాళ్ళ గురించి ఆలోచిస్తున్నాం, ఏం థ్రిల్ లేకుండా"

"అప్పుడే అలా అనెయ్యకు, ఇంకా ఏమీ కాకుండానే థ్రిల్ లేదంటే ఎలా? " నీలం అన్నాడు ఎవరూ వినకుండా.

"ఛీ.. పిచ్చిమాటలు" అంది సంజనా.

★ ★ ★

"ఆంటీ.. నేనూ నీలం, మమ్మీ డాడీ మీ ఇంటికి వస్తున్నాం"

"సంతోషం.. కానీ ఎందుకు? "

"మిమ్మల్ని పెళ్ళికి పిలవడానికి"

"అయ్యో! ఇంత చాదస్తం దేనికి సంజనా? ఫోన్లో చెప్పారు, శుభలేఖ పంపిస్తారు. పెళ్ళికి ముందు వాళ్ళకి ఇలా రావడం శ్రమ కదూ!"

"లేదు ఆంటీ, డాడీయే అందరికంటే ఉత్సాహం చూపిస్తున్నారు. ఇంత మంది వస్తున్నామని నీలం మామయ్య కూడా వస్తున్నారు"

"అలాగా.. చాలా సంతోషం. అందరూ రండి"

'మిమ్మల్ని సంతోష పెట్టాడానికే వస్తున్నాం ఆంటీ' మనసులో అనుకుంది సంజనా.

అటు వింధ్యకి కంగారు వచ్చేసింది. ఆమె ఇంటికి బంధువులు అంటూ ఎవరూ రారు. సంజనా వచ్చి ఒక చిన్న రాయి వేసి ఈ నిశ్శబ్ద సరోవరంలో కదలిక తెచ్చింది. ఇప్పుడు ఆ వలయాలు పెద్దవై చెరువంతా కదులుతోంది.

వింధ్య రెండు రోజులు శలవు పెట్టింది. ఇల్లంతా సర్దింది. ఇల్లు కడిగించి ముగ్గులు పెట్టింది. ఇంటి గుమ్మాలకు తోరణాలు కట్టింది. కొత్త కర్టెనులు వేసింది. సోఫా కుషన్లు, కవర్లు మార్చింది. స్వీటు, హాటు చేయడానికి సరుకులు కొనుక్కు వచ్చింది. ఒకమాటలో చెప్పాలంటే పెళ్లి భార్గవి ఇంటిలో అయితే, కళ వింధ్య ఇంటికి వచ్చింది. స్టేషన్‌కి వెళ్ళి వాళ్ళని రిసీవ్ చేసుకోవాలన్పించినా బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేయడానికి ఇంట్లోనే ఉండిపోయింది.

ఉదయం ఆరుగంటల వేళ టాక్సీ వచ్చి వింధ్య ఇంటిముందు ఆగింది. ఇంతటి థ్రిల్లింగ్ విషయం తెలియనివాడు కృష్ణ మోహన్ ఒక్కడే. ఇలాంటి పల్లెటూరిలో వీళ్ళకి ఇంతటి ఆత్మీయురాలు ఉందా? రాజమండ్రి వస్తూంటే పాత జ్ఞాపకాలు చుట్టుముడుతున్నాయి. డిగ్రీలో తనూ, వింధ్యా తిరిగిన ప్రదేశాలు. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోసం అప్లయ్ చెయ్యడం... అక్కడ భవిష్యత్ గురించి కలలు కనడం, పెళ్ళి,

ఆ వృద్ధజంట అసలు కథేమిటి?



'ఏదో నేరం చేసినవాళ్లలా ఈ వృద్ధుల చీకటి బతుకులేమిటి?' అంది ప్రియంవద, పనిమనిషి గౌరితో.

'అమ్మా! వీళ్లు సొంత కొడుక్కే విషంపెట్టారని అందరూ అంటుంటారు. నీలాంటి అమ్మాయి ఈ ఇంట్లో ఉండటంకన్నా వేరెక్కడైనా ఉండటం మంచిది' అంది గౌరి.

'ఏమిటీ.. ఎవరన్నా సొంత పిల్లల్ని విషంపెట్టి చంపుతారా?' అంది ప్రియంవద నిలువెల్లా వణికి పోతూ.

'ఏమోనమ్మా.. అసలు రహస్యం ఆ పెరుమాళ్లకెరుక! వీళ్లు మాత్రం అందరిలాంటివాళ్లు కాదు' అంది పనిమనిషి.

ఇంతకీ ప్రియంవద ఆ ఇంట్లో ఎందుకుంది? ఆ వృద్ధులు కొడుకుని పొట్టన పెట్టుకున్నారా? ఆ చీకటి బతుకుల వెనుక నిజాలేమిటి? అడుగడుగునా ఉత్కంఠతో చదివించే **అత్తలూరి విజయలక్ష్మి** నవల ***ఆ గదిలో..***

చతుర ఏప్రిల్ కానుక!

హైదరాబాద్ వెళ్ళడం, ఏ ముహూర్తాన ఆ ఊరు వెళ్ళారో.. ఒక్కనాడూ మనశ్శాంతిగా గడిపిన గుర్తులేదు. వింధ్య తనతో ఎంతో నమ్మకంతో వచ్చేసింది. తను ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడా? 'ఎవరైనా కొడితే రాముడితో చెప్పుకోవచ్చు. రాముడే కొడితే ఎవరికి చెప్పుకోవాలి' అన్నట్టు చేశాడు.

"ఏమిటి మామయ్య ఆలోచిస్తున్నావు? " అడిగాడు నీలం.

"ఈ ప్రాంతం ఎన్నడూ చూడలేదేమో.. కొత్తగా అన్పిస్తోందేమో!? " అన్నాడు రామకృష్ణ.

"అదేం లేదు. నేను ఇక్కడే చదువుకున్నాను. అప్పటికీ ఇప్పటికీ చాలా మారిపోయింది" అన్నాడు కృష్ణమోహన్.

'మారనిది వింధ్యాంటీ జీవితమే' అనుకుంది సంజనా. ముందుగా టాక్సీదిగి "ఆంటీ" అంటూ ఇంట్లోకి వెళ్ళింది సంజనా.

"సంజూ" అంటూ వచ్చింది వింధ్య. అందరినీ పలకరించింది. నీలంని పరిచయం చేశారు ఆమెకు రామకృష్ణ, భార్గవి. ఆఖరున కారు దిగి మొహమాటంగా లోపలికి వస్తున్నది ఎవరు? మనసులో అనుక్షణం కదిలే రూపం.. ఆ జ్ఞాపకాలలోనే ఊపిరి తీసుకుంటున్న జీవితం.. ఎన్ని రోజులైనా గుర్తుపట్టగలదు. చప్పున వంటింట్లోకి వెళ్లిపోయింది వింధ్య. అందర్నీ ఆదరంగా ఆహ్వానించిన ఆమె అసలైన వ్యక్తిని పిలవలేకపోతోంది. ఆమె గుండె ఎగసిపడుతోంది. మొదట అనురాగం, తర్వాత అవమానం రుచి చూపించిన అతనితో ఎలా మాట్లాడాలి?

భార్గవి లోపలికి వచ్చింది.

"వింధ్యా! ఏమిటిది.. ఆవేశం తెచ్చుకోకు"

అంది భార్గవి.

"తను ఎలా వచ్చాడు ఇక్కడికి? "

"అతను నీలం మేనమామ. మేమే రమన్నాం"

"నేనేమో పెళ్ళి ఫొటోలో ఆయన్ని చూశాను ఆంటీ"

"సంజనా ఎన్నడూ లేనిది నీ మీద కోపం వస్తోంది"

"ఆంటీ ఇదంతా ముందే అనుకుని చేసింది కాదు. ఏం జరిగిందంటే.."

"నాకేం వినాలని లేదు సంజనా"

"అలా అనకు వింధ్యా. పంతాలకు పోయి మనం సాధించేదేమిటి? " అంది భార్గవి.

"అవన్నీ అతనికి చెప్పు. నాకెందుకు చెబుతావు? "

"మీలో ఇంత కోపం ఎన్నడూ చూడ లేదు ఆంటీ!"

"అవమానం కలిగినప్పుడు ఆత్మాభి మానం బయటకి వస్తుంది సంజనా!" అంది వింధ్యా.

"నీ ఇష్టానికి వ్యతిరేకంగా ఏమీ జరగదు వింధ్యా" అంది భార్గవి.

"కేవలం మీ ఒంటరితనం చూడలేక అంకుల్‌ని తీసువచ్చామాంటీ.. అతను నీలంకి మేనమామ అనే విషయం ఎంగే జిమెంట్ వరకు నాకూ తెలియదు. నేను కావాలని చేయలేదు. పరిస్థితులు అలా కలిసివచ్చాయి. బహుశా మీరిద్దరూ ఎప్ప టికైనా కలిసి ఉండాలని కావచ్చు"

"ఏమో.. నా మనసు అంగీకరించడం లేదు"

తాము ఎంత మాట్లాడినా వింధ్య విన దన్పించింది భార్గవికి.

"సంజూ ఇక్కడ రామాలయం చాలా బాగుంటుందన్నావుగా, స్నానాలు చేసి వెడదాం పద.

తర్వాత ఒక గంట ఆ ఇంట్లో వింధ్య గెస్ట్ అయిపోయింది. ఏమీ పట్టించుకో లేదు. సంజనా అందరికీ మర్యాదలు చేసింది. వింధ్యతో బలవంతగా కాఫీ తాగించింది. కృష్ణమోహన్ను, వింధ్యను ఆ ఇంట్లో వదిలేసి మిగతా నలుగురూ గుడికి బయలుదేరారు. పది నిముషాలు ఆ ఇంట్లో నిశ్శబ్దం నెలకొంది. వింధ్య వంటింట్లో గోడకానుకుని నేల మీద కూర్చుంది.

కృష్ణమోహన్ ఇప్పుడిప్పుడే ఆశ్చర్యం నుంచి తేరుకుంటున్నాడు. అతనిలో ఎక్కడో తనే తప్పు చేశానన్న ఫీలింగ్. అతను హాల్లోంచి నడిచి కిచెన్ గుమ్మంలో నిలబడ్డాడు. చప్పున లేచి నిలబడింది వింధ్య.

"ఇక్కడ నువ్వు ఉన్నావని, ఇది నీ ఇల్లని నాకు తెలియదు వింధ్యా"

"తెలిస్తే వచ్చేవారు కాదు, అవునా? "

"వచ్చి నిన్ను బాధపెట్టే వాడిని కాదు"

"సంజనా చిన్నపిల్ల. వయసు ఉత్సా హంలో ఏదో చేసింది. ఏమనుకోకండి, వాళ్ళ పెళ్ళి జరగనివ్వండి"

"సంజనా చేసింది కరెక్టు. పెద్దవాళ్ల స్నేహాలు పిల్లల వల్ల కలుస్తాయంటారు. అది ఈ రోజు నిజమైంది. నీలం నా మేన ల్లుడు వింధ్యా" అన్నాడు కృష్ణమోహన్.

"అతను మీ దగ్గర ఎందుకు ఉన్నాడు? మీ చెల్లెలు ఎలా ఉంది? "

"మా చెల్లెలికి మనమే పెళ్ళిచేశాం, గుర్తుందా? వీడు పుట్టాక తెలిసింది, అత నికి మరో భార్య ఉందని. మా చెల్లెలు ఆ సంగతి తట్టుకోలేక డిప్రెషన్‌కు గుర య్యింది. ఆ తర్వాత గొడవలు, మా చెల్లె లికి విడాకులు. మా అమ్మ పోయింది. నీలం పెంపకం నాపై పడింది. మా చెల్లె లికి వైద్యం చేయించాక కోలుకుంది. మళ్ళీ పెళ్ళి చేస్తే మంచిదన్నారు డాక్టర్లు. నీలం బాధ్యత నేను తీసుకుని చెల్లెలికి పెళ్లి

చేసాను. ఈ బాధ్యతలన్నీ ఒక్కడినే చూసుకోలేకపోయేవాడిని. ఆలోచించే మరో మనసు, సాయంచేసే ఒక మనిషి ఉంటే బాగుండు అన్పించేది. కానీ నిన్ను వెనక్కి పిలవడానికి అభిమానం అడ్డువచ్చేది. అప్పుడు వయసు చిన్నది, శరీరంలో బలం, ఆవేశం.. ఇంతకాలం గడిచాక ఈ అగడ్తలన్నీ దాటి వచ్చింది నేనేనా? అన్పిస్తుంది. నీలంకి పెళ్ళి అవుతోంది. వాడికి భార్యాపిల్లలు వస్తారు. అప్పుడు నేను మరింత ఒంటరినవుతాను"

"మీకు కాస్త తోడుగా నీలం అయినా ఉన్నాడు. నాకెవరు ఉన్నారు? సంజనా వచ్చేవరకూ అసలు ఎందుకు బతుకుతున్నానా? అన్పించేది. ఆమె వెళ్ళిపోయాక ఆ ఒంటరితనం మరింత భయంకరంగా అన్పించింది"

"మనం ఇప్పుడైనా ఎందుకు కలసి వుండకూడదు? "

"మీరు మళ్ళీ పెళ్ళి ఎందుకు చేసుకోలేదు? "

"మతి సరిగాలేని చెల్లెలు, పసివాడు, పైగా నాది రెండోపెళ్ళి.. నాకెవరు ఇస్తారు పిల్లని. అయినా నా మనసు పెళ్ళి మీదకు వెళ్ళలేదు. ఎంతసేపూ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు. ఒక్కోసారి ఇవన్నీ వదిలేసి ఏ అడవిలోకో పారిపోవాలన్పించేది. ఇటువంటి స్థితిలో మా స్నేహితుడికి భార్య చనిపోయింది. ఒక కూతురు ఉంది. అతను నీలం బాధ్యత తీసుకోను అన్నాడు. మా చెల్లెలికి కూడా కొడుకును తీసుకు వెళ్ళాలని లేదు. దానితో శాశ్వతంగా నీలం నా దగ్గరే ఉండిపోయాడు"

"నేను మీతో ఉండడం అతనికి ఇష్టం లేకపోతే? "

"వాడికిష్టం లేకపోతే నన్ను ఇంతదూరం తీసుకురాడు. అయినా వాడికి సంజనా వుంది. మనిద్దరం ఒకరికొకరం తోడునీడగా వుందాం"

వింధ్య ఆలోచిస్తోంది. ఎప్పుటికప్పుడు జీవితాన్ని పునర్నిర్మించుకోవడంలో తప్పు లేదు. అతనికి తను భౌతికంగా దూరమైందిగానీ మానసికంగా మర్చిపోయిందా? అతడు మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడేమో అనుకునేది. కారణాలు ఏమైతేనేం అతని జీవితంలో మరో స్త్రీ లేదు.

"కానీ ఇక్కడ ఇల్లు, వాతావరణం, జీవన విధానం అలవాటు అయిపోయాయి. వదలి రావాలంటే నాకిష్టం లేదు. మీరే ఇక్కడికి రావచ్చుగా? " అతడు ఏమంటాడో అన్నట్టుగా అంది.

అతడు భుజాలు ఎగరేసాడు అభ్యంతరం లేదన్నట్టు. "కానీ వింధ్య! ఈ వయసులో నాకు ఎవరిస్తారు ఉద్యోగం? ఖాళీగా కూర్చుంటే నీ మెదడు కూడా పాడు చేస్తాను"

వింధ్య నవ్వేసింది. "అక్కడికి వస్తే నాకు బోర్‌గా ఉంటుంది" అంది.

"నీకెప్పుడూ ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. జీవనోపాధి కోసం చేసే ఈ పార్ట్‌టైం జాబ్ మానేసి హాయిగా రచనలు చేసుకోవచ్చు. హైదరాబాద్‌లో నీకు ఎంతో సమయం, అవకాశం దొరుకుతాయి. ఏమంటావ్? "

"భార్యాభర్తల బంధం శాశ్వతమైనది. పిల్లలు మధ్యలో వస్తారు.. వాళ్ళ జీవిత భాగస్వాముల్ని వెతుక్కుంటూ వెళ్ళిపోతారు. ఒక కుటుంబం ఏర్పాటు చేసుకుంటారు. చివరిదాకా తోడుగా ఉండేది భార్యాభర్తలే. గతాన్ని మరిచి తొలినాటి ప్రేమికులుగా, స్నేహితులుగా వుందామంటే నాకేం అభ్యంతరం లేదు" అంది వింధ్య.

అతను వాగ్దానం చేస్తున్నట్టు చేయి చాపాడు. ఆమె ప్రమాణం చేస్తున్నట్టు ఆ చేయి అందుకుంది. ©

అదృష్టలక్ష్మి

- పార్థసారథి చిరువోలు

"మీరు చాలా అదృష్టవంతులు... దేశంలో కొన్ని లక్షల మంది ఉండగా అదృష్టం మిమ్మల్నే వరించింది."

ఆ రోజు మెయిల్లో వచ్చిన మెసేజ్ చూడగానే మల్లేశం ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఊపిరి బిగపట్టి తర్వాత వాక్యాలను ఆసక్తిగా చదవసాగాడు.

'మా లక్కీడ్రాలో.. మీరు ఐదు వేల పౌండ్లు గెలుచుకున్నారు' అని ఉంది అందులో.

రూపాయల్లో తర్జుమా చేసి అది ఎంత మొత్తమో అంచనా వేసుకునేసరికి అతని గుండె వేగంగా కొట్టుకోవటం ఆరంభించింది.

"మా వ్యాపార విస్తరణలో భాగంగా ప్రతి ఏటా ఈ ఎంపికలు చేస్తూ వస్తున్నాం. ఈ సారి భారత్‌తో సహా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ వివిధ దేశాల నుంచి ఈ- మెయిల్ చిరునామాల ద్వారా తొమ్మిది లక్షల మందిని ఎంపిక చేశాం. ఎలక్ట్రానిక్ బ్యాలట్ సిస్టమ్ ద్వారా వడబోత చేపట్టాం. చివరికి ఇరవై మంది మిగిలారు. భారత్ నుంచి ఎంపికయ్యింది మీరే"

మల్లేశం ఆనందానికి అవధులు లేకుండా పోయింది. 'తంతే గారెల బుట్టలో పడటమంటే ఇదే' అనుకున్నాడు.

టిక్కెట్ నెంబరు, సీరియల్ నెంబరు, లక్కీ నెంబరు విడివిడిగా పేర్కొని ఇకపై ఉత్తరప్రత్యుత్తరాలు చేయటానికి వీలుగా ఈ -మెయిల్ ఒకటి ప్రత్యేకంగా ఇచ్చారు. దాన్ని గుర్తు పెట్టుకున్నాడు.

అప్పటికప్పుడే ఆఫీసు నుంచి భార్యకు ఫోన్ చేసి వివరాలు చెప్పేశాడు.

"మనకు అదృష్టం కూడానా? ఎందుకయినా మంచిది. ఓసారి జాగ్రత్తగా చూడండి" హెచ్చరించింది ఆమె.

"నువ్వెప్పుడూ అంతే. అదృష్టం తలుపు తడితే, అనుమానించి వెనక్కి పంపుతావు" కసురుకున్నాడు.

దాంతో ఆమె ఇంకా ఏదో చెబుదామనుకున్నదల్లా ఆగిపోయింది. ఫోన్ పెట్టేసి గబగబా వాళ్లు కోరిన వివరాలన్నీ అక్కడ సూచించిన పత్రం ఆధారంగా నింపాడు. అది వాళ్లకి పంపుతున్నప్పుడు ఎందుకో తెలీదు.. మనసంతా ఉల్లాసంగా మారింది.

ఆ సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే స్వీటు ప్యాకెట్, మల్లెపూలు భార్యకు అందించి ఆత్రంగా వివరాలన్నీ చెప్పాడు.

"ఉచితంగా వాడు అంత మొత్తం ఇస్తాడంటారా? " ఆమె మధ్యలోనే అడ్డుపడింది.

"అదేదో స్కీమ్ అని చెబుతున్నాడుగా.. పైగా ఇతర సంస్థల్లా మా దగ్గర మోసం జరగదు అని కూడా స్పష్టంగా పేర్కొన్నాడు"

అంతా విన్నాక ఆమెకు కూడా నమ్మకం కుదిరింది. ఇద్దరూ రాబోయే నగదు బహుమతి కోసం ఆత్రంగా చూడసాగారు.

పన్నులు పోను చేతికందే మొత్తాన్ని లెక్కలు వేసుకుని దాన్ని ఖర్చుపెట్టటమెలాగా అని ఆలోచించసాగారు.

ఇద్దరూ వేర్వేరు జాబితాలు సిద్ధం చేసుకుంటే.. పిల్లలు కూడా తమ కోర్కెల చిట్టా వాళ్ల ముందుంచారు.

చతుర కత

పదిరోజుల తర్వాత మల్లేశానికి మళ్లీ మెయిల్ వచ్చింది. ప్రాసెసింగ్ ఫీజు కింద సొమ్ములు పంపించాలని అందులో ఉంది.

"వచ్చే డబ్బుతో పోలిస్తే ఇదే మంత పెద్ద విషయం కాదు" చెప్పాడు మల్లేశం.

"అది కాదండీ! అసలే నెలాఖరు రోజులు.. ఇప్పుడు ఇంత మొత్తం చేతిలో పడటమంటే మాటలు కాదు" వారించే ప్రయత్నం చేసిందామె.

"అబ్బ నా మాట విను. ఇప్పుడు మనం వెనకడుగు వేశామనుకో.. చేతికందింది నోటికందని చందంగా చేజారిపోతుంది" భార్యకు నచ్చచెప్పాడు.

ఆ సాయంత్రం తెలిసిన నలుగురు స్నేహితుల దగ్గర చేబదులు కోసం ప్రయత్నించాడు.

అవేమీ ఫలించకపోవటంతో మార్వాడీ దగ్గర కెళ్లి నోటు రాసి అప్పుతెచ్చి డబ్బులు పంపాడు.

నెలలు గడుస్తున్నాయి. తన బహుమతి విషయాన్ని గుర్తు చేస్తూ నాలుగయిదు రిమైం



డర్లు పంపాడు కూడా.

ఆ రోజు ఏదో పనిమీద బ్యాంకుకు వెళ్లాడు.

డబ్బు డ్రా చేయాలని ప్రయత్నిస్తే కౌంటర్లో ఉన్న వ్యక్తి చెప్పాడు.

"మీ ఎక్కౌంట్‌లో ఒక్క పైసాకూడా లేదు'

ఆ మాటలకు మల్లేశానికి దిమ్మ తిరిగింది.

'అదేంటి? మొన్న వారమే బోనస్ వచ్చింది. ఆ డబ్బులు తీసుకుందామని వస్తే..."

నోటిమాట రావటంలేదు. గొంతు పూడుకుపోయింది.

" డబ్బు డ్రా చేసిందెవరో చెప్పగలరా? " ఆత్రంగా అడిగాడు.

ఆ పేరు చెప్పారు .. అదేదో కంపెనీ పేరులా ఉంది. వివరాలు తెలుసుకోవటం అతనికి సాధ్యం కాలేదు.

మేనేజర్‌ను స్వయంగా కలిసి తన గోడు వెళ్లబోసుకున్నాడు.

" మీ రెవరికయినా ఎక్కౌంట్ నెంబరు, పాస్‌వర్డ్ ఇచ్చారేమో గుర్తుచేసుకోండి"

ఇలాంటి సంఘటనలెన్నో చూసిన మేనేజర్ సూచించాడు.

అప్పుడు గుర్తుకొచ్చింది మల్లేశానికి.

క్లిక్ కొట్టగానే వివరాలు కోరుతూ ఓ టేబుల్ రావటం.. అది నింపగానే... మరొకటి..

అలా తనకు తెలియకుండానే అనేక వివరాలిచ్చాడు.

బహుమతి వచ్చే మాట దేముడెరుగు.. ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోయింది. మల్లేశం డీలా పడిపోయాడు.

"పరాయి వ్యక్తులకు బ్యాంకు వివరాలు పంపకండి. ఇలాంటి మెసేజ్‌లకు స్పందించకండి అని బ్యాంకు ద్వారా మీకు అనేక మెసేజ్‌లు, ఈ మెయిల్స్ పంపాం. వాటిని చదివి కూడా అప్రమత్తం కాకపోతే ఎలా? చదువుకున్న వాళ్లే ఇలా చేస్తే.." మొహం మీద బ్యాంకు మేనేజర్ చీవాట్లు పెడుతోంటే ఏం చేయాలో పాలుపోలేదు. దిగాలుగా ఇంటికొచ్చాడు.

"ఏమండోయ్! మీకో శుభవార్త. నా మొబైల్ నెంబరు కెనడా బహుమతికి ఎంపికయ్యింది. బోలెడు డబ్బు ఇస్తామంటూ మెసేజ్ పంపారు. మీరే కాదు.. నేనూ అదృష్టవంతురాలిని" అంటూ పరిగెత్తుకొచ్చింది భార్య.

భార్యకేం సమాధానం చెప్పాలో అర్థం కాక ఆమె వైపు అయోమయంగా చూస్తూండిపోయాడు... పూర్‌ఫెలో మల్లేశం.

అన్నీ సరైన సమాధానాలు రాసిన వారిలో డ్రా ద్వారా ఎంపికైన ఈ విజేతకు రూ.150/– త్వరలోనే అందుతాయి.

వారణాసి విజయలక్ష్మి
ఇ.నెం. 1-82,
చిన్నవీధి, పొడగట్లపల్లి,
తూర్పు గోదావరి జిల్లా
పిన్ : 533236

చతురంగం - 35 జవాబులు

1 తె	రా	2 స		3 ఆ	మ	4 ని		5 జా	6 గా
దే		7 ఖి	8 ల	ము		9 శ	10 వా	గా	రం
11 పా	12 త		13 క	ద	నం		14 న	రం	
	15 ప	ల	ల	ము		16 సా	రం		17 యు
18 అ	తి		క		19 స	దా		20 జ	యా
వ		21 మే		22 చీ	ర		23 సం	పా	తి
24 ని	25 ల	క	26 డ		27 సి	రా		లు	
	వ		28 జ	29 ల	జ		30 వ్యా		31 అ
32 బా	ణ	ము		హ		33 గో	పా	34 లు	డు
35 జా	ము		36 గి	రి	జ		37 రం	తా	సు

సరైన సమాధానాలు రాసిన వారు

1. బచ్చు సత్యనారాయణ, కొత్తగూడెం, 2. అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, శేరిలింగంపల్లి, హైదరాబాద్, 3. తల్లాప్రగడ భాస్కరరావు, న్యూనల్లకుంట, 4. దేవరాజు వెంకటనరసింహారావు, చైతన్యపురి, హైదరాబాద్, 5. టి.వి. నారాయణ, మల్కాజిగిరి, 6. యు. విజయశేఖరరెడ్డి, కూకట్‌పల్లి, 7. గౌతమి శిష్టా, హబ్సిగూడ, హైదరాబాద్, 8. సి.జి.యస్. రావు, ఏ.ఎస్. రావునగర్, 9. కె.వి. శ్రీనివాస్, విక్రమ్‌పురి కాలనీ, సికింద్రాబాద్, 10. అత్తిలి కస్తూరిభాయి, తిరుపతి, 11. గేదెల రామారావు, ఏలూరు, 12. ఇందన మల్లిఖార్జునరావు, ఏలూరు, 13. ఉడాలి భాస్కరయ్య, చెన్నై, 14. పసుమర్తి జయశ్రీ, ఎమ్.జి. కాలనీ, హైదరాబాద్, 15. డా. శివభూషణం, కర్నూలు, 16. పి.వి. రమణారావు, మల్కాజిగిరి, 17. గుర్రాల జయశ్రీ, గుంటూరు, 18. కోలా సత్యనారాయణ, విశాఖపట్నం, 19. ఇందిరా సుబ్రమణ్యం, సూర్యనగర్ కాలనీ, హైదరాబాద్, 20. వి. రమాదేవి, బెంగళూరు, 21. వి.పి. కిరణ్, బెంగళూరు, 22. మొహమ్మద్ ఖాసిం, కల్లూరుగూడెం, ఖమ్మం జిల్లా, 23. తోటపల్లి శశికళాధర్, గుంతకల్లు, 24. బిక్కునూరి రాజేశ్వర్, నిర్మల్, ఆదిలాబాద్, 25. మండ వెంకట బోగేశ్వర శర్మ, అరసవిల్లి, శ్రీకాకుళం జిల్లా, 26. పొన్నపల్లి వెంకటప్పయ్య, నూజివీడు, 27. నెల్లుట్ల ప్రేమలత, నిజాంపేట, హైదరాబాద్, 28. నూతేటి జ్యోతిర్మయి, అనంతపురం, 29. కణుగుల గ్రీష్మ, శ్రీకాకుళం, 30. ఎ. అరుంధతి, పుణె, మహారాష్ట్ర, 31. కె. శ్యాంసుందర్ రెడ్డి, మంచిర్యాల, 32. చింతపల్లి నాగేశ్వరరావు, ప్రసాదంపాడు, విజయవాడ, 33. వి.వి. సత్యనారాయణశెట్టి, తిరుపతి, 34. సి. జనార్దన సింగ్, నల్లకుంట, 35. యు. జాన్సీలక్ష్మి, హైదర్షాకోట్, హైదరాబాద్, 36. కన్నేపల్లి నారాయణమూర్తి, శ్రీకాకుళం, 37. పి. దేవసేనమ్మ, సిద్ధార్థనగర్, హైదరాబాద్, 38. ధరణి పార్థసారథి, డి.డి. కాలనీ, హైదరాబాద్, 39. ఆర్. లక్ష్మి, మోతీనగర్, హైదరాబాద్, 40. చుండూరు అప్పల నరసింహం, బాచుపల్లి, హైదరాబాద్, 41. నేమాన సుభాష్‌చంద్రబోసు, విశాఖపట్నం, 42. టి. తులశమ్మ, మల్కాజిగిరి, 43. బి. రామమోహనరావు, సరూర్‌నగర్, 44. కె.వి.జె. దాస్, మైలార్‌గడ్డ, సికింద్రాబాద్, 45. బోడపాటి కృష్ణవేణి, చెన్నై, 46. అడపా సత్యనారాయణ బాబ్జి, కూకట్‌పల్లి, 47. డి.వి. కామేశ్వరి, విశాఖపట్నం, 48. ఓలేటి కస్తూరి, బెలగాం, విజయనగరం జిల్లా, 49. భూమా శ్రీహరి, గుంటూరు, 50. కొత్తపల్లి స్వరలయ, చీరాల, 51. ఆర్. లక్ష్మి, శ్రీకాకుళం, 52. సి. అల్వాల్ రెడ్డి, సరూర్‌నగర్, 53. చెన్‌రెడ్డి వైష్ణవి, సరూర్‌నగర్, 54. పక్కి శ్రీదేవి, మెట్టపల్లి, విజయనగరం జిల్లా, 56. ఎస్. శ్రీహరి, బెంగళూరు, 57. ఎస్. నాగశ్వేత, బెంగళూరు, 58. జె. కృష్ణకుమారి, సాయినాథపురం, హైదరాబాద్, 59. షేక్ నజీర్ బాషా, కోట, నెల్లూరు జిల్లా, 60. ఏవీ. రామకృష్ణ, కాట్రేనికోన, తూ.గో. జిల్లా, 61. చాగంటి శేషకుమారి, విశాఖపట్నం, 62. పబ్బు నీరాలంబమూర్తి, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు జిల్లా, 63. యమ్. అలమేలు, మల్కాజిగిరి, 64. డి.వి. సూర్యకుమారి, సీతమ్మధార, వైజాగ్, 65. పప్పు కామేశ్వరరావు, అమలాపురం, 66. ఎన్. విజయలక్ష్మి, ఒంగోలు, కె. నాగభూషణం, మౌలాలి, 67. నందూరి

చతురంగం - 36 ఆధారాలు

అడ్డం

1. ఎద్దు (3)
4. ప్రస్తుతం నడుస్తున్న యుగం (4)
7. పాండురాజు పెద్దభార్య (4)
11. గతేడాది కన్నుమూసిన మహిళా గవర్నరు (4)
12. రాత్రి (2)
13. మహిళాధికారిని ఆంగ్లంలో ఇలా పిలుస్తాం, రాజేంద్రప్రసాద్ స్త్రీ వేషం వేసిన సినిమా (2)
14. పిశాచం అటు నుంచి భయపెడుతోంది (3)
15. 'యువ'కు ముందొచ్చే తెలుగు సంవత్సరం (2)
16. నాటకానికి లఘు రూపం (3)
18. మంచి బుద్ధిగలదానికి (4)
20. అడవి (3)
21. ద్రౌపదికి ఐదుగురు - - - (3)
22. ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల గుర్తు (3)
23. కుమారుడి పెళ్లాం (3)
24. ధనుస్సుతో సంధించేదేమిటి? (2)
26. దండ (2)
28. పిల్లలు అక్షరాలు దిద్దుకునేది (3)
30. తనకు తాను చేసుకున్నదాన్ని ఇలా అంటారు (4)
31. కుంతికి మాద్రి - - - (3)
32. క్షురకుడు చేసేది (3)

నిలువు

1. తోడేలు (2)
2. తలకిందులైన కుండ (2)
3. అల్లూరి సీతారామరాజు నేలకొరుగుతూ చేసిన నినాదం (5)
5. రెప్పపాటు (2)
6. తులసి వనంలో - - - మొక్క అంటారు (3)
8. ఒడ్డు (3)
9. నరకాసురుని తల్లి తలకిందులు (3)
10. 'బాబూ వినరా! అన్నాదమ్ముల కథ ఒకటి...' పాట ఉన్న సినిమా (6)
12. బలరాముని భార్య (3)
13. పల్లకీ లాంటిదే (2)
15. స్త్రీలు (3)
17. చూడరు (3)
18. కుమారులు (3)
19. కాంతి పుంజం (3)
20. సంసారం, నివాసం (3)
21. నాగుబాము ఇది ఎత్తి ఆడుతుంది (3)
24. ఎన్టీఆర్ కుమారుడు (4)
25. శిరస్సు (2)
26. అదృశ్యం (2)
27. 'దిశ'కు వికృతి (2)
28. అడ్డం 21కి ఏకవచనం (2)
29. పగ (2)
30. సంగీతానికి ఇది ప్రధానం (2)

నాగేశ్వరరావు, బేగంపేట, 68. ఆర్. మృదుల, వనస్థలిపురం, 69. వి.ఆర్. జయలక్ష్మి, కరీంనగర్, 70. పి. సరళ, మర్రిగూడ, నల్గొండ జిల్లా, 71. వాసా రవికిరణ్, తగరపువలస, విశాఖపట్నం, 72. పరుచూరి భవానీదేవి, గుంటూరు, 73. మంచాళ లక్ష్మణరావు, విశాఖపట్నం, 74. జి. జయ చంద్రగుప్త, కర్నూలు, 75. కొక్కెరగడ్డ అన్నపూర్ణ, మానేపల్లి, తూ.గో. జిల్లా, 76. కె.వి. లక్ష్మణ రావు, మానేపల్లి, తూ.గో. జిల్లా, 77. ఎ. మానస, యర్రగుంట్ల, కడప జిల్లా, 78. ఇ.యల్. నర సింహారావు, మధిర, ఖమ్మం జిల్లా, 79. బి. శాంతి, విజయవాడ, 80. డా. సి.కె. శాస్త్రి, గుంటూరు, 81. గన్నవరం సుబ్బరామయ్య, తిరుపతి, 82. చి.పు. శాస్త్రి, ఎల్లమ్మగుట్ట, నిజామాబాద్, 83. కె. సుబ్రహ్మణ్యం, అనంతపురం, 84. కె.వి.ఎస్.ఎన్. మూర్తి, విశాఖపట్నం, 85. బి. వేణుగోపాలా చారి, మహబూబాబాద్, వరంగల్ జిల్లా

చతురంగం - 36

రూ.150/- బహుమతి

గడువు తేది : మార్చి 17

1		2	■	3	■	4	5		6
	■	7	8		9	■		■	
■	10	■	11	మా			■	12	
13		■	14			■	15		■
16	టి	17	■		■	18			19 కి
■	20			■	21			■	
22			■	23			■	24	
■		■	25	■		■	26		■
27	■	28		29	■	30 స్వ			
31			■	32			■		■

పంపినవారి పేరు: ---

వయసు (   ) చిరునామా : ---------------------------------------

----

------------------ పిన్ : ------------ ఫోన్ : -----------------

ఆధారాలు

నిబంధనలు

✦ చతురంగాన్ని ఇదేపేజీలో పూర్తిచేసి పంపాలి. ✦ తుడుపులు, కొట్టివేతలు ఉండరాదు. ✦ మా 'కీ'తో సరిపోలిన పూరణలనే పరిగణనలోకి తీసుకుంటాం. ✦ గడువు తర్వాత అందిన పూరణలు పరిశీలించం. ✦ ఎక్కువ మంది సరైన జవాబులు రాస్తే డ్రా తీసి విజేతను ఎంపిక చేస్తాం. ✦ ఒక్కొక్కరు ఎన్ని కూపన్లైనా పంపవచ్చు. ✦ ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

చతురంగం పంపాల్సిన చిరునామా : చతురంగం చతుర, ఈనాడు కాంప్లెక్స్, గూడ్స్‌షెడ్ రోడ్డు, మూసాపేట విలేజి, బాలానగర్ (మండలం), హైదరాబాద్- 72, రంగారెడ్డి జిల్లా.

★ ఒకే కవరులో చతురంగం కూపన్లు ఎన్నయినా పంపవచ్చు.

★ చతురంగం, చతురప్రవేశిక, విపుల వినోదిని ఒకే కవరులో పంపినా పరిశీలిస్తాం.

FORM IV (See Rule 8)

Statement about ownership and other particulars of CHATURA.

1. Place of Publication	:	6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.
2. Periodicity of its Publication	:	Monthly
3. Printer's Name	:	**RAMOJI RAO**
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin	:	-
Address	:	6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.
4. Publisher's Name	:	**RAMOJI RAO**
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin	:	-
Address	:	6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.
5. Editor's Name	:	**RAMOJI RAO**
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin	:	-
Address	:	6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.
6. Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital.	:	**RAMOJI RAO, VASUNDHARA PUBLICATIONS** 6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.

I, RAMOJI RAO, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

for VASUNDHARA PUBLICATIONS
Sd/- RAMOJI RAO
Publisher

Date: March 1, 2014

Printed, Published, Edited & Owned, by Ramoji Rao for Vasundhara Publications, D.No. 6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082 and Printed at Eenadu Press, No. 7-134 / 1& 2, Moosapet Village, Balanagar Mandal, Kukatpally - 500 072, R.R District, Office Address: CHATURA, Telugu Monthly, D.No. 6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082, Tel: 23318181, Visakhapatnam: 2552211; Vijayawada: 2494900; Tirupati: 2275757; Anantapur: 273444; Karimnagar: 9959021802; Rajahmundry: 2468992; Suryapet: 221146; Guntur: 2512142; Nellore: 2338734; Srikakulam: 241101; Kurnool: 252813; Kadapa: 270011; Tadepalligudem: 228881; Warangal: 9959021804; Khammam: 9959021806; Nizamabad: 245661; Mahabubnagar: 8008706125; Ongole: 256777; New Delhi: 23753440; Mumbai: 24982498; Chennai: 28242036; Bangalore: 25599686. Toll Free Help line No. 18004258888 (Hyd.), www.eenadu.net.

తల్లావఝ్ఝల వారి చతురోక్తులు

తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి 1917లో 'సాహితి సమితి' వ్యవస్థాపకులు. భావకవి, నవలా రచయిత, అనువాదకుడైన ఆయన 'సాహితి' పత్రికా సంపాదకులు కూడా. బుద్ధుని జాతక కథలను పాళీ భాషనుంచి తెలుగు చేశారు. వివిధ సందర్భాలలో ఆయన ఎక్కుపెట్టిన చతురోక్తులు ఇవీ..



మీ టిక్కెట్ నాక్కావాలి!

ఒకసారి మొక్కపాటి నరసింహశాస్త్రి మద్రాసు బయల్దేరారు. కానీ రిజర్వేషన్ దొరకలేదు. దాంతో ఒంగోలులో దిగిపోయి వియ్యంకులైన తల్లావఝ్ఝలవారి ఇంటికి వచ్చారు. తల్లావఝ్ఝలవారికి అప్పటికే గుండెపోటు వచ్చి మంచం మీద ఉన్నారు. ఆయన మొక్కపాటివారిని చూడగానే 'నేనెళ్లి పోతున్నాను' అన్నట్టుగా చేయి ఊపారు.

దానికి మొక్కపాటివారు చిరునవ్వుతో 'మీ ప్రయాణం ఆపు చేయడానికే వచ్చా! మీ రిజర్వేషన్ నాక్కావాలి!' అన్నారు.

అనంతరం మొక్కపాటివారు కేన్సర్ వ్యాధికి చికిత్స చేయించుకుని సరాసరి ఊరెళ్లిపోయారు. అన్నట్టుగానే తల్లావఝ్ఝలవారికంటే ముందుగానే మొక్కపాటి చనిపోయారు. ఆ వార్త విన్న తల్లావఝ్ఝలవారు కాస్సేపేమీ మాట్లాడలేకపోయారు. తర్వాత ఆ విషాదంలోనూ కంటతడితో 'నా టిక్కెట్ ఆయన తీసుకుని వెళ్లిపోవడం ఏమాత్రం బాగాలేదు!' అని నవ్వుతూనే అన్నారు.

గడప మీద ఏడిస్తే ఏం లాభం?

పిల్లలు ఏడిస్తే తల్లావఝ్ఝలవారికి చాలా బాధగా ఉండేది. అప్పట్లో ఇళ్లకు చాలా పెద్ద గడపలు ఉండేవి. దాంతో పిల్లలు తమ ఏడు పేదో అందరికీ కనిపించాలనీ, పైపెచ్చు తాము కూర్చుని నింపాదిగా ఏడ్చేందుకు బాగా సౌకర్యంగానూ ఉంటుందని ఆ గడపల మీద కూర్చుని ఏడ్చేవారు.



ఒకసారి అలా గడపమీద కూర్చుని విపరీ తంగా ఏడుస్తున్న తన మనవడిని సముదా యించేందుకు ప్రయత్నించిన తల్లావఝ్ఝలవారు విఫలమయ్యారు.

దాంతో 'ఒరేయ్! భారతదేశం సువి శాలమైనది. ఇంతటి పెద్ద దేశంలో ఇలాంటి ఇరుకు గడపమీద కూర్చుని ఏడ్వడం దేనికి? నోటికి తాళం వేయరా!' అన్నారు.

పానశాల నుంచి పాలిటిక్స్‌కు!

మామూలుగా ఎవరితోనూ ఎక్కువగా స్నేహం చేయని కవికోకిల దువ్వూరి రామిరెడ్డికి తల్లావఝ్ఝలవారితో మాత్రం బాగా చనువు, స్నేహం ఏర్పడ్డాయి. వారి పరి



చయం నాటికే దువ్వూరి కవితా సంపుటి 'పానశాల' ప్రచురితమై, ఎంతో పేరు తెచ్చుకున్నది. ఆ తర్వాత 'భారతి' పత్రికలో దువ్వూరివారు జాతీయోద్యమంపై అనేక పద్యాలు రాశారు. అది చూసిన తల్లావఝ్ఝలవారు నవ్వుతూ 'రామిరెడ్డి పానశాలలో నుంచి పాలిటిక్సులో పడ్డాడు. ఇదీ మంచిదే!' అని అన్నారు, అందరినీ నవ్విస్తూ.

ఇక బందరు జైలా?

తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు మంచి మిత్రులు. ఒకసారి మునిమాణిక్యంవారు తల్లావఝ్ఝలవారిని బందరు రమ్మని పిలిచారు. అప్పట్లో ఏవో పనుల ఒత్తిడి వల్ల తల్లావఝ్ఝలవారికి



వెళ్లడం కష్టంగా ఉండింది. అది చూసి మునిమాణిక్యంవారు మరీమరీ బలవంతం చేస్తూ, మొహమాట పెట్టారు. అప్పటికే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటున్న తల్లావఝ్ఝలవారికి చుట్టపుచూపుగా జైలుకెళ్లడం అలవాటయింది. దాంతో ఆయన విసుక్కుంటూ 'నేనెలాగూ జైలుకు వెళుతున్నానుగా.. ఇక బందరు రాకపోతేనేం? 'అని చమత్కరించడంతో మునిమాణిక్యం అవాక్కయ్యారు.


రంభతో క్రీడా?


మరోసారి తల్లావఝ్ఝలవారు బందరులో మునిమాణిక్యంవారి ఇంటికొచ్చారు. ఆయన వచ్చిన సమయంలో మునిమాణిక్యం వారబ్బాయి అరటి చెట్టుతో ఆడుకుంటున్నాడు. 'ఒరే అబ్బాయీ! ఏం చేస్తున్నావురా?' అని తల్లావఝ్ఝలవారు అడిగారు.



దానికా అబ్బాయి 'ఆడుకుంటున్నాను' అని జవాబిచ్చాడు. దాంతో తల్లావఝ్ఝలవారు 'ఒరే! నువ్వేం చేస్తున్నావో తెలుసా? రంభ (అరటి) తో క్రీడిస్తున్నావురా!' అన్నారు.

కాలాతీతం





విలియం ఫాక్నర్

ది సౌండ్ అండ్ ది ఫ్యూరీ

నాలుగు భాగాలుగా వుంటుందీ నవల. ప్రతి భాగంలోనూ భిన్నమైన దృష్టికోణం నుండి కథ వస్తుంది. కథా సమయం కూడా ప్రతిసారీ మారుతుంది. మొదటి భాగం బెంజీ మనసులో జరుగుతుంది. ఇతడు మానసికంగా ఎదగని ఇడియట్. రెండోభాగమంతా క్వెంటిన్ అనే పాత్ర ఆలోచనల చైతన్య స్రవంతిగా కథ సాగుతుంది. మూడోభాగంలో కథను జేసన్ చెబుతాడు. నాలుగోభాగంలో రచయితే కథ చెబుతాడు.

మొదటి రెండు భాగాలూ అర్థం కావటం కష్టమే. కారణం 'ఇడియట్' హేతుబద్ధంగా చెప్పలేడు! కథాకాలం కూడా తరచుగా మారుతుంటుంది. అతనికి ఇంద్రియ జ్ఞానముందిగాని సరిగ్గా వ్యక్తపరచలేడు. ఇక రెండోభాగంలో క్వెంటిన్ ఆత్మహత్య చేసుకుంటాడు. గతం అతణ్ణి వెంటాడుతుంది.

1వ భాగం: బెంజీ, ఏప్రిల్7, 1928

వర్తమానం: బెంజీ ముప్పై మూడో పుట్టినరోజు. లస్టర్‌తో కలిసి గోల్ఫ్ ఆట చూస్తున్నాడు. కంచెకు అటువైపున్న ఆటగాళ్లు తమ సహాయకుల కోసం పిలిచినప్పుడు అతడికి తన సోదరి జ్ఞాపకం వస్తుంది. సాయంత్రం కార్నివల్(తిరునాళ్ల) కోసం దాచుకున్న చిల్లర డబ్బులు పారేసుకున్న లస్టర్ వెదుకుతూ ఒక మొక్క పీకి, చప్పరిస్తూ వుండమని బెంజీకి ఇస్తాడు. కాలవ వద్దకు చేరటంతో బెంజీ బూట్లు విప్పుతాడు లస్టర్. చిల్లర కోసం అన్వేషణ కొనసాగుతుంది. చెట్లమాటున మిస్ క్వెంటిన్, కార్నివల్ మనిషి నౌకర్ని కావిలించుకొనటం చూస్తాడు బెంజీ. లస్టర్ తిరిగి రాగానే, తనను ఆ పరిస్థితిలో చూడటానికి బెంజీకి అవకాశమిచ్చినందుకు లస్టర్‌ను నిందిస్తుంది మిస్ క్వెంటిన్.

కార్నివల్ మనిషికి ఒక గోల్ఫ్ బంతిని యిరవైఅయిదు సెంట్లకు అమ్మటానికి ప్రయత్నిస్తాడు లస్టర్. కాని డబ్బులివ్వకుండానే బంతిని తీసుకుంటాడతను. లస్టర్‌కు కోపం వస్తుంది. తన కోపాన్ని బెంజీమీద తీర్చుకుంటాడు. బెంజీ దాచుకున్న

మొక్కల సీసాను తన్నేసి చెవిలో 'కాడీ' అంటాడు గుసగుసగా. బెంజీ అరుపులు ఇంటిదాకా వినిపిస్తాయి. ఇద్దర్నీ యింటికి రమ్మంటుంది నీగ్రో పనిమనిషి డిల్సీ. ఇల్లు చక్కబెట్టడం ఆమె బాధ్యతే. పుట్టిన రోజు కొవ్వొత్తులు వెలిగించి బెంజీని సంతోషపెడుతుంది. డిల్సీ వంటింట్లోంచి వెళ్లిపోగానే, కొవ్వొత్తులార్పేస్తాడు లస్టర్. బెంజీ మళ్లీ కేకలు వేస్తాడు. తిరిగొచ్చిన డిల్సీ, లస్టర్‌కు చీవాట్లేస్తుంది.

మంట రాకుండా పొయ్యికి తలుపు ఉంటుంది. డిల్సీ వెళ్లిపోగానే తలుపు తీస్తాడు లస్టర్. మతి సరిగా లేని బెంజీ మంటల్లో చెయ్యిపెట్టి కాల్చుకుంటాడు. లస్టర్‌ను లెంపకాయ వేస్తుంది డిల్సీ. గాయానికి మందు రాసి, కాడీ వాడిన పాత చెప్పులు బెంజీకి ఇస్తుంది. డిన్నర్ సమయంలో లస్టర్ అడిగిన చిల్లర డబ్బులివ్వటానికి నిరాకరిస్తాడు జేసన్. తన కార్నివల్ బాయ్‌ఫ్రెండ్ నుండి దూరంగా వుండాలని మిస్ క్వెంటిన్‌కు హెచ్చరిస్తాడు. ఆమె ధిక్కరిస్తుంది. అంతే కాదు, కోపంతో అతడి మొహంమీద గ్లాసు నీళ్లు గుమ్మరించి చివాలున గదిలోంచి వెళ్లిపోతుంది. అదే రాత్రి గదిలోంచి రహస్యంగా తప్పించుకునిపోతుంది మిస్ క్వెంటిన్.

2. గతం

1898లో పిల్లలందరూ కాలవ దగ్గర ఆడుకుంటున్నప్పుడు కాడీ తన దుస్తులు తడి చేసుకుని, తన సోదరుడు క్వెంటిన్ వద్దన్నా వినకుండా విప్పేస్తుంది. క్వెంటిన్ గట్టిగా లెంపకాయ కొట్టడంతో కిందపడి డ్రాయరు మురికి చేసుకుంటుంది. కోపంతో క్వెంటిన్ మీద నీళ్లు చిమ్ముతుంది. ఇద్దరూ ఏం చేశారో యింట్లో చెబుతానని బెదిరిస్తాడు జేసన్. ఇంటికి చేరగానే తండ్రికి చెబుతాడు. రాత్రి భోజనం తర్వాత పడుకోవలసిన పిల్లలు, రహస్యంగా ఇల్లుదాటి నీగ్రోల యింటికెళ్లి ఆడుకుంటారు. చెట్టెక్కి పెద్దవాళ్లేం చేస్తున్నారో తొంగిచూస్తుంది కాడీ. క్వెంటిన్ తప్ప- కిందవున్న మిగతా పిల్లలు కాడీ మురికి డ్రాయర్లను చూస్తారు. ఆ క్షణాన, పెద్దవాళ్లు పార్టీ చేసుకోవటం లేదు. తమ నానమ్మ అంత్యక్రియలకు సమావేశమయ్యారందరూ.

బెంజీ కౌమారదశ జ్ఞాపకాలన్నీ సోదరి కాడీతో నిండివున్నాయి. ఆమె వాసన వర్షంలా వుంటుంది. ఆమె కౌగిలింతలు, తన పక్కన పడుకోవటం.. ఇవేకాదు, ఇతర విషయాలు కూడా వున్నాయి. అంకుల్ మారీ రాసిన ప్రేమలేఖలు పక్కింటావిడకిచ్చాడు. ఆ తర్వాత భర్త ఆమెను చావగొట్టాడు. తనకిష్టమైన కాగితం బొమ్మల్ని జేసన్ చించివేశాడు. పద్నాలుగో ఏట, కాడీ సెంటు రాసుకుంది. ఓ కుర్రాడామెను ముద్దు పెట్టుకోవటానికి ప్రయత్నించాడు. పదమూడో ఏట, తనని కాడీతో కలిసి పడుకోవద్దని చెప్పారు.

కాడీ తన కన్యత్వాన్ని పోగొట్టుకుని యింటికొచ్చింది. అప్పటికి తనకు (బెంజీకి) పద్నాలుగేళ్లు. మరుసటి సంవత్సరం కాడీ పెళ్లి. పార్టీలో మత్తెక్కించే షాంపేన్ తాగుతాడు. కాడీని పెళ్లిడ్రెస్‌లో చూసి ఏడుస్తాడు. జారి కింద పడతాడు. తలకు గాయమవుతుంది. రహస్యంగా చూసినందుకు తననూ, ఓ నీగ్రో కుర్రాణ్ణీ చావబాదుతుంది. తను వాంతి చేసుకుని నిద్రపోతాడు.

కాడీ వెళ్లిపోయిన తర్వాత, ఏడుస్తూ

విలియం ఫాక్నర్ (1897 - 1962)

ఫాక్నర్ వంశీకులు చాలా ప్రసిద్ధులు. అమెరికా చరిత్రలో వీళ్లకో ప్రత్యేక స్థానం వుంది. విలియం ముత్తాత రెండు యుద్ధాల్లో పాల్గొన్నాడు. ఆయన రైలు మార్గాలు నిర్మించి, లాభసాటిగా నిర్వహించాడు. స్థానిక ప్రతినిధుల సభకు ఎన్నికై హత్యకు గురయ్యాడు. అలాంటి వంశంలో పుట్టిన విలియం ఫాక్నర్ ప్రపంచ ప్రఖ్యాత రచయితగా పేరు తెచ్చుకున్నాడు. పులిట్జర్ ప్రైజ్, నోబెల్ ప్రైజ్ (1949)లను గెల్చుకున్నాడు. నిజానికి అతను హైస్కూలు కూడా పాస్ కాలేదు. తర్వాత యూనివర్సిటీ ఆఫ్ మిసిసిపిలో ఇంగ్లీష్ కోర్స్ చదివాడు గాని అందులోనూ ఘోరంగా ఫెయిలయ్యాడు. అయితే, ఫాక్నర్ సహనం గొప్పది. నిర్విరామంగా సాధన చేసి రచనలోని మెలకువలను పట్టుకున్నాడు. కేవలం అమెరికన్ సాహిత్య చరిత్రలో మాత్రమే గాదు, ప్రపంచంలోనే ఇలాంటి వాళ్లు అరుదు. కవిత్వం రాశాడు గాని, 'ఇలా రాయటం కన్నా రాయకపోవడం మేలని' సలహా ఇచ్చారు హితైషులు. అయితే 1914 నాటి యుద్ధం అతని జీవితాన్ని మలుపు తిప్పింది.

ఏదో కారణంతో అమెరికా విడిచివెళ్లొచ్చిన కెనెడియన్ వైమానిక దళంలో లెఫ్టినెంట్‌గా చేరాడు. అయినా రచనా వ్యాసంగం ఆపలేదు. ప్రముఖ రచయిత, విమర్శకుడు షెర్వుడ్ ఆండర్సన్ సలహాతో, కవిత్వసాధన మాని కథలపై దృష్టి పెట్టాడు ఫాక్నర్. అయినప్పటికీ 1924లో ఒక కవితా సంకలనం 'ది మార్బుల్ ఫాన్' ప్రచురించాడు. ఈయన తొలి నవల 'సోల్జర్స్ పే' (1926) షెర్వుడ్ ఆండర్సన్ సహాయంతో వెలుగుచూసింది. దీనివల్ల పేరు రాలేదు గాని, మరో నవల రాయాలని వుత్సాహం పెరిగింది. మూడేళ్ల తర్వాత 'ది సౌండ్ అండ్ ఫ్యూరీ' ప్రచురించాడు. ఇది ఫాక్నర్ అత్యుత్తమ రచన మాత్రమే గాదు, ప్రపంచ నవలా చరిత్రలో దీనికో ప్రత్యేక స్థానముంది. ఇది గొప్ప నవలే గాని డబ్బులు రాలేదు. పెళ్లి చేసుకున్నాడు. ఆర్థిక అవసరాలు పెరిగాయి. కేవలం డబ్బు కోసం 'సాంక్చుయరీ' (1931) రాశానని చెప్పుకున్నాడు ఫాక్నర్. అనుకున్నట్టుగానే ఇది సంచలనం సృష్టించింది. బాగా అమ్ముడుపోయింది. డబ్బు సంపాదన కోసం కొన్నాళ్లు హాలీవుడ్‌లో పని చేశాడు. తన స్వగ్రామం ఆక్స్‌ఫర్డ్ (మిసిసిపి) లోని పూర్వీకుల భవంతిని కొని, రచనలు కొనసాగించాడు. గతించని గతం అతణ్ణి వెంటాడింది. తన తల్లిదండ్రుల గురించి, ఆనాటి సమాజాన్ని గురించి గ్రంథస్థం చెయ్యాలి. ఇందుకోసం ఒక వూహా ప్రపంచాన్ని సృష్టించాడు, మన ఆర్కేనారాయణ్ 'మాల్గుడి' లాగ. అదే యాక్నా పటాఫా కౌంటీ. ఇక్కడ రెండు సంపన్న కుటుంబాలు వుంటాయి. ఒకరు సార్టొరిస్, మరొకరు కాంప్సన్‌లు. ఈ అరిస్టొక్రాట్లతో


కాంప్సన్‌ల కంచెవైపు చూస్తాడు. నెల తర్వాత సోదరుడు క్వెంటిన్ మృతదేహం హార్వర్డ్ నుండి యింటికి వచ్చినప్పుడు తనను చూడనివ్వరు. కొన్నాళ్ల తర్వాత బెంజీ ఆడపిల్లల వెంట పరిగెడతాడు. ఒకర్ని స్పృశిస్తాడు. ఊరివాళ్ల ఆరోపణలతో బెంజీకి పురుషత్వం లేకుండా చేస్తారు. రెండేళ్ల తర్వాత తండ్రి మరణిస్తాడు. చేతిలో పూలు పట్టుకుని తల్లివెంట, గుర్రబ్బండీలో సమాధులవైపు వెళతాడు. దారిలో జేసన్‌ను బండిలో ఎక్కించుకుంటాడు. అతడు అంత్యక్రియలు చూట్టానికి నిరాకరిస్తాడు. బండి పోతుంది.

క్వెంటిన్, జూన్-2, 1910

1. వర్తమానం: క్వెంటిన్ జీవితంలో చివరిరోజు. పెందరాళే లేచాడు. గడియారం చప్పుడు వినిపిస్తున్నది. రూమ్మేట్ శ్రీవ్ అతణ్ణి త్వరగా తెమలమంటాడు. చర్చికి ఆలస్యమవుతుందేమో. ట్రంకును తన వస్తువులతో నింపుతాడు. ఎవరెవరెవరికి ఏయే దుస్తులివ్వాలో రాసి పెడతాడు. స్నానం చేసి, షేవ్ చేసుకుని,

పాటు ఎలాగైనా పైకి రావాలనుకునే పేదలు స్నోప్స్. ఇది దక్షిణ రాష్ట్రం గనక నీగ్రోలు ఎట్లాగూ బాగానే ఉన్నారు.

పందొమ్మిదో శతాబ్దంలో, ఫ్రెంచి రచయిత బాల్జాక్ రాసిన 'హ్యూమన్ కామెడీ' ప్రేరణతో సమాజ సమగ్ర చిత్రణ కోసం, ఇంచుమించు ఒకే పాత్రలతో అనేక నవలలు, కథలు రాయాలనుకున్నాడు ఫాక్నర్.



అప్పటికే జాయిస్ 'యూలిసీస్' కథన సంప్రదాయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. వర్జీనియా వూల్ఫ్‌తో సహా, చాలామంది రచయితలు 'చైతన్య స్రవంతి' టెక్నిక్‌ను స్వంతం చేసుకున్నారు. ఇందులో ఎవరి ప్రత్యేకత, ప్రతిభ వాళ్లదే. 'ది సౌండ్ అండ్ ది ఫ్యూరీ' కూడా ఇదే పద్ధతిలో సాగిన నవలే. ఈయన మరో నవల 'యాజ్ ఐ లే డయింగ్'. ఇది ఇంటర్నల్ మోనోలోగ్స్‌లో సాగుతుంది. 1932లో వచ్చిన 'లైట్ ఇన్ ఆగస్ట్' మరో ముఖ్య రచన. 1936నాటి 'అబ్సాలం అబ్సాలం' అత్యంత సంక్లిష్ట నవల. ఫాక్నర్ వూహా జగతి కథ 'ది అన్ వాంక్విష్డ్' (1938), 'గో డౌన్, మోజెస్', 'ఇంట్రూడర్ ఇన్ ది డస్ట్' (1948), 'ది హామ్లెట్'(1940), 'ది టౌన్' (1957), 'ది మాన్షన్' (1959)దాకా కొనసాగుతుంది.

నోరులేని సామాన్యులకు గొంతునిచ్చిన రచయిత ఫాక్నర్. కాని కథన సంక్లిష్టత వల్ల, శైలీ విన్యాసాల వల్ల ఈయన పాఠకాదరణ పొందలేకపోయాడు. కథ చివరన ప్రారంభించి, వెనక్కు వెళ్లటం ఈయన రచనల ప్రత్యేకత. ఒక రకంగా ఇది సినిమా టెక్నిక్. లేదా రెండు మూడు కథలను కలగలిపి చెప్పటంతో పాఠకుడు గందరగోళంలో పడే ప్రమాదమూ ఉంది. 'రచయిత అన్ని వివరాలూ స్పష్టంగా చెప్పకూడదు. పాఠకుడికి ఆలోచించే అవకాశమివ్వాలి' అంటాడు. ఈయన తరచుగా వాడిన మరో టెక్నిక్, అనేక కోణాల నుండి కథ చెప్పటం. కేవలం గ్రామీణ ప్రాంతాల గురించి, అది కూడా గతకాలపు స్మృతుల గురించి రాసి సార్వజనీనము, సర్వకాలీనమైన మానవుని ఆత్మను ఆవిష్కరించిన రచయిత ఫాక్నర్.

'కథలు రాయలేక పిచ్చెత్తి పోతున్నానని చెప్పాడు. ఎన్ని గంటలు ఆ ధోరణిలో మాట్లాడాడో! అతడు చెప్పింది పెద్దగా అర్థం కాకున్నా ఆ కుర్రాడు బాధ అనే చీకటి గుహలో ప్రవేశం చదలచుకుంటున్నాడని మాత్రం తెలిసింది' అని చెప్పాడు, షెర్వుడ్ ఆండర్సన్, ఫాక్నర్‌తో తొలి సమావేశం గురించి. ఆయన రచనలన్నిట్లోనూ పాఠకుల మనసుల్ని మెలిపెట్టేది ఈ బాధే.

ట్రాంలో బోస్టన్‌కెళ్లి తిండి తింటాడు. ఒక గడియారం షాపుకెళ్లి, ఒక్క గడియారమూ సరైన టైం చూపించటం లేదేమిటంటాడు.

ఒక ఇనుప వస్తువుల దుకాణంలో ఆరు పౌండ్ల బరువులు రెండు కొంటాడు. ఎందుకంటే వాటిని శరీరానికి కట్టుకోవాలి. తరువాత కేంబ్రిడ్జి వైపు కదులుతాడు. చార్ల్స్ నదిలో, గెరాల్డ్ బ్లాండ్ పడవ నడపటం చూస్తాడు. అనువైన చోటుకోసం వెదుకుతున్నాడు. అనేక ప్రదేశాలు తిరిగి, మధ్యాహ్నం వరకు స్టోన్‌బ్రిడ్జి అనుకూలంగా ఉందని నిశ్చయించుకుంటాడు. బరువులు కట్టుకుంటాడు.

బ్రిడ్జి మీద నిలబడి ముగ్గురు కుర్రాళ్లను చూస్తాడు. వాళ్లు చేపల కోసం వెదుకుతున్నారు. మరింత ముందుకు కదులుతాడు. చర్చిగోపురం మీది గడియారం కనిపిస్తుందిగాని చూడటానికి ఇష్టపడడు. బేకరీ వద్ద ఆగి, లంచ్‌కోసం ఒక బన్ను కొనుక్కుంటాడు. ఓ చిన్నపిల్ల కనిపిస్తే, ఆమె కోసం మరోబన్ను, ఐస్‌క్రీం కొంటాడు. పిల్ల అతడి వెంట నడుస్తుంది. ఆమెను పెద్దవా

ళ్ళకు అప్పగించమంటారు ఇద్దరు వ్యక్తులు. కాని ఆ పిల్ల తనెక్కడుంటుందో చెప్పదు. ఆమె కళ్లుగప్పి వెళ్లిపోవటానికి క్వెంటిన్ గోడెక్కుతాడుకాని పిల్ల తనవైపే చూస్తుంటుంది. ఇద్దరూ కలిసి నదికి మరింత చేరువగా నడుస్తారు. ఆ వూరి షెరిఫ్ ఆ పిల్లను కొట్టాడని ఆరోపిస్తాడు. ఈ వింత అభియోగానికి బిగ్గరగా నవ్వుతాడు క్వెంటిన్. అతణ్ణి మెజిస్ట్రేట్ ముందర ప్రవేశపెడతారు. అతని తరపున ఆరుడాలర్ల జరిమానా కట్టటానికి వస్తారు శ్రీవ్, స్పోడ్. కోర్టు వెలుపల గెరాల్డ్ బ్లాండ్, అతడి తల్లి, మరో ఇద్దరు ఆడపిల్లలు కనిపిస్తారు. అందరూ పిక్నిక్ వెళ్లటానికి నిరీక్షిస్తున్నారు. మహిళల శీలం గురించి గెరాల్డ్ చేసిన వ్యాఖ్యతో కోపగించిన క్వెంటిన్ అతణ్ణి మొహం మీద గుద్దడంతో ముక్కులోంచి రక్తం కారుతుంది. కేంబ్రిడ్జికి తిరిగొచ్చాడు.

డార్మిటరీకి చేరుకుని, గుడ్డలు మార్చుకుంటూ క్వెంటిన్ కోటు శుభ్రం చేసుకుంటాడు. గడియారం గంటలు కొట్టింది. శ్రీవ్‌కు ఉత్తరం రాసి అతడి టేబుల్ మీద పెడతాడు. తర్వాత పళ్లు తోముకుని, టోపీ పెట్టుకుని ఆత్మహత్య చేసుకుంటాడు.

2. గతం

బెంజీలాగ, ముసలమ్మ అంత్యక్రియ సందర్భంగా, కాడీ డ్రాయర్లు చూసిన విషయం గుర్తు చేసుకుంటాడు. అతని ఆలోచనలన్నీ కాడీ శీలం గురించే. పదిహేనేళ్ల కాడీ, ఓ కుర్రాణ్ణి ముద్దుపెట్టుకుని, అతడే తనను ముద్దుపెట్టుకున్నాడని చెప్పినప్పుడు, కోపంతో ఆమె మొహాన్ని గడ్డిలో రాస్తాడు. క్వెంటిన్ కూడా మరో అమ్మాయి నటాలీని ముద్దు పెట్టుకున్నాడని దెప్పిపొడుస్తుంది కాడీ. ఆ రోజు తనూ, ఆ అమ్మాయి నిజంగానే ముద్దుపెట్టుకున్నారు. తెలిసీ తెలియనితనంతో మొగుడూ-పెళ్లాల ఆట ఆడుకున్నారు. కాడీ తమను చూస్తున్నదని గమనించలేదు. తర్వాత చాలా సిగ్గుపడ్డాడు. అసలేం జరిగిందో కాడీకి చెప్పాలనుకున్నాడు. కాని ఆమె వినటానికి ఇష్టపడకపోవటంతో బలవంతంగా ఆమెను కిందికి లాగి, కొట్టి, ఒళ్లంతా బురద పూశాడు. కాడీ అతడి మొహం రక్కింది. పొరపాటైందని చెప్పింది. ఇద్దరూ నీళ్లలో దిగి శుభ్రం చేసుకున్నారు.

డాల్టన్ ఏమ్స్‌వల్ల కాడీ కన్యత్వం కోల్పోవటం.. బెంజీ బిగ్గరగా అరచినప్పుడు, మాట్లాడలేని బెంజీ కేకల్ని అర్థం చేసుకోగల క్వెంటిన్, అది అంగీకారంతో జరిగిందా లేక బలవంతం చేశాడా అని అడగాలనుకుంటాడు. కాడీ, నీళ్లలో కూర్చుని వుంది. ఏమ్స్ గురించి గుచ్చిగుచ్చి అడుగుతాడు. "బలవంతం చేశాడా? గాయ పరిచాడా! అదే నిజమైతే వాణ్ణి చంపేస్తాను. ఇద్దరం కలసి పారిపోదాం" అంటాడు. అసలు తనకు 'సెక్సు అనుభవముందా?' అని క్వెంటిన్‌ను తిరిగి ప్రశ్నిస్తుంది కాడీ. నిస్సహాయంగా ఏడుస్తాడు క్వెంటిన్. ఆమె మురికి డ్రాయర్ల దృశ్యం గుర్తుకొస్తుంది. ఆమె గొంతు మీద కత్తిపెట్టి ఇద్దరం చచ్చిపోదామని అంటాడు. అతనికంత మనోధైర్యం లేదని ఆమెకు తెలుసు.

ఏమ్స్‌ను కలుసుకోకుండా కాడీని నిరోధించలేదు. ఇద్దరూ ఆలింగనం చేసుకున్నప్పుడు దూరం నుండి చూస్తాడు. నిరాశగా వెనుతిరుగుతాడు. అతడి పరిస్థితి గమనించిన కాడీ, తనను తాను అర్పించుకోవటానికి సిద్ధమంటుంది. ఎటూ తేల్చుకోలేదు. కొన్నాళ్లకు ఏమ్స్‌ను వదిలిపెట్టమని హెచ్చరిస్తాడు. కాని ఏమ్స్, క్వెంటిన్ మాటల్ని పట్టించుకోక, ఆడవాళ్లందరూ 'లం.'లే అంటాడు. ఒంటిమీద స్పృహలేనంత తీవ్ర ఆగ్రహంతో ఏమ్స్ మీద దాడి చెయ్యబో

తాడు క్వెంటిన్. కాని అతణ్ణి అలవోకగా పక్కకు తోసేసి, పిస్టల్ తీసుకుని కాలవ లోకి ఒకసారి కాల్చి, తీసుకోమ్మని క్వెంటిన్ కిస్తాడు. పిస్టల్ చప్పుడు విన్న కాడీ పరిగె త్తుకొస్తుంది. అతడు క్వెంటిన్‌ను గాయపరి చాడని భయపడింది.

కాడీ కన్యత్వాన్ని పోగొట్టుకోవటం, ఆడపి ల్లలకు సాధారణంగా జరిగే విషయమేనని క్వెంటిన్‌కు నచ్చచెబుతాడు కాంప్సన్. ఈ విషయానికే ఆత్మహత్య చేసుకోవాలా?

ఏమ్స్‌తో సంబంధం తెగదెంపులు చేసు కుని, హెర్బర్ట్‌హెడ్‌ను వివాహం చేసుకోవా లనుకుంటుంది కాడీ. క్వెంటిన్‌కు ఇది నచ్చదు. అతణ్ణి చేసుకోవద్దని కాడీని చా లాసార్లు బతిమాలతాడు క్వెంటిన్. కాని పెళ్లి చేసుకునే అవకాశం అతనికివ్వమం టుంది కాడీ. పెళ్లికి ముందురోజు, తండ్రినీ, బెంజీనీ జాగ్రత్తగా చూసుకొమ్మని క్వెంటి న్‌ను కోరుతుంది. హెడ్‌ను చేసుకోవద్దని మరోసారి కాడీని అడుగుతాడు క్వెంటిన్. ఆమెను కౌగిలించుకోబోతాడు కాని ఆమె అతణ్ణి వెనక్కు నెట్టి, తనిప్పటికే గర్భవతి ననీ, పెళ్లి చేసుకోక తప్పదనీ చెబుతుంది. అంతేకాదు, తనకు ఇతర ప్రేమికులున్నారని కూడా చెబుతుంది. బుద్ధిగా కాలేజీ చదువు ముగించి కుటుంబానికి సాయపడటం తన బాధ్యత అని క్వెంటిన్‌కు నచ్చజెబుతుంది.

జేసన్, ఏప్రిల్ 6, 1928

క్వెంటిన్, తండ్రీ మరణించారు. కాడీ వెళ్లి పోయింది. ఇప్పుడు కాంప్సన్‌ల కుటుంబా నికి తనే పెద్ద. మనకు అపఖ్యాతి తేలేదు నువ్వు, అంతేచాలు అంటుంది తల్లి. కొన్నాళ్ల క్రితం కాడీ భర్త హెర్బర్ట్‌హెడ్ బ్యాంకుద్యోగం ఇప్పిస్తామని ఆశపెట్టాడు. కాని అది అబద్ధమని తేలింది. భార్యతోనే తెగదెంపులు చేసుకున్నాడతడు. కాడీ నెల నెలా తల్లికి పంపిన రెండువందల డాలర్ల చెక్కులు దొంగిలిస్తాడు జేసన్. కూతురు చెక్కులు పంపిందని తల్లికి తెలుసు. కాని అసలు చెక్కులు తను తీసుకుని నకిలీ చెక్కులు ఆమెకిస్తాడు. తలవంపులు తెచ్చిన కూతురి డబ్బు తీసుకోనని ఆ నకిలీ చెక్కు లన్నీ తగలేస్తుందామె.

తల్లికి తెలియకుండా ఆమె డబ్బుల్ని కాజేసి గుమాస్తా ఉద్యోగంలో సెటిలవు తాడు జేసన్- తల్లి డబ్బులతో కారు కొన్న జేసన్‌కు ఆ పెట్రోల్ పొగలతో ఆరోగ్యం పాడై ఊపిరి తీసుకోవటానికి కర్పూరం కట్టిన జేబు రుమాలు వాడతాడు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టుబడి పెట్టిన జేసన్ దాని కదలికలను గమనించక క్వెంటిన్ ఎవరితో పోతుందన్న విషయంలో ఆసక్తి కనపరు స్తాడు. స్టాక్ మార్కెట్ పెట్టుబడులతో నష్టం వస్తుంది. జేసన్‌కు యూదులన్నా, నీగ్రోలన్నా ద్వేషమే.

ఈస్టర్ ఆదివారం, ఏప్రిల్ 8, 1928

ఈ చివరి భాగంతో, మొదటి మూడు భాగాల కథా కలుస్తుంది. కాంప్సన్ కుటుంబం బతికిపోయింది. నీగ్రో డిల్సీ మాత్రం, బ్రేక్‌ఫాస్ట్ వండుకుని నల్లప్రీస్ట్ నిర్వ హించే ఈస్టర్ ప్రార్థనలకు వెళ్తుంది. తను దాచుకున్న ఏడువేల డాలర్లను తీసుకుని క్వెంటిన్ పారిపోయాడని తెలుసుకుంటాడు జేసన్. క్వెంటిన్ గురించి పోట్లాట పెట్టు కుని, ఒక వంటమనిషిగా తన్నులు తింటా డు. చివరిసీనులో లస్టర్ డ్రైవ్ చెయ్యగా బెంజీని ఇంటికి తీసుకొస్తుంది డిల్సీ. లస్టర్ గుర్రబ్బండీని వెనక్కి తిప్పుతాడు. బెంజీ అరుస్తాడు. ఈ కేకలు విన్న జేసన్, లస్టన్‌ను తీవ్రంగా కొడతాడు. నార్సిసస్ మొక్కను చేతిలో పట్టుకున్న బెంజీకి యివేమీ పట్టవు.

ఈ నవల పేరును షేక్స్‌పియర్ నాటకం 'మాక్‌బెత్' లోంచి తీసుకోవడమైనది. 1929 ఇది అచ్చయినప్పుడు 'జీనియస్ అనే మాటకు అర్థుడు ఫాక్నర్' అంటూ ప్రశంసిం చింది స్పెక్టేటర్ పత్రిక.

– ఎం. వసంత

కొత్తగాలి...

బడికెళ్లని డాక్టర్ చక్రవర్తి
గుడికెళ్లని భక్తతుకారాం
నటనకు నడకలు నేర్పిన గడుసరి
అలుపెరగని ఆ 'బాటసారి'

– బి.వి. నరసింహారావు,
పేరాల, ప్రకాశం జిల్లా

కొత్తగాలి...

పురిట్లోనే చీదరించుకుంది అమ్మ!
పురిటిమంచం మీదనే
పీక నులిమాడు నాన్న!
ఇంతకీ నేను చేసిన తప్పు
ఆడపిల్లగా పుట్టడమే!!

– *బొడ్డేడ బలరామస్వామి, కశింకోట*

కొత్తగాలి...

మనం మన ఉగాదిని
పక్కన పడేశాం..
పరదేశ ఉగాదిని
పూజిస్తున్నాం...!

– ఆర్.ఎస్. హైమవతి, చెన్నై

కొత్తగాలి...

ఆంగ్ల సంవత్సరాది
ఆధిపత్యంతో..
తెల్లబోతోంది..
తెలుగు సంవత్సరాది!

– వెల్మల రాంరెడ్డి,
పూడూరు, కరీంనగర్ జిల్లా

కొత్తగాలి...

శిశిరం
శిబిరం ఎత్తేస్తే..
వసంతం
వచ్చి వాలింది!

– వెల్మల రాంరెడ్డి,
పూడూరు, కరీంనగర్ జిల్లా

కొత్తగాలి...

శిశిరం
శిబిరం ఎత్తేస్తే..
వసంతం
వచ్చి వాలింది!

– వెల్మల రాంరెడ్డి,
పూడూరు, కరీంనగర్ జిల్లా

మనసున ఉన్నదీ...

★ చక్కని చిన్నారి ముఖచిత్రంతో వచ్చిన ఫిబ్రవరి సంచిక ఆహ్లాదకరంగా ఉంది. శాంత సుందరి అనువాద నవల 'నన్ను క్షమించు చిన్నూ!' మనసును కదిలించింది. శరత్‌బాబు తొట్టతొలి కథ కోరేల్ ఆలోచనాత్మకంగా ఉంది. చతుర 'సమ్'గతులు తెలుసుకోదగ్గవిగా ఉన్నాయి. మల్లాదివారి పాటలు, రచనలు ఎంత రసరమ్యంగా ఉంటాయో, అతని చతురోక్తులు కూడా అంత హాస్యంగా ఉన్నాయి. 'నవలావలోకనం'లో పూజారి నవల సమీక్ష రసవత్తరంగా సాగింది. 'కొత్తగాలి' చిరుకవితలు మధురాతిమధురంగా ఉన్నాయి.

– *డాక్టర్ శివభూషణం,* కర్నూలు

★ 'నన్ను క్షమించు చిన్నూ!' వైవిధ్యభరితంగా సాగింది. ఈ సమాజాన్ని క్షమించమని చిన్నూని అడిగే అర్హత కూడా మనకు లేదు. మానసికరోగుల పట్ల వైద్యుల తీరు, కుటుంబ సభ్యుల నిరాదరణ వంటి ఎన్నో విషయాలను ఈ నవల ద్వారా తెలియజేశారు. కంటతడి పెట్టించిన రచనా కౌశలానికి అభినందనలు!

– *జి. గోపాలకృష్ణ,* అరసవిల్లి

★ కుటుంబసభ్యుల తిరస్కారానికి గురైన కుర్రాడి జీవితం 'నన్ను క్షమించు చిన్నూ' ఆద్యంతం ఆకట్టుకుంది. పిల్లల భవిష్యత్తుపై పెద్దల ఆలోచనలలో ఉండే అపోహలకు అద్దం పట్టిందీ నవల. అనువాదం చాలా బాగుంది. 'కోరేల్', 'జ్ఞాపిక' కథలు కూడ బాగున్నాయి.

– *బిక్కునూరి రాజేశ్వర్,* పొన్కల్

★ హారిక ముఖచిత్రంతో 'చతుర' ఆకర్షణీయంగా ఉంది. సుషమ్ బేదీ నవలకు శాంత సుందరి అనువాదం గొప్పగా ఉంది. నూనూగు మీసాల యవ్వనంలో ఒక యువకుడి ఉత్కంఠను భావోద్వేగంగా చిత్రించారు. చిన్నూ వ్యాధి ఫలానా అంటూ ఎక్కడా చెప్ప లేదు. మొత్తంగానే ఒక వైవిధ్యమైన కుటుంబగాథ ఈ నవల. ఆద్యంతం చదివింపజేసింది.

– *పక్కి బాలకృష్ణారావు,* గరివిడి

★ ఫిబ్రవరి చతుర నవల 'నన్ను క్షమించు చిన్నూ!' విడవకుండా చదివించింది. మిగిలిన కథలూ చాలా బాగున్నాయి. 'అక్షరధార'లో ఆణిముత్యాల్లాంటి పద్యాలను అందించారు. ధన్యవాదాలు.

– *కరణం శివానందరావు,* కర్నూలు

★ ఫిబ్రవరి చతుర సంచిక వినూత్న కథానికలతో వెలువడి ఇంటిల్లిపాదినీ అలరించింది. నవల ఆసక్తిగా సాగింది. పెద్దకథ 'కోరేల్', అక్షరధార బాగున్నాయి.

– *బగుడు వెంకటలక్ష్మి, బగుడు అనిత,*
చింతపల్లి, విశాఖ జిల్లా

★ 'నన్ను క్షమించు చిన్నూ!' నవల ఎన్నో విషయాలను చర్చించి, పాఠకుల అంతరంగాలను కదిలించింది. ఇందులో పెద్దల ఆలోచనల్నీ, అపోహల్నే కాక నిగూఢమైన బాధను కూడా రచయిత్రి సుషమ్ బేదీ చిత్రించారు.

–*వి. సన్యాసయ్య,* తుని

★ చతుర ముఖచిత్రాలుగా పిల్లల ఫొటోలు పత్రికకు వన్నె తెస్తున్నాయి. ముఖ్యంగా ఫిబ్రవరిలో వచ్చిన పాపిటబిళ్ళ ముగ్ధమోహిని హారిక ముఖచిత్రం చాలా బాగుంది.

– *వెల్మల రాంరెడ్డి,* పూడూరు

★ 'నన్ను క్షమించు చిన్నూ!' నవల ఆసాంతం చదివించింది. అక్కడక్కడా ఒళ్ళు గగుర్పొడిచే సన్నివేశాల కల్పన బాగుంది. 'జ్ఞాపిక' కథలో మాతృత్వం గొప్పతనాన్ని బాగా చిత్రించారు. చతుర 'సమ్'గతుల వల్ల ఎంతో ప్రపంచ జ్ఞానం తెలుస్తోంది. మల్లాది రామకృష్ణశాస్త్రి చతురోక్తులు బరువైన కథల మధ్య హాయిగా అనిపించాయి. అక్షరధార సూక్తులు కూడా ఎంతో బాగున్నాయి.

– *ఎన్వీ రమణి,* బంజారాహిల్స్

చిరునామా : సంపాదకుడు, చతుర, ఈనాడు కాంప్లెక్స్, రైల్వే గూడ్స్‌షెడ్ రోడ్డు, మూసాపేట విలేజి, బాలానగర్ (మండలం), హైదరాబాద్- 72, రంగారెడ్డి జిల్లా.
ఈ మెయిల్ : vipula.chatura@gmail.com
vipula.chatura@eenadu.net

నవలావలోకనం 4

మునిపల్లె రాజు

పూజారి

'పూజారి' నవల 1952లో ప్రచురితమైనప్పటికీ ఎంతోమంది సాహితీప్రియులకి నేటికీ గుర్తుండిపోయింది. దిగులు, ఉదాసీనత, నిర్లిప్తత, నిరాసక్తతలాంటి విభిన్న మనస్తత్వ వ్యక్తీకరణలను చిత్రీకరించడం పెద్ద సవాలైనా రచయిత మునిపల్లెరాజు అలవోకగా దాన్ని సాధించారీ నవలలో. ఈ నవల ఆధారంగా బి.ఎన్.రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన 'పూజాఫలం' సినిమా 1964 జనవరి 1న విడుదలైంది. ఆ సినిమా వచ్చి యాభైఏళ్లయినా అందులోని 'పగలే వెన్నెల.. జగమే ఊయల' సంగీతప్రియులను నేటికీ ఉయ్యాలలూగిస్తూనే ఉంది.

చిన్న కథనైనా, నవలనైనా సినిమాగా తీయడం చాలాకష్టం. ఎందుకంటే కథా రచనలో వర్ణించినదంతా దృశ్యరూపంగా తెరమీదకి రాదు. 'అతను మన్మథుడిలా ఉన్నాడు' అని కథలో రాసేయవచ్చు అది దృశ్యంగా మార్చటం చాలా సున్నితమైన ప్రక్రియ. అలాగే ఓ రచనను సినిమా చేయాలనుకున్నప్పుడు కథా గమనం, కాలంలాంటి అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. వీటన్నిటికన్నా కష్టమైంది మనస్తత్వ చిత్రణ.



మునిపల్లె రాజు

దిగులు, ఉదాసీనత, నిర్లిప్తత, నిరాసక్తత.. ఇలాంటి విభిన్న వ్యక్తీకరణలను చిత్రీకరించడం పెద్ద సవాలు. 'పూజారి' నవలకి పునాది మానసిక ప్రపంచమే. అందుకే, 'పూజాఫలం' చిత్రం ఎందరికో నచ్చినా, ప్రఖ్యాత దర్శకులైన బి.ఎన్. రెడ్డికి ఎంతో కీర్తినిచ్చినా, రచయిత మునిపల్లెవారికి కొన్ని అభ్యంతరాలు ఉండిపోయాయి.

'పూజారి' నవల ఆరంభమే ఎంతో గాఢమైంది. రచయిత ప్రత్యేక తాత్వికత, అంతర్దృష్టి ఎలాంటిదో తెలిపే ఆరంభం. ఆ ఊరి పార్క్‌తో కథ మొదలవుతుంది.

ఆ పార్క్ ఆలనాపాలనా ఎవరికీ పట్టనట్టుగా ఉన్న పరిస్థితి.. అది ఉపయోగంలో ఉన్నా ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు వాడుతున్నారు. శిథిలావస్థకి చేరుతున్న దాని పరిస్థితిగానీ, పచ్చగా సౌందర్యంతో ఉండాల్సిన దాని అవసరాన్ని గానీ గుర్తించినవాళ్ళు లేరు. పార్క్ ప్రజా జీవితానికి, సామాజిక చైతన్యానికి, వ్యక్తి వికాసానికి కూడలి. ఆ విషయాన్ని రచయిత సూచిస్తూ, నవలానాయకుడు మధు జీవితాన్ని పాఠకులకి పరిచయం చెయ్యటానికి చక్కగా వాడుకున్నారు. నవల ఆరంభానికి ఇంతటి సృజనాత్మక తాత్విక శిల్పం చాలా అరుదుగా చూడగలుగుతాం.

పెద్ద జమీ అంతటి ఆస్తికి ఏకైక వారసుడు మధు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోయారు.

ఎవరూ తీర్చలేని లోటు అది. తాతగారు మధుని సంరక్షించినా, క్షయ వ్యాధి కారణంగా ఆరోగ్యం కోసం మదనపల్లె శానిటోరియం, నీలగిరి కొండల్లో కాలం గడుపుతున్నాడు. నమ్మకమైన గుమాస్తా రామకృష్ణయ్య, సొంత బిడ్డలా సాకిన ఇంటి నౌకరు రంగప్ప ఎవరూ లేని మధుని ఎంతో అపురూపంగా చూసుకుంటుంటారు. ఆస్తి, సౌకర్యం, సంరక్షణా వున్నా మధుకి ఉత్సాహం లేదు. ఒంటరిగా గడచిన బాల్యం దానికి చాలా వరకు కారణమైతే, అతని దిగులు మనస్థత్వం కూడా దానికి తోడవుతుంది. 'అతడు నిరాశా వేదాంతి' అన్న ఒక్క వాక్యంతో మధు తత్వానికి రచయిత పటం కట్టగలిగారు. 'తను జన్మించింది.. తనదైన ప్రతి వస్తువునూ, తను కోరిన ప్రతిదాన్నీ కోల్పోవటానికేననే సంక్షోభిత నమ్మకంతో అతను జీవనయాత్ర సాగిస్తున్నాడు' అంటారు మధు గురించి. ఈ తత్వమే 'పూజారి' నవల ఆయువుపట్టు. నవల ఆరంభంలోని పార్కుకి, మధుకి సామీప్యం చదువరుల మనసుల్లో మెదుల్తుంది.

అతని అనాసక్త జీవితానికి భిన్నంగా, మధుకి రెండు అలవాట్లున్నాయి. ఒకటి సంగీతం పట్ల ఆసక్తి, అభిరుచి. రెండోది అంతగా చదువుకోవాల్సిన అవసరం లేకపోయినా, క్రమం తప్పకుండా కాలేజీకి వెళ్లటం. తప్పనిసరిగా చెయ్యాల్సిన కార్యాలేం అతనికి లేవు. ఇల్లు, ఆస్తి వ్యవహారం అంతా రామకృష్ణయ్య, ఇంటి పనంతా నౌకరు రంగప్ప చూసుకుంటారు.

ఊళ్ళో దొంగతనాలు ఎక్కువగా ఉండటం వల్ల తాతయ్య సలహామేరకు, ఆ పెద్ద ఇంటి కిందిభాగం ఓ బేంక్ మేనేజర్‌కు అద్దెకిచ్చారు. ఆయన కూతురు ప్రీతి. ఆ ఇంటికి ప్రీతి రాక, ఓ అనూహ్య అనుభవం మధుకి. మధు తీరుకి పూర్తిగా భిన్నమైనది ప్రీతి తీరు. ఆమెతోటి తొలి, మలి పరిచయాలే మధుని ఓ మధురానుభూతిగా కమ్మేశాయి. ఆమె అల్లరి, చొరవ, అతని ప్రమేయం లేకుండానే వచ్చి వెళ్లటం.. 'గాలివాన వలె వచ్చి, పూలజల్లు వలె పోయింది' అన్న ఒక వాక్యంతో ప్రీతి నడవడిని, మధు పరిస్థితిని కళ్ళకు కట్టించారు రచయిత. కొద్ది కాలంలోనే ప్రీతి, మధుకి సర్వస్వం అయిపోయింది. అస్తమానం ఆమె ధ్యాసే. 'నిరాశా పరివేధిత వేదాంతంలో సున్నితమైన జడునిగా మారిన మధు, ఆ వసంత వాయు ప్రసారంతో తిరిగి చైతన్యవంతుడు కాసాగాడు. ప్రీతి వసంతవాయువు' అంటారు రచయిత. 'ఆ విశ్వాస దేవతను చూచి బతుకునే నమ్మవచ్చు, మృత్యువునే కౌగలించవచ్చు' అన్నంత మార్పు మధులో. ఆడపిల్లతో మాట్లాడటమే ఎరగని మధుకి అదో దైవానుభూతి.

ప్రీతిలాగే, మధుకి పట్నంలో చదువు దగ్గర మరో పరిచయం అయింది. అది శ్రీరాంతో. అతడు కావడానికి పేదవాడైనా, ధ్వనించే ఆత్మ బలం లాంటివాడు. భవిష్యత్తుమీద గొప్ప నమ్మకం. 'శ్రీరాం మధుకి బాగా నచ్చాడు. ఆత్మీయత ఏర్పడింది. కొంచం తరచిచూస్తే.. ప్రీతి ఎందుకు నచ్చిందో, మధుకి శ్రీరాం కూడా అందుకే నచ్చాడు. మధుకి నచ్చింది, తనలో లేని, వాళ్ళలో ఉన్న ఆశ, ఆత్మబలం.

ఇటువంటి మధు మానసిక జీవనయానం 'పూజారి' నవల. ప్రీతిని ప్రేమిస్తూనే, 'ఆమెను ప్రేమించటం వృథా' అన్న నిర్లిప్తత. తను కోరుకున్నది ఏదీ తనకి దక్కదు, ప్రీతీ దక్కదన్న భయపూరిత నిరాశ. చివరికి అలాగే జరుగుతుంది. ప్రీతి మధు జీవితంలోకి ఎంత అకస్మాత్తుగా వచ్చిందో, అంత అకస్మాత్తుగానే అంతర్ధానమైంది. బాంక్ మేనేజర్ గారికి ట్రాన్స్‌ఫర్ వల్ల ఆ ఊరునుంచి వెళ్లిపోయారు.

ఈ నవలలో మరో బలమైన పాత్ర, గుమాస్తా రామకృష్ణయ్య కూతురు సుశీల. మధుపట్ల ఆమెది ఓ అజ్ఞాత మూగ ఆరాధన. ప్రీతి వెళ్లిపోయిన తర్వాత, తాతగారి మరణంతో నిరాశలో కూరుకుపోయి, కోర్టు తగాదాలలో ఆస్తి చిక్కుకున్న సమయంలో మధు మరింతగా కృంగిపోతాడు. రామకృష్ణయ్య మంచమెక్కిన ఆ సమయంలో సుశీలే, అహర్నిశ శ్రమతో ఇంటినీ, మధుని సంరక్షిస్తుంది. ఈ క్రమంలో సుశీల సౌశీల్యతకి దగ్గరైన మధు ఆమెని అర్ధాంగిగా స్వీకరిస్తాడు.

కొన్నాళ్ళపాటు నీలనాగిని అన్న వేశ్యా లోలత్వంలో మధు సర్వం మరచిపోవటం, ఆ ఇంటి డబ్బు, నగలు కరిగిపోవటం లాంటి సంఘటనలు ఈ నవలలో ఉన్నాయి.

సుశీల, మధు వివాహం. దానికి ముందు వెనకగా ప్రీతి, శ్రీరాం వాళ్ళకి తారసపడి మేలు చెయ్యటం.. నవలలోనూ, 'పూజాఫలం' సినిమాలోనూ వున్నా, రెండింటికీ చాలా భేదం వుంది. 'పూజాఫలం'లో మధుకి తాత్కాలిక మానసిక అనారోగ్యం కలిగితే, శ్రీరాం డాక్టరుగా, అతని భార్య ప్రీతి తన ఆనాటి 'పగలే వెన్నెల' పాట

కథల రారాజు.. మునిపల్లె రాజు

తెలుగుకథను సుసంపన్నం చేసిన రచయితల్లో అగ్రగణ్యులైన మునిపల్లె రాజు 1925, మార్చి16న గుంటూరు జిల్లాలో పుట్టారు. ఆయన భారత రక్షణ మంత్రిత్వశాఖలో ఇంజనీరింగ్ సర్వీసులో ఉద్యోగం చేశారు. అస్తిత్వ వాద ఆందోళనలను తన కథల్లో అత్యద్భుతంగా చిత్రించారు. మేజికల్ రియలిజం అనే విలక్షణమైన సాహితీ ప్రక్రియలో రచనలు చేసిన కొద్దిమంది తెలుగు ప్రముఖుల్లో ఆయన ఒకరు. 'మునిపల్లె రాజు కథలు', 'పుష్పాలు-ప్రేమికులు-పశువులు', 'దివో స్వప్నాలతో ముఖాముఖి', 'అస్తిత్వనదం ఆవలి తీరాన' అనేవి ఆయన కథాసంపుటాలు. 'వేరొక ఆకాశం-వేరెన్నో నక్షత్రాలు', 'అలసిపోయినవాడి అరణ్యకాలు' అనే కవితా సంపుటాలు కూడా ఆయన సాహితీ కృషిలో భాగమే. రచయితలు, కవులమీద ఆయన రాసిన అరుదైన సాహిత్య వ్యాసాలన్నీ 'జర్నలిజంలో సృజన రాగాలు', 'సాహితీ మంత్రనగరిలో సుస్వరాలు' పేరిట రెండు పుస్తకాలుగా వెలువడ్డాయి.

చాలా చిన్నవయసు నుంచే సాహిత్యం పై మక్కువ పెంచుకున్న మునిపల్లెరాజు తెలుగులో తొలితరం ఆధునిక రచయితలందరినీ చదివారు. దాంతోపాటు సుప్రసిద్ధ రష్యన్ రచయితలైన పుష్కిన్, గోగోల్, దోస్తోయేవ్‌స్కీ, టాల్‌స్టాయ్, గోర్కీ రచనల చేత ప్రభావితమై, ప్రేరణ పొందారు.

'అస్తిత్వనదం ఆవలి తీరాన' కథా సంపుటికి ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాన్ని, గోపీచంద్ పురస్కారాన్ని పొందారు.

స్మృతితో అతనికి స్వస్థత చేకూరుస్తారు. ఆ తర్వాత సుశీల, మధు చేరువతో సినిమా సుఖాంతం అవుతుంది. పూజారి నవలలో అలా లేదు. పెళ్ళయి కొన్నాళ్ళు సంసారం తర్వాత ఏడో నెలలోనే ఓ ఆడపిల్లని ప్రసవించి సుశీల మరణిస్తుంది. తర్వాత ఆ పుట్టిన పిల్లా మరణిస్తుంది. యాదృచ్ఛికంగా శ్రీరాం దగ్గరకి చేరిన మధుకి చెడిన ఆరోగ్యం కుదుటపడినా, అనుకోని పరిస్థితులు ఎదురై, తన ఆస్తిలోంచి సైంటిస్ట్ శ్రీరాం పరిశోధనలకి అవసరమైన డబ్బుని అందేలా చేసి, తన ఊళ్ళోని శిథిల దేవాలయం చేరతాడు. 'ఆ శిథిల మందిరం ఇప్పుడు కళకళలాడుతోంది. ఆ మందిరం ప్రాంగణంలోనే కొత్త పూజారి కుటీరం' అని నవలని ముగిస్తారు మునిపల్లె రాజు. ఇది విషాదాంతం.

ఈ నవల స్థూలంగా త్రిముఖ ప్రేమకథ. అప్పటి కొన్ని కథల్లోల్లాగే జమీందారీ నాయకుడు, పేదనాయికా, వీళ్ళిద్దరికీ భిన్నమైన ఉపనాయికా ఈ కథలోనూ ఉన్నారు. కానీ ప్రముఖమైన తేడా అల్లా ఈ పాత్రల వెనుకనున్న మానసిక ప్రపంచం, తాత్విక నేపథ్యం, వాటి ప్రతిభ ఈ నవలకి పూర్తిగా భిన్నత్వాన్ని కూర్చి అత్యున్నత స్థాయికి తీసుకెళ్ళింది. యాభయ్యోదశకం నాటికి తెలుగు సాహిత్యం మీద, బెంగాలీ నవలల ప్రభావం ఉద్ధృతంగా వుంది. 'పూజారి' నవల విషయంలోనూ ఈ బెంగాలీ క్లాసిక్స్ ప్రభావం కనిపిస్తుంది. అయినా ఈ నవలలోని పరిసరాలు, పాత్రలు, మనస్థత్వాలు పూర్తిగా తెలుగు జీవితానివే. అదే 'మునిపల్లె'వారి ప్రత్యేక ప్రతిభ.

పలు తరహా రచనలు ఎన్నో మునిపల్లె రాజు చేసినా 'పూజారి' అంత సుదీర్ఘ రచన మరొకటి లేదనే చెప్పాలి. ప్రఖ్యాత కథకులైనా ఆయన 'పూజారి'ని కథగా రాయలేదు. నవలావిస్తృతినే ఇచ్చారు. పెద్దకథగానైనా రాయటానికి కుదరని వస్తువిది. మంచి నవలాస్థాయికి ఇదో గీటురాయి.

తమ విస్తృత అనుభవంతో దర్శకులు బి.ఎన్. రెడ్డి, డి.వి. నరసరాజు 'పూజాఫలం' చిత్రాన్ని నవరసభరితంగా తీర్చిదిద్దారు. చాలా మంచి సినిమా అన్న పేరుతోపాటు ఆర్థికంగా విజయాన్ని గడించారు. ప్రేక్షక ఆదరణ ఎంతగానో లభించిన చిత్రమిది. అయినా సినిమాకోసం మూలకథలో చేసిన మార్పుల విషయంలో మునిపల్లెవారికి నిర్దిష్ట అభిప్రాయాలున్నాయి.

1952 నాటికి ఇంతగా మనస్థత్వ విశ్లేషణ మీద ఆధారపడిన తెలుగునవలలు అరుదు. మనిషిని అర్థం చేసుకోటంలో మానవతాదృక్పథంతో పాటు, శాస్త్రీయ అవగాహన తోడై ముందుకి సాగుతున్న కాలమది. అపజయభావం అనేది ఓ మానసిక శాఖ. దానికి ప్రతిరూపంగా మధుపాత్రని రూపొందించారు రచయిత. అది బలంగా చూపించే క్రమంలోనే 'పూజారి' నవల

విషాదాంతమైంది. సినిమాకోసం సుఖాంతం చెయ్యటంతో తన ప్రధాన ఉద్దేశం పక్కదారి పట్టిందన్న అసంతృప్తి ఆయనకు కలిగింది. ఏదేమైనా 'పూజారి', నవలగా ప్రత్యేకత వున్న రచన. అలాగే 'పూజాఫలం' కూడా ఓ ప్రత్యేక చిత్రం.

కొంత బరువైన పదం, వాక్యం కనపడగానే ఇదంతా 'పాతశైలి' అనే చులకన భావాన్ని చాలా మంది వ్యక్తీకరిస్తారు. అలాంటివాళ్ళు 'పూజారి' నవల తప్పక చదవాలి. రచయిత వాడిన పదాలు ఎంతసరైనవో, వాటిని మరోలా రాస్తే ఏం నష్టపోతామో అర్థమవుతుంది. భాషలో ప్రతి పదం ఎప్పటికీ గొప్పదే, అపురూపమైనదే నని 'పూజారి' నవలా శైలి నిరూపించింది.

నిరుత్సాహి మధుకి, ప్రీతి పరిచయం ఓ కొత్త అనుభవం. అతనిలో స్త్రీపట్ల అనురక్తి, ఆసక్తి, ఉత్సాహం ఉదయింపజేసిందది. ఆ పరిచయం తర్వాత అతని భావనని 'ఆమె అతని పాలిట ఆనంద దేవత అయిపోయింది' అని తెలియజేశారు రచయిత. 'ఆమె ఆశ... అతను నిరాశ' అని వారి అస్తిత్వస్థాయిని చెబుతారు.

'ప్రేమించటమనేది నిష్కామమైన కార్యం. అది దేవత్వం ఆపాదించుకొంటుంది', 'నాది భయానక స్వర్గ జీవితం' 'భక్తిపూరిత అలంకరణ' 'మహాగంభీర రహస్య శోధనలో నిమగ్నుడైన, నిరంతర అశాంతాపూరిత అపరిపూర్ణ మానవుడు'లాంటి అద్భుత వాక్యభాగాలు, నవలలోని అప్పటి పరిస్థితిని, వ్యక్తుల మనస్థితిని ఎంతోగాఢతతో తెలుపుతాయి. ఇంతటి లోతైన భావ వ్యక్తీకరణకి ఇటువంటి శైలే ఉండాలి. ఇది రాజు గారి గొప్ప విజయం. తొంభై పేజీల ఈ నవలలో, పాత్రల తీరుని, మనస్థత్వాన్ని, మనస్థితిని, పరిసరాలని, భావోద్వేగాలని, తాత్వికతని వ్యక్తీకరించిన పదాలు, పద్ధతులు అద్భుతం. గొప్ప శైలీ, శిల్పాల మేలు కలయిక ఈ నవల.

1952 నాటికి ఇంతటి మనస్థత్వ అవలోకన, నవలలో వేశ్య పాత్రకి పెట్టిన 'నీలనాగిని' పేరు, అరవై ఏళ్ళ తర్వాత కూడా ఇప్పటికీ నవీనమే.

మంచి రచయిత కాలంకన్నా ఒక్కడుగేనా ముందుండి ఆలోచిస్తారనటానికి 'పూజారి' నవల మరో ఉదాహరణ. మునిపల్లె రాజు కాలం కన్నా ఎంత ముందున్నారో ఈ నవల చదివితే తప్పక తెలుస్తుంది.

– వి. రాజారామమోహనరావు

పెద్దకథ

డాక్టర్ జి.వి. కృష్ణయ్య

వచ్చింది తీర్పు

మసకచీకట్ల మధ్య పల్లె ప్రశాంతంగా తెల్లవారడానికి సిద్ధమవుతోంది. గుడిదగ్గర పాలవ్యాను హారన్ మోత ఊరంతటినీ నిద్రలేపే అలారంలా అరుస్తూవుంది. చుయ్ చుయ్‌మంటూ పొదుగులోంచి చెంబులోకి దూకుతున్న పాలధారల విన్యాసం, దొడ్డికాడ లేగదూడలు అంబా అని గంతులేస్తున్న అడుగుల చప్పుళ్ళు. వణికించే చలిలోంచి బయటపడని ముసలీముతకా కప్పుకున్న దుప్పట్లోంచి తల బయటకు పెట్టి, తొంగిచూస్తూ తిరుగుతున్నారు. ఉదయభానుడు చిరునవ్వుతో ఒక్కోమెట్టెక్కి వూళ్ళోకొస్తున్నాడు.

ఇళ్ళ దగ్గర మెడలు తెగిన కోళ్ళు విల విలా తన్నుకుంటూ ఎగిరిపడి వీధుల్లో ప్రాణాలొదిలేస్తున్నాయి. వాటిని ముక్కలు ముక్కలు చేసి ఆరగించడానికి తొట్లకాడ కత్తులు పదునెక్కుతున్నాయి. పొయ్యిమీద దోసెలపెనాలు సర్రున పొగలు చిమ్ముతూ ఆకలిని రెచ్చగొడుతున్నాయ్. పొట్టేలు మాంసంకోసం బారులుతీరిన జనాలు కొష్టాలకాడ పోటీలు పడుతున్నారు. నువ్వుల నూనెతో తలంటుకుని, జిడ్డుకారే శరీరాలతో కొందరు మల్లయోధుల్లా వీధుల్లో తిరుగుతున్నారు. తాగుబోతులు గోల చేస్తుంటే, వారిని కొందరు గేలి చేస్తున్నారు. మొత్తంమీద కనుమ పండుగ మాంచి కిక్కుమీదుంది.

మాసిన లుంగీ, చిరిగిన చొక్కాతో మోకాళ్ళదాకా బురద కొట్టుకొని ఆవేశంగా పళ్ళు కొరుకుతూ, కసిగా బుసలు కొడుతూ, పడుతూ లేస్తూ, ఒక్కవుదుటున సుందర్రామిరెడ్డి ఇల్లు చేరాడు ఏడుకొండలు. అతని కళ్ళు సూర్యగోళాల్లా మండుతున్నాయి. దారిన వస్తుంటే వూళ్ళో జనమంతా అతన్నే వింతగా చూస్తున్నారు. తలదించుకొని దారినపోయే మనిషి అంత హడావిడిగా వెళ్తుంటే అందరికీ ఆశ్చర్యం, అనుమానం.

“అమ్మగోరూ.. అమ్మగోరూ..” పులి గాండ్రించినట్టు కేకేశాడు ఏడుకొండలు.

ఆ కేక విని పరుగున వచ్చింది వంటింట్లోంచి యజమానురాలు గాయత్రి.

ఏడుకొండల్ని ఎగాదిగా చూసింది.

“ఏందిరా ఏడుకొండలూ ఈ వేషం? తెల్లారకముందే తాగొచ్చావా.. యేంది? ”

“రెడ్డిగోర్ని కలవాల!” అన్నాడు.

రాత్రి తాగినమత్తు వదిలినట్టు లేదు. మూతపడుతున్న రెప్పల్ని బలవంతంగా లేపుతూ, నేలపై స్థిరంగా నిలబడ్డానికి ప్రయత్నిస్తున్నాడు.


“వీధిలో వుంటాడు చూడు.. దేనికీ? ” అనుమానంగా అడిగింది.

“పనుందిలే.. మీరిద్దరూ ఓమాలి తోటలోకి రావాల” మాట కటువుగా వుంది, మనిషి భయంకరంగా వున్నాడు.

‘ఏమై వుంటుందా? ’ అనుకుంటూ, “సరే, వస్తాంలే, వెళ్లు” అనిందామె.

“కాదు, ఇప్పుడే రావాల” ఏడుకొండలు పట్టుపడుతున్నాడు.

గాయత్రి గాబరా పడుతోంది. జరగరాని



దేమైనా జరిగిందేమోనని ఆలోచిస్తోంది.

ఆరిపోతున్న పెదాల్ని నాలుకతో తడిచేసుకొంటూ రమ్మని ఒకటే తొందర పెడుతున్నాడు.

సుందర్రామిరెడ్డి అప్పుడే బయటినుంచి వచ్చాడు. రెడ్డివైపు తీక్షణంగా చూశాడు ఏడుకొండలు. ఊహించని ఆ చూపులకు ఒక్కక్షణం ఆగి "ఏందిరా ఇట్టొచ్చావు, ఏంకావాలి? " వేళ్ళమధ్య వేపపుల్లని పళ్ల మీద ఆడిస్తూ అడిగాడు.

"మీరిద్దరూ అర్జంటుగా తోటకాడికి రావాలయ్యా"

"పండగపూట పొద్దున్నే దేనికి, కాసేపాగి వస్తాంలే.. పో"

"లేదయ్యా, ఇప్పుడే రావాల"

గాయత్రివైపు చూశాడు సుందర్రామిరెడ్డి.

"ఇందాకట్నించి ఇదే వరస" అందామె.

'ఎప్పుడూ లేంది, ఇంత మొండిగా వున్నాడేందా? ' అనుకుంటూ, "సరే, ఆమె పనిమీదుంది. నేనొస్తా, పద" అన్నాడు.

"లేదయ్యా, ఇద్దరూ రావాల" అన్నాడు.

"ఏమైందిరా నీకు, ఏమైనా చేశావాయేంది? మీ ఆడోళ్ళేరి? " విసుగ్గా అడిగింది గాయత్రి.

"తోటకాడుందిలే. మీర్రండి పోదాం" తొందర పెడుతున్నాడు.

"వదిలేట్టు లేదు, పద" అన్నాడు రెడ్డి.

అత్తగారికి ఇంటిపనులు అప్పజెప్పి గాయత్రి కూడా బయలుదేరింది. పరుగులాంటి నడకతో ఏడుకొండలు వెళుతుంటే రెడ్డి దంపతులు అతన్ని అనుసరించారు.

ఏడుకొండలు ఒక్క వూపునపోయి తోటలో గుడిసెముందు ఆగాడు. మొఖానికి చేతులడ్డం పెట్టుకొని బోరున ఏడుస్తున్నాడు. గాయత్రీ, సుందర్రామిరెడ్డిలకి అంతా అయోమయంగా వుంది. అటూ ఇటూ కలయజూశారు. పచ్చని ఆకుతోటలో గెలలు దిగిన అరటిచెట్లు నిశ్చలంగా నిలబడి వారివైపే చూస్తున్నాయి. యజమాని తోటలోకి అడుగుపెట్టడంతోటే వచ్చి వాలిపోయే ఏడుకొండలు భార్య భ్రమరాంబ జాడ అక్కడ కనిపించడం లేదు.

గుడిసెలోంచి వస్తున్న మూలుగు విని, గబగబా లోపలికెళ్లింది గాయత్రి. అక్కడి దృశ్యం చూసి భర్తని కేకేసి పిలిసింది.

మంచంపై భ్రమరాంబ అచేతనంగా పడివుంది. చిరిగిన బట్టలు శరీరంపై చిందరవందరగా పడున్నాయి. ముఖమంతా రక్కినట్టు చీరుకుపోయి, కుడికన్ను కమిలిపోయింది. చిట్లిన పెదవి నుంచి కారిన రక్తం ఆరిపోయి ఈగలు వాలుతున్నాయి. ప్రతిఘటనకు ఆనవాళ్లుగా పగిలిన గాజుముక్కలు పడున్నాయి. పరిస్థితిని అర్థం చేసుకోడానికి అట్టే సమయం పట్టలేదు. ఏమిటీ దారుణం అన్నట్లు ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంటున్నారు.

"భ్రమరా..." పలకరించింది గాయత్రి.

మూలుగుతూనే చిన్నగా తలతిప్పి చూసింది. ఆమె పెదాలు అదురుతున్నాయి. పంటి బిగువున బాధను దిగమింగుతున్నా కళ్ళనుండి ఉబుకుతున్న జలధార ఆగడం లేదు. సుందర్రామిరెడ్డి వైపు దీనంగా చూసింది.

"ఏమైందే? " చేయి పట్టుకుని అడిగింది గాయత్రి.

చెప్పడానికి ప్రయత్నిస్తోందికానీ చెప్ప లేక గుటకలు మింగుతోంది. కాళ్ళపైకి జరిగిన చీర సరిచేసి, భర్తవైపు చూసింది.

"ఏం జరిగింద్రా? " కళ్ళు పెద్దవి చేసి ఏడుకొండల్ని అడిగాడు సుందర్రామిరెడ్డి.

"ఏం జరిగిందీ ఆ మడిసి చెప్పడం లేదయ్యా! అడిగితే ఏడుస్తుందేగాని నోరు విప్పడంలేదు. మంచికైనా చెడ్డకైనా మాకు దిక్కు మీరేగదా!? ఏం జరిగిందో మీకైనా చెబుతుందని మీకాడికి లగెత్తుకొచ్చా నయ్యా" దండంపెట్టి చెప్పాడు.

"ఈ పరిస్థితిలో అదేం చెబుతుంది? ముందు ఆస్పత్రికి తీసుకపోదాం పదండి. కాస్త కోలుకున్నాక అన్ని విషయాలు బయ టకు వస్తాయ్. అపుడేం చేయాల్నో ఆలో చిద్దాం. మీరెల్లి ట్రాక్టరు తీసుకరండి" రెడ్డిని పురమాయించింది గాయత్రి.

చేలోనే వున్న ట్రాక్టరుకి ట్రక్కు తగిలిం చుకుని తీసుకొచ్చి గుడిసెముందు నిలి పాడు సుందర్రామిరెడ్డి.

అందరూ కలిసి భ్రమరాంబను ట్రాక్టరు ఎక్కించి ఆసుపత్రికి తీసుకుపోయారు.

★ ★ ★

సుందర్రామిరెడ్డి తోటలో భ్రమరాంబ కాపలా మనిషి. నిజానికి కాపలామనిషి కంటే కాపు మనిషిగానే ఆ వూరిలో గుర్తింపు. ఆ తోట పరిసరాల్లో మనిషి అలికిడి వున్నా లేకున్నా 'ఓయ్.. ఎవురా మడిసి..? ' అని అరుస్తూ వుంటుంది. ఆ సంకేతానికి అర్థం చుట్టుపక్కల వారంద రికీ పరిచయమే. ఆ మాటకు కొందరు నవ్వుకోవడం, మరికొందరు గుసగుసలాడు కోవడం మామూలే.

తమలపాకు తుంచాలన్నా, ఆకుట్లు (అరిటాకులు) తెంచాలన్నా, నారుమడి తడపాలన్నా, అరటిగెల దించాలన్నా అక్కడ భ్రమరాంబ వుండాల్సిందే. కూలో ళ్లను పిలవడం, కూలి డబ్బులివ్వడం, పొలం పనులన్నీ ఆమె చేతుల మీదుగానే జరుగుతుంటాయి.

'చేలో ఆ మనిషుంటే చాలు, మనం కాలుపెట్టాల్సిన పనికూడా వుండదు' అంటుంటాడు సుందర్రామిరెడ్డి. సేద్యం విషయంలో ఆమెదే తుది నిర్ణయం.

సుందర్రామిరెడ్డి దగ్గర కాపలాకి కుదిరే నాటికి భ్రమరాంబ లేతవయసులో ఉంది. పసిమి నిమ్మపండులాంటి మేలిమిఛాయ, నిండైన కేశసంపద, అందమైన కళ్ళు, చక్కని పలువరుస, నవ్వినపుడు ఎడమబు గ్గపై కనిపించే సొట్ట ప్రత్యేక ఆకర్షణ. ఆమె అద్భుత సౌందర్యానికి ముగ్ధుడవ్వని మగాడుండడంటే అతిశయోక్తి కాదు.

'అబ్బ, ఈ మనిషి ఆ కులంలో పుట్టా ల్సింది కాదురా! కత్తిలాగుంటది' అంటూ పెదాలు కొరుక్కునే కుర్రకారు మాటలు, 'దీనమ్మ ఎవుడ్ని తగులుకుందో గాని.. ఈయమ్మి కచ్చితంగా క్రాస్‌బ్రీడింగే! అను మానం లేదు' అనే పొగరుబోతుల మాటల్ని విన్నపుడల్లా వుడికిపోయేది.

తక్కువ కులంలో కాస్త అందంగా పుట్టిన పాపానికి జన్మనిచ్చిన తల్లికూడా నిందలు మోయడం మనసుకెంతో బాధని పించేది. పేదదాని కోపం పెదవికి చేటు అనుకొని అవమానాలు భరించేదేగాని బయటపడేదికాదు.

భ్రమరాంబకు పెళ్లైన సంవత్సరానికే భర్త వదిలేసి మరొకామెను తీసుకుపో యాడు. అప్పటికి ఆమె గర్భవతి. భర్త వదిలేయడానికి కారణమూ ఆమె అందం చుట్టూ ఆవరించిన అనుమానమే. ఇష్ట మైతే కలిసి కాపురం చేయడం, కష్టమైతే విడిపోయి ఎవరి బతుకు వారు బతకడం ఆ కులంలో మామూలు విషయం. కనుక మనసులో బాధగా ఉన్నా భర్తనుంచి విడి పోయింది. పుట్టింట్లో పురుడు పోసుకొని మెట్టినింటితో తెగతెంపులు చేసుకొంది.

పసిబిడ్డనెంటేసుకొని పనీపాటకు పోతూ కాలం వెళ్ళబుచ్చేది.

కూలిపనుల దగ్గర పరిచయమైన ఏడు కొండలుకి భ్రమరాంబ చేరువయ్యింది. భార్య వదిలేసిన ఏడుకొండలు ఆమెను చేరదీశాడు. అతడు అందగాడు కాకపో యినా పనిలో మెలకువలు తెలిసినవాడు. పనిలోకి దిగితే పూర్తయిందాకా నడుమె త్తని మనస్తత్వం. తాగుడు అలవాటున్నా అనవసరంగా ఒకరి జోలికి పోడు, మితి మీరి ఒకమాట తూలడు. భ్రమరాంబనీ, ఆమెబిడ్డనీ ప్రేమగా చూసుకొంటాడు.

ఏడుకొండల్ని భార్య విడిచిపెట్టి వెళ్లిపో యినందుకు సుందర్రామిరెడ్డి దిగులుప డ్డాడు. ఎందుకంటే ఆడతోడు లేకుంటే పని ఎగేస్తాడని అతని భయం. ఏడుకొం డలుకి తోడు దొరికినందుకు రెడ్డికెంతో ఆనందంగుంది.

"యేరా కొండలూ, ఎట్టుంది కొత్త కా పురం? మంచిపని చేశావురా!" అన్నాడు రెడ్డి నవ్వుతూ.

"బానే వుందయ్యా! మా ఆడోళ్ళు చానా మంచిదయ్యా!" మురిసిపోతూ చెప్పాడు.

"సరేరా, అంతమందికి ఆ గుడిసెట్టా సరిపోతోంది? తోటలో షెడ్డు ఖాళీగానే వుంది గదా! కాపలావాడూ ఎగ నూకాడు. మీరెళ్లి అందులో వుండండి" ఉదారంగా వరమిచ్చాడు.

మనిషిలోపలి మర్మం తెలియని ఏడు కొండలు 'ఆహా! మా రెడ్డిగోరి మనసెంత మంచిదో' అని కనిపించినోడికల్లా ఘనంగా చెప్పుకున్నాడు.

ఏడుకొండలు కాపురం కాలనీ నుంచి కాపుగారి తోటలోకి మారింది.

మొగలిపొదలో తాచుపాములా తిరిగే సుందర్రామిరెడ్డి మనసంతా భ్రమరాంబ చుట్టూతానే తిరుగుతోంది. మాటలతో మచ్చిక చేసుకొని, మనసులో స్థానం పొంది, మనిషిని వశపరచుకున్నాడు. నీకు కొండంత అండగా నేనుంటానని నమ్మబలి కాడు. గత్యంతరంలేక, గమ్యంతెలియక మౌనంగా వుండిపోయింది. ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు. వేటగాడి ఉచ్చులో పక్షికూనలా నిస్సహాయంగా చిక్కుకొంది. భ్రమరాంబ ముఖంలో కొత్తదనం, చేలో పచ్చదనం, ఏడుకొండలు అమాయకత్వం అన్నీ సుందర్రామిరెడ్డికి కలిసొచ్చాయి.

★ ★ ★

సంక్రాంతి ముగ్గులతో ముంగిళ్ళు రంగు లద్దుకొని ఆనందానికి ఆహ్వానం పలుకుతు న్నాయి. వేకువతోటే స్నానాలు ముగించు కుని గుడికెళ్లొచ్చిన ఆడవాళ్లు తడి ఆరని వెంట్రుకల్ని ముడేసుకొని వంటపనిలో నిమగ్నమయ్యారు. పూజాగదిలో అగరొ త్తుల పరిమళాలు ఎగజిమ్ముతుంటే, ప్రమి దల్లో వత్తులు వెలుగును విరజిమ్ముతు న్నాయి. నైవేద్యం కోసం విస్తర్లు ముస్తాబ య్యాయి. ఉపవాసాల పేగులు ఆకలితో గీపెడుతున్నాయి. పంతులుగారి దీవెనల కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

ఎద్దుల బండిలాగుడు పోటీలు చూడడా నికి మగాళ్ళంతా పోగయ్యారు. సంక్రాంతి సెలవులకొచ్చిన కార్పొరేట్ విద్యార్థులూ, చదువు 'కొన'లేకపోయిన చిన్ననాటి మిత్రు లతో కలిసి హైస్కూలు మైదానంలో క్రికెట్ ఆడుతున్నారు. ఉద్యోగాలూ, వ్యాపారాలతో పట్నంలో స్థిరపడ్డ కొందరు పండక్కి సొంతూరొచ్చి పాతమిత్రులతో చేరి పేకాడుతుంటే మరికొందరు పాతజ్ఞా పకాలతో కాలక్షేపం చేస్తున్నారు.

ఊరుమ్మడి పనోళ్ల రాకపోకలతో ఇళ్ళన్నీ సందడిగా వున్నాయి. పండగ పూట వచ్చిన వారికి లేదనకుండా అన్నంకూరలతోపాటు పిండివంటలూ పెట్టి పంపుతున్నారు ఇళ్ళ దగ్గర ఆడ వాళ్ళు. పండగ మామూళ్ళ కోసం ఆసా

ముల్ని వెంటబడి వేధించి వసూలు చేస్తు న్నారు పనివాళ్ళు. వీధులన్నీ హాస్యపు జల్లులతో తడిసి ముద్దవుతున్నాయి. అదొక గ్రామీణ సంబరాల సాంస్కృతిక జీవన విధానం.

చిరుగజ్జెల సవ్వడితో నడివీధిలో నడిచి పోతున్న భ్రమరాంబ లేత గులాబీరంగు నేత చీరలో మ్యాచింగ్ బ్లౌజు, గాజులు, ముఖాన స్టిక్కర్‌తో ముచ్చటగా ఉంది. కాటుక దిద్దిన కళ్ళతో క్రీగంట చూస్తూ వెళుతుంటే బాపూబొమ్మ ప్రాణం పోసు కుని కదిలిపోతున్నట్లుగా ఉంది.

"ఏమే భ్రమరం.. ఎందాకా..? " దారిన పోయేవారిని పిలిచి ఇరుగుపొరుగు వారి వివరాలు సేకరించడంలో బిజీగా కాలంగ డిపే నడిపింటి కాంతమ్మ అడిగింది.

"మా ఆసాములోరింటికి అత్తా! పండక్కి ఇంటికి రమ్మంటే పోతున్నా. ఏంటి సంగ తులు.. ఏం చేస్తుండారు? మావలేడా? యాడికంపిచ్చా? పందాలు కాయడానికి పంపావా, యేంది? " చనువుగా వుండేవా రితో అలా మాట్లాడ్డం, వరసలతో సంబో ధించడం ఆమెకు మొదట్నించీ అలవా టైంది. అందరితో కలుపుగోలుగా మాట్లా డుతుంది.

"ఒసే.. నీ దుంపదెగా.. మావేం పందెం కాస్తాడ్లేయే.. గొడ్లకు నీళ్ళు పెట్టా నికి కొష్టం కాడికి పొయినాడుగానీ.. ఈ చీరేడ కొన్నావే.. బెమ్మాండంగుండాది" అడగనే అడిగింది కాంతమ్మ.

చెప్పకుంటే గుచ్చిగుచ్చి అడిగి చంపుకు తింటాది. ఏదొకటి చెప్పి తప్పించుకోవా లని చూసింది.

"మా ఆసాములు పండక్కి పెట్టారత్తా! మావ నీకేం తెచ్చాడు? "

"ఆ.. ఏదో తెచ్చాడ్లే. నీకయితే మీ కాపు ఎతికెతికి తెస్తాడు.. అందరికీ నీలా కుదు రుద్దంటే? దేన్నికైనా పెట్టిపుట్టుండాల్లే!"

భ్రమరాంబ మనసు చివుక్కుమంది. ఈ మనిషితత్వం ఇంతేలే అనుకొని, ఇక మాటలు పొడిగించదలుచుకోలేదు. అలాం టి వారితో పరాచికాలెక్కువైతే పరాభవాలే మిగులుతాయని ఎరిగిన భ్రమరాంబ 'వస్తా'నంటూ అక్కడ్నించి సుందర్రామిరెడ్డి ఇంటివైపు బయలుదేరింది.

సుందర్రామిరెడ్డి ఇంటిపంచలో ఓ మూల గిన్నెలు పెట్టి, గుంజకానుకొని నిల బడింది. చేలో ఎంత స్వేచ్ఛగా వున్నా ఇంటి దగ్గర కొచ్చేసరికి భయంభయంగా నిలబడుతుంది. సుందర్రామిరెడ్డి తల్లి సరోజనమ్మను నవ్వుతూ పలకరించింది. "పొద్దుట్నించీ యాడికెల్లినావే.. ఇంతాలి సింగొచ్చినా? " అడిగింది సరోజనమ్మ.

దొడ్డివాకిలి పక్కన పీటమీద కూర్చొని కట్టెలపొయ్యి మీద గారెలు కాలుస్తున్న సుందర్రామిరెడ్డి భార్య గాయత్రి ఎవురా అని గుమ్మంవైపు చూసింది. భ్రమరాం బను చూడగానే ఆమె మనసులో అసంక ల్పితంగా చిన్న అలజడి రేగింది.

'అబ్బా! దీనెమ్మ కడుపుకాలా! ఏం పుటకే! దీని సోకు చూస్తుంటే నా కళ్లే చెదురుతున్నాయి. ఇక మగోడొదిలి పెడ తాడా!' అనుకొంది. ఏవేవో ఆలోచనలు ఆమెని ముసురుకొని సతాయిస్తున్నాయి.

నూనెబాండీలోంచి గారెలు చివరివాయి తీసి చేయికడుక్కొని లేచింది గాయత్రి.

చెమటతో జాకెట్ తడిసి వంటికి అంటుకుపోయింది. ముడిపెట్టుకున్న వెంట్రుకల్ని విదిలించి కొప్పు చుట్టుకొంది. జిడ్డు కారుతున్న ముఖంపై నీళ్ళు చల్లుకొని పైట కొంగుతో తుడుచుకొంటూ బయటకొచ్చింది. "ఏందిమా, వంటలు ఇంకా అవలా? " గాయత్రిని అడిగింది భ్రమరాంబ.

"యాడ్నే.. పొద్దుట్నించి వచ్చేవాళ్ళకు, పోయేవాళ్ళకు తెంపులేదు. పొయ్యిసెగకు ఉడకిపోతుండా!"

"పోనీలేమా! పండగపూట అంత పెడితేనే గదా పుణ్యం? "

"పుణ్యం పురుషార్థానికేంగానా.. అరిసెలకు బియ్యప్పిండి కొడదామని నిన్న రమ్మంటే ఇప్పుడొచ్చావేంది? పిండెప్పుడు కొట్టాల? " టవల్ తో తుడుచుకొంటూ అడిగింది.

"నిన్న కుదర్లేదుమా! ఈయాల పొద్దున పూట మీకు తీరికుండదని రాలా! ఇంటికి పోయి మా ఆయనకీ, పిల్లోడికీ అన్నం పెట్టి వచ్చేస్తా. ఎంతసేపులే, సాయంత్రానికి అయిపోద్దికానీ.."

"నువు మళ్ళా పొద్దుపోయిందాక ఆన్నే కూర్చోమాక. సరే, అన్నం పెట్టించుకొని పాయసం, గారెలూ తీసుకొని పోదువుండు" అని ఇంట్లోకి పోతూ మరోసారి వెనక్కి తిరిగి చూసింది.

తన భర్తకూ, భ్రమరాంబకూ మధ్య వున్న సంబంధం గురించి ఊరందరికీ తెలుసు. ఈ విషయంమీదే గతంలో భార్యాభర్తల మధ్య అనేకసార్లు వాదోపవాదాలు జరిగాయి. కొన్నాళ్ళు ఎడమొహం పెడమొహంగా ఉన్నారు. గాయత్రి పదే పదే నిలదీస్తుంటే సుందర్రామిరెడ్డి బుకాయించడం, విసుక్కోవడం, చివరకు సమాధానం చెప్పడంకూడా మానేశాడు. విసుగు పుట్టిన గాయత్రి అడగడమూ మానేసింది. ఇంటగెలిచిన సుందర్రామిరెడ్డికి 'ఉంచుకోవడం' తనకో సామాజికహోదాగా భావించి పంచె ఎగబట్టి తిరుగుతుంటాడు.

ఈ ఒక్క విషయంలో తప్ప భ్రమరాంబను వేలెత్తిచూపే అవసరం, అవకాశం గాయత్రికి కనిపించడంలేదు. అందగత్తెనన్న అహంభావం ఏనాడూ ప్రదర్శించదు. పనిదొంగ కాదు. గాయత్రి ఎప్పుడు తోటలోకి వెళ్ళినా ఏదోక పని చేస్తూనో, చేయిస్తూనో ఉంటుంది. యజమాని దగ్గర లేడన్న ధీమాగానీ, పనిపట్ల నిర్లక్ష్యంగానీ ఉండదు. పని అర్జంటు అనుకుంటే భర్తతోపాటు తమ్ముణ్ణీ, బంధువుల్నీ తీసుకొచ్చి పని పూర్తి చేయిస్తుంది. నమ్మకమైన మనిషి దొరకడమే కరువైన కాలంలో భ్రమరాంబలాంటి నమ్మకస్తురాల్ని దూరం చేసుకుంటే సేద్యమెంత కష్టమవుతుందో రైతుబిడ్డయిన గాయత్రికీ తెలుసు. అందుకే ఆమె భ్రమరాంబను పల్లెత్తు మాట అనదు. భ్రమరాంబ దాన్ని అవకాశంగా తీసుకొని అధిక ప్రసంగం చేయదు. యజమానురాలితో ఎంత మర్యాదగా, అణకువగా వుండాల్నో అంతలోనే వుంటుంది. గాయత్రికి ఆమెపట్ల సానుభూతి, ప్రేమ.

★ ★ ★

రచ్చబండ దగ్గర ఊరి జనమంతా గుమిగూడారు. ఏడుకొండలు ఓ మూల చేతులు కట్టుకొని, తలదించుకొని నిలబ

డ్డాడు. గ్రామపెద్దలు రచ్చబండ అరుగు మీద ఆసీనులయ్యారు. రచ్చబండ పక్కన ప్లాస్టిక్‌కుర్చీలో కూర్చొన్న రమణారెడ్డి సిగరెట్ కాలుస్తున్నాడు. వెనుక నిలబడ్డ సంతోష్‌రెడ్డి తనవాళ్ళతో మాట్లాడుతూ ధీమాగా చూస్తున్నాడు. సుందర్రామిరెడ్డి కుర్చీలో తలపట్టుకొని కూర్చొనున్నాడు.

"ఎవరో ఒకరు మొదలుపెట్టండి. ఎవురి పాటికివాళ్ళు మౌనంగా కూర్చోడానికా అందర్నీ పిలవనంపింది" అన్నాడు పెద్దమనుషుల్లో ఒకరైన జాలిరెడ్డి.

అక్కడున్నోల్లంతా ఒకరికొకరు బీరకాయ పీచు బంధుత్వంగలవాళ్ళే. ఏడుకొండలు మాత్రమే పరాయివాడు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాల దాడిని ఎదుర్కొనడానికి సిద్ధంగున్న పాలకపక్షంలా నిందితులకు వ్యతిరేకంగా ఎవరు నోరెత్తినా ఎదురుదాడికి సిద్ధంగున్నట్లు అక్కడి పరిస్థితి కనబడుతోంది.

"రే, ఏడుకొండలూ! అసలేం జరిగిందో వివరంగా చెప్పు" చుట్టకాలుస్తూ అడిగాడు జాలిరెడ్డి.

ఉలిక్కిపడ్డట్టు తలపైకెత్తి జాలిరెడ్డివైపూ, సుందర్రామిరెడ్డి వైపూ చూశాడు ఏడుకొండలు. ముందే పసిగట్టిన వాడిలా గడ్డం కింద చెయ్యి పెట్టుకొని మౌనవిగ్రహంలా కూర్చొన్నాడు సుందర్రామిరెడ్డి. ఆ మౌనం ఏడుకొండలు గుండెల్లో గుదిబండలా వుంది. తన తరపున మాట్టాడ్డానికి రెడ్డిగోరున్నారనే ఆశ క్రమంగా సన్నగిల్లుతోంది. సమయం గడిచేకొద్దీ ఏడుకొండలు కళ్ళల్లో ఎర్రజీరలు కొలిమిలో కాలుతున్న కర్రుల్లా ఎరుపెక్కుతున్నాయి. అంతా ఏడుకొండలు వైపే చూస్తున్నారు.

"ఏం జరిగిందో మీకు ముందే చెప్పాను గదయ్యా? "

"మాకు తెలుసురా! మిగతావాళ్ళకక్కూడా తెలియాలిగా? అదేదో నీ నోటితో చెబితే అంతా వింటారు. వాళ్ళభిప్రాయం కూడా తీసుకోవాలిగా? " అన్నాడు జాలిరెడ్డి.

"సరేనయ్యా" అని చెప్పడం ప్రారంభించాడు. "మా ఆసామిగోరు పిండిగొట్టానికి రమ్మంటే పెద్దపండగరోజు మావిటేల రెడ్డిగోరి ఇంటికొచ్చింది. పిండికొట్టినాక చీకటి పడి ఇంటికొస్తావుంటే ఆలిద్దరూ ఎకసెక్కాలాడుతూ ఎంబడించారంట. పెద్దోరితో ఎందుకులే అని చిన్నగా తప్పించుకొని వచ్చేసింది. గలగాయిగా వుండేది.. మౌనంగా వుందేందబ్బా అనుకున్నా గానీ ఏం జరిగిందని నేనడగలా.. అదీ చెప్పలా. రేత్రి కరెంటుగదా, నాపాటికి నేను నీళ్ళు పెట్టానికి మోటారుకాడికి పోయినా. ఆ రేత్రి ఇద్దరూ పూటుగా తాగొచ్చి దాని మీద పడి అఘాయిత్యం చేశారు. కాళ్ళాయాళ్ళాబడి బతిమిలాడినా యిడిసి పెట్టలేదంట. ఆళ్ళెవరో కాదు.. మారెడ్డిగోరి అన్నకొడుకు రమణారెడ్డి, మా గాయత్రమ్మగోరి చినతమ్ముడు సంతోష్‌రెడ్డి"

అంతా నిశ్చేష్టులై వింటున్నారు.

"ఇదంతా ఎవరు చెప్పార్రా? " మధ్యలో ఎవరో అరిచారు.

"ఎవురు చెప్పడమేంటయ్యా, మా ఆడోళ్ళే చెప్పింది. గాయత్రమ్మగోరూ ఆడే ఉన్నారు. కావాలంటే అడగండి. దానికి తెలివొచ్చినాక అడిగితే జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పింది"

గాయత్రికీ, సుందర్రామిరెడ్డికి ముఖాన నెత్తురుచుక్క లేదు. సాలెగూడులో చిక్కుకున్న పురుగుల్లా విలవిల్లాడిపోతున్నారు. తమనే నమ్ముకున్నవాళ్ళు ఒకవైపూ, బంధుగణం మరోవైపూ. ఎటువైపు నిలవాలో, ఏం మాట్లాడాలో అర్థంకాని పరిస్థితి. సుందర్రామిరెడ్డి ఇప్పుడిప్పుడే గ్రామంలో రాజకీయంగా గుర్తింపు పొందుతున్నాడు. ఈ పరిస్థితిలో బంధుత్వాన్ని దూరం చేసుకుంటే తన రాజకీయభవిష్యత్తు ఏమవుం

తుందోనన్న భయంలో ఉన్నాడు.

"అదీ జరిగిన సంగతి, అంతా విన్నారుగా! తాగిచేసినా, తాగకుండా చేసినా వాళ్ళు చేసింది ముమ్మాటికీ తప్పే. ఏడుకొండలుగానీ, వాడిపెళ్లాంగానీ ఒకరి జోలికీ, మాటకీ వచ్చేవాళ్లు కాదు. ఇది జరిగుండాల్సింది కాదు. వాళ్ళకెందుకు ఈ దుర్బుద్ధి పుట్టిందో అలా అయ్యింది. ఏడుకొండలు వూళ్ళో పెద్దమనుషులకు చెప్పుకొని న్యాయం చెయ్యమని అడుగుతున్నాడు. ఇందులో మనూరి కుర్రాళ్ళ పాత్ర ఉందికాబట్టి ఇక్కడే ఈ సమస్యని పరిష్కరిస్తే బావుంటుందని ఊరందరినీ పిలిపించాం. దీనిపై అభిప్రాయాలు చెప్పండి" ఉపోద్ఘాతం ముగించాడు జాలిరెడ్డి.

"తప్పని పెద్దమనుషులు తేల్చారుగా! ఇక అభిప్రాయాలెందుకు? శిక్షా మీరే చెప్పేయండి. రాళ్ళతో కొట్టి చంపేద్దామా, నడివీధిలో ఉరేద్దామా.. ఏం చేద్దాం?" కళ్ళురుముతూ ముందుకు దూకాడు రమణారెడ్డి బంధువు. అతనితో మరో నాలుగు గొంతులు కలిశాయి.

"ఏందయ్యా అంతలావున నీలుగుతున్నారు? జాలిరెడ్డిబాబాయ్ అడిగిందాంట్లో తప్పేముంది, చేసిందానికి సిగ్గుపడాల్సింది పోయి పెద్ద మాట్లాడుతున్నారే! ఈయాళ ఇదయ్యింది, రేపు ఇలాంటిదే ఇంకోటి జరిగినా ఇలాగే మాట్లాడుతారా?" వారిని నిలేసింది ఒకావిడ.

"ఆ.. సిగ్గు అందరికీ వుండాల్లే, నువ్వాపవమ్మా. ఒక్కొక్కరి బండారం విప్పితే యవ్వారం చానాదూరం పోద్ది. నీకెందుకు అంతగా పొడుచుకొస్తుంది? మీ భాగోతాలు అందరికీ తెలుసులే. కాస్త తగ్గి నీది నీవు చూసుకో.. పో.. పోవమ్మా" ఒంటికాలి మీదలేచి అవతలామె నోరుమూయించింది రమణారెడ్డి పెద్దక్క.

ప్రత్యర్థుల్ని ఎదుర్కోడానికి పక్కా వ్యూహంతో ఉన్నారు నిందితుల తరఫు బంధువులు. ఒక్కరు నోరు తెరిస్తే నలుగురు శ్రుతి కలుపుతున్నారు. ఆ కుటుంబాలకు ఊళ్ళో బంధుత్వం ఎక్కువ. మంది బలం వున్న వారిముందు నోరు తెరవడానికి జనం జంకుతున్నారు.

"అనవసర విషయాలు దేనికి చెప్పండి.. ఏడుకొండలు ఏం జరిగిందో చెప్పాడు, దాన్ని గురించి మాట్లాడండి" అన్నాడు మరో పెద్దమనిషి.

★ ★ ★

"అది పెద్ద పత్తిత్తని వెనకేసుకురాకయ్యా.. దాని సంగతి వూరంతా తెలుసు. ఎవురి హద్దుల్లో వారుండుంటే పరిస్థితి ఇంతదాక వచ్చేది కాదు. కాస్త ఎర్రగా, బుర్రగా వుండాగదాని వూపుకుంటూ తిరిగితే కుర్రోళ్ళు వూరకే వుంటారా? చేయి దాటినాక బాధపడి లాభమేంది? యాడుండాల్సినోళ్ళని ఆడుంచకుండా నెత్తికెక్కించుకోవడమే బుద్ధిమాలినతనం. పనిమనిషి, పనిమనిషిలా వుండాలిగాని పేనుకు పెత్తనమిస్తే తలంతా గుండు చేసినట్టు, చేలో పెత్తనమంతా దానిదే అయినట్టు పోజులొకటి. సరే! ఏదో చిన్న పొరపాటు జరిగింది. పిలిచి మందలిస్తే పోయేదానికి, పెద్ద రాద్ధాంతం చేస్తుండారు" పంచె ఎగ్గట్టి చేతులు తిప్పుతూ శివాలు తొక్కుతున్నాడు సంతోష్‌రెడ్డి చిన్నాన్న.

అతని మాటలు భ్రమరాంబమీద వ్యక్తిగత ద్వేషంతో వున్నట్టు జనం గుసగుసలాడుకుంటున్నారు.

సుందర్రామిరెడ్డి కళ్ళు పెద్దవిచేసి అతని వైపు ఉరిమి చూశాడు. ఇంకేదో మాట్లాడబోయినవాడల్లా సుందర్రామిరెడ్డిని చూసి వెనక్కి తగ్గాడు. వాదనలన్నీ ఏకపక్షంగా సాగుతున్నాయి. నిందితుల్ని నిలదీయడం అటుంచి, ఆరోపణలు అవునో కాదో విచా



రణ కూడా సాగడంలేదు. ఏడుకొండలు ఉడికిపోతున్నాడు. పళ్లు బిగపట్టిన అతని దవడలు రంపాల్లా పొడుచుకొస్తున్నాయి. కళ్ళల్లో రక్తనాళాలు చిట్లి నిప్పుకణికల్లా మండుతున్నాయి.

ఉరుములేని మెరుపులా చటుక్కున గాయత్రి ముందుకొచ్చి అటూఇటూ తీవ్రంగా చూసింది. పైటకొంగు బిగదోపి “బుద్ధుండే మాట్లాడుతున్నారా? ఒళ్లు బలిసి మాట్లాడుతున్నారా? ఏంది.. మీరు మాట్లాడేది? న్యాయం చెయ్యడానికొచ్చారా? నీతులు బోధించడానికొచ్చారా? జరిగిన దారుణం గురించి ఒక్కరైనా మాట్లాడారా, మాట్లాడనిచ్చారా? ఇలాంటిదే మన ఆడోళ్ళకు జరి

గుంటే ఈపాటికి తలలు పగలగొట్టుకొని పోలీస్‌స్టేషన్ చుట్టూ పిచ్చికుక్కల్లా తిరుగుతుండేవాళ్ళం. ఏం ఇదీ అలాంటిదే కాదా? అయినోళ్ళకొక న్యాయం.. పరాయోళ్ళకొక న్యాయమా? ఆ మాత్రం దానికి ఈ మధ్యస్థాలెందుకు? వాళ్ళకెవురూ లేరని నోరు పారేసుకుంటే మర్యాదగా వుండదు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడండి" అంది.

ఈ హఠాత్పరిణామానికి అందరూ తెల్లబోయి చూస్తున్నారు. సాటి ఆడదన్న సానుభూతితో మాట్లాడిందో, ఇన్నాళ్ళు చాకిరీ చేయించుకున్న విశ్వాసంతో కలగజేసుకుందో గానీ మొత్తంమీద కలకలం రేపింది గాయత్రి. అంతటితో వదిలిపెట్టలేదు. ఇంకొక అడుగు ముందుకేసింది.

"ఈ పంచాయితీ దేనికి పెట్టినట్టు, తప్పోఒప్పో విచారించడానికా లేక అది తప్పుడదని నలుగురితో చాటింపు వేయడానికా? తప్పుని కప్పిపుచ్చుకోడానికి అవతలోళ్ళపై అభాండాలేస్తే సరిపోదు. ఇక మాటలెందుకు.. మీకు చేతనైతే న్యాయంగా మాట్లాడండి.. లేదంటే ఎవురిదారిన వాళ్ళు లేచి వెళ్ళిపోండి. పోలీసు కేసు పెట్టి తేల్చుకుంటాం. ఎవుర్నీ బతిమలాడుకోవాల్సిన అవసరం లేదు"

గాయత్రి మాటలు బంధువుల గుండెల్లో బాకుల్లా గుచ్చుకుంటున్నాయి. గుసగుసలే గాని ఎవరినోరు పెగలడంలేదు. ఒకరి మొఖాలొకరు చూసుకొంటున్నారు.

గుండెనిండా గాలిపీల్చి వదిలి తలపైకెత్తాడు ఏడుకొండలు. గాయత్రివైపు చూసి రెండు చేతులు జోడించాడు. అప్రయత్నంగా అతని కన్నీటి కుండలు పగిలి బొటబొటా నేలరాలాయి నీటి బిందువులు. ఒక్క మనిషైనా తనవైపు లేని స్థితిలో గాయత్రి నిలవడం ఏడుకొండలు హృదయంలో గంపెడాశను రేపింది.

'నేను వింటున్నది నిజమేనా?' అన్నట్టు సుందర్రామిరెడ్డి ఆశ్చర్యంగా భార్యవైపు చూస్తున్నాడు. గాయత్రి నోరెత్తడంతో ఎక్కడివాళ్ళక్కడ కిక్కురుమనకుండా దిక్కులు చూస్తూ నిలబడ్డారు.

"అడుగుతోంది కదా! సమాధానం చెప్పండి" అన్నాడు జాలిరెడ్డి.

అప్పటిదాకా వీరంగాలతో చెలరేగినవారు నిమ్మకు నీరెత్తినట్టు నిలబడిపోయారు. నిందితుల్ని వెనుకేసుకొస్తుందనుకున్న ఆమె వ్యతిరేకంగా నిలవడం అక్కడివారు ఊహించని పరిణామం. చుట్టాలు చూపులతో గుచ్చిగుచ్చి పొడుస్తున్నా గాయత్రి చలించడంలేదు. బంధువులు దూరమవుతారన్న బాధ ఆమెలో కనిపించడం లేదు. పరువుప్రతిష్టతోపాటు ఆర్థిక పరిపుష్టివున్న గాయత్రిని ఎదుర్కోవడం కొరివితో తలగోక్కున్నట్టువుతుందనుకున్నారేమో.. ఎవరికివారు సర్దుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

"పొద్దస్తమానం సాగదీయడమెందుకు! జరగాల్సింది చూడండి. ఎదవనాయాళ్లు బుద్ధి గడ్డితిని ఇట్టాంటి పని చేశారు. ఇది తెలిసింతర్వాత మేమంతా కూడా చివాట్లు పెట్టాం. గ్రామానికే తలవంపులు తెచ్చారు. ఇలాంటివి మరోసారి జరగడానికి వీల్లేదు. ప్రస్తుతానికొస్తే.. కొండలు

భార్య హాస్పిటల్లో వుంది. వాడి పరిస్థితీ అంతంత మాత్రమే. పెద్ద మనుషులు వుండారుగదా.. ఏదొకటి చేసి వగదెం చండి" విషయాన్ని పలుచబార్చడానికి ఎత్తుగడ వేశాడు ఆ వూరి మోతుబరి నర సింహులు. అట్నుంచి కాకపోతే ఇట్నుంచి నరుక్కురావాలనే వ్యూహంలో వున్నాడ తను. అంతేకానీండని వంతపాడారు మరి కొందరు.

తర్జనభర్జనతో అర్ధరాత్రి దాటింది.

'నిద్ర ముంచుకొస్తోంది.. ఏదోకటి తేల్చండి' అనేకాడికొచ్చారు. పెద్దమను షులు చర్చించుకొని ఒక నిర్ణయానికొచ్చాక చెయ్యి పైకెత్తి ఆపమన్నట్లు సైగ చేశాడు జాలిరెడ్డి.

తీర్పుకోసం చూస్తున్నారు.

"జరిగిందానికి మేమెంతో బాధపడు తున్నాం. ఇలాంటివి మరోసారి జరిగితే పరిణామాలు తీవ్రంగా వుంటాయని హెచ్చరిస్తున్నాం. ఇప్పుడు రమణారెడ్డి, సంతోష్‌రెడ్డి చేసిన తప్పుకి చెరో ఐదువేలు జరిమానా వేస్తూ, ఆ డబ్బు రేపు సాయం త్రానికల్లా ఏడుకొండలుకి చేర్చాలి. అలాగే, భ్రమరాంబ ఆస్పత్రి ఖర్చు మొత్తం వాళ్ళి ద్దరూ భరించాల. పెద్దమనుషులుగా మేమీ నిర్ణయం తీసుకొంటున్నాం. ఇంకెవ రైనా ఏదైనా చెప్పదలచుకొంటే ఇక్కడే, ఇప్పుడే చెప్పేయండి" అన్నాడు జాలిరెడ్డి.

"చెప్పడానికేముంది.. పెద్దమనుషులు ఒకమాట చెప్పాక కాదనేదేముంది? అట్నే కానీయండి" అన్నారు నిందితుల తరపు బంధువులు. ఇంతకంటే అవకాశం రాద న్నట్లు దాన్నే ఖాయం చేయమని నాలుగు వైపుల నించి ఒత్తిడి చేశారు.

గాయత్రి ఒంటరిగా మిగిలిపోయింది

ఏడుకొండలు తలవంచుకొని నిలబడు న్నాడు.

గాయత్రి తట్టుకోలేక "ఏందయ్యా ఈ తీర్పు? " అనింది.

